ఈనాడు

విజయవాడ 11-12-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 121 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 6-50 పేజీలు 16 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు సినిమా

త్రిశూలం పట్టుకున్న దైవం


బాలకృష్ణ

విభూతి కొండను ఆపేదెవరు? అంటూ తాండవానికి సిద్ధమయ్యారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా... బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన 'అఖండ 2: తాండవం' సందడి ఈరోజు ప్రత్యేక ప్రదర్శనలతోనే షురూ కానుంది. శుక్రవారం ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం రాత్రి ప్రత్యేక టీజర్‌ని విడుదల చేశారు. 'లోక క్షేమం కోరావు.. ఇక నీ క్షేమం ఆ శివుడి అధీనం...', 'కాషాయం కట్టుకున్న ఆ దేశాన్ని చూడు... త్రిశూలాన్ని పట్టుకున్న ఆ దైవాన్ని చూడు...' అంటూ సాగే సంభాషణలు, బాలకృష్ణ చేసిన యాక్షన్ సన్నివేశాలు టీజర్‌కి ఆకర్షణగా నిలిచాయి. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. తమన్ స్వరాలు సమకూర్చారు. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ సినిమా టికెట్ ధరల పెంపునకు, ప్రత్యేక ప్రదర్శనలకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతినిచ్చాయి. తెలంగాణలో 11న జరిగే ప్రత్యేక ప్రదర్శనల్లో టికెట్ ధరలు జీఎస్టీతో కలిపి రూ.600గా నిర్ణయించగా, సింగిల్ స్క్రీన్స్‌లో జీఎస్టీతో కలుపుకుని రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 చొప్పున పెంచుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 12 నుంచి 14 వరకూ ఈ ధరలు అమల్లో ఉండనున్నాయి. పెంచిన ధరలతో వచ్చిన ఆదాయంలో 20 శాతం సినీ కార్మికుల సంక్షేమం కోసం మూవీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు జమ చేయాలని ప్రభుత్వం పేర్కొంది. ఏపీలో సింగిల్ స్క్రీన్స్‌లో జీఎస్టీతో కలుపుకుని రూ.75, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 పెంచుకునేందుకు అనుమతులు వచ్చాయి. ఈ ధరలు 12వ తేదీ నుంచి పది రోజులపాటు అమల్లో ఉంటాయి.


కార్తి

కథలు.. పాత్రల పరంగా సాహసాలు చేయడం తనకు బాగా అలవాటైందని చెబుతున్నారు కార్తి. సూపర్ హీరో సినిమాల్లో ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించే 'అన్నగారు వస్తారు' కోసం నటన పరంగా ఎంతో శ్రమించాల్సి వచ్చిందన్నారు. ఆయన హీరోగా తెరకెక్కిన 'అన్నగారు వస్తారు' శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మించిన చిత్రమిది. సినిమా విడుదలను పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లో కార్తి విలేకర్లతో ముచ్చటించారు.

అలా కథల్ని ఎంపిక చేసుకోవడమే నా ప్రత్యేకత!

"విభిన్నమైన ప్రయత్నాలు చేయడానికి కావల్సినంత ధైర్యం ఓ నటుడిలో ఉండాలని నేను బలంగా నమ్ముతాను. అలాంటి ప్రయత్నాలు చేసినప్పుడే నటుడిగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. విజయం సాధించామా లేదా అనేది కాదు, ప్రయత్నం చేశామా లేదా? అనేదే ముఖ్యం. నేను అలా చేయలేదంటే కార్తి అంటే 'ఊపిరి', 'ఖైదీ' సినిమాలు మాత్రమే గుర్తొస్తాయి. అలాంటి ఆలోచనలతో కథల్ని ఎంపిక చేసుకోవడంతోనే కథానాయకుడిగా నాకంటూ ఓ ప్రత్యేకత వచ్చింది. 'అన్నగారు వస్తారు' నేను చేసిన మరో సాహసోపేతమైన ప్రయత్నం. సూపర్ హీరో సినిమా ఇది. ఈ మాట వినగానే మనకు బ్యాట్‌మ్యాన్, సూపర్‌మ్యాన్‌లే గుర్తొస్తారేమో కానీ, మన సంస్కృతిలోనూ ఎన్టీఆర్, ఎంజీఆర్‌లాంటి సూపర్ హీరోలు ఉన్నారు. ఇదొక కాల్పనిక ప్రపంచంలో సాగే కథ".

◆ "ప్రతి సినిమాకీ దానికంటూ ప్రేక్షకులు ఉంటారని నమ్ముతాను. ఈవారం 'అఖండ 2' వస్తుందని నాకూ తెలుసు. నేనూ ఆ సినిమా కోసం ఎదురు చూశా. ఒకే వారంలో మూడు సినిమాలు వచ్చినా శుక్ర, శని, ఆది... ఇలా ఒకొక్కటి ఒక్కో రోజు చూస్తూ నేను పెరిగా. ఇప్పుడూ అంతే. నేను బౌండెడ్ స్క్రిప్ట్‌తో ప్రయాణం చేయడానికే మొగ్గు చూపుతుంటా. 'ఖైదీ2' ఎప్పుడనేది నాకూ తెలియదు".

◆ "తెలుగు, తమిళ ప్రేక్షకుల అభిరుచులు, జీవన శైలి వేర్వేరు కాదు. ప్రచార కార్యక్రమాల కోసం అంతా తిరుగుతుంటాను కదా, నాకూ వ్యత్యాసమేమీ కనిపించలేదు. అక్కడ ఇక్కడా వ్యవసాయమే జీవనాధారం. ఆహారపు అలవాట్లు, బంధాలు, అనుబంధాలు ఇలా అన్ని విషయాల్లోనూ చాలా సారూప్యతలు కనిపిస్తాయి. అందుకే కథల గురించి ప్రత్యేకమైన జాగ్రత్తలేమీ తీసుకోవల్సిన అవసరం పడటం లేదు".

వెంకీ చిత్రం... ఏకే 47


వెంకటేశ్

వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకి 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47' (ఏకే 47) పేరుని ఖరారు చేస్తూ వెంకటేశ్ లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. అందులో వెంకటేశ్ క్లాస్‌గా పక్కా ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. కథానాయకుడిగా, దర్శకుడిగా ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న తొలి సినిమా ఇదే. ఇదివరకు వెంకటేశ్ చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పనిచేసిన విషయం తెలిసిందే. ప్రత్యేకమైన ఈ కలయికలో రూపొందుతున్న ఈ కొత్త చిత్రం ఓ కుటుంబ కథతో తెరకెక్కుతోందని పేరునిబట్టే అర్థమవుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. వచ్చే ఏడాది వేసవి సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది.

థ్రిల్లింగ్‌గా సాగే మిస్టీరియస్


రియా కపూర్, రోహిత్, మేఘన

రోహిత్, మేఘన రాజ్‌పుత్, రియా కపూర్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వం వహించారు. జయ్ వల్లందాస్ నిర్మాత. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోందీ చిత్రం. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది. ప్రముఖ నటుడు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త రకమైన కథనంతో సాగే థ్రిల్లర్ చిత్రమిదని చెప్పారు దర్శకుడు. ప్రపంచవ్యాప్తంగా 150 థియేటర్లలో సినిమాని విడుదల చేస్తున్నామన్నారు నిర్మాత.

'మోగ్లీ' ఒక రోజు ఆలస్యం


రోషన్ కనకాల

రోషన్ కనకాల హీరోగా సందీప్ రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మోగ్లీ 2025'. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు. సాక్షి సాగర్ మడోల్కర్ కథానాయిక. ఇటీవలే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్, పాటలు సినీప్రియుల దృష్టిని ఆకర్షించాయి. తాజాగా ఈ నెల 12న రావాల్సిన ఈ చిత్రం కొన్ని కారణాలతో ఒక రోజు ఆలస్యంగా 13న రానున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. ఈ నేపథ్యంలోనే మరో కొత్త పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. అటవీ నేపథ్యంలో సాగే ప్రేమకథతో దీన్ని తీర్చిదిద్దారు. హర్ష చెముడు, బండి సరోజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

నా అద్దం నువ్వే


డింపుల్ హయాతి, రవితేజ

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ ప్రేక్షకులను పలకరించనున్నారు రవితేజ. ఆయన హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. తాజాగా ఈ సినిమా నుంచి 'అద్దం ముందు..' అనే పాటను విడుదల చేసింది చిత్రబృందం. "అద్దం ముందు నిలబడి అబద్ధం చెప్పలేనే.. నా అద్దం అంటే నువ్వే మరి నిజం దాచలేనే.." అంటూ సాగుతున్న గీతానికి రవితేజ, డింపుల్ హయాతీల మధ్య కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. చంద్రబోస్ రాసిన ఈ పాటని శ్రేయా ఘోషల్, కపిల్ కపిలన్ ఆలపించారు.

'జెట్లీ' కోసం మిస్‌యూనివర్స్ ఇండియా


రియా సింఘా

హాస్యనటుడు సత్య కథానాయకుడిగా రితేశ్ రానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జెట్లీ'. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. 'మిస్ యూనివర్స్ ఇండియా 2024' రియా సింఘా ఇందులో కథానాయికగా నటిస్తున్నట్టు చిత్రబృందం తెలిపింది. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ బుధవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది. ఆమె సినిమాలో యాక్షన్ హీరోయిన్‌గా, స్టైలిష్ అవతారంలో సందడి చేయనున్నట్టు తెలుస్తోంది. వెన్నెల కిశోర్, అజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ఛాయాగ్రహణం: సురేశ్ సారంగం, కూర్పు: కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైన్: నార్ని శ్రీనివాస్, యాక్షన్: వింగ్ చున్ అంజి, కథ, స్క్రీన్‌ప్లే: రితేశ్ రానా, జయేంద్ర ఎరోలా.

తెలుగోడి పోరాటం


హరనాథ్

"తెలుగోడు ప్రతిభావంతుడు. ప్రపంచంలో ఎక్కడున్నా కష్టపడి పనిచేస్తాడు, అవసరమైతే పోరాటమూ చేస్తాడని ఈ సినిమాతో చెబుతున్నాం" అన్నారు హరనాథ్ పొలిచెర్ల. ఆయన కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రమే... 'నా తెలుగోడు'. జరీనా వహాబ్, నైరా పాల్, సుఫియా తన్వీర్, రోనీ కౌలా కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. ప్రముఖ నిర్మాత నవీన్ ఎర్నేని, దర్శకులు శివ నిర్వాణ, వివేక్ ఆత్రేయ, స్వరూప్.ఆర్.ఎస్.జె, మహేశ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరనాథ్ పొలిచెర్ల మాట్లాడుతూ "నేను సినిమాలు చేయడానికి స్ఫూర్తి దివంగత నటుడు ఎన్టీఆర్. మంచి కోసం పోరాటం చేసే ఓ తెలుగోడి కథ ఇది" అన్నారు.

ఈనాడు

విజయవాడ 11-12-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 121
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



అమెజాన్ పెట్టుబడులు ₹3.15 లక్షల కోట్లు

10 లక్షల ఉద్యోగాల సృష్టికి అవకాశం

దిల్లీ: అమెరికా ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ 2030 కల్లా మనదేశంలో 35 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.15 లక్షల కోట్ల) పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించింది. బుధవారం జరిగిన 'అమెజాన్ సంభవ్ సమిట్'లో ఈ విషయాన్ని తెలిపింది. అమెరికా ఐటీ దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్, గూగుల్ ప్రకటించిన మొత్తానికి సమానంగా అమెజాన్ ఒక్కటే ఇంత భారీ పెట్టుబడులు ప్రకటించడం విశేషం. క్విక్ కామర్స్‌తో పాటు (మిగతా 13లో)



సచివాలయంలో మంత్రులు, హెచ్‌వోడీలు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సాకులు చెబితే సహించను

దస్త్రాల పరిష్కారంలో మంత్రుల జాప్యంపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తి

- 7 రోజుల్లోగా పూర్తికాకుంటే వివరణ ఇవ్వాలన్న సీఎం
- సగటున 15 రోజులకుపైగా సమయం తీసుకుని అట్టడుగున నిలిచిన రాంప్రసాద్‌రెడ్డి
- 2 రోజుల్లోనే పరిష్కరించి టాప్‌లో డోలా
- ఆరో స్థానంలో చంద్రబాబు
- అత్యధికంగా 6,653 దస్త్రాలు పరిష్కరించిన సీఎం
- 9వ స్థానంలో లోకేశ్.. 11వ స్థానంలో పవన్

ఈనాడు, అమరావతి: దస్త్రాల్ని ఆన్‌లైన్‌లో (ఈ-ఆఫీస్) ఎక్కడి నుంచైనా పరిష్కరించే వెసులుబాటు ఉన్నప్పటికీ కొందరు మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులు ఇప్పటికీ రోజుల తరబడి సమయం తీసుకుంటున్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతుల సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాకులు చెబితే సహించేది లేదని, ఇకపై ఏడు రోజుల కంటే ఎక్కువ సమయం తీసుకున్నవారు వివరణ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ-ఆఫీస్ ఫైల్స్ డిస్పోజల్ నివేదికను ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సమావేశంలో వివరించారు. దాని ప్రకారం 2024 జులై 15 నుంచి 2025 డిసెంబరు 9 వరకు 16 నెలల 24 రోజుల వ్యవధిలో దస్త్రాల పరిష్కారంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అట్టడుగున ఉన్నారు. ఆయన సగటున 15 రోజుల 19 గంటల 53 నిమిషాల సమయం తీసుకుని, 25వ స్థానంలో నిలిచారు. ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర 24వ స్థానంలో, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 23వ స్థానంలో ఉన్నారు. (మిగతా 3లో)

మీదే ఓటుచోరీ

అనాడు నెహ్రూ చేసింది అదే


ఇందిర, సోనియా కూడా దానికి పాల్పడ్డారు

చొరబాటుదారుల తొలగింపులో వెనక్కి తగ్గం: అమిత్‌షా

నేను లేవనెత్తిన అంశాలపై చర్చకు రాగలరా?: రాహుల్

3లో

వివేకా హత్యకేసులో పాక్షికంగా తదుపరి దర్యాప్తునకు అనుమతి



కిరణ్‌యాదవ్, అర్జున్‌రెడ్డిల సంబంధం తేల్చాలి

- అనుబంధ అభియోగపత్రం దాఖలు చేయాలి
- సునీత పిటిషన్‌పై సీబీఐ కోర్టు తీర్పు

ఈనాడు, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కొన్ని అంశాలపై తదుపరి దర్యాప్తు కొనసాగించడానికి సీబీఐకి అనుమతిస్తూ హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. దర్యాప్తుపై వివేకా కుమార్తె సునీత లేవనెత్తిన సందేహాల నేపథ్యంలో కొన్నింటిపై దర్యాప్తు కొనసాగించవచ్చని పేర్కొంది. వివేకా హత్యపై లోతైన దర్యాప్తు కొనసాగించేలా ఆదేశాలు జారీచేయాలంటూ ఆమె దాఖలుచేసిన పిటిషన్‌పై సీబీఐ ప్రధానకోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం బుధవారం రాత్రి 9 గంటల తర్వాత తీర్పు వెలువరించారు. సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను పాక్షికంగా అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 7వ నిందితుడైన వైఎస్ భాస్కరరెడ్డి తమ్ముడు వైఎస్ ప్రకాశ్‌రెడ్డి మనవడు అర్జున్‌రెడ్డికి, రెండో నిందితుడైన సునీల్‌యాదవ్ సోదరుడు కిరణ్‌యాదవ్ ముందుగా హత్య సమాచారాన్ని ఇచ్చారన్న (మిగతా 13లో)





రెండు దశాబ్దాలపాటు పని చేసినా పదోన్నతులు లేక చాలా మంది ఎంపీడీవోలు, ఈవోలుగానే మిగిలిపోయారు. వారిలో నిరాశా నిస్పృహలను తొలగించేందుకు ఒకేసారి వేల సంఖ్యలో పదోన్నతులు కల్పించాం. సీఎం చంద్రబాబు నాయకత్వంలో పంచాయతీరాజ్‌శాఖలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం.

\- పవన్‌కల్యాణ్

పదోన్నతులిచ్చాం.. ప్రజలకు సేవలందించండి

కూటమి ప్రభుత్వం వల్లే పంచాయతీరాజ్‌లో 10 వేల మందికి పైగా పదోన్నతులు

ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంత భారీగా ఇవ్వలేదు

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగులతో మాటామంతిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో పది వేల మందికి పైగా పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చాం. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వల్లే ఇది సాధ్యమైంది. తెలంగాణలోనూ ఇంత భారీగా పదోన్నతులు ఇచ్చినట్లు లేదు. పదోన్నతుల ద్వారా ప్రతి ఉద్యోగి కుటుంబంలో పండగ వాతావరణం కల్పించాం. ఇదే స్ఫూర్తితో గ్రామాల్లో సేవలందించండి. పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలంతా సమస్యలకు పరిష్కారం లభించిందన్న ఆనందంతో తిరిగి వెళ్లాలి. నిజాయతీ, నిష్పక్షపాతంగా పని చేయండి. నాతో సహా ఎవరు తప్పు చేసినా శిక్షార్హులే' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగులతో (మిగతా 3లో)

డ్రోన్ల తయారీ రంగంలో సహకరించండి

గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ని కోరిన మంత్రి లోకేశ్

అమెరికాలో అడోబ్, ఇంటెల్, ఎన్‌విడియా, జూమ్ సంస్థల ప్రతినిధులతోనూ భేటీలు


గూగుల్ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్‌తో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలు గూగుల్, ఇంటెల్, అడోబ్, ఎన్‌విడియా, జూమ్ సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రం సాంకేతికంగా అభివృద్ధి చెందుతోందని.. సెమీకండక్టర్ల తయారీ.. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ యూనిట్ల ఏర్పాటుకు ఎకోసిస్టమ్ గురించి వారికి వివరించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే డ్రోన్ సిటీ ప్రాజెక్టులో డ్రోన్ అసెంబ్లింగ్, టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని గూగుల్ సంస్థకు మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్‌తో భేటీ అయ్యారు. గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, గూగుల్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలీ ఈ సమావేశంలో పాల్గొన్నారు. విశాఖలో ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టు పనులు ప్రారంభించడంపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విస్ట్రాన్ న్యూ వెబ్ కార్పొరేషన్ ద్వారా డేటా సెంటర్ సర్వర్ తయారీ ఎకోసిస్టమ్‌ను (మిగతా 10లో)



లోపలి పేజీల్లో

పట్టుకు బదులు పాలిస్టర్
- శ్రీవారి సేవలో దగా
- పదేళ్లలో రూ.54.95 కోట్ల విలువైన శాలువాల కొనుగోళ్లు
- బయటపెట్టిన విజిలెన్స్ నివేదిక

దీపావళికి యునెస్కో గుర్తింపు
సాంస్కృతిక వారసత్వ జాబితాలో చోటు

ఆయనో అవినీతి అనకొండ
- విశ్రాంత ఈఎన్‌సీ శ్రీనివాస్ అక్రమాస్తులపై కేసు నమోదు
- ఏకకాలంలో ఏడుచోట్ల సోదాలు
- కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

హెచ్1బీ ఇంటర్వ్యూల వాయిదా పిడుగు

- వేల మంది భారతీయులపై వెట్టింగ్ దెబ్బ
- ఆకస్మిక నిర్ణయం తీసుకున్న అమెరికా
- ఇప్పటికే భారత్‌కు వచ్చినవారు ఇక్కడే చిక్కుకుపోయే పరిస్థితి
- మిగిలిన కేటగిరీలపైనా ప్రభావం



దిల్లీ: అమెరికా ప్రభుత్వం తీసుకున్న ఆకస్మిక నిర్ణయం వేల మంది భారతీయులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. సోషల్ మీడియా ఖాతాలను, ఆన్‌లైన్ ప్రొఫైళ్లను పరిశీలించే పేరుతో ఈ నెలలో నిర్వహించాల్సిన హెచ్1బీ వీసా ఇంటర్వ్యూలను అర్ధంతరంగా వాయిదా వేసింది. కొన్ని నెలలపాటు హెచ్1బీ వీసా అపాయింట్‌మెంట్లను వాయిదా వేస్తున్నట్లు దరఖాస్తుదారులకు ఈ మెయిళ్లద్వారా వ్యక్తిగతంగా సమాచారమిచ్చింది. ఇప్పటికే ఇంటర్వ్యూల స్లాట్లను బుక్ చేసుకుని భారత్‌కు వచ్చిన వారికి ఇది అశనిపాతమే. వారు మళ్లీ అమెరికాకు తిరిగి వెళ్లడానికి అవకాశం ఉండదు. వచ్చే వారం ఇంటర్వ్యూలకు స్లాట్లను తీసుకున్న వారికి అమెరికా వలస సేవల విభాగం నుంచి ఈమెయిళ్లు వచ్చాయి. ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది (మిగతా 3లో)

తిరుమలలో సిఫార్సు దర్శనాల రద్దు రోజులు ఇవే

తిరుమల, న్యూస్‌టుడే: డిసెంబరు, జనవరి నెలల్లో పలు పర్వదినాలను పురస్కరించుకుని తిరుమలలో వీఐపీ బ్రేక్ సిఫార్సు దర్శనాలను తితిదే రద్దు చేసింది. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగే ఈ నెల 23న, వైకుంఠ ఏకాదశి దర్శనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 29 నుంచి జనవరి 8 వరకు, రథసప్తమిని పురస్కరించుకుని జనవరి 25న ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ సిఫార్సు దర్శనాలు రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. పైన పేర్కొన్న రోజులకు ముందు రోజు సిఫార్సు లేఖలు స్వీకరించబోమని, సహకరించాల్సిందిగా భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది.

పరకామణిలో చోరీ కేసు..

సమాచారాన్ని ఈడీ, ఐటీ విభాగాలతో పంచుకోండి

- సీఐడీ, ఏసీబీ డీజీలను ఆదేశించిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసుకు సంబంధించి హైకోర్టు బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దర్యాప్తులో భాగంగా ఇప్పటి వరకు సేకరించిన సమాచారం, దస్త్రాలను చట్టం అనుమతిస్తున్న మేరకు ఆదాయపు పన్ను విభాగం (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లతో పంచుకోవాలని సీఐడీ డీజీ, ఏసీబీ డీజీలను ఆదేశించింది. చోరీ వ్యవహారంపై చట్ట ప్రకారం తగిన చర్యలు ప్రారంభించే వెసులుబాటును వారికి ఇచ్చింది. పరకామణిలో జరిగిన అక్రమాలు, చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై సీఐడీ విచారణకు ఆదేశించాలని కోరుతూ జర్నలిస్ట్ శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. నివేదికలు ఇవ్వాలని సీఐడీని.. నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఆస్తులపై విచారణ జరపాలని ఏసీబీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఆదేశాలకు అనుగుణంగా దర్యాప్తు చేసి సీఐడీ, ఏసీబీ డీజీలు వేర్వేరుగా నివేదికలు సీల్డ్ కవర్లో కోర్టు ముందు ఉంచారు. బుధవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా నివేదికలను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్.. దర్యాప్తు కొనసాగించాలని సీఐడీ, ఏసీబీ డీజీలను ఆదేశించారు. అంతకుముందు ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ కేసు దర్యాప్తు మొత్తాన్ని సీఐడీకి అప్పగించడం సబబు అన్నారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. అలాంటి అభ్యర్థన దర్యాప్తు సంస్థల నుంచి రాలేదని పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేశారు.

● మరోవైపు తితిదే అప్పటి ఏవీఎస్‌వో వై. సతీష్ కుమార్ పోస్టుమార్టం సర్టిఫికెట్ ప్రతిని మూడు రోజుల్లో సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని సీఐడీని న్యాయమూర్తి ఆదేశించారు.

శ్రీవారి సేవలో పట్టు దగా!

- పట్టుకు బదులు పాలిస్టర్ శాలువాలు
- బయటపెట్టిన విజిలెన్స్ నివేదిక

ఈనాడు డిజిటల్, తిరుపతి: శ్రీవేంకటేశ్వర స్వామివారి సేవలో వినియోగించే పట్టు శాలువాల కొనుగోళ్లలో భారీ మోసం వెలుగుచూసింది. పట్టువస్త్రాల పేరిట పాలిస్టర్‌ను అంటగట్టి తితిదే ఖజానాకు గండికొట్టడమే కాకుండా భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వైనం విజిలెన్స్ విచారణలో బట్టబయలైంది. నాణ్యత లేని వస్త్రాలను సరఫరా చేసిన సదరు సంస్థపై క్రిమినల్ చర్యలకు, ఏసీబీ డీజీ విచారణకు తితిదే ధర్మకర్తల మండలి ఆదేశాలు జారీచేసింది.

అసలేం జరిగిందంటే..

శ్రీవారి ఆలయ అవసరాల కోసం 'పట్టు శాలువాల' కొనుగోలుకు తితిదే టెండర్లు పిలిచింది. శ్రీవారి సేవలతోపాటు వీవీఐపీలకు వేదాశీర్వచనం, దాతలను సత్కరించడానికి వాటిని వినియోగిస్తారు. ఇందులోభాగంగా నగరికి చెందిన మెసర్స్ వీఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్ అనే సంస్థకు 15,000 శాలువాల సరఫరా కాంట్రాక్టును అప్పగించారు. ఒక్కోటి రూ.1,389.15 చొప్పున ధర నిర్ణయించారు. నాణ్యతపై అనుమానాలు రావడంతో, గత బోర్డు సమావేశంలో దీనిపై సమగ్ర విచారణ జరపాలని సీవీఎస్వోను ఆదేశించారు.

పట్టు కాదు.. పక్కా పాలిస్టర్

విజిలెన్స్ అధికారులు తిరుపతిలోని గోదాము, తిరుమలలోని వైభవోత్సవ మండపం నుంచి తాజా స్టాకు నమూనాలు సేకరించారు. వీటిని బెంగళూరు, ధర్మవరంలోని సెంట్రల్ సిల్క్‌బోర్డులకు పంపి పరీక్షించగా విస్తుపోయే వాస్తవాలు వెల్లడయ్యాయి. టెండర్ నిబంధనల ప్రకారం స్వచ్ఛమైన పట్టు ఉండాలి. పరీక్షల్లో అది వందశాతం పాలిస్టర్ అని తేలింది. ఆ శాలువాలపై 'సిల్క్ హోలోగ్రామ్' కూడా లేదని అధికారులు గుర్తించారు.

అధికారుల పాత్రపై అనుమానాలు

ఈ వ్యవహారంలో తితిదేలోని కొందరు అధికారుల తీరుపై విజిలెన్స్ నివేదికలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గతంలో డిప్యూటీ ఈవో (వేర్‌హౌస్) పంపిన నమూనాలను కాంచీపురం ల్యాబ్‌లో పరీక్షిస్తే అవి నాణ్యమైనవేనని నివేదిక వచ్చింది. కానీ అదే స్టాకు నుంచి విజిలెన్స్ సేకరించి పంపినవి మాత్రం పాలిస్టర్ అని తేలింది. దీన్నిబట్టి ల్యాబ్‌కు పంపేటప్పుడు మార్చేయడమో, లేదా నివేదికలు తారుమారు చేయడమో జరిగి ఉంటుందని విజిలెన్స్ స్పష్టం చేసింది.

రూ.55 కోట్ల కొనుగోళ్లు

ప్రస్తుత టెండర్‌లోనే కాకుండా కొన్నేళ్లుగా ఈ అక్రమాలు సాగుతున్నట్లు అనుమానిస్తున్నారు. వీఆర్ఎస్ ఎక్స్‌పోర్ట్, దాని సోదర సంస్థలైన తిరుమల ఫ్యాబ్రిక్స్, నన్నా కాటేజెస్, వీఎం రాజా పవర్‌లూమ్ యూనిట్ సంస్థల నుంచి 2015-25 వరకు దాదాపు రూ.54.95 కోట్ల విలువైన వస్త్రాలను తితిదే కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది.

ఏసీబీ విచారణకు తితిదే బోర్డు ఆదేశం

విజిలెన్స్ నివేదికను పరిశీలించిన తితిదే ఛైర్మన్ బి.ఆర్.నాయుడు నేతృత్వంలోని బోర్డు.. ప్రస్తుత టెండర్లను వెంటనే రద్దుచేయాలని, ఈ వ్యవహారంపై ఏసీబీతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టరు తితిదేని మోసం చేసినందున క్రిమినల్ కేసులు నమోదుచేయాలని నెలక్రితం జరిగిన సమావేశంలో తీర్మానించింది.



గుత్తేదారు సరఫరా చేసిన శాలువా

శాలువాల కొనుగోళ్లలో అవకతవకలు నిజం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదేకు పట్టు శాలువాలకు బదులు పాలిస్టర్ శాలువాలను సరఫరా చేసిన స్కాంపై ప్రస్తుత పాలకమండలి సమగ్ర విచారణ ప్రారంభించిందని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 2019 నుంచి ఇప్పటివరకు రూ.80-90 కోట్ల అవినీతి జరిగి ఉండవచ్చని అంచనా వేశామన్నారు. శుద్ధమైన తుస్సా పట్టు.. బంగారు, వెండి జరీ, సిల్క్‌మార్క్ ధ్రువీకరణతో సరఫరా చేయాల్సి ఉండగా నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని, ఏసీబీ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో నివేదిక రాగానే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వహయాంలో కల్తీనెయ్యి, నాసిరకం సరకులు, పరకామణిలో చోరీ, టెండర్ల మార్పిడి వంటి అనేక అవినీతి కేసులు బయటపడ్డాయని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ పేర్కొన్నారు.

మంచుగడ్డలా మన్యం!



పొలంలో కనిపించిన మంచు గడ్డలు

పాడేరు, చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఏజెన్సీ చలి గుప్పిట్లో చిక్కుకుంది. మూడు రోజులుగా ఈ ప్రాంతంలో చలి తీవ్రత పెరిగింది. బుధవారం పాడేరు మండలంలోని సంగోడి గ్రామ పరిసరాల్లో ఓ రైతు పొలంలో పేర్చిన టార్పాలిన్‌పై మంచుగడ్డలు కనిపించాయి. బుధవారం ఉదయం అరకులోయలో 4.4 డిగ్రీలు, డుంబ్రిగుడ- 4.7, జి.మాడుగుల- 4.8, ముంచంగిపుట్టు- 5, పాడేరు-5.2, హుకుంపేట-5.6, చింతపల్లి-6.2, పెదబయలులో 6.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు కనువిందు చేసే ప్రకృతి పర్యాటకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్తోంది. ప్రకృతి ప్రేమికులకు పాడేరు ఇప్పుడు భూతల స్వర్గంగా మారింది.

గ్రహం అనుగ్రహం

11-12-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
సప్తమి: సా. 6-44 తదుపరి అష్టమి
మఖ: ఉ. 8-05 తదుపరి పుబ్బ
వర్జ్యం: సా. 4-14 నుంచి 5-52 వరకు
అమృత ఘడియలు: ఉ. 7-17 వరకు
తిరిగి రా. 2-01 నుంచి 3-39 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-03 నుంచి 10-47 వరకు
తిరిగి మ. 2-27 నుంచి 3-11 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.24; **సూర్యాస్తమయం:** సా.5.23

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	27.0
కర్నూలు	16.1	31.6
అనంతపురం	16.5	30.2
రాజమహేంద్రవరం	16.5	34.5
కడప	17.0	28.0
శ్రీకాకుళం	17.0	29.0
విశాఖపట్నం	17.4	29.6
విజయవాడ	17.6	29.6
గుంటూరు	18.0	29.0
నరసాపురం	18.6	31.2
ఒంగోలు	20.4	30.4
తిరుపతి	20.6	29.2
నెల్లూరు	21.2	29.6

కల్తీ నెయ్యిపై నిర్ణయం సుబ్బారెడ్డిదే

- తితిదే మాజీ జీఎం సుబ్రహ్మణ్యం వెల్లడి

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): 'తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అవుతోందని 2020 ఆగస్టులో మీ దృష్టికి వచ్చింది కదా? ఆ విషయాన్ని తితిదే నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి మాత్రమే ఎందుకు చెప్పారు? ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదు?' అని ఈ కేసులో నిందితుడు, తితిదే కొనుగోళ్ల విభాగం మాజీ జీఎం ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యాన్ని సీబీఐ నేతృత్వంలోని సిట్ అధికారులు ప్రశ్నించారు. నమూనాలు ల్యాబ్‌కు పంపమని వైవీనే చెప్పినందున ఆయనకే కల్తీ విషయాన్ని తెలిపామని సుబ్రహ్మణ్యం సమాధానమిచ్చారు. బుధవారం రెండోరోజు ఆయనతోపాటు మరో నిందితుడు అజయ్ కుమార్ సుగంధ్‌ను ప్రశ్నించారు. చాలా ప్రశ్నలకు సుబ్రహ్మణ్యం అంతగా గుర్తులేవని, సమాధానం చెప్పలేనని బదులిచ్చినట్లు తెలుస్తోంది. నాలుగు డెయిరీలూ కల్తీ నెయ్యి పంపుతున్నాయని సుబ్బారెడ్డికి మీరు, డిప్యూటీ ఈవో వివరించిన తర్వాత కూడా దాని సరఫరా ఎందుకు కొనసాగిందని ప్రశ్నించారు. ఛైర్మన్‌గా ఆయన నిర్ణయం తీసుకున్నారని సుబ్రహ్మణ్యం తెలిపినట్లు సమాచారం.

నోరు మెదపని అజయ్ కుమార్: సుగంధ్ ఆయిల్స్ యజమాని అజయ్ కుమార్ సుగంధ్ సిట్ విచారణకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిల్ జైన్, విపిన్ జైన్.. కొన్నేళ్లుగా కల్తీ నెయ్యి వ్యాపారం చేస్తున్నారని, వారికి ఎందుకు సహకరించారని ప్రశ్నించగా తనకు ఆ విషయంతో సంబంధం లేదన్నారు.

చిన్న అప్పన్నకు వివరాలు ఎందుకిచ్చారు?

'ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌లలోని భోలే బాబా డెయిరీ ప్లాంట్లను మేం పరిశీలించినప్పుడు వాటికి అంత సామర్థ్యం లేదని గుర్తించాం. కొనుగోళ్ల విభాగం జీఎంగా, తనిఖీ బృందంలో సభ్యుడిగా ఉన్న మీరు ఎందుకు గుర్తించలేదు. వారితో కుమ్మక్కయ్యారా?' అని ప్రశ్నించగా తనతోపాటు మరికొందరూ తనిఖీ చేశారని, అందరి అభిప్రాయాలు తితిదేకు నివేదించామని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 'తితిదేతో సంబంధమే లేని చిన్న అప్పన్నకు డెయిరీల పేర్లు, వాటి ప్రతినిధుల ఫోన్ నంబర్లు ఎందుకిచ్చారు?' అని అడగ్గా అతడు సుబ్బారెడ్డి వ్యక్తిగత కార్యదర్శినని చెప్పడం వల్లే సమాచారం అందించానన్నారు.

దక్షిణాదిలో రూ.4వేల కోట్ల పెట్టుబడులకు

జియో హాట్‌స్టార్ శ్రీకారం



బ్లాక్‌బస్టర్ సౌత్ లైనప్‌ను ఆవిష్కరిస్తున్న తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్


చెన్నై, న్యూస్‌టుడే: దక్షిణాదిలో వినోదరంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు రాబోయే ఐదేళ్లలో రూ.4వేల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టినట్లు జియో హాట్‌స్టార్ ప్రకటించింది. చెన్నైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, తమిళ అభివృద్ధి, సమాచార శాఖ మంత్రి సామినాథన్, నటుడు, ఎంపీ కమల్‌హాసన్, దక్షిణాది సినీ, బుల్లితెర పరిశ్రమలకు చెందిన ప్రముఖుల సమక్షంలో ఈ విషయాన్ని ప్రకటించింది. జియో హాట్‌స్టార్‌లో ఎస్‌వీఓడీ హెడ్ అండ్ చీఫ్ మార్కెటింగ్ అధికారి సుశాంత్ శ్రీరామ్, జియో హాట్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్(సౌత్) హెడ్ కృష్ణన్ కుట్టి హాజరై... భారతదేశ వినోద రంగంలో జియో హాట్‌స్టార్ తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులు, భారతీయ కథా కథనాలను మరింత విస్తృతస్థాయిలో దక్షిణాది ప్రేక్షకులకు అందించడానికి చేస్తున్న కృషిని వివరించారు. ఆ దిశగా తమిళనాడు ప్రభుత్వంతో జియో హాట్‌స్టార్ భాగస్వామ్య ఒప్పందం చేసుకుందని, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రాంతీయతకు పెద్దపీట వేసి, కొత్తతరం కథలు, భౌగోళిక సరిహద్దులను దాటి వినూత్న కథలను భారీస్థాయిలో పరిచయం చేయాలన్నది ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశంగా వెల్లడించారు. ఈ సరికొత్త అధ్యాయానికి ప్రతీకగా, దక్షిణాది సంస్కృతి, సంప్రదాయాలను చాటే ప్రాంతీయ వినోద భవిష్యత్తుకు బాటలు వేసే 25 కొత్త టైటిల్స్‌తో కూడిన జియో హాట్‌స్టార్ బ్లాక్‌బస్టర్ సౌత్ లైనప్‌ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సినీ నటులు మోహన్‌లాల్, నందమూరి బాలకృష్ణ, నాగార్జున, ధనుష్, విజయ్ సేతుపతి, శివకార్తికేయన్, నివిన్ పౌలి, ఐశ్వర్య రాజేశ్, కాజల్ అగర్వాల్, నయనతార, సమంత, నిత్యామేనన్ తదితరులు పాల్గొన్నారు.

సాకులు చెబితే సహించను

(మొదటి పేజీ తరువాయి)

ఫైళ్లను వేగంగా క్లియర్ చేసిన మంత్రుల్లో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి 2 రోజుల 41 నిమిషాలతో మొదటి స్థానంలో నిలిచారు. 2 రోజుల 7 గంటలతో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రెండో స్థానంలో, 2 రోజుల 9 గంటల 59 నిమిషాలతో న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మూడో స్థానంలో ఉన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు



పరిష్కరించిన దస్త్రాలు: 6,653 (అందరికంటే ఎక్కువ)
ఒక్కో దస్త్రానికి తీసుకున్న సమయం: 3 రోజుల 8 గంటల 18 నిమిషాలు
స్థానం: 6

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



పరిష్కరించిన దస్త్రాలు: 2,001
ఒక్కో దస్త్రానికి తీసుకున్న సమయం: 4 రోజుల 9 గంటల 43 నిమిషాలు
స్థానం: 11

మంత్రి నారా లోకేశ్



పరిష్కరించిన దస్త్రాలు: 3,669
ఒక్కో దస్త్రానికి తీసుకున్న సమయం: 3 రోజుల 14 గంటల 10 నిమిషాలు
స్థానం: 9

● మొత్తం మంత్రివర్గంలో తక్కువ ఫైల్స్ వచ్చింది కొండపల్లి శ్రీనివాస్‌కు. ఆయనకు 269 దస్త్రాలు వస్తే, మొత్తం పరిష్కరించారు. అందరికంటే తక్కువ దస్త్రాలు వచ్చినప్పటికీ వాటి పరిష్కారంలో ఆయన పదో స్థానంలో నిలిచారు.

రాంప్రసాద్‌రెడ్డికి నాకంటే సెన్సిటివ్ ఫైల్స్ వస్తాయా: సీఎం

దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై అందర్నీ ఒకే గాటన కట్టడం సరికాదని... విజిలెన్స్, ఏసీబీ వంటి కేసుల ఉపసంహరణ కోసం వచ్చిన దస్త్రాలు ఎక్కువగా ఉండటంతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దగ్గర జాప్యం జరిగిందని కాటమనేని భాస్కర్ తెలిపారు. మంత్రులు కొల్లు రవీంద్ర, మనోహర్ వద్ద కూడా అలాంటి కేసుల దస్త్రాలే ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని, ఆర్థిక మంత్రి కేశవ్ దగ్గర నిధుల కోసం వచ్చిన విజ్ఞప్తుల ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దానిపై సీఎం స్పందిస్తూ.. 'రాంప్రసాద్‌రెడ్డికి నాకొచ్చే వాటికంటే సెన్సిటివ్ ఫైల్స్ వస్తాయా? కారణం ఏదైనా దస్త్రాల పరిష్కారానికి 15 రోజులు తీసుకోవడం సరికాదు. ఇకపై సాకులు చెబితే ఊరుకోను. గిరిజన సంక్షేమశాఖలో ఒక్కో దస్త్రం పరిష్కారానికి 12 రోజులు తీసుకున్నారు. అసలే గిరిజనులు వెనుకబడిన ప్రజలు. వారిని మీరు మరింత వెనుకబాటులోకి నెట్టేస్తున్నారు' అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారి రేఖారాణికి వచ్చే దస్త్రాలే తక్కువని, ఆమె 11 రోజులు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. ఇకపై మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఎవరైనా దస్త్రాల పరిష్కారంలో వెనుకబడితే ముఖ్యమంత్రి హోదాలో వాటిని తానే స్వయంగా పరిశీలించి, వారిని సెన్సిటైజ్ చేస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు.

జనవరి 15 తర్వాత ఫిజికల్ ఫైల్స్ ఉండొద్దు

జిల్లాల్లో ఇప్పటికీ చాలా దస్త్రాల్ని ఫిజికల్‌గా నడుపుతున్నారని భాస్కర్ చెప్పగా... జనవరి 15 తర్వాత మాన్యువల్ ఫైల్ అన్నది ఉండటానికి వీల్లేదని, అన్నీ ఆన్‌లైన్ చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. చేయనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యదర్శుల్లో హరిజవహర్‌లాల్ టాప్

● కార్యదర్శుల్లో ఎం.హరిజవహర్‌లాల్ ఒక్కో దస్త్రం పరిష్కారానికి సగటున 2 గంటల 55 నిమిషాల సమయంతో టాప్‌లో నిలిచారు. 16 నెలల 24 రోజుల్లో ఆయన 869 దస్త్రాలు పరిష్కరించారు.

● 3 రోజుల 6 గంటల 9 నిమిషాలతో జి.జయలక్ష్మి చివరి స్థానంలో ఉన్నారు.

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ 14వ స్థానంలో ఉన్నారు. ఆయన ఒక్కో దస్త్రానికి సగటున 1 రోజు 2 గంటల 16 నిమిషాల సమయం తీసుకున్నారు.

● విభాగాధిపతులకు సంబంధించి గడిచిన మూడు నెలల్లో దస్త్రాల పరిష్కారం వివరాల్నే నివేదికలో పొందుపరిచారు. వారిలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్, ఐపీఎస్ అధికారి రాహుల్‌దేవ్ శర్మ అత్యధికంగా 18 రోజుల 2 గంటల 45 నిమిషాల సమయం తీసుకున్నారు. ఆయన పరిష్కరించినవి మొత్తం 20 దస్త్రాలే కావడం విశేషం.

● విభాగాధిపతుల్లో వి.రంగరాజ్ ఒక గంట 19 నిమిషాల సమయం తీసుకున్నారు. మూడు నెలల్లో ఆయన రెండు దస్త్రాలే పరిష్కరించారు. పెండింగ్‌లో ఏమీ లేవు.

సీఎస్ కార్యాలయం టాప్

● సచివాలయశాఖలకు సంబంధించి కూడా గడిచిన మూడు నెలల్లో పరిష్కరించిన దస్త్రాలనే పరిగణనలోకి తీసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కార్యాలయం మొదటి స్థానంలో నిలిచింది. ఒక్కో దస్త్రం పరిష్కారానికి సగటున 1 రోజు 2 గంటల 34 నిమిషాల సమయం తీసుకుంది.

● 3 రోజుల ఒక గంట 40 నిమిషాలతో శాసనసభా వ్యవహారాల విభాగం రెండో స్థానంలో, 3 రోజుల 14 గంటల 36 నిమిషాలతో ముఖ్యమంత్రి కార్యాలయం మూడో స్థానంలో నిలిచాయి.

● 27 రోజుల 18 గంటల 8 నిమిషాలతో పరిశ్రమలశాఖ అట్టడుగున నిలిచింది.

● 24 రోజుల 20 గంటల 54 నిమిషాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చివరి నుంచి రెండో స్థానంలో ఉంది.

● 23 రోజుల 16 గంటల 10 నిమిషాలతో ఇంధనశాఖ చివరి నుంచి మూడో స్థానంలో నిలిచింది.

కార్యదర్శులు, శాఖల వివరాలు https://epaper.eenadu.net లో

15.07.2024 నుంచి 9.12.2025 వరకు ముఖ్యమంత్రి, మంత్రులు పరిష్కరించిన దస్త్రాలు, ఒక్కో దస్త్రానికి తీసుకున్న సగటు సమయం వివరాలు

స్థానం	మంత్రి	పరిష్కరించిన దస్త్రాలు	పరిష్కారానికి సగటున తీసుకున్న సమయం
1.	డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి	651	2 రోజుల 41 నిమిషాలు
2.	నిమ్మల రామానాయుడు	1,546	2 రోజుల 7 గంటలు
3.	ఎన్ఎండీ ఫరూఖ్	1,512	2 రోజుల 9 గంటల 59 నిమిషాలు
4.	బీసీ జనార్దనరెడ్డి	1,091	3 రోజుల 21 నిమిషాలు
5.	పొంగూరు నారాయణ	2,474	3 రోజుల 8 గంటల 12 నిమిషాలు
6.	నారా చంద్రబాబునాయుడు	6,653	3 రోజుల 8 గంటల 18 నిమిషాలు
7.	కందుల దుర్గేష్	316	3 రోజుల 9 గంటల 21 నిమిషాలు
8.	సత్యకుమార్‌యాదవ్	3,061	3 రోజుల 13 గంటల 30 నిమిషాలు
9.	నారా లోకేశ్	3,669	3 రోజుల 14 గంటల 10 నిమిషాలు
10.	కొండపల్లి శ్రీనివాస్	269	4 రోజుల 4 గంటల 53 నిమిషాలు
11.	పవన్‌కల్యాణ్	2,001	4 రోజుల 9 గంటల 43 నిమిషాలు
12.	ఎస్.సవిత	651	4 రోజుల 19 గంటల 4 నిమిషాలు
13.	అనగాని సత్యప్రసాద్	2,269	4 రోజుల 21 గంటల 10 నిమిషాలు
14.	ఆనం రామనారాయణరెడ్డి	803	5 రోజుల 19 గంటల 4 నిమిషాలు
15.	కె.అచ్చెన్నాయుడు	2,719	5 రోజుల 22 గంటల 41 నిమిషాలు
16.	గొట్టిపాటి రవికుమార్	530	6 రోజుల 8 గంటల 4 నిమిషాలు
17.	టీజీ భరత్	548	7 రోజుల 3 గంటల 39 నిమిషాలు
18.	వాసంశెట్టి సుభాష్	711	7 రోజుల 5 గంటల 11 నిమిషాలు
19.	గుమ్మిడి సంధ్యారాణి	545	8 రోజుల 8 గంటల 20 నిమిషాలు
20.	వంగలపూడి అనిత	2,701	8 రోజుల 13 గంటల 54 నిమిషాలు
21.	కొలుసు పార్థసారథి	321	8 రోజుల 18 గంటల 32 నిమిషాలు
22.	నాదెండ్ల మనోహర్	325	9 రోజుల 3 గంటల 40 నిమిషాలు
23.	పయ్యావుల కేశవ్	1,586	11 రోజుల 3 గంటల 36 నిమిషాలు
24.	కొల్లు రవీంద్ర	912	15 రోజుల 5 గంటల 23 నిమిషాలు
25.	మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి	669	15 రోజుల 19 గంటల 53 నిమిషాలు

పదోన్నతులిచ్చాం.. ప్రజలకు సేవలందించండి





మాటామంతి కార్యక్రమానికి హాజరైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. వేదికపై అధికారులు గాయత్రీదేవి, బాలునాయక్, వెంకటకృష్ణ, ముత్యాలరాజు, కృష్ణతేజ, తమీమ్ అన్సారియా

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఏర్పాటు చేసిన 'మాటామంతి' కార్యక్రమంలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు.

గత ప్రభుత్వంలో ప్రతి పోస్టుకు, బదిలీకి రేటు పెట్టారు

ఉద్యోగులు బాగుండాలని కోరుకునేవాణ్ని నేను. మా నాన్న ప్రభుత్వోద్యోగే. ఆయనకు ప్రమోషన్ వచ్చినపుడల్లా ఇంట్లో పండగ వాతావరణమే. బిడ్డ పుట్టి, ఆ బిడ్డకు పెళ్లయినా కూడా ఎలాంటి పదోన్నతులు లేకుండా ఒకేస్థానంలో ఉండిపోయామని పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు చెప్పినపుడు చాలా బాధపడ్డాను. గత ప్రభుత్వంలో ప్రతి పోస్టుకు, బదిలీకి రేటు పెట్టారని విన్నాను. దాన్ని పూర్తిగా నిర్మూలించాలని, సీనియారిటీ, సిన్సియారిటీ, పని తీరు ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించా. నిర్దిష్ట ఫ్రేం వర్క్ ప్రకారం జరగాలని సూచించా. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు కూడా ఆ పరిధిలో ఉంటేనే చేయాలని చెప్పాను. చివరకు నేను చెప్పినా ఇవ్వొద్దన్నాను. పదోన్నతులు పారదర్శకంగా జరిగాయంటే అది అధికారుల సమర్థతే.

పంచాయతీరాజ్‌శాఖ తీసుకున్నాక మొదట భయపడ్డా

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకున్నాక ఏ నిర్ణయం తీసుకుంటే ఎలాంటి తప్పవుతుందో అని మొదట భయపడ్డా. సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే ఏం చేయాలో ఆలోచించా. ఫ్రాన్స్‌లో 18వ శతాబ్దంలో అనుకుంటా.. చాలామంది వ్యాపారులు ఎగుమతులు, దిగుమతులు, వ్యాపారాభివృద్ధిపై చర్చిస్తుంటే పారిశ్రామిక మంత్రి అక్కడికి వెళ్లి మీకేం చేయాలో చెప్పండి అని అడిగారట. మీరేం చేయొద్దు. మా పని మమ్మల్ని చేసుకోనివ్వండి. మమ్మల్ని చెడగొట్టొద్దు అని వ్యాపారులు సమాధానమిచ్చారట. అలాగే ఉప ముఖ్యమంత్రిగా నా సొంత తెలివితేటలు వాడలేదు. బలమైన, నిబద్ధతగల అధికారుల సహకారంతోనే పంచాయతీరాజ్ శాఖలో 18 నెలల వ్యవధిలో సంస్కరణలు అమలు చేయడం సాధ్యమైంది. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వచ్చాం. తొలిసారిగా ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించడంతోపాటు 77 డీడీవో కార్యాలయాలు ప్రారంభించాం. అత్యంత పారదర్శకంగా అంతర్గత బదిలీలు చేశాం. పంచాయతీల్లో క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి, గ్రేడ్లుగా విభజించి ప్రతి పంచాయతీలోనూ కార్యదర్శులను నియమించాం. జడ్పీ సీఈవోలకు తొలిసారి పదోన్నతులు కల్పించనున్నాం.

జీతాలు పెంచాలంటే ఆదాయం పెరగాలి కదా!

చట్టబద్ధంగా ఉద్యోగులకు చేయాల్సిందంతా చేస్తా. జీతాలు పెరగాలంటే ఆదాయం పెరగాలి. దానిపైనా ఉద్యోగులు దృష్టి పెట్టాలి. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించా. ఉద్యోగులపై రాజకీయ నేతలు దాడులు చేసినా క్షమించేది లేదు. ఉమ్మడి కడప జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై ఒక పార్టీ నాయకులు దాడి చేస్తే నేనే వెళ్లి అండగా నిలిచా.



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సన్మానిస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు

స్వామిత్వపై ఎమ్మెల్యేలకు 'జనరల్ నోట్' పంపుతా

కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం స్వామిత్వను ఎమ్మెల్యేలు ఎందుకు వద్దంటున్నారు? గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలపై ప్రజలకు హక్కులు కల్పించి ప్రాపర్టీ కార్డులు ఇప్పించడం దాని లక్ష్యం. దీనివల్ల చట్టబద్ధంగా ఆస్తులు అమ్ముకోవడానికి, కొనుక్కోవడానికి వీలుంటుంది. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యేలకు జనరల్ నోట్ పంపుతా. సర్పంచులతో సంబంధం లేకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టే గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించేలా నిర్ణయం తీసుకుంటాం. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా' అని పవన్ కల్యాణ్ చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో 600 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల బకాయిలు చెల్లించాలని కమిషనర్‌ను ఆదేశించారు.

పదవీవిరమణ చేసిన ఉద్యోగులు పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయండి

పంచాయతీరాజ్‌శాఖలో వివిధ హోదాల్లో పని చేసి పదవీవిరమణ పొందిన ఉద్యోగులు, అధికారులు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తే మంచిదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. వారి అనుభవాలతో శాఖలోనూ మరిన్ని విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ కమిషనర్ రేవు ముత్యాలరావు, ఈఎన్‌సీలు బాలు నాయక్, గాయత్రీదేవి, నరేగా సంచాలకులు షణ్ముఖరావు తదితరులు మాట్లాడారు.

ప్రమోషన్లు ఇచ్చి గౌరవం పెంచారు

● ఆనందం వ్యక్తం చేసిన పంచాయతీరాజ్ ఉద్యోగులు

ఈనాడు- అమరావతి, న్యూస్‌టుడే- జిల్లా పరిషత్తు (గుంటూరు): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్వహించిన మాటామంతి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ జిల్లాల అధికారులు, ఉద్యోగులు.. కూటమి ప్రభుత్వం గత 18 నెలల్లో పంచాయతీరాజ్‌శాఖలో అమలు చేసిన సంస్కరణలపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఏడాది వ్యవధిలో రెండేసి పదోన్నతులు వచ్చాయంటూ పలువురు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యలపైనా వినతులిచ్చారు.

పదోన్నతి లేకుండానే రిటైరయిపోతాననుకున్నా



– నాగలక్ష్మి, నర్సీపట్నం డీడీవో

ఇరవై ఐదేళ్లుగా ఎంపీడీవోగా పనిచేసిన తర్వాత పదోన్నతి లేకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తుందేమోనని బాధపడేదాన్ని. ఇప్పుడు డీడీవోగా పదోన్నతి కల్పించారు. జులై 31న సంతోషంగా ఉద్యోగ విరమణ చేస్తాను.

డీపీవో సీట్లో కూర్చోపెట్టి గౌరవం కల్పించారు



– రాజ్యలక్ష్మి, వైఎస్సార్ కడప జిల్లా డీపీవో

గత ప్రభుత్వం డీపీవోగా పదోన్నతి కల్పించినా వేరే పోస్టులో నియమించింది. అప్పుడు పోస్టుకు, పదోన్నతికి ఓ రేటు ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక కడప జిల్లా డీపీవోగా కుర్చీలో కూర్చోబెట్టి గౌరవించింది. స్వామిత్వలో సర్వే చేయొద్దని కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిడి తెస్తున్నారు. వారితో మాట్లాడి, సమస్య పరిష్కరించాలి.

కారుణ్య నియామకాల్లో జాప్యమవుతోంది



– మురళీకృష్ణప్రసాద్, ఏవో, ఎన్టీఆర్ జిల్లా

జిల్లా, మండల పరిషత్ పాఠశాలల నిర్వహణను విద్యాశాఖకు అప్పగించినా ఉపాధ్యాయులు ఎవరైనా చనిపోతే వారి పిల్లలకు కారుణ్య నియామకాల కోసం జడ్పీకి పంపుతున్నారు. దీంతో పంచాయతీరాజ్ ఉద్యోగుల పిల్లలు కారుణ్య నియామకాల కోసం ఐదేళ్లు నిరీక్షించాల్సి వస్తోంది. ఉపాధ్యాయ కారుణ్య నియామకాలను కలెక్టర్ల పూల్‌లో చేర్చాలి.

స్టాంపు డ్యూటీ సర్‌ఛార్జి జమ చేయించాలి



– శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎంపీడీవో

పంచాయతీల్లోనూ డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టడం ద్వారా ప్రభుత్వం నూతన అధ్యాయం లిఖించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి స్థానిక సంస్థలకు రావలసిన స్టాంపు డ్యూటీ సర్‌ఛార్జి నిధులు జమ చేసేలా చూడాలి. జనరల్ ఫండ్ పెంచుకునేందుకు అవకాశాలు కల్పించాలి.

హెచ్1బీ ఇంటర్వ్యూల వాయిదా పిడుగు

(మొదటి పేజీ తరువాయి)

మార్చి నుంచి మే నెల వరకూ వాయిదా వేస్తున్నామని అందులో ఉంది. ఈ నెల 15వ తేదీన ఇంటర్వ్యూకు హాజరు కావాల్సిన వారికి వచ్చే ఏడాది మార్చిలో మళ్లీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. 19వ తేదీ తర్వాతి వారికి మే నెలలో సమయం ఇచ్చారు.

■ హెచ్1బీతోపాటు పలు ఇతర కేటగిరీల ఇంటర్వ్యూలూ వాయిదా పడినట్లు తెలుస్తోంది.

కాన్సులేట్లకు రావొద్దు: ఎంత మందికి ఈమెయిళ్లు వెళ్లాయో కచ్చితంగా తెలియలేదు. అయితే వీసా అపాయింట్‌మెంట్లు తీసుకున్నవారు గతంలో కేటాయించిన తేదీల్లో కాన్సులేట్లకు రావొద్దని దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం సూచించింది. 'మీ వీసా అపాయింట్‌మెంట్ రీషెడ్యూలు అయిందని ఈమెయిల్ వస్తే.. తదుపరి తేదీపై సహాయం చేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొంది. పాత తేదీలతో వస్తే కాన్సులేట్లలోకి అనుమతించబోమని స్పష్టం చేసింది.

సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తిన ఫిర్యాదులు

వీసా ఇంటర్వ్యూల వాయిదాపై సామాజిక మాధ్యమాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. 'ఈ నెల 18వ తేదీన చెన్నైలో నాకు వీసా అపాయింట్‌మెంట్ ఉంది. మంగళవారం బయోమెట్రిక్ ఇచ్చా. వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీకి ఇంటర్వ్యూను వాయిదా వేస్తున్నట్లు సమాచారం వచ్చింది' అని ఓ దరఖాస్తుదారు పోస్టు పెట్టారు.


● హెచ్1బీ వీసా అపాయింట్‌మెంట్లను వాయిదా వేయడాన్ని హ్యూస్టన్ కేంద్రంగా పనిచేసే వలస వ్యవహారాల అటార్నీ ఎమిలీ న్యూమాన్ తప్పుబట్టారు. 'వీసా స్టాంపింగ్ అనేది ప్రస్తుతం చిక్కుముడిలా మారింది. హెచ్చరికలు లేకుండా అపాయింట్‌మెంట్లు నెలలపాటు వాయిదా పడుతున్నాయి. ఈ ప్రక్రియ ఎలాంటి అంచనాలకు అందడం లేదు. వ్యాపారవేత్తలకు, ఉద్యోగులకు ఇది సవాళ్లను విసురుతోంది' అని ఆమె విమర్శించారు.

మీదే ఓటుచోరీ

● కాంగ్రెస్ ఓటములకు కారణం నాయకత్వ లోపమే

● చొరబాటుదారుల తొలగింపులో వెనక్కి తగ్గం: అమిత్‌షా

● నేను లేవనెత్తినవాటిపై చర్చకు రాగలరా?: రాహుల్





దిల్లీ: కాంగ్రెస్ నాయకులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ వేర్వేరు సందర్భాల్లో ఓటుచోరీకి పాల్పడ్డారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై బుధవారం లోక్‌సభలో కొనసాగిన చర్చలో ఆయన 90 నిమిషాలసేపు ప్రసంగించారు. విపక్షనేత రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణల్ని తోసిపుచ్చారు. "స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధాని పదవికి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు 28 మంది మద్దతు పలికారు. నెహ్రూకు కేవలం ఇద్దరు అండగా నిలిచారు. అయినా నెహ్రూయే ప్రధాని అయ్యారు. అది తొలి ఓటుచోరీ. ప్రధానిగా ఇందిరాగాంధీ ఉన్నప్పుడు ఆమె ఎన్నికను కోర్టు రద్దుచేస్తే తనకు తాను ఆమె చట్టపరమైన రక్షణ కల్పించుకున్నారు. అది రెండో ఓటుచోరీ. భారతీయ పౌరురాలు కాకముందే సోనియాగాంధీ ఓటరుగా నమోదవడం మూడో ఓటుచోరీ" అని అమిత్‌షా పేర్కొన్నారు. "ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి కారణం నాయకత్వలోపమే. విలేకరి ఒక ప్రశ్న సంధిస్తే భాజపా ఏజెంటుగా ముద్ర వేస్తున్నారు. ఏదైనా కేసులో విపక్షం ఓడిపోతే జడ్జీని నిందిస్తున్నారు. ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎంలు ఆడిపోసుకుంటున్నారు. అది కూడా పనిచేయక ఓటుచోరీ ఆరోపణలు చేస్తున్నారు" అని తెలిపారు. చరిత్ర గురించి తాము మాట్లాడితే కాంగ్రెస్‌కి కోపం వచ్చేస్తుందని, చరిత్రే లేకుండా ఏ సమాజమైనా ఎలా ముందుకు వెళ్తుందని ప్రశ్నించారు.

వారిని ఏరివేస్తే గెలవలేమని కాంగ్రెస్‌కి భయం

చొరబాటుదారుల్ని ఏరివేస్తే ఇకపై ఎన్నికల్లో గెలవడం సాధ్యం కాదనేది కాంగ్రెస్ భయమని, అందుకే వారికి కొమ్ముకాస్తోందని అమిత్‌షా ఆరోపించారు. సర్‌పై విమర్శల్ని తోసిపుచ్చారు. నాయకత్వం లోపం వల్ల కాంగ్రెస్ ఓడిపోతోందే తప్ప ఈవీఎంలు, ఓటుచోరీ వల్ల కాదని స్పష్టంచేశారు. అక్రమంగా వచ్చి మనదేశంలో ఉంటున్నవారిని ఓటర్ల జాబితాల్లో ఉంచడానికే సర్ ప్రక్రియను విపక్షం వ్యతిరేకిస్తోందని చెప్పారు. విపక్షాలు సభా కార్యకలాపాలను బహిష్కరించి వెళ్లిపోయిన తర్వాతా ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. విపక్షాలు ఎన్నిసార్లు ఇలా చేసినా ప్రభుత్వం మాత్రం చొరబాటుదారుల్ని గుర్తించి, దేశం నుంచి పంపించేస్తుందని తెగేసి చెప్పారు. చొరబాట్లను జాబితాలో మళ్లీ చేర్చాలనేదే విపక్షం ఆరాటమని దుమ్మెత్తిపోశారు. ప్రధానిని, ముఖ్యమంత్రులను చొరబాటుదారులు ఎన్నుకుంటే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందా అని ప్రశ్నించారు. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు 1952, 1957, 1961లలో సర్‌ను చేపట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నామని భావిస్తున్న విపక్షాలు నిజానికి భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగం కలిగిస్తున్నాయని చెప్పారు. ఈవీఎంలను 1989లో రాజీవ్‌గాంధీ తెచ్చారని, వాటిని తొలిసారిగా 2004లో వాడినప్పుడు, ఆ తర్వాత 2009లో కూడా కాంగ్రెస్సే గెలిచిందని గుర్తుచేశారు.

నా ప్రశ్నలకు జవాబివ్వండి: రాహుల్

ఈసీ-భాజపా కుమ్మక్కై ఓటుచోరీ చేశాయని విలేకరుల సమావేశాల్లో లేవనెత్తిన అంశాలపై అమిత్‌షా తనతో చర్చకు రాగలరా అని రాహుల్ సవాల్ విసిరారు. అప్పుడు అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎన్నికల కమిషనర్లకు కొన్ని అంశాల్లో చట్టం నుంచి పూర్తిస్థాయి రక్షణను కల్పించడానికి కారణమేంటో చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. మంత్రి సమాధానం ఆత్మరక్షణ ధోరణిలో ఉందన్నారు. ఈసీ, సమాచార కమిషన్ సారథుల ఎంపిక కమిటీల్లో సీజేఐని లేకుండా చేయడంపై కొంత చర్చ జరిగింది. అణుబాంబు మీటనే ప్రధాని చేతిలో పెట్టినప్పుడు ఈ ఎంపిక అధికారాన్ని ఎందుకు ఇవ్వకూడదని రవిశంకర్ ప్రసాద్ (భాజపా) ప్రశ్నించారు. అన్నింటిలో న్యాయవ్యవస్థ పాత్ర ఎందుకు ఉండాలని అన్నారు. ప్రధాని మోదీ ప్రజల హృదయాలను దోచుకుంటారే గానీ ఈవీఎంలను కాదని కంగనా రనౌత్ (భాజపా) చెప్పారు. ఉభయ సభల్లో విపక్షాలు వేర్వేరు కారణాలతో వాకౌట్ చేశాయి. తర్వాత 'ఎక్స్' వేదికగా రాహుల్ స్పందిస్తూ ఓటుచోరీకి ఈసీని ఒక ఆయుధంగా భాజపా మలచుకుందని పునరుద్ఘాటించారు. లోక్‌సభలో మంగళవారం తాను చేసిన ప్రసంగం వీడియోను దానికి జతపరిచారు. తప్పు చేయలేదని చెప్పడానికి అమిత్‌షా ఒకటిన్నర గంటలు ఎందుకు తీసుకున్నారని ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి లోకేశ్ అండ

ఈనాడు, అమరావతి: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న అనంతపురానికి చెందిన 12 ఏళ్ల కె.చిన్నికృష్ణ ఉదయ్ పవన్‌కుమార్‌కు మంత్రి లోకేశ్ అండగా నిలిచారు. వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.12 లక్షల ఆర్థికసాయం అందించారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో సాయం అందించి కుమారుడి ప్రాణం నిలపాలంటూ గత నెలలో లోకేశ్ అనంతపురం జిల్లా పర్యటనలో ఉన్నప్పుడు బాలుడి తల్లిదండ్రులు కలిసి విన్నవించారు. అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు రూ.12 లక్షల ఎల్‌వోసీని అందజేశారు.

ఒకటో తేదీనే జీతాలు, పింఛన్లు ఇవ్వాల్సిందే

ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులు, ప్రాధాన్యతలు అర్థం చేసుకోగలమని, కానీ మా జీవనం ఒకటో తేదీన రావల్సిన జీతం, పింఛను మీదే ఆధారపడి ఉందని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాశీభట్ల రామసూర్యనారాయణ, ఎం.రమేష్‌కుమార్ తెలిపారు. ఒకటో తేదీనే జీతం, పింఛను రాకపోతే ఎంత మా ప్రభుత్వం అనుకున్నా సహకరించలేమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తేదీ సాయంత్రానికి కూడా 31 ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు సుమారు రూ.800 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్ల వరకు జీతాలు జమ కాలేదన్నారు. దీనిపై వివరణ ఇవ్వకపోవడం ఆర్థిక శాఖ బాధ్యతారాహిత్యమేనని పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్థిక బకాయిల విషయంలో ఉద్యోగుల నుంచి ఒత్తిడి ఉన్నా ప్రభుత్వం మీద ఉన్న గౌరవంతో సంయమనం పాటిస్తున్నామని తెలిపారు.

ఈనాడు

ప్రగతి స్వప్నాలు సాకారం కావాలి!

'మీ భవితను నిర్ణయించేది మరేంటో కాదు- ఇవాళ మీరు చేసే పనే'నంటారు మహాత్మాగాంధీ. ఆలోచనల్లో స్పష్టతకు కార్యశీలత జతకలిసినప్పుడే భవిష్యత్తు బంగారుమయమవుతుంది. ప్రస్తుతం 20వేల కోట్ల డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణం 2034 నాటికి లక్ష కోట్ల డాలర్లకు, 2047 కల్లా మూడు లక్షల కోట్ల డాలర్లకు చేరాలన్న ఘనతర స్వప్నాన్ని 'తెలంగాణ రైజింగ్' దార్శనిక పత్రం ఆవిష్కరించింది. విస్పష్టమైన వ్యూహాలు, ప్రపంచంతో పోటీపడే స్థిర విధానాలకు స్థానిక వనరులను మేళవించి పరిశ్రమించడం ద్వారా ప్రవచిత లక్ష్యాన్ని చేరుకోగలమనే ధీమాను రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తంజేస్తోంది. ఆ మేరకు ప్రగతి యజ్ఞదీక్ష స్వీకరిస్తూ సర్కారు విజయవంతంగా నిర్వహించిన గ్లోబల్ సమిట్‌లో రూ.5.75 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు కుదరడం- తెలంగాణ భావి పురోగతికి శుభసూచికం! దూరదృష్టి, నిర్దిష్ట ప్రణాళికలతో 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేర్చి 'స్వర్ణాంధ్ర'ను సాధించాలన్న సంకల్ప పత్రాన్ని ఏపీ ప్రభుత్వమూ నిరుడు డిసెంబరులో విడుదల చేసింది. ఆ కలను సాకారం చేసే బృహత్ కృషిలో భాగంగా కిందటి నెలలో విశాఖపట్నం ఆతిథ్యమిచ్చిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు ముడిపడటం- ఏపీ స్వప్నిస్తున్న ఉన్నతికి సానుకూల సంకేతం!

నలుగురు అమెరికన్ అధ్యక్షులకు సలహాదారుగా పనిచేసిన మేధావి ప్రొఫెసర్ వారెన్ బెన్నిస్ మాటల్లో చెప్పాలంటే- దార్శనికతను వాస్తవంగా మార్చడమే నాయకత్వ సామర్థ్యానికి సరైన కొలమానం! దాన్నే గీటురాయిగా పెట్టుకుని పెట్టుబడుల ఒప్పందాలను ఆచరణ రూపంలోకి తీసుకురావడంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సఫలీకృతం కావాలి. రాబోయే రెండు దశాబ్దాల్లో తాము సాధించబూనిన అభివృద్ధి అంతా 'వికసిత భారత్' సాకార యాగంలో తమవంతు భాగస్వామ్యమని ఉద్ఘాటిస్తున్న తెలంగాణ, ఏపీలకు కేంద్రమూ విరివిగా చేయూతనందించాలి. అందుబాటులో ఉన్న అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలు, కల్పించే సదుపాయాలను పారిశ్రామికవేత్తలకు వివరించి, వారిని తమ తమ రాష్ట్రాల వైపు ఆకర్షించడానికి పెట్టుబడుల సదస్సులు ఉపకరిస్తాయి. వాటిలో వెలువడే ప్రకటనలు క్షేత్రస్థాయిలో ప్రతిఫలించాలంటే మాత్రం యంత్రాంగం వైపు నుంచి కంపెనీలకు లేనిపోని అడ్డంకులేమీ ఎదురుకాకూడదు. ప్రోత్సాహకాలను సకాలంలో అందించడం, అనుమతుల్లో ఆలస్యాన్ని పరిహరించడం తదితరాల్లో అధికారగణం చురుగ్గా వ్యవహరించాలి. రాష్ట్రంలో పెట్టుబడులు పెడతామంటూ సమిట్‌లో చేసిన వాగ్దానాలను ఆయా పారిశ్రామిక, వ్యాపార సంస్థలు నిలబెట్టుకుని స్థానికంగా కార్యకలాపాలు ఆరంభించేంత వరకు సంబంధిత ప్రాజెక్టులపై నిత్యం అనుశీలన చేయాలి!

అందరినీ కలుపుకొనిపోని అభివృద్ధి ఏదీ సుస్థిరంగా కొనసాగదన్నది యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షురాలు క్రిస్టీన్ లగార్డ్ హెచ్చరిక! కొన్ని రంగాలకూ, కొద్దిమంది వ్యక్తులకే పరిమితమయ్యే పేరుగొప్ప ప్రగతి జనజీవన ప్రమాణాలను పెంచలేదు. ఆ కీలకాంశాన్ని గుర్తించిన 'తెలంగాణ రైజింగ్, 'స్వర్ణాంధ్ర' దార్శనిక పత్రాల్లోని సమ్మిళిత వృద్ధి సాధనకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అంకితమైతే తెలుగు రాష్ట్రాలకు నిజంగానే తిరుగుండదు. ఉపాధి కల్పనకు ఊతమిచ్చే రంగాలను ప్రోత్సహించడం, అసంఘటిత కార్మికుల నైపుణ్యాలకు సానపట్టడం, ఏఐ యుగంలో నెగ్గుకురాగలిగే శక్తియుక్తులను నవతరానికి అలవరచడంపైనుంచి పాలకుల దృష్టి ఎప్పటికీ తప్పిపోకూడదు. దీర్ఘకాలంలో ప్రగతికి పాదులుతీసే మూలధన వ్యయానికీ సంక్షేమ పథకాలకూ మధ్య సమతౌల్యాన్ని పాటించడం మరీ ముఖ్యం. దాంతోపాటు శాంతిభద్రతలను కళ్లలో పెట్టుకుని చూసుకుంటే- పారిశ్రామికాభివృద్ధి దేదీప్యమానమై రెండు రాష్ట్రాల అభ్యున్నతికి అదే ఆలంబన అవుతుంది!




మీ రంగంలో మీరెంత నిపుణులైనా సరే, కాలాన్ని బట్టి పరిస్థితులు మారుతుంటాయి. నిష్పక్షపాతంగా మార్పును స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి. భావోద్వేగాలు మనసును మసకబారుస్తాయి, స్పష్టమైన నిర్ణయాలు తీసుకోనివ్వవు.

– విశ్వనాథన్ ఆనంద్

ముప్పును తప్పించే మదింపు

పర్యావరణం అంటే- నీరు, గాలి, మట్టి, చెట్లు, జంతుజాలం, ఆరోగ్యం, సంస్కృతి, స్థానిక విలువలు వంటి సర్వ అంశాల సమ్మేళనం. ఏదైనా అభివృద్ధి ప్రాజెక్టు కారణంగా పరిసరాలు, ప్రజారోగ్యం, జీవవైవిధ్యం, సమాజంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడానికి పర్యావరణ ప్రభావ మదింపు(ఈఐఏ) అనే శాస్త్రీయ ప్రక్రియను చేపడతారు. తద్వారా నష్టప్రభావాన్ని తగ్గించుకునే అవకాశముంటుంది. చెత్త నుంచి విద్యుత్తును తయారుచేసే ప్లాంట్లతో పాటు మున్సిపల్ ఘన వ్యర్థాలను ఈ మదింపు నుంచి మినహాయిస్తూ కేంద్రం ఇటీవల ప్రతిపాదనలు తీసుకురావడంతో 'ఈఐఏ' చర్చనీయాంశంగా మారింది.

సుస్థిరాభివృద్ధి మౌలిక లక్ష్యం- ఆర్థిక వృద్ధి, సామాజిక సమానత్వం, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను కొనసాగించడమే. ఏదైనా కార్యక్రమం లేదా ప్రాజెక్టు వల్ల పర్యావరణంలో జరిగే మార్పులను ప్రభావంగా చెబుతారు. అది సానుకూలమైనదైనా కావచ్చు, ప్రతికూలమైనా కావచ్చు. ఆ ప్రభావాన్ని అంచనా వేసేందుకు ప్రస్తుత పరిస్థితి గురించి పూర్తి అవగాహన అవసరం. ప్రాజెక్టు ప్రారంభానికి ముందున్న పర్యావరణ పరిస్థితిని ప్రాథమిక స్థితి అంటారు. ఇది నీటి నాణ్యత, నేల ఉత్పాదకత, వృక్షజాలం, జంతుజాలం, ప్రజారోగ్యం వంటి అంశాల ద్వారా నిర్ధారితమవుతుంది. ఈ సమాచారం ఆధారంగా ప్రాజెక్టు వల్ల కలిగే మార్పులను సమగ్ర రీతిలో పరిశీలించవచ్చు.



ఈఐఏతో ప్రయోజనాలెన్నో...


ఈఐఏ అనేది పర్యావరణ సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఉపయోగపడే ఒక ప్రణాళికాబద్ధమైన సాధనం. ఇది ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చేయడానికి, పర్యావరణ, ఆర్థిక నష్టాలను నివారించడానికి, ప్రజల అభ్యంతరాలను ముందుగానే పరిష్కరించడానికి సహాయపడుతుంది. చట్టపరమైన, విద్యాపరమైన అవగాహన కలిగించే సాధనంగానూ పని చేస్తుంది. వనరుల సమర్థ వినియోగానికి, సామాజిక ప్రయోజనాలు పెంచేందుకు, పర్యవేక్షణ పద్ధతులను మెరుగు పరిచేందుకు తోడ్పడుతుంది. దీని సాయంతో సంబంధిత అధికారులు సరైన సమాచారం ద్వారా అభివృద్ధి నిర్ణయాలు తీసుకోవచ్చు. ఏదైనా అభివృద్ధి ప్రాజెక్టు ప్రారంభించే ముందు ఈఐఏ ప్రక్రియను విభిన్న దశలుగా విభజిస్తారు. స్థలం ఎంపిక, పర్యావరణ స్క్రీనింగ్ తదితర ప్రక్రియలు చేపడతారు. తరవాత వివరణాత్మక మదింపు చేపట్టి ప్రభావాలను తగ్గించే చర్యలను గుర్తించి అమలు చేస్తారు. చివరిగా తీసుకున్న చర్యల ప్రభావాన్ని విశ్లేషించి భవిష్యత్ ప్రాజెక్టులకు పాఠాలుగా ఉపయోగిస్తారు.

ప్రాజెక్టు ప్రతిపాదకులు, మదింపు నిపుణులు, నిర్ణయాధికారులు, ప్రజలు ఈఐఏ ప్రక్రియలోని ప్రధాన వర్గాలు. ప్రతి వర్గం తమ పాత్రను సక్రమంగా నిర్వహిస్తే, పర్యావరణ పరిరక్షణలో సమగ్ర ఫలితాలు అందుతాయి. ప్రజాభిప్రాయం, ప్రజా విచారణలు ఇందులో కీలకం. ప్రాజెక్టు ప్రతిపాదకులు మొత్తం ఈఐఏ ప్రక్రియను నిర్వహిస్తారు. మదింపు నిపుణులు పర్యావరణ అధ్యయనం చేపట్టి నివేదికను సిద్ధం చేస్తారు. సంబంధిత అధికారులు ఆ నివేదికల్ని పరిశీలించి, అనుమతులపై నిర్ణయాలు తీసుకుంటారు. చివరగా, ప్రజాభిప్రాయం, ప్రజావిచారణల్లో పాల్గొనడం ద్వారా ప్రజలు భాగస్వాములవుతారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇలాంటి చట్టపరమైన వ్యవస్థకు సంబంధించి స్పష్టమైన, సమగ్ర నిబంధనలు అమలవుతాయి. ప్రజా భాగస్వామ్యం అధికంగా ఉంటుంది. ప్రతి దశలోనూ పర్యవేక్షణ కొనసాగుతుంది. ప్రతిపాదిత ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయాలనూ పరిశీలిస్తారు. నివేదికల నాణ్యతపై నిర్దిష్ట ప్రమాణాలు పాటిస్తారు. అదే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చట్టపరంగా అస్పష్టత, నిబంధనల్లో అసమగ్రత పెద్ద సమస్య. ప్రజా భాగస్వామ్య ప్రక్రియ కూడా తక్కువే. ప్రాజెక్టులపై పర్యవేక్షణ, ప్రత్యామ్నాయాల పరిశీలన చాలా అరుదు. ప్రాజెక్టు మొత్తం వ్యయంలో ఈఐఏ ఖర్చు సాధారణంగా 0.01-0.14శాతం మధ్యలో ఉంటుంది. ఇది చాలా తక్కువే. కానీ, పర్యావరణ నష్టాలను నివారించడంలో బాగా ఉపయుక్తం. అందుకని, దీన్ని పెట్టుబడిగా, కొద్దిపాటి ఖర్చుతో పర్యావరణ పరంగా భారీ ప్రయోజనాలను పొందే సాధనంగా భావించాలి. భారతదేశంలో పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియ పర్యావరణ(సంరక్షణ) చట్టం-1986, ఈఐఏ నోటిఫికేషన్-2006 ఆధారంగా అమలులో ఉంది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 'ఏ గ్రేడ్ ప్రాజెక్టు'లకు అనుమతులు మంజూరు చేస్తుంది. రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అధికారులు 'బీ గ్రేడ్' ప్రాజెక్టులను పరిశీలిస్తారు. ప్రస్తుతం అన్ని అనుమతులు, పర్యవేక్షణ కార్యకలాపాలు 'పరివేష్' అనే డిజిటల్ పోర్టల్ ద్వారా నిర్వహిస్తున్నారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ ద్వారా వివాదాల పరిష్కారం, ఉల్లంఘనలపై చర్యలు సాగుతున్నాయి.

కొన్ని రాష్ట్రాల్లోనే బాగు

గనులు, విద్యుత్, రహదారులు, స్థిరాస్తి, పరిశ్రమలు ప్రధాన ప్రాజెక్టు రంగాలుగా ఉంటున్నాయి. సగటు అనుమతి సమయం 180-270 రోజులుగా నమోదవుతోంది. అనుమతుల తరవాత 40-45శాతం ప్రాజెక్టులు మాత్రమే క్రమం తప్పకుండా నివేదికలు సమర్పిస్తున్నాయి. ఈఐఏ అమలు ప్రక్రియ ప్రతి రాష్ట్రంలో విభిన్నంగా ఉంటోంది. గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు సమర్థ వ్యవస్థలను కలిగి ఉన్నాయి. ఉత్తర, తూర్పు రాష్ట్రాలు సిబ్బంది కొరత, భౌగోళిక క్లిష్టత వల్ల సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లు గనుల ప్రాజెక్టులకు జిల్లా స్థాయి పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేశాయి.

సాంకేతిక నైపుణ్యం, బలమైన సంస్థాగత నిర్మాణం కలిగిన రాష్ట్రాలు ఈఐఏలో మెరుగైన నాణ్యతను ప్రదర్శిస్తున్నాయి. ప్రజా భాగస్వామ్యంలో కేరళ, ఒడిశా మంచి పనితీరు చూపుతున్నాయి. నగర ఆధారిత రాష్ట్రాల్లో ప్రజావిచారణల్లో భాగస్వామ్యం తక్కువే. మన దేశంలోని ఈఐఏ వ్యవస్థ ఆర్థికాభివృద్ధి, పర్యావరణ సంరక్షణ మధ్య సమతుల్యత సాధించడానికి శాస్త్రీయ, పారదర్శక విధానంగా అభివృద్ధి చెందింది. కానీ, రాష్ట్రాల మధ్య సంస్థాగత, సాంకేతిక వ్యత్యాసాలు కొనసాగుతున్నాయి. సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయాల్సి ఉంది. పారదర్శకతను, ప్రజా భాగస్వామ్యాన్ని పెంచాలి. ఈఐఏను స్థిరమైన అభివృద్ధి సాధనకు మూలస్తంభంగా పరిగణించాలి. ఇది పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక వృద్ధి, సామాజిక సమానతల మధ్య సమతుల్యతను సాధిస్తుంది. ప్రాజెక్టులను ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రజా భాగస్వామ్యంతో అమలు చేస్తేనే పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి సాధ్యమవుతాయి.



వై.శ్రీనివాస్
విశ్రాంత 'జీ'గ్రేడ్ సైంటిఫిక్ ఆఫీసర్ (రేడియేషన్ సేఫ్టీ), అటామిక్ ఎనర్జీ విభాగం

స్వాతంత్ర్యానికి పూర్వం మొదలై దాదాపు ఆరు దశాబ్దాల పాటు తెలుగు చిత్రసీమలో కూచిపూడి నృత్యం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. సినీరంగంలో నృత్య దర్శకత్వానికి ఆద్యులైన పసుమర్తి కృష్ణమూర్తి, వేదాంతం రాఘవయ్య, వెంపటి పెద్ద సత్యం 'నాట్యత్రయం'గా పేరుగాంచారు. వారిలో అత్యధిక చిత్రాలకు దర్శకత్వం వహించి, వైవిధ్యభరితమైన నృత్యరీతులతో ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న పసుమర్తి శతజయంతి నేడు.

కృష్ణమూర్తి నృత్య దర్శకత్వం వైవిధ్యంగా ఉండేది. గుణసుందరి కథ, మల్లీశ్వరి, పాతాళ భైరవి, మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మ కథ, మేఘసందేశం, బాల రామాయణం వంటి 300కు పైగా చిత్రాలకు పసుమర్తి నృత్య దర్శకత్వం

కూచిపూడి కీర్తిపతాక

వహించారు. మాయాబజార్‌లో కథాకళి పద్ధతికి చెందిన మోహినీ భస్మాసుర ముఖాభినయం, గుండమ్మ కథలో స్టేజ్ నృత్యం వంటివి చాలా ఆదరణ పొందాయి. నాట్యం, అభినయంతో భావం అర్థమయ్యేలా ప్రదర్శించాలంటే కళనూ నాట్యాన్నీ ఆహార్యాలనూ కూలంకషంగా తెలుసుకున్న మహానుభావులకే సాధ్యం.


కృష్ణమూర్తి

అలాంటి వారిలో అగ్రగణ్యులు పసుమర్తి. ఆయనెప్పుడూ 'నాట్యధర్మి, లోకధర్మి' అంటుండేవారు. అంటే, నాట్యశాస్త్రాన్ని ఒకవైపు, పాత్ర సందర్భాన్ని మరోవైపు తీసుకుని చక్కటి నృత్యాన్ని నిర్మించడమని అర్థం. ఒక్క నాట్యంలోనే సంగీతం, సాహిత్యం, శిల్పం, చిత్రలేఖనం, ఆహార్యం వంటి కళలన్నీ మిళితమై ఉంటాయనేవారు. ఆయన నృత్యాలన్నీ ఎలాంటి తికమకలు లేకుండా... అభినయం, ఆంగికం, పదవిన్యాసం, లాలిత్యం, శిల్పం ఆకర్షణీయంగా ఒదిగిపోయి హృదయాన్ని హత్తుకునేలా కనిపిస్తాయి. అశ్లీలతకు మచ్చుకైనా చోటిచ్చేవారు కాదు. హాస్య ప్రధానమైన నృత్యాలు, కవ్వాలీ, వెస్ట్రన్ డాన్సులకు సైతం దర్శకత్వం వహించారు పసుమర్తి.

కృష్ణమూర్తి 1925 డిసెంబరు 11న కృష్ణా జిల్లా కూచిపూడిలో రామయ్య, ఆదిలక్ష్మి దంపతులకు జన్మించారు. మాతామహులు చింతా వెంకట్రామయ్య దగ్గర నాట్యం నేర్చుకున్నారు. మేనమామలతో కలిసి కూచిపూడి నృత్యనాటిక ప్రదర్శనలిచ్చేవారు. లవుడు, కుశుడు, లోహితాస్య, ప్రహ్లాదుడు వంటి బాలపాత్రల్లో ఇట్టే ఒదిగిపోయేవారు. ఏకబిగిన రెండున్నర గంటలకు పైగా సోలో ప్రదర్శనలిచ్చిన బాలనర్తకుడిగా పేరు తెచ్చుకున్నారు. కూచిపూడిలో సోలో ప్రదర్శన ఇచ్చిన తొలి కళాకారుడు ఆయనే. వేదాంతం రాఘవయ్యతో కలిసి ప్రభాకర నాట్యమండలిని స్థాపించి ప్రదర్శనల ద్వారా కూచిపూడి వైభవాన్ని చాటారు. వాగ్గేయకారుడు, గాయకుడు అయిన పసుమర్తి సాత్వికాభినయంలోనూ దిట్ట. సాధారణ ప్రేక్షకులను అలరించడానికి జానపద, సాంఘిక నృత్యనాటికలు కూడా ప్రదర్శించేవారు. 1945లో లంక సత్యం దర్శకత్వం వహించిన భక్త తులసీదాస్ చిత్రానికి తొలిసారిగా నృత్య దర్శకత్వం వహించారు పసుమర్తి. తరవాత ప్రముఖ దర్శకుడు కె.వి.రెడ్డి పరిచయంతో గుణసుందరి కథకు నృత్య దర్శకత్వం వహించే అవకాశమొచ్చింది. దాంతో మంచి పేరు తెచ్చుకున్న ఆయన- తిరుగుబాటు, మల్లీశ్వరి వంటి చిత్రాలతో సినీ రంగంలో తన స్థానాన్ని పదిలపరచుకున్నారు. తన నృత్య దర్శకత్వంతో పాటలకు జీవంపోసి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన పసుమర్తి కృష్ణమూర్తి- 2004, ఆగస్టు 8న నిద్రలోనే అస్తమించారు. నృత్య దర్శకత్వంలో ఘనాపాటిగా ఆయన ఎప్పటికీ నిలిచిపోతారు!

– పసుమర్తి ఉదయభాస్కర్

అంతా మాయ!

మనుషులు నిత్యం అనేక రకాల కర్మలను(పనులను) ఆచరిస్తుంటారు. అవి సత్కర్మలు కావచ్చు, దుష్కర్మలైనా కావచ్చు. సత్కర్మల వల్ల సత్ఫలితాల్ని, దుష్కర్మల వల్ల దుష్ఫలితాల్ని అనుభవిస్తుంటారు. అసలు ఈ కర్మలను మనతో ఎవరు చేయిస్తున్నారు? దేవతలని, దానవులని లేకపోతే పూర్వ జన్మల పాపపుణ్యాల ఫలితమేమోనని.. రకరకాలుగా మథనపడతారు మనుషులు. వాటికి మనలోని త్రిగుణాలే ముఖ్యకారణం అన్న విషయాన్ని మాత్రం గ్రహించరు. పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలతో పాటు మనసును కూడా కలిగిన మానవ దేహం ప్రకృతి స్వభావాన్ని అనుసరించి విభిన్న గుణాలను కలిగి ఉంటుంది. అందులో ముఖ్యమైనవి సత్వ, రజో, తమో గుణాలు. ఈ త్రిగుణాల మాయలోనే మనుషులు కర్మలను ఆచరిస్తుంటారు. చేసే పనులను అనుసరించి ఉత్తమ, మధ్యమ లేక అధమ ఫలితాలను అనుభవిస్తుంటారు.

త్రిగుణాల్లో ఉత్తమమైంది సత్వ గుణం. ఇది ఉన్నవారు జ్ఞానులై వస్తువును వస్తువుగా నిజదర్శనం చేస్తారు, భ్రాంతిలో ఉండరు. తమతో పాటు అందరి శ్రేయస్సు కోరుకుంటారు. స్వార్థం, అహంకారం, ఈర్ష్య, అసూయ, ద్వేషాలకు దూరంగా ఉంటారు. సత్యాన్ని నమ్ముతారు, ధర్మం తప్ప మరి వేటినీ తమ దరికి చేరనివ్వరు. సత్కార్యాల పట్ల ఆసక్తిని కలిగి ఉంటారు. తదనుగుణంగా కర్మలను ఆచరించి, ఆనందకరమైన ఫలితాలను అనుభవిస్తారు. ఇందుకు శ్రీరాముడే ఉదాహరణ. కష్టసుఖాలను చిరునవ్వుతో స్వీకరించి ధర్మమార్గంలో నడిచి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచాడు. రాముడంటేనే ధర్మం, ధర్మం అంటేనే రాముడు ఆచరించినది- అని ప్రసిద్ధికెక్కిన దివ్య చరితుడు శ్రీరాముడు.



అంతర్యామి

బాహ్య భోగాల వ్యామోహానికి ఆకర్షితులై ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోయే వారిని అందుకు పురికొల్పేది రజోగుణం. అపారమైన జ్ఞానసంపదను కలిగి ఉన్నప్పటికీ తమలోని ఈ రజోగుణం వల్ల సత్ఫలితాన్ని పొందలేకపోతారు. ఇందుకు రావణాసురుడే ఉదాహరణ. రావణబ్రహ్మగా కీర్తి పొందినప్పటికీ పరస్త్రీ వ్యామోహంతో కష్టాలను కోరి తెచ్చుకుని ఫలితాన్ని అనుభవించాడు. మహాభారతంలో దుర్యోధనుడు కూడా రాజ్యకాంక్ష అనే రజోగుణం కారణంగా పతనమయ్యాడు.

ఇక గుణాలన్నిటిలోకి అధమమైంది తమోగుణం. ఇది ఉన్నవారు నిరాశ, నిరాసక్తత, సోమరితనం, మూర్ఖత్వంతో చెడ్డ పనులు చేసి దుష్ఫలితాలు పొందుతారు. దురాచారాలూ దుర్వ్యసనాలూ వీరి సొంతం. ఇలాంటి వారిని నేటి సమాజంలో ఎక్కువగా చూస్తుంటాం.

ప్రతి వ్యక్తీ ఏ పని చేస్తున్నా- అదే ఎందుకు చేస్తున్నాం, ఏ గుణం అందుకు ప్రేరేపిస్తోంది, దాని ఫలితం ఏ విధంగా ఉంటుంది- అని ఒక్క క్షణం ఆలోచించాలి. కర్మలన్నీ త్రిగుణాల మాయ అని గ్రహిస్తే, ఆ మాయ నుంచి బయటపడే ప్రయత్నం చేయగలుగుతాడు. ఇంద్రియ నిగ్రహాన్ని పాటిస్తూ ధర్మమార్గంలో మానవత్వంతో నడవగలిగితే అదే మానవ జన్మకు సార్థకతనిచ్చే సత్కర్మ అవుతుంది.

– జీవీయస్ ఆచార్యులు



సామాజిక శాస్త్రాల వారే...

సివిల్ సర్వీస్ పరీక్షల్లో విజయం సాధించి అత్యున్నత కొలువులు అందిపుచ్చుకోవాలని ఎంతోమంది యువత కలలు కంటుంటారు. అందుకోసం రేయింబవళ్లు కష్టపడుతుంటారు. హ్యుమానిటీస్ (హిస్టరీ, సాహిత్యం, ఫిలాసఫీ, ఇతర ఆర్ట్స్ కోర్సులు), సైన్స్, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి విభాగాల్లో పట్టాదారులెందరో సివిల్స్‌లో పోటీ పడుతుంటారు. వారిలో సామాజిక శాస్త్రాల వారి సక్సెస్ రేటే ఎక్కువగా ఉంది. 2021లో సివిల్స్ మెయిన్స్ పరీక్షలు రాసిన వారిలో 1819 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారిలో 748 మంది కొలువులు ఒడిసిపట్టారు. వారిలో ఆయా విద్యార్హతలు కలిగిన అభ్యర్థుల సంఖ్య, వారి సక్సెస్ రేట్ (శాతాల్లో)...

చదువు	ఇంటర్వ్యూకు ఎంపికైనవారు	విజేతలు	సక్సెస్ రేట్
బ్యాచిలర్ డిగ్రీలు	1402	585	41.7
ఎ) హ్యుమానిటీస్	184	88	47.8
బి) సైన్స్	119	35	29.4
సి) మెడికల్ సైన్స్	101	41	40.6
డి) ఇంజినీరింగ్	998	421	42.2
డిగ్రీ పైస్థాయి	417	163	39.1
ఎ) హ్యుమానిటీస్	241	100	41.5
బి) సైన్స్	71	29	40.8
సి) మెడికల్ సైన్స్	12	3	25
డి) ఇంజినీరింగ్	93	31	33

పరకాయ స్వాహా!

తాము నరకయాతన పడుతున్నామని మనుషులెప్పుడూ ఉసూరుమంటుంటారు. నిజానికి స్వర్గంలో దేవుళ్లు పడుతున్న కష్టాల ముందు అవెంత? పైగా తమ బాధలను దేవుళ్లు బయటకు చెప్పుకోనూ లేరు. ఇక్కడ మనుషులు చలికి గజగజమని వణుకుతుంటే, అక్కడ దేవుళ్లు 'జగజగ'మని వణికిపోతున్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన పరమ పవిత్ర స్థలం తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయ పరకామణిలో దొంగతనం జరిగింది కదా! అదేదో చిన్న విషయమని, డాలర్లలో లెక్కకట్టి మరీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తేలిగ్గా తీసిపారేశారు. ఆ మాటలకు దేవుళ్లు ఎంతగా కలవరపడి ఉంటారో అని పలువురు కంటతడిపెడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 151 మధ్యలోని 5 తీసేసి, అటూ ఇటూ కలిపి 11 చేశారన్న కోపంతో దేవుళ్లను జగన్ అలా అంటున్నారేమోనని మరి కొంతమంది లా పాయింట్లు తీస్తున్నారు.

దేవాలయాల్లో నోటు చోరీ జరిగితేనే లెక్కలేకపోతే, ప్రజలే దేవుళ్లని చెప్పే ప్రజాస్వామ్యంలో జనం జేబుల్ని ఘరానా దొరలు జోరుగా కత్తిరిస్తుంటే ఇక పట్టించుకునేదెవరు? వెనకటికి తాము టోపీ పెట్టుకుని నాయకులయ్యేవారు. ఇప్పుడేమో ఇతరులకు కుచ్చు టోపీ పెట్టి గద్దె నెక్కుతున్నారు. తిమ్మిని బమ్మిని చేసి, నీకిది నాకది అంటూ అవినీతిని వ్యవస్థాగతం చేసి మరీ అడ్డగోలుగా దోపిడులు, స్కాములకు పాల్పడుతున్నారు. అందుకే, స్కామాతురాణాం న భయం, న లజ్జ, న చీము, న నెత్తురు అన్నట్టు మారిపోయింది పరిస్థితి. అసలు స్కాము చేయడమే కొంతమందికి డ్రీము అన్నట్లు తయారైంది. ఒక స్కాం బయటపడ్డాక సంబంధిత దోపిడిదారులు డబ్బు తిరిగి కట్టేశారుగా అని నిందితులపై సానుభూతి చూపించే 'దయామయులూ' పుట్టుకొస్తున్నారు. ఈ జాలిని చూసి చివరికి అసలైన కరుణ కూడా చీదరించుకోకుండా ఉంటుందా? ఇన్ని అవలక్షణాలను ప్రజాస్వామ్యం ఎలా తట్టుకుంటుంది? పైగా, స్కాములు చేయడంలో ఆరితేరిన ఎంతో మందిని 'ఆర్పి తేరిన' నాయకులు పాత నేతలైన తమ కుటుంబ సభ్యులనే మించి కుంభకోణాలు చేస్తున్నారు. కొడుకు చేతిలో ఓడిపోవాలని తండ్రి కోరుకుంటాడు. కానీ తనయుడు తనకు మించిన కుంభకోణాలు చేస్తే



తండ్రికి చాలా మేలుంది! అప్పుడు తండ్రే మేలు.. కొడుకు అంతకన్నా ఘోరంగా తయారయ్యాడని జనం అంటుంటే ఏ లోకంలో ఉన్నవారికైనా అంతకన్నా మంచి పేరు ఏముంటుంది మరి!

మన దేశంలో కుంభకోణాలు పొరపాటున రుజువవుతాయనుకున్నా వాటిలో పీకల్లోతున కూరుకుపోయిన జగత్‌కంత్రీలు జంకు గొంకు లేదంటున్నారు. మహా అయితే అరెస్టు చేస్తారు. అయితే ఏంటట! జైజై అంటూ 'మందు'మాగధులు నానా బీభత్సం సృష్టిస్తుండగా కుంభకోణాసురుడు అత్తారింట్లో లాగా కారాగారంలోకి అడుగుపెడతాడు. మొదటిసారి అయితే భయమో, బాధో ఉంటాయికానీ, అలవాటయ్యేకొద్దీ ఏ చీకూ చింతా ఉండదు. పైగా జైల్లో 'భావసారూప్యం'గల ఖైదీలతో పరిచయమై బయటికొచ్చాక చేయాల్సిన కొత్త కుంభకోణాలకు ప్రణాళికలు రచించుకోవచ్చు. కంఠస్థం చేశాక సాక్ష్యాధారాలు లేకుండా చేసుకోవచ్చు. చివరికి జైలు నుంచి బెయిలు మీద బయటకొచ్చిన సమయంలోనూ స్వాగత తోరణాలు, సత్కారాలు, బాణసంచా వెలుగుల్లు.. అదో జాతరే! 'మము పాలించగ నడచీ వచ్చితివా' అన్న పాటలకూ కొదవుండదు. 'జరిగితే పడాలి.. జారితే పడాలి' అన్న సామెత నాయకుల కోసం మారిపోయి 'పడితే జైల్లో పడాలి' అన్నట్లు రూపుదిద్దుకుంది. కోటీశ్వరుల పెళ్లిళ్లప్పుడూ అంత హడావుడి ఉండదు. విచారణకు హాజరైనప్పుడు నిందిత నాయకులు దేశాన్ని ఉద్ధరిస్తున్నట్టు పోజులు పెడతారు. డబ్బిచ్చి రప్పించుకున్న రాజకీయ కూలీలు జిందాబాద్‌లు కొడుతూ సెల్ఫీలకు ఎగబడతారు. నరుకుతాం, నాశనం చేస్తామంటూ అరుపులూ తొక్కిసలాటలు.. అబ్బో! ఆ దొంగ రాజకీయ నాటకాలకు అంతే ఉండదు!


ధర్మ దేవత కలియుగంలో ఒంటి కాలి మీద నడుస్తుందంటారు. అదీ సందేహమే. ఏ పాపం చేయకపోయినా, తమకు గిట్టని నాయకులను జైల్లో పడేసి కొట్టాలన్న (అ)ధర్మాత్ములయిన నాయకులు మనకున్నారు. అలా కొట్టకూడదని యమధర్మరాజు వచ్చి చెప్పినా ఆ నాయకులు ఒప్పుకోరు. రాజకీయంగా ప్రత్యర్థుల అంతం కోరుకుంటారు తప్ప తమ పంతం మానుకోరు. ఒకప్పుడు బాగా చదువుకున్న వాళ్లు రాజకీయ నాయకులయ్యేవారు. ఈ రోజుల్లో చదువు ఒంటబట్టని హంతకులు, దోపిడిదారులు, రౌడీషీటర్లు రాజకీయాల్లోకి చేరడం, చివరికి రాజ్యాలేలే స్థితికి రావడం పెరిగిపోతోంది. రౌడీయిజమా! నీ పేరు రాజకీయమా? అనే దుర్గతి వచ్చిపడింది. దేవుడా! ఇదంతా నువ్వు చూస్తున్నావా? చూస్తుంటే ఏం చేస్తున్నావు? పాపం పండుతుందంటావా? పోనీ అదెప్పుడు పండుతుందో అయినా చెప్పు!

– శంకర నారాయణ

హాయ్! బుజ్జీ!!

పక్కన పెట్టేస్తే ఎలా?

బొమ్మలు: శ్రీనివాస్ కథ: హరి





దీక్షబూని.. తరలగా!

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

34.50 లక్షల లడ్డూలు

దేవస్థానం అధికారులు లడ్డూలు ఘనంగా సిద్ధం చేశారు. కనకదుర్గానగర్‌లో 14 ప్రసాదాల విక్రయ కౌంటర్లు, రైల్వేస్టేషన్, బస్టాండ్, ఘాట్ రోడ్డు, దిగువన మరో నాలుగుచోట్ల కౌంటర్లు సమకూర్చారు.

భవానీల ఆకలి తీర్చేలా..

ఇరుముడి సమర్పించిన భవానీ దీక్షాధారులకు ఎలివేటెడ్ క్యూలైన్ కాంప్లెక్సులో ఉదయం అల్పాహారం, పాలు, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం అల్పాహారం, పాలు ఇస్తారు.

దుర్గమ్మ సన్నిధిలో నేటి నుంచి ఈనెల 15 వరకు నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 6 గంటలకు ప్రధాన ఆలయం నుంచి కలశ జ్యోతులను తెస్తారు. నిర్ణయించిన ముహూర్తానికి కనకదుర్గానగర్‌లో హోమగుండాల్లో అగ్ని ప్రతిష్ఠాపనతో విరమణ మహోత్సవం మొదలవుతుంది. గిరిప్రదక్షిణ పూర్తి చేసి క్యూలైన్లో ఉన్న భవానీ దీక్షాధారులను దర్శనానికి అనుమతిస్తారు. **ఇరుముడి సమర్పణ:** నూతన అన్నదాన భవనం మొదటి అంతస్తులో 110 స్టాండ్ల వద్ద ఇరుముడి పాయింట్లు ఏర్పాటు చేశారు. కనకదుర్గానగర్‌లో రెండు, గోశాల పక్కన ఒక హోమగుండం వద్ద దీక్ష విరమణ చేసిన వారు నేతి కొబ్బరికాయలు సమర్పించే ఏర్పాట్లు చేశారు. 300 మంది గురుభవానీలు షిఫ్టుల వారీగా సహకరిస్తారు. **సుజలం:** గిరిప్రదక్షిణ, క్యూలైన్లు, హోల్డింగ్ ఏరియాల్లో భక్తుల దాహార్తి తీర్చేలా 15 లక్షల వాటర్ బాటిల్స్ సిద్ధం చేశారు. **స్వచ్ఛ సైన్యం:** గిరిప్రదక్షిణ మార్గం, ఘాట్లు, క్యూలైన్లు, ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు 2,177 మందికి.. మూడు షిఫ్టుల్లో విధులు కేటాయించారు. **పుణ్యస్నానాలు:** సీతమ్మవారి పాదాలు, భవానీ ఘాట్ వద్ద జల్లు స్నానాలకు సిద్ధం చేశారు.. 800 షవర్లు పెట్టారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు 14 గదులను సమకూర్చారు. **తలనీలాలు:** తాత్కాలిక కేశఖండనశాల, ఘాట్ల వద్ద తలనీలాల సమర్పణకు 850 మంది క్షురకులను నియమించారు.


హోమగుండం సిద్ధం

మొర్సుమిల్లి దారి.. మేలుకోకుంటే అంతేమరి!

రక్షణ గోడలు విరిగిపోయాయి.. పిల్లర్లు ధ్వంసమయ్యాయి. ఏ క్షణమైనా కూలేలా ఉన్న ఈ వంతెనపై ప్రయాణం దినదిన గండంలా మారింది. మైలవరం మండలం మొర్సుమిల్లి సమీపంలో రాజు





పాలెం నుంచి మధిర వెళ్లే దారిలో నందికొండ కాలువపై ఉన్న ఈ వంతెన చాలాకాలం నాటిది. దీనిని కూలగొట్టి కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
- ఈనాడు, అమరావతి

వీడని చిక్కులు.. దక్కని రూకలు

సాంకేతిక ఇక్కట్లతో 3,050 మంది రైతుల దరిచేరని సుఖీభవ

ఈనాడు, అమరావతి

★ దరఖాస్తులు: 2,42,826
★ అర్హత: 1,21,679 మంది
★ జమైన రైతులు: 1,18,629



అన్ని అర్హతలు ఉన్నా జిల్లాలో చాలా మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము జమ కాలేదు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్, ఈకేవైసీ, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడం వంటి సాంకేతిక కారణాలతో పథకానికి దూరమయ్యారు. మొదటి విడత జమ సమయంలో మాదిరిగా ప్రత్యేక గ్రీవెన్స్ పెట్టి సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

అన్నీ ఉన్నా అందని సాయం...

☆ పెనుగంచిప్రోలు రైతు గడిపుడి గోపీనాథ్ 3, ఆయన తండ్రి 2.4 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇద్దరికి వేరుగా రేషన్ కార్డులతోపాటు అన్ని అర్హతలున్నాయి. అయినా, పీఎం కిసాన్, సుఖీభవ.. రూ.14వేలు జమ కాలేదు. ఇదే తరహాలో పంచాయతీ పరిధిలో పదుల సంఖ్యలో రైతులున్నారు. ☆ ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం రైతు కొప్పుల వెంకటేశ్వరరావు, మరీదు అనసూయ, మరీదు చిన్నారావు, బొలగాని గోపి, బొలగాని వెంకటేశ్వరరావు తదితర రైతులకు అన్ని అర్హతలున్నా నగదు జమకాలేదు. పెట్టుబడి ఖర్చు భారంగా మారుతోందని రైతులు వాపోతున్నారు.

సాంకేతిక కారణాలు... ☆ భూమి రికార్డులకు ఆధార్ అనుసంధానం లేకపోవడం, ఒక రైతుకు బదులు మరో రైతు ఆధార్ అనుసంధానం కావడం, ఈ-పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోక పోవడంతో ఎక్కువ మంది పథకానికి దూరమయ్యారు. ☆ వేర్వేరు కుటుంబాల వివరాలన్నీ ఒకే హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు కావడంతో వారిలో ఒక్కరికే నగదు జమయ్యాయి. ☆ కొందరు రైతుల బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదు. కొన్ని బ్యాంకు ఖాతాలు సైతం క్రియాశీలకంగా (యాక్టివ్) లేవు. ☆ భూ యజమానులు మరణించడం.. యాజమాన్య హక్కులు కుటుంబ సభ్యులకు బదిలీ కాకపోవడం.

ఆర్ఎస్‌కేల్లో అవకాశం..

మొదటి విడత జమ చేసినప్పుడు ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్ ఆహ్వానించి సమస్యలు పరిష్కరించింది. ప్రస్తుతం ఆ అంశంపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. ☆ దీనిపై జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి మాట్లాడుతూ 'రైతులు అర్హత నిర్ధారించే పత్రాలతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సహాయకులకు సమర్పించాలి. పరిశీలించి అర్హత ఉంటే అర్హుల జాబితాలో చేరుస్తారని' తెలిపారు.

స్వాగత వీచిక.. సగర్వ వేదిక

కలంకారీ కార్పెట్లకు అంతర్జాతీయ గుర్తింపు

కలంకారీ హస్తకళల్లో కార్పెట్లకు ప్రత్యేక స్థానం ఉంది. ఇంటీరియర్ డెకరేటర్‌గా వినియోగించే వీటికి అంతర్జాతీయంగా ఆదరణ లభిస్తోంది. పెడనలో రూపుదిద్దుకునే ఈ కార్పెట్లను దేశ విదేశాల్లో విక్రయిస్తుంటారు. ఇంటికి అదనపు అందాన్ని తీసుకొస్తూ ఈ కార్పెట్లు భారతీయ సంస్కృతికి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి.

వివిధ సైజుల్లో...: కార్పెట్లు 1.50×2 అడుగుల సైజ్ నుంచి 6×9 అడుగుల సైజు వరకు ఉంటాయి. ఇంటీరియర్ డిజైనర్లు ఇటీవల కలంకారీ కార్పెట్లను ఎక్కువగా సిఫార్సు చేస్తున్నారు. కశ్మీర్, ఇతర రాష్ట్రాల ఉత్పత్తులతో పోల్చితే అందుబాటు ధర, ప్రకృతి సిద్ధమైన రంగులతో రూపుదిద్దుకోవడం ప్రధాన కారణం. హస్తకళా ప్రియులు పూజ, యోగా మ్యాట్‌లుగా ఈ కార్పెట్లను వినియోగిస్తుంటారు. లివింగ్ రూం, బెడ్ రూం, స్టడీరూముల్లోనూ ఉపయోగిస్తుంటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కలంకారీ కార్పెట్ల వినియోగం గణనీయంగా పెరిగింది. పశ్చిమ భారత దేశం నుంచి ఉత్పత్తిదారులకు ఆర్డర్లు భారీగా వస్తున్నాయి.





వరంగల్ నుంచి విక్రయాలు

వరంగల్‌లో కొంతమంది కలంకారీ కార్పెట్ల వర్తకాన్ని భారీ స్థాయిలో చేస్తున్నారు. అక్కడ కొత్తవాడలో నేతన్నలు మగ్గాలపై ఉత్పత్తి చేసే కార్పెట్లను పెడనకు తీసుకొచ్చి కలంకారీ ప్రింటింగ్ చేస్తారు. పెడనలో రూపుదిద్దుకుంటున్న వీటిని వరంగల్ తరలించి అక్కడి నుంచి దేశ విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారు. వరంగల్ నుంచి వచ్చిన కోరా కార్పెట్లు రంగురంగుల కలంకారీగా మారేందుకు కనీసం రెండు నెలలు పడుతుంది. ప్రభుత్వ సంస్థలు కూడా వివిధ సందర్భాల్లో బహుమతులుగా వీటిని ఎంపిక చేస్తున్నాయి. – పెడన, న్యూస్‌టుడే

భళాకృతులు...

పనికిరాని వస్తువులు, రోజు వారీగా వచ్చే వివిధ వ్యర్థాలతో చక్కని కళాకృతులు తయారు చేసి సృజన చాటారు ఆ విద్యార్థులు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో జరుగుతున్న అమరావతి బాలోత్సవంలో భాగంగా బుధవారం నిర్వహించిన 'బెస్ట్ ఫ్రం వేస్ట్' ప్రదర్శనలో రెండు వందల వరకు ప్రదర్శించి భళా అనిపించారు.
– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే



ప్లాస్టిక్ వ్యర్థాలతో పెట్రోలు

ప్లాస్టిక్ వ్యర్థాలతో పెట్రోలు ఉత్పత్తి చేయొచ్చని కె.సృజన్(8వ తరగతి) పేర్కొన్నారు. పైరాలిసిస్ విధానం ద్వారా ఒక రాగి పాత్ర, దానికి ఒక పాత ట్యూబ్ ఏర్పాటు చేశారు. రాగి పాత్రలో వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు కరిగేలా స్టౌ ఏర్పాటు చేశారు. దీని పక్కనే ఉన్న కండెన్సర్ ప్రవాహంలోకి మారుస్తుంది. తర్వాత అది పెట్రోలు, డీజిల్‌గా మారుతుంది. కొంత గ్యాస్ కూడా ఉత్పత్తి అవుతుందని సృజన్ వివరించారు.



మొక్క పెరగడానికి రక్షణగా..

8వ తరగతి చదువుతున్న లాస్య.. ఒక పాత టైరు చుట్టూ మట్టి పోసి అందులో మొక్క నాటింది. పాత ప్లాస్టిక్ ఏర్పాటు చేసి దానికి సీసా పెట్టింది. సీసాలో నీరు పోసిగానే మొక్కకు వెళ్లేలా పైపు ఏర్పాటు చేసింది. మరోవైపు డబ్బాలను రెండు కండీలను మనిషి ఆకారంలో తయారు చేసి దీనికి ఓ టోపీ పెట్టింది. ఇలా పనికి రాని సామగ్రితో మొక్కకు రక్షణ ఏర్పాటు చేయవచ్చని తెలిపింది.



ఇనుప తీగలతో విద్యుత్తు సరఫరా

9వ తరగతి చదువుతున్న జి. ఫణీంద్ర.. వృథాగా పడి ఉన్న ఇనుప తీగలతో ఒక పెట్టెలా తయారు చేసి వ్యర్థాలు వేశాడు. దీని పక్కన సౌర పలకలు ఏర్పాటు చేశాడు. దీని ద్వారా వచ్చిన విద్యుత్తుతో వ్యర్థాలను దహనం చేసేందుకు యంత్రం ఏర్పాటు చేశాడు. కాల్చినప్పుడు వచ్చే విద్యుత్తు, సౌర పలకల ద్వారా వచ్చే విద్యుత్తు నిల్వ ఉంచేందుకు బ్యాటరీ ఏర్పాటు చేశాడు. దీంతో రహదారుల పక్కన వ్యర్థాలను దహనం చేయడం ద్వారా రెండు రూపాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చని వివరించాడు.


కళలకు జీవం: విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం బాలోత్సవ్‌లో ఆకృతులను తీర్చిదిద్దుతున్న బాలికలు

ఆకర్షణీయ వల.. ఆశపడితే విలవిల



సామాజిక మాధ్యమాల్లో ఆకర్షించే ప్రకటనలు.. లాభాల ఆశ చూపి నిలువునా ముంచుతున్నారు. ప్రముఖుల బోగస్ ఇంటర్వ్యూలు, కృత్రిమ మేధస్సు ఆధారిత వీడియోలను వాట్సప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో మోసపూరిత ప్రకటనలను పోస్టు చేస్తున్నారు. వీటిని నమ్మి చాలా మంది తమ సొమ్ము పోగొట్టుకుంటున్నారు. తొలుత కొంత మొత్తం నగదు జమ చేసి, నమ్మకం కలిగిస్తున్నారు. తర్వాత ఎక్కువ మొత్తం డబ్బు పెట్టుబడి రూపేణా జమ చేయించుకుని సొమ్ము స్వాహా చేస్తున్నారు.

ఏకంగా రూ.60 లక్షలు... మాచవరం పరిధిలో ఓ వ్యక్తిని టెలిగ్రామ్ గ్రూప్‌లో చేర్చారు. ఆన్‌లైన్‌లో స్టాక్ ట్రేడింగ్ చేస్తే.. భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. నిజమని నమ్మి.. మోసగాళ్లు సూచించిన సైట్‌లో పేరు రిజిస్టర్ చేసుకున్నాడు. ప్రక్రియ పూర్తవగానే కన్ఫర్మేషన్ మెయిల్ వచ్చింది. కొన్ని బ్యాంకు ఖాతాల నెంబర్లు పంపారు. వ్యాపారం నిమిత్తం వాటిలో లావాదేవీలు చేయాలని సూచించగా.. తొమ్మిది రోజుల్లో దశల వారీగా రూ.60 లక్షలు పంపాడు. నగదు జమవగానే మోసగాళ్ల పత్తా లేరు. చేసేదిలేక నగర పోలీసులను ఆశ్రయించాడు.

అనుమానం రాకుండా...

★ సామాజిక మాధ్యమాల్లో ఆకర్షణీయ ప్రకటనలు చూసి భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. ★ తొలుత.. మోసగాళ్లు లింక్ పంపి యాప్ డౌన్‌లోడ్ చేయిస్తారు. ★ వందల మంది ఈ యాప్‌లో లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు చూపిస్తారు. ★ మీ పేరుతో ఖాతా తెరిచి పెట్టుబడి పెట్టిస్తారు. ★ మొదట రూ.వందల్లో పెట్టించి రూ.వేలల్లో లాభం ఇచ్చి.. దానిని తీసుకునే వీలు కల్పిస్తారు. ★ ఆపై రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టించి రూ.కోట్లలో ఆదాయం ఉంటుందని నమ్మిస్తారు. ★ తర్వాత ఒక్కసారిగా సైబర్ నేరగాళ్లు మీ ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా కాకుండా ఆపేస్తారు. ★ ఇదేమని అడిగితే ఏదో సాకు చెప్పి మళ్లీ రూ.లక్షలు పెట్టుబడి పెట్టిస్తారు. వాలెట్‌లో డబ్బున్నా తీసుకోలేరంతే. – ఈనాడు, అమరావతి

అప్రమత్తతతోనే నివారణ..

★ సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలను చూసి మోసపోవద్దు. ఆ సంస్థ వివరాలను పరిశీలించి నిర్ణయించుకోవాలి. ★ భారీ పెట్టుబడి పెట్టేప్పుడు ఆ కంపెనీ కార్యాలయాలను నేరుగా సందర్శించాలి. ★ ఒకవేళ ఏదైనా గ్రూప్‌లో మీ ఆమోదం లేకుండా కలిపితే బయటకొచ్చేయాలి. ★ పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తూ రూ.లక్షల్లో సంపాదించవచ్చని ప్రకటనలు, జాయినింగ్ ఫీజు అని డబ్బులు అడిగితే చెల్లించొద్దు.

ప్రభవించిన ఘనచరిత..

దక్షిణ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవాలయానికి వందేళ్ల క్రితమే 90 అడుగుల ఇనుప ప్రభ ఉంది. ప్రతి ఏడాది చిన్న తిరునాళ్లలో అమ్మవారికి ఇనుప ప్రభోత్సవం జరగడం ఆనవాయితీగా వస్తోంది. దీన్ని చూసేందుకు వేలాది మంది భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివస్తారు. పెనుగంచిప్రోలులో 16వ శతాబ్దంలో అమ్మవారు యోగాగ్ని ప్రవేశం చేశారని చరిత్ర చెబుతోంది. అనంతరం 1925లో అమ్మవారికి 90 అడుగుల ఇనుప ప్రభను గ్రామస్థుల విరాళాలతో అధికారులు చేయించారు. అప్పట్లో మద్రాసు నుంచి సామగ్రి తీసుకొచ్చి దీన్ని తయారు చేశారు. పూర్తిగా ఇనుముతో తయారు చేసిన దాన్ని రైతులు తమ ఎడ్లను కట్టి నడిపించేవారు. ఆ తరం విద్యుత్తు లైన్లు వచ్చాక ప్రభోత్సవాన్ని ఆలయం చుట్టూ వరకే పరిమితం చేశారు. పాతది పాడైపోవడంతో 2019లో కొత్త ఇనుప ప్రభను సుమారు 90 అడుగుల ఎత్తుతో తయారు చేయించినట్లు ఆలయ ఈవో తెలిపారు. అప్పటి నుంచి అమ్మవారి తిరునాళ్లలో కొత్త దానిపై ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయం చుట్టూ ప్రభోత్సవం నిర్వహిస్తున్నారు. – పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే



మీదికొస్తే బండి.. బతుకు తెల్లారేనండి





వివిధ పనులు నిమిత్తం నగరానికి వలస వచ్చే కూలీలు, గూడు లేని అనాథలు చలిలో వణుకుతూ విజయవాడ నగరంలో రహదారుపై నిద్రపోతున్నారు. కురుస్తున్న మంచు నుంచి శరీరాన్ని రక్షించుకోవడానికి కనీసం దుప్పటి కూడా లేక వణుకుతూ ప్లాస్టిక్ కవర్లు, గోనె సంచులు చుట్టుకుని రహదారులపై నిద్రపోతున్నారు. వర్షం కురిస్తే వీరి బాధలు వర్ణనాతీతం. ఏదైనా వాహనం అదుపుతప్పి దూసుకొచ్చిందంటే పదుల సంఖ్యలో ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. గతంలో బెంజిసర్కిల్‌లో అర్ధరాత్రి ఓ బస్సు అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకు రావడంతో నిద్రపోతున్న ఐదుగురు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి వారికి కేవలం ఆధార్ కార్డు చూపిస్తే నగరంలో ప్రభుత్వం ఉచితంగా భోజనం, నిద్రపోవడానికి వసతిగృహాలు అందుబాటులో ఉన్నాయన్న విషయం చాలామందికి కూడా తెలియదు. – ఈనాడు అమరావతి

పేద కడుపు చల్లగా!

జిల్లాకు చేరిన గోధుమ పిండి, జొన్నలు...

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో బియ్యం, అరకొరగా పంచదార పంపిణీతో ఐదేళ్లు గడిచిపోయింది. కూటమి సర్కారు మాత్రం పౌర సరఫరాల వ్యవస్థలో సంస్కరణల దిశగా నడుస్తోంది. ఇప్పటి వరకు బియ్యం, పంచదార సరఫరా చేస్తుండగా కొత్త ఏడాదిలో గోధుమపిండి, జొన్నలు అందించేందుకు రంగం సిద్ధం చేసింది. ఆ మేరకు ఇప్పటికే గిడ్డంగుల్లో సరకు నిల్వ చేశారు.

✪ రేషన్ కార్డులు: 5,90,933
✪ చౌకదుకాణాలు: 957
✪ సిద్ధమైన గోధుమ పిండి: 198
✪ జొన్నలు: 100 (టన్నుల్లో)

సదవకాశం.. బహిరంగ విపణిలో కిలో గోధుమ పిండి రూ.65 ఉంది. ప్రభుత్వం మాత్రం రూ.16 లకే కార్డుదారులకు ఇవ్వనుంది. ఒక్కో కార్డుకు ఒక కిలో ప్యాకెట్ ఇస్తారు. దీంతో కార్డుదారులకు మంచి రాయితీ దక్కనుంది. జిల్లాలో కార్డుదారులకు.. 300 టన్నులు అవసరం. మొదటి నెల కార్డుదారుల ఆసక్తి మేరకు ముమ్మందు సరఫరా పెంచనున్నారు.



జొన్నలు ఇలా... జొన్నలు కార్డుకు 2-3 కిలోలు ఇవ్వనున్నారు. కార్డుదారులకు ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని మినహాయించి జొన్నలు సరఫరా చేస్తారు. ★ ఉదాహరణకు.. 20 కిలోల బియ్యం ఇచ్చే కార్డుదారుడికి... మూడు కిలోల బియ్యం మినహాయించి.. 17 కిలోల బియ్యం, 3 కిలోల జొన్నలు ఉచితంగా ఇస్తారు. మధుమేహ బాధితులకు ఈ నిర్ణయం ఊరటనిస్తుంది.

విమాన ప్రయాణికులకు మెరుగైన సేవలు


మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి తదితరులు

గన్నవరం గ్రామీణం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ ఎమ్.లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఇండిగో సర్వీసుల సంక్షోభంపై బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విమానాశ్రయం మీదుగా 22 స్వదేశీ, మూడు విదేశీ విమానాలు రాకపోకలు సాగిస్తుంటే అందులో 16 స్వదేశీ, మూడు విదేశీ సర్వీసులను ఇండిగో సంస్థ నిర్వహిస్తోంది. వాటిలోనూ ఎయిర్‌బస్ సర్వీసులైన దిల్లీ, ముంబయి సర్వీసులకే సంక్షోభం తలెత్తగా విజయవాడ విమానాశ్రయంలో ఏ అసౌకర్యం కలగలేదన్నారు. ఒక్క రోజు ముంబయి సర్వీసు, ఈ నెల 11 వరకు మాత్రమే దిల్లీ సర్వీసును రద్దు చేసినట్లు సంస్థ ప్రకటించిందన్నారు. సంక్షోభాన్ని తగ్గించేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆధ్వర్యంలో ఏఏఐ కసరత్తు చేస్తోందనీ.. ఎంపీ బాలశౌరి ఆదేశాలతో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లోనూ మెరుగైన సేవలందించేందుకు పౌర విమానయాన శాఖ కృషి చేస్తుందని లక్ష్మీకాంతరెడ్డి పేర్కొన్నారు. ఏఏఐ అధికారులు అంకిత్, శ్రీహరిరావు, డీఎస్పీ ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

విజయవాడ సిటీ: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు(టెట్)-2025 బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లాకు సంబంధించి తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో స్వర్ణభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, టెక్నాలజీ కళాశాల కేంద్రంలో జరిగిన ఆన్‌లైన్ పరీక్షకు 158 మంది అభ్యర్థులకుగాను 141 మంది హాజరయ్యారు. 17 మంది గైర్హాజరయ్యారని డీఈవో యు.వి.సుబ్బారావు తెలిపారు.

బాధ్యత మరిచి.. బరి తెగించి..

సభ పరువుతీసిన వైకాపా

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో పాలక పక్షం అడ్డగోలుగా వ్యవహరించింది. ఆ పార్టీ సభ్యులు సభ పరువుపోయేలా వ్యవహరించారు. కౌన్సిల్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం జరగ్గా, ప్రశ్నోత్తరాల తర్వాత ఎజెండాపై చర్చ జరిగింది. ఆ సమయంలో వైద్యకళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు 88కే కింద వైకాపా అత్యవసర ప్రతిపాదన తేగా, తెదేపా అభ్యంతరం వ్యక్తం చేసింది. మేయర్, వైకాపా సభ్యులు ఎదురుదాడికి దిగారు. రాష్ట్రప్రభుత్వ విధానంపై కౌన్సిల్లో చర్చించాల్సిన అవసరం లేదని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి, ఆ పార్టీ కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, జాస్తి సాంబశివరావు అడ్డుతగిలారు. ప్రతిగా ఇరుపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ప్రతిపాదనల ప్రతులను తెదేపా సభ్యులు చించి గాల్లోకి ఎగరేశారు. మైక్ కట్ చేయడంతో..ఆగ్రహించిన పాలకపక్షం సభ్యులు జై జగన్..జోహార్ వైఎస్సార్..అంటూ పెద్ద ఎత్తున నినాదాలు, అరుపులు, కేకలతో సభలో గందరగోళం సృష్టించి, వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మేయర్ పోడియం వద్దకు చేరి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. తెదేపా సభ్యులు మాట్లాడకుండా మైక్‌ను మేయర్ కట్ చేయించారు. అదే సమయంలో వైకాపా సభ్యులు హ్యాండ్‌మైక్ తీసుకుని బిగ్గరగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. దీంతో ఆగ్రహించిన తెదేపా కార్పొరేటర్ ఉషారాణి డిప్యూటీ మేయర్ వద్ద ఉన్న హ్యాండ్‌మైక్ లాక్కుని ప్రైవేటీకరణ వ్యతిరేక ప్రతిపాదిత ప్రతులను చించేశారు. దీంతో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజారెడ్డి వేగంగా ఉషారాణి వద్దకు వెళ్లి కలియబడ్డారు. మైక్ లాక్కునేందుకు కిందపడేశారు. ఇద్దరూ కింద పడి దాడి చేసుకుంటూ దుర్భాషలాడుకున్నారు. దీంతో సభ గందరగోళంగా మారింది. విరామం తర్వాత కార్పొరేటర్ ఉషారాణిని సస్పెండ్ చేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. మార్షల్స్‌తో బయటకు పంపేందుకు యత్నించగా, తెదేపా సభ్యులు అడ్డుకున్నారు. ఆపై సభలో క్షమాపణ చెప్పాలంటూ వైకాపా డిమాండ్ చేసింది. గొడవకు డిప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి కారణమంటూ ఆమె కూడా క్షమాపణలు చెప్పాలని తెదేపా డిమాండ్ చేసింది. దీంతో సభలో వాగ్వాదం జరిగింది. మార్షల్స్ చేత ఉషారాణిని బయటకు పంపేందుకు యత్నించగా, వెళ్లకపోవడంతో తదుపరి కౌన్సిల్ సమావేశానికి రాకుండా ఆమెను సస్పెండ్ చేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు.


హ్యాండ్‌మైక్ వినియోగించడంపై తెదేపా, వైకాపా సభ్యుల తోపులాట


వైకాపా, తెదేపా కార్పొరేటర్ల వాగ్వాదం

సృజనశీలురు..



శాస్త్రీయ నృత్యం

విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో అమరావతి బాలోత్సవం ఉత్సాహంగా కొనసాగుతోంది. రెండోరోజు బుధవారం ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు సందడి చేశారు. చిత్రలేఖనం పోటీల్లో సృజన చాటారు. మరో వేదికపై తెలుగు భాష ఔన్నత్యం, గొప్పతనాన్ని ఆవిష్కరించారు. పద్యాలు చెబుతూ వాటికి భావాలు వివరించారు. వివిధ కథలు చెప్పి భళా అనిపించారు. బృందాలుగా ఏర్పడి లయబద్ధంగా కోలాటం ఆడుతూ ఆకట్టుకున్నారు. జానపద నృత్యాలతో అలరించారు. దేశభక్తి, అభ్యుదయ గీతాలు ఆలపించారు. వివిధ వేషధారణలు ధరించి ఆకట్టుకున్నారు.

- న్యూస్‌టుడే, విజయవాడ సిటీ,

మరిన్ని చిత్రాలు www.eenadu.net లో చూడవచ్చు



బాలికల ఆనందహేల...



కోలాటం ఆడుతూ...



ఆకట్టుకున్న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన



చిత్రాలు వేస్తూ..



బృంద గీతాలాపన

ఎన్‌ఎంయూ రాష్ట్ర మహాసభలు రేపు

విజయవాడ (గాంధీనగర్): ప్రజా రవాణా శాఖలో కార్మికుల సంక్షేమానికి కృషి చేసే నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్‌ఎంయూ) ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన విజయవాడలో నిర్వహించే ద్వితీయ రాష్ట్ర మహాసభలకు కార్మికులు పెద్దఎత్తున తరలివస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నూతన కమిటీ ఎన్నిక, ఉద్యోగుల పదోన్నతులు, ఖాళీల భర్తీ, పాత పింఛను విధానం (ఓపీఎస్) అమలు, కొత్త బస్సుల కొనుగోలు, గతంలో రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌లో ఉన్న సర్వీసు నిబంధనలు ప్రజా రవాణా శాఖలో కొనసాగించడంతో పాటు మరో 23 అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు వివరించారు. వీటిపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ సభలకు మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌రావు, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, అధికారులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్మికులు మహా సభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

హక్కుల పరిరక్షణకు కృషి చేద్దాం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : పురాణ కాలం నుంచే మానవ హక్కుల పరిరక్షణ ఉందని బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా పేర్కొన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను జీవిస్తూ ఇతరులు కూడా జీవించేలా చూడటమే మానవ హక్కులను కాపాడడం అని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులే మానవ హక్కులని చెప్పారు. బీబీఏ మాజీ అధ్యక్షుడు మట్టా జయకర్ మాట్లాడుతూ.. దేశంలో తొలి మానవ హక్కుల కమిటీ.. బెజవాడ బార్ అసోసియేషన్ మాత్రమే అని అన్నారు. గతంలో కర్పూరి రామ్మోహనరావు నేతృత్వంలో హక్కులను కాపాడడంలో బీబీఏ ప్రముఖ పాత్ర పోషించిందని తెలిపారు. అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ కమిటీ అధ్యక్షుడు ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలో అడవులను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని విమర్శించారు. పౌర హక్కుల నాయకుడు ఎస్.ఎస్.బోస్ మాట్లాడుతూ.. గతంలో తాను నక్సలైట్లకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేశానని గుర్తు చేశారు. కార్యక్రమంలో పిచుక శ్రీనివాస్, సతీష్, వై.సీతారాం, కె.వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎ.కె.బాషా, వేదికపై శ్రీనివాస్, జయకర్, రంగారావు, రాంప్రసాద్

దీక్షాధారులతో మర్యాదగా వ్యవహరించాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: భవానీ దీక్షధారులతో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సీపీ రాజశేఖరబాబు సూచించారు. భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి బుధవారం సీపీ దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీక్షల విరమణ బందోబస్తుకు 71 సెక్టార్లుగా విభజించామని చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన 4,129 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తారన్నారు. అన్ని ముఖ్య పాయింట్ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, లక్ష్మీనారాయణ, షిరీన్ బేగం, ప్రసాద్, ఆనంద్‌బాబు, ఏడీసీపీ రామకృష్ణ పాల్గొన్నారు.



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న సీపీ రాజశేఖరబాబు, డీసీపీ కృష్ణకాంత్ పటేల్ తదితరులు

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షాదారుల మౌలిక వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా సూచించారు. భవానీ దీక్షల విరమణ నేపథ్యంలో బుధవారం క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిస్థితి సమీక్షించారు. కనకదుర్గానగర్‌లో ఇరుముడి పాయింట్లు, హోమగుండాలు, అన్నప్రసాదం పంపిణీ, ప్రసాదాల కౌంటర్లలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గిరిప్రదక్షిణ మార్గం, ఘాట్లు, తాత్కాలిక కేశఖండన శాల, క్యూలైన్లలో తాగునీరు, క్లోక్ రూమ్, సెల్ ఫోన్ భద్రతా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించేందుకు సమన్వయ శాఖల బృందాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేవస్థానం అధికారులు, పోలీసు, రెవెన్యూ, కార్పొరేషన్ తోపాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో శీనానాయక్, ఆర్డీవో కావూరి చైతన్య, ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఇలక్కియా, ఈవో శీనానాయక్, ఆర్డీవో చైతన్య

వాహనాల దారి మళ్లింపు

గొల్లపూడి, న్యూస్‌టుడే : భవానీ దీక్షల నేపథ్యంలో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై వచ్చే వాహనాలను ట్రాఫిక్ పోలీసులు మళ్లించనున్నారు. ఏలూరు, విశాఖపట్నం, గుంటూరు వైపు వెళ్లే వాహనాలను గొల్లపూడి వద్ద నుంచి పశ్చిమ బైపాస్ మీదుగా పంపిస్తారు. అలాగే తాడేపల్లి, హైకోర్టు, రాష్ట్ర సచివాలయానికి వెళ్లే వాహనాలు సైతం గొల్లపూడి వద్ద నుంచే పంపించనున్నారు. కృష్ణా నదిపై నూతనంగా నిర్మించిన వంతెన మీదుగా వాహనాలు అమరావతి వైపు వెళ్లనున్నాయి. ఈ విషయంలో వాహన చోదకులకు తెలిసేలా ట్రాఫిక్ పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



గొల్లపూడి వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎలక్ట్రిక్ లోకో షెడ్.. రైల్వేకు వెన్నెముక

విజయవాడలోనే మరమ్మతులు

విజయవాడ(రైల్వే స్టేషన్), న్యూస్‌టుడే

రైలు ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలు చేర్చడంలో ఇంజిన్ల పాత్ర కీలకం. నిర్వహణ లోపంతో మార్గమధ్యలో ఏమైనా జరిగితే భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది. అలాంటి ఇంజిన్ల నిర్వహణను విజయవాడలో చేపడుతున్నారు. అదే 'ఎలక్ట్రిక్ లోకో షెడ్' (ఈఎల్‌ఎస్).

✦ వన్‌టౌన్ పాల ఫ్యాక్టరీ సమీపంలో దీన్ని ఏర్పాటు చేశారు. దక్షిణ మధ్య రైల్వేలోనే ప్రసిద్ధిగాంచిన ఈ లోకో షెడ్డులో నిత్యం రైలు ఇంజిన్లను సిబ్బంది మరమ్మతులు చేస్తారు. 1981లో 100 లోకోమోటివ్(రైలు ఇంజిన్ల) నిర్వహణకు రూ.2.40 కోట్లతో నిర్మించారు. మొత్తం 1.28 లక్షల చదరపు మీటర్ల వైశాల్యం గల అతిపెద్ద లోకో షెడ్డు ఇది. ✦ 1980 సంవత్సరంలో రైళ్లు ఎక్కువగా బొగ్గు, డీజిల్ ఇంజిన్లతో నడిచేవి. అనంతరం ఎలక్ట్రిక్ ఇంజిన్లు వచ్చాయి. నిర్వహణ పనుల్లో భాగంగా రైలు విజయవాడకు చేరుకోగానే ఇంజిన్లను లోకో షెడ్డుకు తరలిస్తారు. అక్కడ వివిధ విభాగాల అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు.

✦ ఒక్కో రైలు ఇంజిన్ మరమ్మతులు చేయడానికి సుమారు రెండు రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం 300లకు పైగా ఇంజిన్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఇక్కడ అత్యాధునిక ఇంజిన్లకు సైతం నిర్వహణ చేస్తారు. ఇంజిన్ బట్టి ఇన్ని లక్షల కిలోమీటర్లు తిరిగిన తర్వాత, 60 రోజుల నుంచి నిర్వహణ చేయాల్సి ఉంటుంది. ✦ ప్రస్తుతం అత్యాధునిక సాంకేతికత సహాయంతో సీనియర్ డీఈఈ మునిరెడ్డి పర్యవేక్షణలో డీఈఈ ఎన్.గురు శ్రీనివాస్ సారథ్యంలో ఇంజిన్ల నిర్వహణ పనులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. మరమ్మతుల అనంతరం అధికారులు పరిశీలించిన తర్వాత బయటకు పంపుతారు.



ఇంజిన్‌కు మరమ్మతులు చేస్తున్నారిలా..

★ సిబ్బంది : 600 మంది
★ కాంట్రాక్ట్ : 125 మంది
★ ఇంజిన్లు : సుమారు 300 (విజయవాడ డివిజన్‌వి)

జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ చందు శ్రీనివాస్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

☛ భవానీ దీక్షల విరమణ మహోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎన్.వి.ఎస్.ఎన్ మూర్తి భవానీ దీక్ష విరమణ మహోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎన్.వి.ఎస్.ఎన్. మూర్తిని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.



జస్టిస్ మల్లికార్జునరావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న శ్రీనివాస్

17న పింఛనర్ల దినోత్సవం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 17వ తేదీన నగరంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో 'ఆల్ ఇండియా పెన్షనర్స్ డే' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్టు నగర ఇన్‌ఛార్జి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హనుమంతరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 139, 148, 159 చికెన్ విత్ స్కిన్ - 264 చికెన్ స్కిన్‌లెస్ - 274.

ఏటా ఇదే తంతు.. కర్షకుడిదే కాటా ఖర్చు

40 కిలోల బస్తాకు రూ.25 వసూలు

మైలవరం, న్యూస్‌టుడే

అన్నదాతలు ప్రభుత్వ కేంద్రాల్లో పంట అమ్మినా.. కాటా ఖర్చు వారి నెత్తినే పడుతోంది. పేరుకు ప్రభుత్వం నామమాత్ర ధరలిస్తున్నట్లు చెబుతున్నా.. ప్రతి ఏటా అది ప్రకటనలకే పరిమితమవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతుండగా, కాటా ఖర్చుల తిప్పలు మొదలయ్యాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కొన్నేళ్లుగా సర్కారు కర్షకుల నుంచి ధాన్యాన్ని సొసైటీలు, డీసీఎంఎస్‌ల ద్వారా పౌర సరఫరాల శాఖ కొనుగోళ్లు చేస్తోంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఆయా లావాదేవీలను పరిశీలిస్తున్నారు. నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా కేంద్రాలు తెరవగా కాటాలు ముమ్మరంగా సాగుతున్నాయి. తుపాను హెచ్చరికల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకున్న రైతులు ధాన్యాన్ని కోసి, కేంద్రాలు కేటాయించిన స్థలాల్లో ఆరబెట్టుకుంటున్నారు. జిల్లాలోనే మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో అత్యధికంగా వరి సాగవుతోంది.

రూ.3 కోట్లకుపైగా చెల్లింపులు

నిబంధనల మేరకు తేమ శాతం ఉన్న రైతుల ధాన్యాన్ని 40 కిలోల సంచుల్లో నింపి కాటాలేస్తున్నారు. ఒక్కో సంచికి రూ.25ల చొప్పున కూలీలకు చెల్లిస్తున్నారు. కాటా ఖర్చులు చెల్లిస్తామంటేనే కొనుగోళ్లు సాగుతున్నాయి. ఎకరానికి సరాసరి 35 బస్తాల దిగుబడులకు గానూ 70 సంచులు అవసరమవుతున్నాయి. అంటే ఎకరానికి రూ.1,750లు చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 60 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ ఎగుమతులకు లక్షల గన్నీ సంచులను కాటాలు వేయగా, ఒక్కో సంచికి రూ.25ల చొప్పున రైతులు కూలీలకు చెల్లించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా ఇదే తంతు నడుస్తోందని పలువురు అన్నదాతలు వాపోతున్నారు.



ధాన్యాన్ని లారీలోకి లోడు చేస్తున్న కూలీలు

జిల్లాలో సాగు విస్తీర్ణం సుమారు 60 వేల ఎకరాలు
దిగుబడుల అంచనా ఎకరానికి సరాసరి 35 బస్తాలు
కొనుగోలు కేంద్రాలు : 148
కొనుగోళ్ల లక్ష్యం 1.5 లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు.. 60,924 మెట్రిక్ టన్నులు

బ్యాంకు ఖాతాల్లో జమవుతోంది

జిల్లాలో మంగళవారం నాటికి 60,924 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతున్నాయి. క్వింటాకు రూ.22ల చొప్పున కాటా ఖర్చులు, ట్రాక్టర్లలో తరలిస్తే టన్నుకు రూ.350ల చొప్పున రవాణా ఖర్చులు నెలరోజుల్లోపే వారి ఖాతాల్లో పడుతున్నాయి. - **సతీష్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు**

ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో 50 ఏళ్ల వారోత్సవాలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉర్దూ అకాడమీ ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉర్దూ అకాడమీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. పాతబస్తీ పంజా సెంటర్‌లోని ముసాఫిర్ ఖానా బుధవారం ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫరూఖ్ షుబ్లీతో పాటు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాడమీ చరిత్రలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఉర్దూ భాషాభివృద్ధికి నూతన అధ్యాయం లిఖిస్తున్నారని చెప్పారు. అకాడమీ ఉద్యోగుల్లో పని చేసిన వారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఉద్యోగులంతా ప్రభుత్వానికి కుటుంబ సభ్యులని పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఉర్దూ అకాడమీ వారోత్సవాలను నిర్వహిస్తామని, అందుకు సంబంధించిన గోడ పత్రికలను త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సీహెచ్ శ్రీధర్, అకాడమీ సెక్రటరీ గౌస్‌పీర్, ఏపీఎస్‌ఎంఎఫ్‌సీ ఎండీ యాకూబ్ బాషా, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ షుబ్లీ.. పక్కన మంత్రి ఫరూక్ తదితరులు

ఎండోమెంటు జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం : ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పలు ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న 11 మంది జూనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-3 ఈవోలుగా తాత్కాలిక ప్రాతిపదికన పదోన్నతి ఇస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రేడ్-3 పోస్టులు నేరుగా భర్తీ చేయాల్సిన కోటాలో ఉన్నప్పటికీ ఖాళీల దృష్ట్యా జూనియర్ అసిస్టెంట్లకు తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగోన్నతులు కల్పించారు. పదోన్నతి పొందిన వారంతా పోస్టింగుల విషయమై కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా దేవాదాయ శాఖాధికారుల వద్ద హాజరు కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ★ ఎస్.అర్జున్‌రావు (అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర, గవర్నర్‌పేట), ★ కె.రామకృష్ణారావు(కాళీమాత అమ్మవారు, కృష్ణలంక)లకు పదోన్నతి లభించింది.

మైనర్లను రక్షించిన రైల్వే పోలీసులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్ పరిధిలో ఈ నెల 8, 9 తేదీల్లో అక్రమ రవాణాకు గురైన బాలలను రక్షించి నిందితులను పట్టుకున్నట్లు విజయవాడ ఆర్పీఎఫ్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 18189 ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు-నెల్లూరు మధ్య నిర్వహించిన ఆపరేషన్‌లో ఒడిశా నుంచి తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు బాలలను రక్షించామని చెప్పారు. విజయవాడలోని 6వ నంబరు ప్లాట్‌ఫాంపై ఇంట్లో నుంచి పారిపోయిన 13 ఏళ్ల బాలుడిని రక్షించి చైల్డ్‌లైన్ 1098 సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

విజిలెన్స్ విచారణ.. కొలిక్కి

విజయవాడ క్రీడలు: శాప్ అధికారిణి ఎస్వీ రమణ, రాష్ట్ర జూడో సంఘంపై గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ పూర్తికానుంది. గతంలో రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఆర్‌కే పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ ముగింపు దశకు చేరుకుంది. మెడికల్ కోటా, గ్రామ సచివాలయాలు, పశు సంవర్ధక శాఖలో నకిలీ క్రీడా ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందారనే ఫిర్యాదు మేరకు విజిలెన్స్ విచారణ చేపట్టింది.

సీసీ ఫుటేజ్‌పై వంశీ పిటిషన్ 12కు వాయిదా

పటమట, న్యూస్‌టుడే: సత్యవర్ధన్ కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో పటమట పోలీస్ స్టేషన్‌లో సీసీ ఫుటేజ్ ఇవ్వాలని గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత వల్లభనేని వంశీ వేసిన పిటిషన్ బుధవారం విచారణకు రాగా.. విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఈనెల 12కు వాయిదా వేశారు. దీంతోపాటు ఇదే కేసులో నిందితులుగా ఉన్న తేలప్రోలు రాము(ఏ3), వజ్రకుమార్ (ఏ6)లను ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పటమట పోలీసులు వేసిన పిటిషన్‌పై నిందితుల తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేశారు. దీంతో ఈ పిటిషన్‌ను ఈనెల 12కు వాయిదా వేశారు. తేలప్రోలు రాము(ఏ3), వజ్రకుమార్(ఏ6) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి ఈనెల 12కు వాయిదా వేశారు.

'ఇంటి నుంచి ఆహారానికి అనుమతించండి'

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో అరెస్టు అయి గుంటూరు కారాగారంలో రిమాండ్‌లో ఉన్న రోనక్.. తాజాగా ఇంటి నుంచి భోజనం అనుమతించాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. ఇది బుధవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. జైన మతాచారాల ప్రకారం ప్రత్యేక ఆహార నియమాలు పాటిస్తామని, వీటిని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఉల్లి, వెల్లుల్లి ముట్టమని, ఈ నేపథ్యంలో ఇంటి నుంచి ఆహారాన్ని అనుమతించాలని కోరారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని గుంటూరు జైలు అధికారులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి వాదనల నిమిత్తం కేసును ఈనెల 12వ తేదీకి వాయిదా వేశారు.

కొండలరావు బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: అగ్నిమాపక శాఖలో వెబ్‌సైట్, యాప్ తయారీ, ట్యాబ్‌ల కొనుగోలులో అక్రమాల కేసులో కొండలరావు (ఏ4) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఈ పిటిషన్ బుధవారం ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి భాస్కరరావు.. తీర్పు నిమిత్తం ఈనెల 15కి వాయిదా వేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



? గంపలగూడెం మండలం తోటమూల సమీపంలోని కట్లేరుపై హైలెవల్ వంతెన నిర్మించలేదు. దీంతో వర్షాకాలం వరదలు వచ్చినపుడు ప్రజల రాకపోకలకు రోజుల తరబడి ఆటంకం ఏర్పడుతోంది. సమస్య పరిష్కరించండి. **- మురళీకృష్ణ, ఉద్యోగి**

✔ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు దస్త్రం ప్రభుత్వం వద్ద ఉంది. నిధులు మంజూరవ్వగానే పనులు చేపడతాం. **- ఒ.అచ్చారావు, ఆర్అండ్‌బీ ఏఈ, గంపలగూడెం** – న్యూస్‌టుడే, గంపలగూడెం

? జి.కొండూరు తహసీల్దార్ కార్యాలయం పక్కన పులివాగులో కలిసే మురుగు కాలువలో చెత్తచెదారం పేరుకున్నాయి. **- కల్యాణ్ గ్రామస్థుడు** ✔ పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయిస్తాం. **- బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం

✦ తిరువూరు 15వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికుడు రవికుమార్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శానిటరీ అధికారి సంతోష్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ✦ తిరువూరు 17వ వార్డులో డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని, దీంతో మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికుడు బాబురావు సమస్యను అధికారులకు తెలిపారు. శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. – న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

✦ రెడ్డిగూడెం 7వ వార్డులోని డ్రెయిన్‌లో పూడిక పేరుకుందని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం...మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించి బుధవారం కార్మికులను పంపి పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

జాతీయ స్థాయి గుర్తింపు

మైలవరం, న్యూస్‌టుడే : తోలుకోడులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా స్థానికులకు ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలు, విధి నిర్వహణలో అంకితభావం అంశాల్లో నూటికి 91.68 శాతం సాధించడం ద్వారా గుర్తింపు వచ్చినట్లు చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రియాంక తెలిపారు.

వినియోగదారులకు చేరువగా సేవలు

రెడ్డిగూడెం: వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరింత చేరువగా బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరింపజేస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మైకు బాబురావు తెలిపారు. బుధవారం రెడ్డిగూడెం మండలం నాగులూరులోని బీఎస్ఎన్ఎల్ టవర్‌ను తెదేపా నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

రెడ్డిగూడెం: యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను రంగాపురంలోని డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీలోని పది విద్యార్థులకు దాత ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి డి.ప్రకాష్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తబిత, కేజీబీవీ ఎస్‌వో శ్యామల, సుబ్బారెడ్డి, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలు రాక ఇబ్బందులు

విస్సన్నపేట: మెగా డీఎస్సీ- 2025 ద్వారా ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్యన్ రామకృష్ణారావు కోరారు. గత మూడు నెలలుగా వేతనాలు అందక వారంతా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు అవసరం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని, దాని పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల సర్పంచులు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు సైతం పరిష్కారం కాలేదని ఆవేదన చెందారు. ఆర్థిక సంఘ నిధులు వెచ్చించి మధ్యలో నిలిచిన పనులను పూర్తి చేయాలని కోరారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాలి

మైలవరం, న్యూస్‌టుడే : అర్హులైన పేదలు సాగులో ఉన్న అసైన్డ్ భూములపై, వారికే హక్కులు కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన భూలబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ, రెవెన్యూ పోరంబోకు భూములు సాగు చేస్తున్న పేదలకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. నాయకులు రావుల సుబ్బారావు, వెంకటరెడ్డి, సుధాకర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రోత్సాహం.. తుది పరీక్షలకు సన్నద్ధం

గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు సెలవు దినాల్లో కూడా మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. పది పబ్లిక్ పరీక్షలకు వీరు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యేలా బడుల్లో ప్రస్తుతం వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6 నుంచి వచ్చే ఏడాది మార్చి 15 వరకు పది విద్యార్థులకు సెలవులు ఉండవు. దీంతో సెలవు రోజుల్లో పాఠశాలకు వచ్చేవారికి మధ్యాహ్న భోజనం వడ్డించాలని విద్యా శాఖ ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంతో పాటు కొండపల్లి పురపాలిక పరిధిలోని అయిదు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

సంక్రాంతి మూడు రోజులు మినహా..

వంద రోజుల ప్రణాళిక అమలు సమయంలో ఆదివారం, క్రిస్మస్, రెండో శనివారం తదితర సెలవులు 14 రాగా.. సంక్రాంతి సెలవులు 9 ఉన్నాయి. పది విద్యార్థులకు సంక్రాంతి మూడు రోజులు మినహా మిగిలిన రోజుల్లో అదనపు తరగతులు నిర్వహించనున్నారు. ఇలా 20 రోజుల పాటు మధ్యాహ్న భోజనం అమలు కానుంది. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 వరకు ఉపాధ్యాయులు అదనపు తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించి మధ్యాహ్నం భోజనం పెట్టి విద్యార్థులను ఇళ్లకు పంపిస్తామని మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డేవిడ్ రాక్ ఫెల్లర్ తెలిపారు.

పోటీ పడ్డారు.. బహుమతులు సాధించారు



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులు బహుమతులు సాధించారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు జరిగాయి. ఇందులో 9వ తరగతి విద్యార్థిని కె.వ్యోమకేషి, 8వ తరగతి విద్యార్థిని ఎన్.శరణ్య, 9వ తరగతి విద్యార్థిని జి.పూజిత వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయురాలు ఆర్.శోభ, ఉపాధ్యాయులు కాత్యాయని, రవికుమార్, లజపతి రావు తదితరులు బహుమతులు అందజేశారు.

పంట వ్యర్థాలు భూమికి సహజ పోషకాలు



కలగర: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి విజయకుమారి



రంగాపురం : ధాన్యం పరిశీలిస్తున్న సుశీలాదేవి తదితరులు

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడుకునేందుకు పంటల అవశేషాలను భూమిలో కలియదున్నాలని జిల్లా వ్యవసాయాధికారిణి డి.ఎం.ఎఫ్.విజయకుమారి సూచించారు. విస్సన్నపేట మండలం కలగరలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పంట అవశేషాలు భూమికి సహజ పోషకాలని చెప్పారు. ఏడీఏ కె.శశికళ, అధికారులు ఎస్‌కే.టిప్పుసుల్తాన్, బి.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె.సుశీలాదేవి తెలిపారు. రంగాపురం, నాగులూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో డి.శ్రీనివాసరావు, ఏఈవో బిజిలీ, ఆర్ఐ జి.పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కేతనకొండలో..

ఇబ్రహీంపట్నం గ్రామీణం : కేతనకొండ, కొటికలపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వనరుల శాఖ అసిస్టెంట్ డైరెక్టరు మోనిషా పాల్గొన్నారు. ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం తగ్గించేందుకు ధాన్యం ఆరబోతలో అనుసరించాల్సిన పద్ధతులను రైతులకు వివరించారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా నిల్వ ఉండేలా చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : రబీలో సాగు చేసే ఆరుతడి పంటలకు తడులు అందించేందుకు నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చెరువుల్లో నీరు నిల్వ ఉండేలా చూడాలని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు నీటి పారుదల శాఖల అధికారులకు సూచించారు. తిరువూరులోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని కాల్వలు, చెరువులకు జరుగుతున్న అభివృద్ధి పనులు, మరమ్మతులు, భవిష్యత్తులో చేయాల్సిన పనులపై చర్చించారు. ఎన్నెస్పీ తిరువూరు, విస్సన్నపేట సబ్ డివిజన్ డీఈఈలు రామదాసు, విజయలక్ష్మి, ఏఈఈలు సునీత నాగలక్ష్మి, మహేష్ బాబు, లోకేశ్వరి పాల్గొన్నారు.

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే : ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యలను తెలుసుకోవడానికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు తిరువూరులో బుధవారం పర్యటించారు. పలువురితో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

మర్యాద పూర్వక కలయిక

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సెక్టార్- 1 ఎస్సై విశ్వశాతకర్ణి స్థానిక ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావును బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

మానవ హక్కులకు భంగం వాటిల్లరాదు



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి సూర్యతేజ, పక్కన న్యాయవాదులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : భారత రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రజలు పరస్పరం గౌరవించుకోవాలని తిరువూరు న్యాయస్థానం జూనియర్ అదనపు సివిల్ జడ్జి కె.సూర్యతేజ సూచించారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని తోటమూల విశిష్ట జూనియర్, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులను కాపాడుకునేలా నడుచుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్.వెంకటరెడ్డి, ఏపీపీ ఎస్‌కే.బడేమియా, సీనియర్ న్యాయవాదులు ఎస్.జనార్దనరావు, ఆర్.శ్రీనివాసరావు, పలువురు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలని వినతి

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి కొయ్య బొమ్మల కళాకారులను ఆదుకోవాలని హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పి.హరిప్రసాద్‌ను మైలవరం జనసేన నాయకులు కోరారు. బుధవారం విజయవాడలో ఛైర్మన్‌ను వారు మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. అక్కల రామ్మోహనరావు, సీహెచ్ సురేష్, యర్రంశెట్టి సాంబశివ రావు, రమేష్, మహేష్ పాల్గొన్నారు.

ఎత్తు పెంచండి.. ఇబ్బందులు తీర్చండి



స్థానిక బీసీ కాలనీ సమీపంలోని పంచాయతీ కుళాయి తక్కువ ఎత్తులో ఉందని, దీంతో నీరు పట్టుకొనేందుకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్ల వద్దే కుళాయి ఉన్న నీరు పట్టుకోవాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి కుళాయి ఎత్తు పెంచి, ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

పశువుల సంచారం.. పట్టించుకోని యంత్రాంగం



తిరువూరులోని ప్రధాన రహదారులపై పశువుల సంచారం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అవి అకస్మాత్తుగా మీదకు వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని నియంత్రించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకుని రోడ్లపై పశువులు సంచరించకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

ఇలా వెళ్తే ప్రమాదమే..



విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు వ్యతిరేక మార్గంలో వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గొల్లపూడి పరిధిలో నిత్యం లారీలు, టిప్పర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు వ్యతిరేక మార్గంలోనే వెళ్తున్నారు. దీంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆ విధంగా వెళ్లే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

సాయంత్రమైతే తిప్పలే..



సాయంత్రమైతే మైలవరం బస్టాండ్ ప్రయాణికుల చిందులతో, రణగొణ అరుపులతో నిండిపోతోంది. విద్యాసంస్థల నుంచి వచ్చే విద్యార్థులు, ఇళ్లకు వెళ్లే ఉద్యోగులతో బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడుతోంది. ఈ నేపథ్యంలో పరిమిత బస్సులతో జనాలు అవస్థలు పడుతున్నారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతుంటే, కండక్టర్ నిలబడేందుకూ జాగా దొరకడం లేదు. ఇదే తంతు నిత్యకృత్యంగా మారుతోందని, సాయంత్రం వేళలో బస్సులు పెంచాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

దారిలో గుంత.. ప్రయాణానికి చింత



వెలగలేరులో యూనియన్ బ్యాంకు సమీపంలో రహదారి మధ్యలో గుంతలు ఏర్పడి ప్రయాణానికి అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు వరకు వెళ్లే కృష్ణా జలాల పైపులైన్ లీకై రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడిందని వాపోతున్నారు. దీంతో భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగించేటప్పుడు పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై మురుగు నీరు పడుతున్నాయని పలువురు అసహనానికి గురవుతున్నారు. సమస్యపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**


జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రంగారావు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ముగ్గురు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల వ్యాయామోపాధ్యాయుడు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పోటీల్లో ప్రతిభ చాటిన చివరి ఏడాది బీఎస్సీ విద్యార్థిని సీత, పురుషుల విభాగంలో మొదటి బీఏ విద్యార్థి హ్యాపీ, ద్వితీయ బీకాం విద్యార్థి జాన్‌వెస్లీ ఎంపికైనట్లు పీడీ చెప్పారు. వీరిని ప్రిన్సిపల్ పి.రంగారావు, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ సైన్స్..



ఎంపికైన వారితో ఉపాధ్యాయులు

కొండపల్లి: రాష్ట్ర స్థాయి కౌశల్ సైన్స్ టాలెంట్ పోటీలకు కొండపల్లి జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

విస్సన్నపేట ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి



అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్న ఆర్డీవో మాధురి

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట మండల పరిషత్ నూతన అధ్యక్షుల ఎన్నికను గురువారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నిక నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, తిరువూరు ఆర్డీవో కె.మాధురి బుధవారం పరిశీలించారు. ఎన్నిక నిర్వహణ ప్రత్యేక పరిశీలకురాలిగా జిల్లా సంయుక్త కలెక్టరు ఎస్.ఇలక్కియా హాజరుకానున్నారు. విస్సన్నపేట మండలంలో 17 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఎంపీపీ పదవిని ఎస్సీ జనరల్‌కు కేటాయించారు.

రైతులకు నష్టపరిహారం అందించండి



తిరువూరులో సీపీఐ నాయకుల ధర్నా

గంపలగూడెం, తిరువూరు: మొంథా తుపానుకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ కోరారు. తిరువూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కేంద్రాల్లో నిబంధనలను సవరించి ధాన్యం, మొక్కజొన్న, పత్తిలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. నాయకులు కృష్ణయ్య, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు'

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమంలో 65 వేల సంతకాలు సేకరించినట్లు వైకాపా తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. ఈ మేరకు బుధవారం సంతకాల పత్రాలను తిరువూరులోని ఆ పార్టీ కార్యాలయం నుంచి విజయవాడలోని జిల్లా కార్యాలయానికి ప్రదర్శనగా తీసుకెళ్లారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : మైలవరం నియోజకవర్గంలో సేకరించిన సంతకాల ప్రదర్శన ముగింపు కార్యక్రమాన్ని కొండపల్లిలో నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 60 వేల సంతకాలు పూర్తి చేశామని వైకాపా యువ నాయకుడు జోగి రాజీవ్ తెలిపారు. అనంతరం జెండా ఊపి సంతకాల ప్రతులను విజయవాడకు తరలించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ఇర్ఫాన్ పాషాను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ఉర్దూ అకాడమీ ద్వారా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జీవితకాల సాఫల్య అవార్డు పొందిన కాచవరం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మహమ్మద్ ఇర్ఫాన్ పాషాను బుధవారం జరిగిన మండల పరిషత్తు సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎంపీడీవో శకుంతల, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంఈవో పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే : కృష్ణా మిల్క్ యూనియన్ తిరువూరు క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదారుల సంఘాల్లోని సభ్యులకు 2025-26 ఏడాదికి సంబంధించి రెండో విడత బోనస్‌ను తిరువూరు మండలం లక్ష్మీపురం పాల శీతల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. జిల్లా పాలకవర్గ సభ్యుడు బి.రామచంద్రరావు, జిల్లా ట్రస్ట్ సభ్యుడు పి.సత్యనారాయణ, జిల్లా ఫీడ్ కమిటీ సభ్యుడు సూరయ్య, మేనేజర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జి.కొండూరు, న్యూస్‌టుడే : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఇది. పోలీసుల సమాచారం మేరకు.. జి.కొండూరు మండలం ఆత్కూరుకు చెందిన దడదాసుల అఖిల్‌రాకేష్(25) కొండపల్లి పారిశ్రామికవాడలోని ఓ ఫార్మా కంపెనీలో మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. బెట్టింగ్‌కు అలవాటు పడి తీర్చలేనంత అప్పులు చేయడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం పురుగు మందు తెచ్చుకుని గ్రామ శివారులోని పొలంలోకి వెళ్లి దాన్ని తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్సై కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఫెర్రీ సమీపంలోని కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకురావడం మత్స్యకారులు బుధవారం సాయంత్రం గుర్తించారు. నది మధ్యలో మృతదేహం ఉండటంతో ఈ విషయాన్ని పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి తెలిపారు. అప్పటికే రాత్రి కావడంతో మృతదేహాన్ని బయటకు తీసేందుకు వీలులేక పోలీసులు కార్యక్రమాన్ని మరుసటి రోజుకు వాయిదా వేసినట్లు మత్స్యకారులు చెప్పారు.



రెండు తలల శుక బ్రహ్మ దర్శనమైందా!

చూసే కోణాన్ని బట్టి ఉంటుంది అంటే ఇదేనేమో. నల్గొండ జిల్లా నాంపల్లి మండలంలోని మహ్మదాపురం సీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాలలో కనిపించిన ఈ దృశ్యాన్ని ఈనాడు క్లిక్‌మనిపించింది. వాస్తవానికి రెండు చిలుకలు ఆ చెట్టుపైన వేర్వేరు కొమ్మలపై ఒకదాని వెనక మరొకటి ఒద్దికగా కూర్చుని ఉన్నాయి. అయితే ఈ కోణంలో చిలుక (శుక)కు రెండు తలలు ఉన్నాయనిపించేలా కనిపించడం విశేషం. – ఈనాడు, నల్గొండ



ఎలా ఉన్నాను?

హిమాచల్ ప్రదేశ్‌లోని చంబా జిల్లా పరిధిలో గల భర్మౌర్ గిరిజన గ్రామం వద్ద పైన్ అడవుల్లో అరుదైన తెల్ల కోతి కనిపించింది. గస్తీ విధుల్లో ఉన్న అటవీశాఖ గార్డు తల నుంచి తోక దాకా తెల్లగా మెరిసే జుట్టు, గులాబీ రంగు ముఖంతో ఉన్న ఈ కోతిని తన ఫోను కెమెరాలో బంధించారు. "ఇది ప్రత్యేకమైన జాతికి చెందినది ఏమీ కాదు. పుట్టుకతో తెల్ల వెంట్రుకలు ఉండి అరుదుగా కనిపించే ఈ కోతిని 'అల్బినో రెసస్ మకాక్ అంటారు'' అని డీఎఫ్‌వో నవనాత్ మానె తెలిపారు. దేహంలో మెలనిన్ పిగ్మెంటు లోపంతో ఇటువంటి కోతులు తెల్లగా ఉంటాయని హిమాచల్ ప్రదేశ్ వర్సిటీ జీవశాస్త్ర ఆచార్యులు హరీందర్ సింగ్ వివరించారు. ఇటువంటి కోతి గతంలో అస్సాంలో కనిపించినట్లు తెలిపారు. – ఈటీవీ భారత్

రైల్లో మాటు వేస్తారు క్షణాల్లో దోచేస్తారు!



కాస్తంత ఏమరుపాటుగా ఉన్నా... రైలు ప్రయాణికులు, చోరుల చేతివాటానికి చిత్తైపోతున్నారు. అందుకే ప్రయాణంలో అప్రమత్తత అవసరమంటున్నారు అధికారులు.

సౌకర్యంగా ఉంటుందనే ఉద్దేశంతో ఎక్కువమంది రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటారు. ప్రస్తుతం వీటిలో జరిగే దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. బోగీల్లో చేరిన చోరులు ప్రయాణికులు గాఢనిద్రలోకి జారుకోగానే చేతులకు పనిచెప్పి మాయమవుతున్నారు. ఆనవాళ్లు దొరక్కపోవడంతో నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఏటా ఈ కేసులు 20-30శాతం పెరుగుతున్న నేపథ్యంలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే విలువైన వస్తువులు కాపాడుకోవచ్చని వారు సూచిస్తున్నారు.

ఏమరుపాటు తగదు..

- అర్ధరాత్రి దాటాక, తెల్లవారుజామున రైళ్లలో ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయి.
- సొమ్ము కోసం ఎంతకైనా తెగించే కరడుగట్టిన నేరస్తులు ఉంటున్నారని, దోచుకొనేటప్పుడు అడ్డగించినా, ఎదురుతిరిగినా హతమార్చేందుకు కూడా వెనుకాడరని పోలీసులు హెచ్చరిస్తున్నారు.
- మూత్రశాలకు వెళ్లి వస్తున్న సమయంలో తలుపు వద్ద కాచుకున్న దొంగలు మెడలోని గొలుసులు లాక్కొని కిందికి దూకుతారు.
- రైల్వేస్టేషన్లలో రద్దీగా ఉన్న ప్లాట్‌ఫామ్‌పై పాగా వేసి ప్రయాణికుల వస్తువులు, ఛార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్లు మాయం చేస్తారు.
- రైలు రాగానే బోగీల్లోకి ఎక్కుతున్నట్టు నటిస్తూ ప్రయాణికుల చేతుల్లోని బ్యాగులు, మెడలోని బంగారు ఆభరణాలు లాక్కొని పారిపోతారు.
- తలుపులు, కిటికీల వద్ద కూర్చొన్న వారి సెల్‌ఫోన్ దొంగిలిస్తారు.

పోయిందెక్కడో చెప్పలేరు!

- సికింద్రాబాద్ రైల్వే జిల్లా పరిధిలో వివిధ నేరాలపై వేలల్లోనే ఫిర్యాదులు అందుతుంటే వాటిలో ఎక్కువ దొంగతనాలు, దోపిడీలు, స్నాచింగ్‌లే ఉంటున్నాయి.
- ఏమరుపాటు, నిద్రమత్తు కారణంగా తమ సొమ్ము ఎక్కడ మాయమైందనేది ప్రయాణికులు చెప్పలేకపోతున్నారని పోలీసులు చెబుతున్నారు.
- చాలామంది దిగాల్సిన స్టేషన్‌కు చేరుకున్నాక తమ వస్తువులు పోయినట్లు గుర్తిస్తున్నారు.
- వీటిపై జీఆర్పీ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితులు చెప్పిన ఆనవాళ్ల ద్వారా చోరీ జరిగిన ప్రాంతంలోని ఠాణాకు కేసు బదిలీ చేస్తున్నారు.

ఎక్కడ.. ఎవరు?

- రాయ్‌పూర్, నాగ్‌పూర్, దానాపూర్, ఫలక్‌నుమా, గౌతమి, నర్సాపూర్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌ల్లో, ఔరంగాబాద్, భోపాల్, విజయవాడ రైల్వేస్టేషన్ల పరిధిలో ఎక్కువ చోరీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.
- స్థానికంగా అయితే పట్టుబడతామనే ఉద్దేశంతో హరియాణా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌కు చెందిన దొంగల ముఠాలు ఏపీ, తెలంగాణ రైళ్లలో ప్రయాణిస్తూ చోరీలకు పాల్పడుతున్నాయి.

జాగ్రత్తగా ఉండండిలా..

- మహిళలు బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులున్న బ్యాగ్‌లను బయటకు కనిపించకుండా భద్రంగా దాచుకోవాలి.
- వాష్‌రూమ్‌కు వెళ్లొచ్చే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి.
- దూర ప్రాంతాలకు వెళ్లేటపుడు కుటుంబసభ్యులు, మిత్రుల్లో ఎవరో ఒకరు మేల్కొని ఉండాలి.
- కిటికీలు, తలుపుల వద్ద సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ కూర్చోవద్దు.
- రైల్వేస్టేషన్, మలుపుల వద్ద రైలు వేగం తగ్గే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.
- అనుమానాస్పద వ్యక్తులను గుర్తించినపుడు పోలీసులకు సమాచారమివ్వాలి.

సస్పెక్ట్‌షీట్‌తో కట్టడి

రైళ్లలో నేరాలకు పాల్పడే వారిపై సస్పెక్ట్ షీట్ తెరుస్తున్నాము. దొంగతనాలకు పాల్పడే ప్రాంతాలు(బ్లాక్‌స్పాట్స్), జంక్షన్లు, ట్రాక్‌లపై నిఘా పెంచుతున్నాము. అంతర్రాష్ట్ర దొంగల ఆట కట్టించేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశాము. ప్రయాణికుల జాగ్రత్తలతో విలువైన వస్తువులు కాపాడుకోవచ్చు.

– చందనాదీప్తి, సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ

- ఈనాడు, హైదరాబాద్



రీఛార్జి చేస్తారు!



యువతను ప్రకృతికి దగ్గరచేసి.. సేవా భావాన్ని, ఆధ్యాత్మికతను పెంపొందించాలని.. ధైర్యవంతులు, సాహసవంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం రాచకొండ అడవిలో 'శ్వాస ఆశ్రమం (బ్రీత్)' నెలకొల్పారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు అరబిందో ఘోష్ స్ఫూర్తితో పచ్చటి ప్రకృతి నడుమ, కొండ కోనల అంచున ప్రశాంతమైన 'గన్నెర్ల' ప్రాంతంలోని ఈ ఆశ్రమాన్ని విశ్రాంత ఎయిర్‌ఫోర్స్ ఇంజినీర్, పుదుచ్చేరిలోని అరబిందో పూర్వాశ్రమవాసి పులసాని అరవింద రెడ్డి నెలకొల్పారు. ఇందులో యోగా, ధ్యానం, ప్రకృతి వైద్య చికిత్స, నాట్య సాధన, మట్టి దారుల్లో నడక, గుట్టలు ఎక్కడం, చెట్లతో అనుబంధాన్ని ఏర్పరచుకోవడం, అనంత విశ్వంలో మనమొక బిందువులాంటి వారమని అవగాహన కల్పించేందుకు టెలిస్కోప్‌లో ఖగోళాన్ని, నక్షత్ర మండలాన్ని వీక్షించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రకృతి ఒడిలో సేదతీరి, రీఛార్జి అయ్యేలా వారాంతాల్లో 2, 3 రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయం, కుండలు తయారు చేయడం తదితర పనుల్లోనూ భాగస్వామ్యం చేస్తారు. 30 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ఆశ్రమంలో రాత్రి బస కోసం డార్మెటరీ, గదులు ఉన్నాయి. కాన్ఫరెన్సుహాలు, నీటి కొలను, బోటింగ్ ఏర్పాటు చేశారు. యువతను ప్రకృతికి చేరువ చేయాలనే ప్రయత్నంతో దీనిని ఏర్పాటు చేసినట్లు అరవింద్‌రెడ్డి తెలిపారు. వారాంతాల్లో రెండు, మూడు రోజుల పాటు ప్రముఖులను రప్పించి వారితో వివిధ శిక్షణలు ఇప్పిస్తామని.. వసతి, భోజనం సమకూరుస్తామని, దీనికయ్యే ఖర్చునే సాధకుల నుంచి సేకరిస్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం

ఫేస్‌బుక్.. వారి ప్రేమ పుస్తకం



రెండున్నర అడుగుల ఎత్తున్న దీపాంకర్ (21)కు మూడడుగుల ఎత్తు గల నందిని (20) ఫేస్‌బుక్‌లో దొరికింది. పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ దినాజ్‌పుర్ జిల్లా బాలుర్ఘాట్‌కు చెందిన దీపాంకర్ మరుగుజ్జు కావడంతో ఇతడి పెళ్లి ఓ సమస్యగా మారింది. పశ్చిమ బర్ధమాన్ జిల్లా దుర్గాపుర్‌కు చెందిన నందిని సమస్య కూడా ఇలాంటిదే. ఈ సమస్యకు వారిద్దరే పరిష్కారం వెదుక్కొన్నారు. ఫేస్‌బుక్ ద్వారా పరస్పర పరిచయాలు జరిగి వీడియోకాల్స్ మాట్లాడుకున్నారు. తొలిచూపులోనే ప్రేమలో పడ్డారు. అభిప్రాయాలు పంచుకొన్నారు. పెద్దల అంగీకారంతో వీరి పెళ్లి ఘనంగా జరిగింది. – ఈటీవీ భారత్



మీ ప్రయాణం ఇతరుల ఆమోదం కోసం కాదు

ప్రతి ఒక్కరూ మీకు మద్దతుగా నిలబడరనే విషయాన్ని అంగీకరిస్తే, మీ జీవితం చాలా ప్రశాంతంగా అనిపిస్తుంది. కొందరు ఎప్పుడూ గతంలోని మీ స్థాయి గురించే మాట్లాడుతుంటారు తప్ప మీ ఎదుగుదలను గుర్తించడానికి ఇష్టపడరు. వారి గురించి పట్టించుకోకుండా ముందుకు సాగండి. మీ ప్రయాణం మీ పురోగతి కోసమే తప్ప వారి ఆమోదం కోసం కాదు. – లిల్లీ, లైఫ్ కోచ్

కళ్లకు గంతలు.. కళకు ప్రాణం!



కళ్లకు గంతలు కట్టుకొని ఓ విద్యార్థిని 24 గంటల్లో 350 చిత్రాలు గీసి.. ఔరా అనిపించారు. ఆమె ప్రతిభకు 'ఆసియా గోల్డెన్ బుక్ ఆఫ్ రికార్డ్సు' వరించింది. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరులోని వర్ణకుటీర కళా పాఠశాల విద్యార్థిని శమిక(14). నాలుగేళ్లుగా గాంధారి విద్య(కళ్లకు గంతలు కట్టుకొని చదవడం, రాయడం, బొమ్మలు గీయడం) నేర్చుకుంటున్నారు. శనివారం ఆ విద్యను ప్రదర్శించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు గాయకులు పాటలు పాడుతుంటే భావానికి అనుగుణంగా చిత్రాలు వేశారు. – న్యూస్‌టుడే, మంగళూరు

అమరావతిలో కాగ్ కార్యాలయ నిర్మాణానికి అనుమతి

కేంద్ర మంత్రి పెమ్మసాని ప్రకటన



కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్‌తో పెమ్మసాని చంద్రశేఖర్

ఈనాడు, దిల్లీ: అమరావతిలో కేటాయించిన 2.05 ఎకరాల స్థలంలో కాగ్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి పరిపాలన అనుమతులు లభించాయి. ఈ విషయాన్ని డిప్యూటీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కేఎస్ సుబ్రహ్మణియన్ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. దీనిపట్ల మంత్రి పెమ్మసాని సంతోషం వ్యక్తంచేశారు.

రూ.80 కోట్లతో తపాలాశాఖ ప్రాంతీయ కార్యాలయం

అమరావతిలో రూ. 80 కోట్లతో అత్యాధునిక రీతిలో తపాలాశాఖ ప్రాంతీయ కార్యాలయం నిర్మించనున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆయన బుధవారం లోక్‌సభలో కొత్త పోస్టాఫీసుల నిర్మాణంపై అనంతపురం సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఈ విషయం చెప్పారు. 2020-21 నుంచి 2024-25 మధ్యకాలంలో రాష్ట్రంలో ఐదు కొత్త పోస్టాఫీసులు నిర్మించినట్లు తెలిపారు.

ఆయుష్‌మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్‌తో భేటీ

కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్‌తో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ఇక్కడ సమావేశమయ్యారు. గుంటూరు జిల్లా నడింపాలెంలో ప్రతిపాదించిన 100 పడకల ఆసుపత్రి, సెంట్రల్ యోగా, నేచురోపతి ఇన్‌స్టిట్యూట్‌ను త్వరగా పూర్తిచేసే విషయంపై చర్చించారు.

డీడీవోల సీనియారిటీ జాబితా ఖరారు

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్‌శాఖలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు (డీడీవో)గా పదోన్నతులు పొందిన 249 మంది సీనియారిటీ జాబితాను ప్రభుత్వం ఖరారు చేసింది. పలువురు ఎంపీడీవోలకు డీడీవోలుగా ఇటీవల పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. వీరి సీనియారిటీ ఖరారు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పరకామణిలో చోరీ జరిగితే చిన్నదంటారా?

- క్రైస్తవంలో జరిగితే జగన్ ఇలాగే స్పందించేవారా?
- న్యాయమూర్తి తీర్పుపై 120 మంది ఎంపీల అభిశంసన పిటిషన్ ఆక్షేపణీయం
- హిందూ ఆచారాలపై చేస్తున్న దాడులపై ప్రతి ఒక్కరూ గళం విప్పాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: పరకామణిలో చోరీ కేసు చాలా చిన్నదని, చిటికె వేసినంత తేలిగ్గా వైకాపా అధినేత జగన్ మాట్లాడటం సరికాదని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ధ్వజమెత్తారు. ఇలాంటి సంఘటనలు ఇస్లాంలో, ఆయన ఆచరించే మతం క్రిస్టియానిటీలో జరిగితే ఇలాగే స్పందించే వారా అని నిలదీశారు. ఐదేళ్లు సీఎంగా పని చేసిన వ్యక్తి ఇలా మాట్లాడటం సబబుకాదని పవన్‌కల్యాణ్ అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళగిరిలో బుధవారం నిర్వహించిన మాటా-మంతి కార్యక్రమం అనంతరం ఉప ముఖ్యమంత్రి జాతీయ మీడియాతో మాట్లాడారు. 'తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించి వరుస లోపాలు వెలుగు చూస్తున్నాయంటే బలమైన పాలనా వ్యవస్థ ప్రస్తుతం ఉండటమే కారణం. ఆచారాలు, సంప్రదాయాలు కాపాడేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు తితిదే అధికారులను నిర్దేశించారు కాబట్టే.. గతంలో జరిగిన తప్పులను పాలకమండలి వెలుగులోకి తీసుకొస్తోంది' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

హిందువులు వివక్షను ఎదుర్కొంటున్నారు

'దేశంలో హిందువులు మెజారిటీలు కాదు. హిందువుల ఐక్యత, మెజారిటీలు అన్న భావన ఒక మిథ్య. కులం, భాష, ప్రాంతాల వారీగా విభజితమయ్యారు. హిందువులు మెజారిటీలు అన్న భావనే సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. మెజారిటీ పేరిట హిందువులు వివక్షను ఎదుర్కొంటున్నారు. దేశంలో ముస్లింలు, క్రైస్తవులకు వర్తించే నిబంధనలే హిందువులకూ వర్తింపజేయాలి. ఒకరికి ఒకలా, మరొకరికి వేరేలా అమలు చేస్తే ఘర్షణలు చోటుచేసుకునే అవకాశాలున్నాయి' అని పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. 'ప్రతి ఒక్కరూ హిందువులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ప్రతి సందర్భంలోనూ హిందువుల ఆచారాలను ప్రశ్నిస్తున్నారు. తమిళనాడు ఎంపీల వ్యాఖ్యలు అదే విధంగా ఉన్నాయి. ఇలాంటివి బుజ్జగింపు రాజకీయాల మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తాయి. తమిళనాడు, అస్సాం, పశ్చిమబెంగాల్.. ఇలా దేశంలో ఎక్కడ హిందూ ఆచారాలపై దాడి జరిగినా అందుకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన బాధ్యత ప్రతి హిందువుపైనా ఉంది. అవకాశవాద రాజకీయ నాయకుల ధోరణులపై మాట్లాడాలి' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

తమిళనాడులో కొన్ని పార్టీలు సూడో సెక్యులరిజాన్ని పాటిస్తున్నాయి

'తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం దేవాలయాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోంది. రాజకీయాల కోసం భాజపా, ప్రధానిని విమర్శించాలనుకుంటే ..ఆ స్వేచ్ఛ వారికి ఉంది. అందులోకి మతాన్ని లాగడం, వ్యక్తులకు, ఒక భాషకు, మతానికి పరిమితం చేయడం సరికాదు. తమిళనాడులోకి కొన్ని రాజకీయ పార్టీలు సూడో సెక్యులరిజాన్ని పాటిస్తున్నాయి. హిందూ సమాజ హక్కును కాపాడేలా ఒక న్యాయమూర్తి తీర్పు ఇస్తే ...120 మంది ఎంపీలు అభిశంసన పిటిషన్ వేశారు. శబరిమల ఆలయం వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు హిందువులు న్యాయంగానే పోరాడారు తప్ప...జడ్జిలపై అభిశంసన తీర్మానాలు పెట్టలేదు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసినా ఆయన స్థానాన్ని గౌరవించి ఎవరూ వ్యతిరేకంగా మాట్లాడలేదు. సనాతన ధర్మ పరిరక్షణ నా ఒక్కడి వల్ల అయ్యే పనికాదు. ప్రతి హిందువు సనాతన ధర్మ పరిరక్షణకు నడుం బిగించాలి. ఇందుకోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయాలి' అని పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. 'పశ్చిమబెంగాల్ ఎంతోమంది గొప్ప నేతలను, వందేమాతరం, జనగణమన గేయాలు దేశానికి అందించింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో ఒక మతం ప్రాధాన్యం పెరిగింది. ఆ రాష్ట్రాన్ని పాలిస్తున్న వారు ఒక మతానికి అనుకూలంగా మారిపోతున్నారు. వాళ్లకు నచ్చినా, నచ్చకపోయినా అందరికీ సమాన ప్రాధాన్యమివ్వాలి. బుజ్జగింపు రాజకీయాలు మానుకోవాలి' అని ఉప ముఖ్యమంత్రి హితవు పలికారు.

తల్లిదండ్రుల నమ్మకం.. అంగన్‌వాడీ కేంద్రం

- సిబ్బందితో మంత్రి సంధ్యారాణి
- కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు సెల్‌ఫోన్ల పంపిణీ



అంగన్‌వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి

విజయవాడ (ఎన్టీఆర్ కలెక్టరేట్), న్యూస్‌టుడే: 'తల్లిదండ్రుల నమ్మకం, ఆకాంక్షలకు ప్రతీకగా అంగన్‌వాడీ కేంద్రాలు రూపుదిద్దుకోవడం గర్వకారణం.. మహిళా శిశు సంక్షేమ శాఖ 98 శాతం సంతృప్త సేవలతో ఏ++ స్థాయిలో ఉండడం అభినందనీయం.. దీన్ని నిలబెట్టుకునే విధంగా అంగన్‌వాడీ సిబ్బంది.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత సమర్థంగా సేవలు అందించాలి' అని ఆ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో బుధవారం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జీ సెల్‌ఫోన్లను ఆమె పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 55,706 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, 58,204 మంది కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు రూ. 75 కోట్ల విలువైన 5జీ సెల్‌ఫోన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. చంద్రబాబు హయాంలోనే ఇప్పటికి మూడుసార్లు అంగన్‌వాడీ సిబ్బందికి వేతనాలు పెంచారని గుర్తుచేశారు. ఈ నెల 12న అంగన్‌వాడీల ధర్నా విషయమై మంత్రి స్పందిస్తూ.. మీకు ఏదీ కావాలన్నా చేస్తాం, ఎవరో చెప్పారని ధర్నాలతో సమయం వృథా చేసుకోవద్దని వారికి సూచించారు. వేతనాల పెంపు విషయం సీఎం దృష్టిలో ఉందన్నారు. 7,000 మినీ అంగన్‌వాడీలు ఉండగా, వాటిలో 5,000 మెయిన్ కేంద్రాలుగా స్థాయి మార్పు చేశామని వెల్లడించారు. మిగతా మినీల్లోని టీచర్లకు 10వ తరగతి విద్యార్హత వచ్చిన అనంతరం ఉన్నతీకరిస్తామని చెప్పారు. గ్రామీణ అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలో ఏకరూప దుస్తులు అందజేయనున్నట్లు చెప్పారు. యాప్‌ల సంఖ్య తగ్గించాలని కేంద్రానికి విన్నవించామన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారిమాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులు 70% ఉండగా, రాష్ట్రంలో 96% ఉండడం ఉత్తమ పనితీరుకు నిదర్శనమన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జాయింట్ డైరెక్టర్ కె.ప్రవీణ, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియా, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

కడప మాజీ మేయర్ సురేష్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ

మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌పై ఆయన పిటిషన్ కొట్టివేత

ఈనాడు, అమరావతి: కడప కార్పొరేషన్ మాజీ మేయర్ సురేష్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌ను ప్రశ్నిస్తూ ఆయన వేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం కొట్టేసింది. పాలకమండలి సభ్యుల పదవీకాలం ముగిసే 6నెలల ముందు ఎన్నికలు నిర్వహించడానికి వీల్లేదన్న సురేష్ వాదనను న్యాయస్థానం తోసిపుచ్చింది. మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నికకు ఈ నిబంధన వర్తించదని స్పష్టం చేసింది. మేయర్ ఎన్నికను నిలుపుదల చేయలేమని తేల్చిచెప్పింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం ఈ తీర్పు ఇచ్చారు. కడప మేయర్ ఎన్నిక నిమిత్తం రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ మాజీ మేయర్ సురేష్‌బాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మేయర్‌గా తనను తొలగిస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై తాను వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీచేయడం సరికాదని, దాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై నిర్ణయాన్ని బుధవారం వెల్లడించిన న్యాయమూర్తి..సురేష్‌బాబును తొలగిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను కోర్టు తుది తీర్పులో తప్పుపడితే, మేయర్‌గా ఆయనే కొనసాగుతారని స్పష్టం చేశారు. అందులో ఎలాంటి సందిగ్ధతకు తావు లేదని చెప్పారు.

గృహ వినియోగదారులపై విద్యుత్ భారం లేదు

- వాణిజ్య, పారిశ్రామిక టారిఫ్‌లో సవరణకు ప్రతిపాదన
- 2026-27లో రెవెన్యూ లోటు రూ.15,651.95 కోట్లు
- విద్యుత్తు నియంత్రణ మండలికి డిస్కంల నివేదిక

ఈనాడు, అమరావతి: గృహ విద్యుత్ వినియోగదారుల టారిఫ్‌లో మార్పులు, భారాలు లేకుండా విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)కి 2026-27 సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్) సమర్పించాయి. ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు ప్రస్తుతం అమలులో ఉన్న టెలిస్కోపిక్ బిల్లింగ్ విధానానికి బదులు.. నాన్-టెలిస్కోపిక్ విధానం అమలుకు ప్రతిపాదించాయి. వాణిజ్య, పారిశ్రామిక ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులకు టైమ్ ఆఫ్ డే (టీవోడీ) టారిఫ్ వేళలు.. యూనిట్ టారిఫ్‌లో స్వల్ప మార్పులను డిస్కంలు ప్రతిపాదించాయి. రెవెన్యూ లోటు రూ.15,651.95 కోట్లుగా చూపాయి. డిస్కంలు సమర్పించిన లెక్కలు పరిశీలించి.. వాటిలో సర్దుబాట్ల తర్వాత ఆదాయ లోటును కమిషన్ నిర్ణయిస్తుంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకం, ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద ఇచ్చే విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ కింద ఎంత భరిస్తుంది? మిగిలిన మొత్తాన్ని ఎలా సర్దుబాటు చేయాలనే దానిపై ఏపీఈఆర్‌సీ నిర్ణయం తీసుకోనుంది.

రూఫ్‌టాప్ సోలార్‌కు నిరుత్సాహం

✦ ఇళ్లపై సోలార్ యూనిట్‌లు ఏర్పాటు చేసుకునే వారిని ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పదే పదే చెబుతుండగా.. దానికి విరుద్ధంగా డిస్కంలు టారిఫ్ ప్రతిపాదనల్లో సవరణలు ప్రతిపాదించాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం వినియోగదారుడు ఉత్పత్తి చేసిన విద్యుత్ కంటే.. అదనంగా వినియోగించిన విద్యుత్‌కు టెలిస్కోపిక్ విధానంలో లెక్కగట్టి డిస్కంలు బిల్లులు ఇస్తున్నాయి. దీన్ని సవరించి నాన్-టెలిస్కోపిక్ విధానంలో బిల్లులు వసూలు చేయాలని ప్రతిపాదించాయి.

నకిలీ మద్యం తయారీలో జయచంద్రారెడ్డి పాత్ర

పీఏ రాజేష్ రిమాండ్ రిపోర్ట్‌లో వెల్లడి

ఈనాడు, కడప, న్యూస్‌టుడే: ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో కీలక విషయాలు వెలుగుచూశాయి. తెదేపా మాజీ నేత జయచంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకుడు రాజేష్(ఏ5)ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి తంబళ్లపల్లె కోర్టులో మంగళవారం రాత్రి హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేసే అన్బురాసు(ఏ19)ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టుచేసి తంబళ్లపల్లె కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ కేసులో జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డిలు పరారీలో ఉన్న విషయం తెలిసిందే.

రాజేష్ రిమాండ్ రిపోర్ట్‌లో వివరాలు

'రాజేష్ బి.కొత్తకోటలో రాజ్యలక్ష్మి ఆగ్రో ట్రేడింగ్ పేరిట దుకాణాన్ని నడిపారు. నష్టాలు రావడంతో మూసేసి జయచంద్రారెడ్డి పీఏగా చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జయచంద్రారెడ్డి తెదేపా అభ్యర్థిగా తంబళ్లపల్లెలో పోటీచేయడంతో తన స్నేహితుడు జనార్దన్‌రావు (ఏ1) స్థానికంగా ఓ గదిని అద్దెకు తీసుకుని ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అ సమయంలో జయచంద్రారెడ్డి బావమరిది గిరిధర్‌రెడ్డి, కట్టా సురేంద్రనాయుడులతో పరిచయం ఏర్పడింది. అనంతరం మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోగా ములకలచెరువు దుకాణం రాజేష్‌కు వచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు నష్టాలు రావడంతో బెంగళూరుకు చెందిన బాలాజీ ద్వారా రెక్టిఫైడ్ స్పిరిట్, ఇతర ముడిపదార్థాలు కొనుగోలు చేసి నకిలీ మద్యం తయారుచేయొచ్చని భావించారు. ఇందుకు జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి, కట్టా సురేంద్రనాయుడులు అంగీకరించారు. సెప్టెంబరు 20న బాలాజీ కుమారుడు సుదర్శన్ ఖాతాకు రూ.లక్ష నగదు బదిలీచేశారు. ఈ క్రమంలో తంబళ్లపల్లె, ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాల్లోని బెల్ట్ దుకాణాలకు నకిలీ మద్యం సరఫరా చేశారు. నకిలీ మద్యం తయారీ బండారం బహిర్గతం కావడంతో జయచంద్రారెడ్డి సూచనతో రాజేష్ తన ఫోన్లు ధ్వంసం చేశారు. చివరకు రాజేష్ నుంచి ఒక మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం' అని రిమాండ్ రిపోర్టులో ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు.

సీఐసీ, సీవీసీ సారథుల ఎంపికపై ప్రధానికి రాహుల్ అసమ్మతి లేఖ

దిల్లీ: కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ), కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) సారథుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ తన అసమ్మతి లేఖను ప్రభుత్వానికి అందించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎంపిక సంఘం బుధవారం పీఎంవోలో సమావేశమైంది. సభ్యులుగా ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రాహుల్‌గాంధీ దీనిలో పాల్గొన్నారు. ప్రధాన సమాచార కమిషనర్‌ను, 8 మంది కమిషనర్లను నియమించడంపై కమిటీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. వీరి ఎంపికకు అనుసరించిన విధానంపై రాహుల్ అసంతృప్తి వ్యక్తంచేసి, పలు ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. ప్రభుత్వం ప్రతిపాదించిన పేర్లతో విభేదిస్తున్నట్లు స్పష్టంచేశారు ఈ సమావేశం గురించి ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టుకు తెలిపింది. సీఐసీలో ప్రస్తుతం 30,838 పెండింగ్ కేసులున్నాయి. 2014 నుంచి సీఐసీ పదవి చాలాసార్లు ఖాళీగా ఉంటోంది. ఈ పదవి కోసం మే నెలలో ప్రకటన జారీచేయగా 83 దరఖాస్తులు వచ్చాయి. కమిషనర్ల పోస్టులకు 161 మంది దరఖాస్తు చేసుకున్నారు.

చిరుత వేషంలో అసెంబ్లీకి..

నాగ్‌పుర్: మహారాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్న చిరుతల బెడదను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు జున్నార్ శాసనసభ్యుడు శరద్ సోనావణె (శివసేన) బుధవారం చిరుతపులి వేషధారణలో అసెంబ్లీ ప్రాంగణానికి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు.



ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత మూడు నెలల్లో పుణె జిల్లాలోని జున్నార్ తాలూకా పరిధిలో 55 మంది చిరుతపులుల దాడుల్లో మృతిచెందినట్లు తెలిపారు.



మీ ఆహారంలో ఈ విషాలు ఉన్నాయా?

✦ అధిక చక్కెర ✦ శుద్ధి చేసిన నూనెలు ✦ జంక్ ఫుడ్
ఈ మూడూ విషంతో సమానం. వీటిని వాడుతూ ఎన్ని వ్యాయామాలు చేసినా, మరెన్ని ఆరోగ్య జాగ్రత్తలు తీసుకున్నా ఉపయోగం ఉండదు. అందుకే వీటికి దూరంగా ఉండండి.
– ఫ్రెడో, పర్సనల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోచ్

దీపావళికి
యునెస్కో గుర్తింపు

- సాంస్కృతిక వారసత్వ జాబితాలో చోటు

దిల్లీ: వెలుగు వెన్నెల దీపావళి ప్రపంచ వేదికపై తళుకులీనింది. భారతీయ లోగిళ్లను సంబురాల్లో ముంచెత్తే ఈ దీపాల పండగకు అంతర్జాతీయంగా అరుదైన గౌరవం దక్కింది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో ఈ పండగను చేర్చారు. దిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన సమావేశంలో యునెస్కో బుధవారం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భారత్‌కు చెందిన 15 అంశాలు యునెస్కో వారసత్వ గుర్తింపు పొందినట్లయింది. వీటిలో కుంభమేళా, కోల్‌కతా దుర్గా పూజ, గుజరాత్‌లోని గర్బా నృత్యం, యోగా, వేద పఠన సంప్రదాయం, రామాయణ గాథను ప్రదర్శించే రామ్‌లీల సంప్రదాయ ప్రదర్శనలున్నాయి. వీటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని యునెస్కో ప్రతినిధులు వెల్లడించారు. ఈనెల 8న ప్రారంభమైన యునెస్కో 20వ సదస్సు ఈనెల 13 వరకూ దిల్లీలోని ఎర్రకోటలో జరగనుంది. యునెస్కో ఇంటాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ సమావేశం భారత్‌లో జరగడం ఇదే తొలిసారి. ఈ సమావేశంలో 80 దేశాలు సమర్పించిన 67 నామినేషన్లను కమిటీ పరిశీలిస్తోంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు వందల మంది ప్రతినిధులు వచ్చారు.



భారతీయులు ఉప్పొంగుతున్నారు: మోదీ

దీపావళికి యునెస్కో గుర్తింపు రావడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత ప్రజలు, ప్రపంచవ్యాప్తంగా ఈ పండగ జరుపుకొనే వారు సంతోషంతో ఉప్పొంగిపోతున్నారని పేర్కొన్నారు. భారత సంస్కృతి, నైతిక విలువలకు ఈ పండగతో చాలా దగ్గర సంబంధాలున్నాయని కొనియాడారు. యునెస్కో గుర్తింపుతో ప్రపంచవ్యాప్తంగా ఈ పండగకు ప్రజాదరణ మరింత పెరుగుతుందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర శెఖావత్‌లు ఈ గుర్తింపు పట్ల హర్షం వ్యక్తంచేశారు. భారతీయులకు దీపావళి ఎంతో ప్రత్యేకమైనదని, అనేక తరాలుగా దీనిని జరుపుకొంటున్నట్లు పేర్కొన్నారు. యునెస్కో గుర్తింపు రావడం ఒక బాధ్యత అని, కచ్చితంగా ముందు తరాలకు దీన్ని అందించాలని పిలుపునిచ్చారు.

ప్రయాణికులకు ఇండిగో ఛైర్మన్ క్షమాపణ

- కొనసాగుతున్న విమాన సర్వీసుల రద్దు
- పూర్తి వివరాలతో రావాలని ఇండిగో సీఈవోకు డీజీసీఏ ఆదేశం

ముంబయి: ప్రయాణికులకు ఇండిగో విమానయాన సంస్థ ఛైర్మన్ విక్రం సింగ్ మెహతా క్షమాపణ చెప్పారు. ఇటీవల విమాన సర్వీసుల్లో చోటుచేసుకున్న అంతరాయానికి సంబంధించి ప్రతి అంశాన్నీ పరిశీలిస్తామని తెలిపారు. మరోవైపు ఇండిగో విమాన సర్వీసుల రద్దు కొనసాగుతోంది. బుధవారం 3 నగరాల్లోనే 220 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దిల్లీలో 137, ముంబయిలో 21, బెంగళూరులో 61 సర్వీసులను ఇండిగో నిలిపేసింది. విమాన సర్వీసులన్నీ సాధారణ స్థితికి చేసుకున్నాయని సంస్థ సీఈవో ఎల్బర్స్ మంగళవారం ప్రకటించారు. అయినా 220 విమాన సర్వీసులు 3 నగరాల్లోనే బుధవారం రద్దు కావడం గమనార్హం.
■ 'ఈ నెల 3న అనుకోకుండా చోటుచేసుకున్న వరుస సంఘటనలతో భారీ స్థాయిలో విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. వేల మంది మా ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. వారెంత ఇబ్బందిపడ్డారో అర్థం చేసుకోగలను. దీనికి క్షమాపణ చెబుతున్నా' అని మెహతా బుధవారం విడుదల చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆ రోజుల్లో అంచనాలను అందుకోలేకపోయామని, గత వారం రోజులుగా చాలా విమర్శలను ఎదుర్కొన్నామని తెలిపారు.
■ విమాన సర్వీసుల అంతరాయాలకు సంబంధించి పూర్తి వివరాలతో గురువారం సాయంత్రం 3 గంటలకు విచారణకు రావాలని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌ను డీజీసీఏ ఆదేశించింది. పూర్తి నివేదికను అందించాలని సూచించింది. సీఈవోతోపాటు సంబంధిత అధికారులంతా రావాలని ఆదేశించింది.

కొత్త షెడ్యూలు

శీతాకాల విమాన సేవలకు సంబంధించి రివైజ్డ్ షెడ్యూలును డీజీసీఏకు ఇండిగో సమర్పించింది. 10శాతం విమాన సర్వీసులను తగ్గిస్తూ కొత్త ప్రణాళికను అందించింది. వాస్తవానికి రోజూ 2,200 విమాన సర్వీసులను ఇండిగో నడపాల్సి ఉంది. తాజాగా 10శాతం కోత విధించడంతో 220 విమాన సర్వీసులను తగ్గించాల్సి వచ్చింది. అయితే ఏయే రూట్లలో సర్వీసులను తగ్గించిందీ తెలియరాలేదు.

ఆ మురికి జనాన్నే ఇప్పటిదాకా తెచ్చుకున్నాం

- 50 ఏళ్లలో తొలిసారి వారి వలసలను అడ్డుకోవడంతో అమెరికన్లకు ఉపాధి
- డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు

న్యూయార్క్, మౌంట్ పోకానో: వలసలను అడ్డుకోవడంతో గత 50 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా అమెరికన్లకు మరిన్ని ఉద్యోగాలు, మంచి వేతనాలు దక్కుతున్నాయని, వారి ఆదాయం పెరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. తొలిసారిగా రివర్స్ మైగ్రేషన్ (అక్రమ వలసదారులను వెనక్కి పంపడం, మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను అడ్డుకోవడం) కొనసాగుతోందని తెలిపారు. అఫ్గానిస్థాన్, హైతీ, సోమాలియా తదితర దేశాల నుంచి వచ్చే వలసలను అడ్డుకున్నామని వెల్లడించారు. 'మనకు నార్వే, స్వీడన్, డెన్మార్క్ దేశాల నుంచి ఎందుకు వలసల్లేవు? ఆ దేశాల నుంచి కొంత మంది మంచి వ్యక్తులను తీసుకోవడం లేదెందుకు? కానీ మనం ఎల్లప్పుడూ సోమాలియా లాంటి దేశాల నుంచి తీసుకుంటున్నాం. మురికిగా, అసహ్యంగా, నేరాలతో నిండిపోయిన వారినే అంగీకరిస్తున్నాం. వారిలో నైపుణ్యం ఏంటంటే ఓడలను వెంటాడటం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. పెన్సిల్వేనియాలోని మౌంట్ పోకానోలో మంగళవారం జరిగిన సభలో ట్రంప్ ప్రసంగించారు. అణ్వస్త్ర దేశాలైన భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపానని 70వ సారి ట్రంప్ చెప్పారు. '10 నెలల్లో 8 యుద్ధాలను ఆపా. అందులో కొసావో-సెర్బియా, భారత్-పాకిస్థాన్ ఉన్నాయి. ఇజ్రాయెల్, ఇరాన్, ఈజిప్టు, ఇథియోపియా, ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లలో శాంతిని స్థాపించా' అని ఆయన పేర్కొన్నారు. థాయ్‌లాండ్, కంబోడియా మళ్లీ యుద్ధం ప్రారంభించాయని, దీంతో ఇద్దరు నేతలకూ ఫోన్లు చేశానని తెలిపారు.



తల్లిదండ్రుల మధ్య నలిగి..
నవజాత శిశువు దుర్మరణం



ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లా సిహాలి జాగీర్ గ్రామంలో నిద్రపోతున్న తల్లిదండ్రుల మధ్య నలిగి 26 రోజుల నవజాత శిశువు మృతిచెందిన ఘటన వెలుగు చూసింది. మొహ్సిన్ నర్సరీ నడుపుతున్న సద్దాంతో ఏడాది క్రితం అస్మాతో వివాహం జరిగింది. గత నెల అస్మా మగబిడ్డకు జన్మనిచ్చింది. శ్వాస సమస్య తలెత్తడంతో వైద్యులు ఆ చిన్నారిని కొన్నిరోజులు పర్యవేక్షణలో ఉంచారు. పరిస్థితి మెరుగయ్యాక దంపతులు ఆ బిడ్డను ఇంటికి తీసుకొచ్చారు. కొద్దిరోజులకు కామెర్లు రావడంతో మరోసారి చికిత్స చేయించారు. బిడ్డకు నామకరణం చేశారు. అంతా సవ్యంగా జరుగుతోందని అనుకునేలోపు విధి వక్రించింది. గత శనివారం రాత్రి తల్లిదండ్రుల మధ్య బాబును పడుకోబెట్టుకోగా.. ఇరుక్కుపోయిన చిన్నారి ఊపిరాడక మృతిచెందాడు. ఆదివారం ఉదయం బిడ్డకు పాలు తాగించాలని చూసిన అస్మా కదలిక లేకపోవడం చూసి విస్తుపోయింది. వెంటనే గజ్రౌలా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది.

ఉల్లి, వెల్లుల్లితో కాపురాన లొల్లి..
పదకొండేళ్ల దాంపత్యానికి చెల్లు



సంసారం అన్నాక చిన్న చిన్న గొడవలు.. సర్దుకుపోవడాలు సహజం. ఆ దంపతుల నడుమ వంటగదిలో ఉల్లి, వెల్లుల్లి వాడకంపై మొదలైన గొడవలు కోర్టు దాకా వెళ్లాయి. దీంతో 11 ఏళ్ల వివాహబంధానికి ముగింపు పలుకుతూ విడాకులు తీసుకున్నారు. ఈ ఘటన గుజరాత్‌లో జరిగింది. అహ్మదాబాద్‌కు చెందిన జంటకు 2002లో పెళ్లయింది. భార్య వేరే వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఉల్లిపాయ, వెల్లుల్లి తినేది కాదు. ఇంట్లోనూ వాడొద్దని తరచూ చెప్పేది. దీని వల్లే కుటుంబసభ్యుల మధ్య దూరం పెరిగి, గొడవలు పడేవారు. ఈ నేపథ్యంలో భర్తను, కుమారుడిని వదిలి ఆమె వెళ్లిపోయింది. భర్త విడాకులు కావాలని 2013లో ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఈ జంటకు విడాకులు మంజూరు చేసింది. భార్య ఆ తీర్పును సవాలు చేస్తూ గుజరాత్ హైకోర్టులో అప్పీలు చేసింది. ఆమె పిటిషన్‌ను తిరస్కరించిన ధర్మాసనం ఫ్యామిలీ కోర్టు నిర్ణయాన్ని తాజాగా సమర్థించింది.

ఈటీవీ భారత్ — యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

ఏడేళ్ల బాలికపై అఘాయిత్యం
నిర్భయ తరహా అమానుషం



గుజరాత్‌లోని రాజ్‌కోట్ జిల్లాలో ఏడేళ్ల బాలికపై దిల్లీ నిర్భయ కేసును పోలిన దారుణం జరిగింది. అట్కోట్ పోలీస్‌స్టేషను పరిధిలోని ఓ గ్రామానికి సమీపంలో గల పొలంలో బాలిక కుటుంబం వ్యవసాయ కూలీలుగా పనిచేస్తోంది. డిసెంబరు 4న కుటుంబమంతా పొలం పనిలో ఉండగా.. కాస్త దూరంలో బాలిక ఆడుకుంటోంది. ఆ సమయంలో ఓ వ్యక్తి చిన్నారి నోటిని చేతితో మూసివేసి ఎత్తుకుపోయాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి అత్యాచార ప్రయత్నం చేయగా.. బాలిక భయంతో కేకలు వేసింది. దీంతో ఆమె ప్రైవేటు భాగంలోకి రాడ్డు లాంటి పదునైన వస్తువును చొప్పించి, అక్కడే వదిలి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో పడున్న బాలికను గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను రాజ్‌కోట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలిక ప్రస్తుతం చికిత్స పొందుతోంది. నిందితుడు మధ్యప్రదేశ్‌కు చెందిన రాంసింగ్ టెర్సింగ్ (30)గా గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నోబెల్ కార్యక్రమానికి మచాడో గైర్హాజరు

- ఆమె తరఫున శాంతి పురస్కారం అందుకున్న కుమార్తె

ఓస్లో: ప్రతిష్ఠాత్మక నోబెల్ అవార్డుల ప్రదానోత్సవం బుధవారం నార్వేలోని ఓస్లోలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి 2025 శాంతి పురస్కార గ్రహీత, వెనెజువెలా విపక్ష నేత మరియా కొరీనా మచాడో గైర్హాజరయ్యారు. మచాడో తరఫున ఆమె కుమార్తె అనా కొరీనా సోసా ఈ బహుమతిని అందుకున్నారు. అవార్డు ప్రదానోత్సవానికి మచాడో హాజరుకావడం లేదంటూ అంతకుముందే నోబెల్ సంస్థ ప్రకటించింది. "ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి మచాడో తన శక్తిమేర అన్ని ప్రయత్నాలు చేశారు. కానీ.. బయట పొంచి ఉన్న తీవ్ర ప్రమాదం కారణంగా ఆమె రాలేకపోయారు'' అని నోబెల్ కమిటీ ఛైర్మన్ జోర్గన్ వాట్నే ఫ్రైడ్నెస్ తెలిపారు. నోబెల్ వెబ్‌సైట్లో ఉన్న ఆడియో కాల్ రికార్డింగులో 'ఓస్లోకు నన్ను చేర్చడానికి ఎంతోమంది తమ ప్రాణాలను పణంగా పెట్టారు. వారందరికీ నేను రుణపడి ఉన్నాను. ఇది వెనెజువెలా ప్రజలందరి బహుమతి. దీన్ని అంగీకరిస్తారని భావిస్తున్నాను'' అని మచాడో పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న ఆమె నోబెల్ బహుమతిని స్వీకరించడానికి దేశం దాటి బయటకు వెళ్తే పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని ఇప్పటికే వెనెజువెలా అటార్నీ జనరల్ ప్రకటించిన విషయం తెలిసిందే.




శాంతి పురస్కారంతో అనా కొరీనా సోసా

కోర్టు ధిక్కరణలో శిక్షించే అధికారం
జడ్జీల వ్యక్తిగత రక్షణ కవచం కారాదు

- విమర్శకుల నోరుమూయించే ఖడ్గమూ కాదు
- సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్య

దిల్లీ: కోర్టు ధిక్కరణ నేరాలకు గాను విధించే శిక్షల విషయంలో జడ్జీలు జాగరూకతతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆ అధికారం జడ్జీల వ్యక్తిగత రక్షణ కవచం కానీ, విమర్శకుల నోరుమూయించే ఖడ్గం కానీ కారాదని తెలిపింది. సుమోటోగా చేపట్టిన క్రిమినల్ ధిక్కార కేసులో బాంబే హైకోర్టు ఓ మహిళకు విధించిన వారం రోజుల జైలు శిక్షను, రూ.2వేల జరిమానాను మాఫీచేస్తూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. క్షమించడం న్యాయ వివేచనలో ఓ అంతర్భాగమని తెలిపింది. కోర్టు ధిక్కరణకు పాల్పడిన వ్యక్తి చిత్తశుద్ధితో తన తప్పును అంగీకరిస్తూ పశ్చాత్తాపం వ్యక్తం చేసినప్పుడు దానిని పెద్దమనసుతో సమ్మతించాలని అభిప్రాయపడింది. క్షమించే అధికారం కూడా శిక్షించే అధికారంలో మిళితమై ఉంటుందని పేర్కొంది. జంతువుల సంతాన నియంత్రణ నిబంధనలు-2023లోని ఓ నిబంధనను సవాల్ చేసిన వ్యాజ్యం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా ఓ హౌసింగ్ కాంప్లెక్స్ డైరెక్టర్ అయిన మహిళ జారీ చేసిన సర్క్యులర్‌లో వినియోగించిన 'డాగ్ మాఫియా' అనే పదంపై ఈ కేసు దాఖలైంది. తన తప్పును అంగీకరిస్తూ బేషరతుగా ఆమె క్షమాపణ చెప్పినప్పటికీ హైకోర్టు శిక్షతో పాటు జరిమానా విధించడంతో సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలైంది. ఆ క్షమాపణను హైకోర్టు పరిగణనలోకి తీసుకోవాల్సిందని సర్వోన్నత న్యాయస్థాన ధర్మాసనం అభిప్రాయపడింది.



పని స్థలాల్లో లైంగిక వేధింపుల ఫిర్యాదును
మరో విభాగ కమిటీ కూడా స్వీకరించవచ్చు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి తీసుకొచ్చిన 'పోష్' చట్టం కింద దాఖలు చేసే ఫిర్యాదులను మరో విభాగంలో ఏర్పాటైన అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)కి కూడా బాధితులు అందజేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిందితుడు వేరే విభాగానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ విచారణకు సహకరించాలని జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం తెలిపింది. నిందితుడు పనిచేసే కార్యాలయంలో ఏర్పాటైన ఐసీసీకి మాత్రమే ఫిర్యాదు చేయాలనడం... 'పోష్ చట్టం' నిర్వచనం పరిధిని కుదించడమే అవుతుందని, బాధితురాలికి న్యాయం చేయాలన్న సామాజిక సంక్షేమ లక్ష్యాన్ని అది బలహీనపరుస్తుందని అభిప్రాయపడింది. అంతేకాక బాధితురాలికి మానసికమైన అవరోధాలను కల్పించినట్లవుతుందని, విధానపరమైన సమస్యలకూ తావిస్తుందని పేర్కొంది. ఐసీసీ నోటీసును సవాల్ చేస్తూ ఇండియన్ రెవెన్యూ సర్వీస్(ఐఆర్ఎస్) అధికారి దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం ఈ తీర్పు వెలువడింది. 2010-బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి ఒకరు తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ 2004-బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి 2023 మే 15న ఫిర్యాదు చేశారు. అప్పుడు ఆమె ఆహారం, ప్రజా పంపిణీ విభాగంలో సంయుక్త కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆ విభాగంలో ఏర్పాటైన అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) ఈ ఫిర్యాదును చేపట్టింది. నిందితుడైన ఐఆర్ఎస్ అధికారి దీనిని సవాల్ చేస్తూ తొలుత కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌ను, ఆ తర్వాత దిల్లీ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చాయి. దీంతో సుప్రీంకోర్టుకు వెళ్లారు.

చిరుతపులి దాడిలో ఏడుగురికి గాయాలు

- మహారాష్ట్రలో ఘటన

నాగ్‌పుర్: మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో ఓ చిరుతపులి దాడికి దిగింది. ఈ ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. శివ్‌నగర్‌లోని పార్డీ ప్రాంతంలో బుధవారం ఉదయం అటవీ ప్రాంతం నుంచి జనావాసాల్లోకి వచ్చిన చిరుత ప్రజలపై దాడి చేసిందని అధికారులు తెలిపారు. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. చిరుతను పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు రంగంలోకి దిగారు. గత నెలలో ఈ ప్రాంతంలోనే ఒక చిరుతను పట్టుకున్నారు.



నాగ్‌పుర్‌లో ఓ ఇంటిపైకి ఎక్కుతున్న చిరుత

టిక్కెట్టుకు రూ.39 వేలా..

- ఇండిగో సంక్షోభంపై నిలదీసిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: ఇండిగో సంక్షోభంపై దాఖలైన పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. రూ.5,000కు లభించే టికెట్టును ఇండిగో సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని ఇతర విమానయాన సంస్థలు రూ.35,000 నుంచి రూ.39,000కు ఎలా పెంచాయని దిల్లీ హైకోర్టు ప్రశ్నించింది. ఈ సంక్షోభాన్ని ఇతర సంస్థలు అవకాశంగా మలుచుకుంటుంటే ఎలా అనుమతించారని నిలదీసింది. అసలు ఇండిగో అన్ని విమానాలను ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందని బుధవారం జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇది సంక్షోభమేనని స్పష్టం చేసింది. విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన ప్రయాణికుల ఇబ్బందులతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థకు కలిగిన నష్టమూ ముఖ్యమేనని అభిప్రాయపడింది. విచారణ కమిటీ నివేదికను తదుపరి విచారణ జరిగే జనవరి 22వ తేదీ నాటికి సమర్పించాలని ఆదేశించింది. పౌర విమానయాన మంత్రిత్వశాఖ, డీజీసీఏ తీసుకున్న చర్యలను అభినందిస్తున్నామని, అయితే అటువంటి పరిస్థితులు తలెత్తడానికి కారణాలేంటని ప్రశ్నించింది.



దిల్లీ-తిరువనంతపురం టికెట్టు రూ.64,783

ఇండిగో సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యతని సీపీఎం ఎంపీ ఏఏ రహీం స్పష్టం చేశారు. అధ్యయనం చేయకుండా ప్రైవేటీకరణ చేయడంవల్ల విమానయాన రంగంలో రెండు సంస్థల ఆధిపత్యం పెరిగిందని అభిప్రాయపడ్డారు. విమాన విధుల సమయ పరిమితుల (ఎఫ్‌డీటీఎల్) నిబంధనలను సడలించవద్దని కోరారు. బుధవారం రాజ్యసభ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వమే నిందితురాలని స్పష్టం చేశారు. ఛార్జీలను పెంచవద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా.. 1,500 కిలోమీటర్ల దూరానికి రూ.18,000కు మించి వసూలు చేయవద్దని హెచ్చరించినా.. బుధవారం దిల్లీ-తిరువనంతపురం టికెట్టు ధర రూ.64,783 ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు విమానయాన సంస్థలపై ప్రభుత్వానికి నియంత్రణ లేదని విమర్శించారు.

ఇండిగోపై నిఘా

ఇండిగో సంక్షోభం నేపథ్యంలో 8 మందితో డీజీసీఏ పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఇద్దరు సభ్యులు.. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. ఈ కమిటీలో డిప్యూటీ చీఫ్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. కార్పొరేట్ కార్యాలయంలో ఉండే అధికారులు.. రోజుకు ఎన్ని సర్వీసులు నడుస్తున్నాయి.. రోజుకు ఎంత మంది ముందుగా చెప్పకుండా సెలవు తీసుకుంటున్నారు.. సిబ్బంది కొరతవల్ల ఏయే సెక్టార్లలో విమాన సేవలకు అంతరాయం కలిగింది.. రోజూ ఎంత మంది కాక్‌పిట్, క్యాబిన్ సిబ్బంది అత్యవసరంగా అందుబాటులో ఉంటారు.. అనే అంశాలను పరిశీలించనున్నారు.

భారత్ స్వతంత్రతకు జై

బహుళార్థ విదేశాంగ విధానం ఆ దేశాన్ని మాకు మంచి ఫ్రెండ్‌గా మార్చింది: రష్యా

మాస్కో: భారత్ అనుసరిస్తున్న బహుళార్థ విదేశాంగ విధానాన్ని రష్యా ప్రశంసించింది. ఆ విధానమే తమకు ఆ దేశాన్ని మంచి ఫ్రెండ్‌గా మార్చిందని పేర్కొంది. 'అన్ని దేశాలతో సంబంధాలను నెరపే భారత్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని ప్రపంచంలోని మెజారిటీ దేశాలు పరిశీలిస్తున్నాయి. భారత్ మాకు మంచి ఫ్రెండ్‌గా మారడానికి ఇదే సూచిక' అని రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లవ్రోవ్ వ్యాఖ్యానించారు. బుధవారం పార్లమెంటు అప్పర్ ఛాంబర్‌లో ఆయన మాట్లాడారు. 'దేశీయ అభివృద్ధి సమస్య పరిష్కారం మా విదేశాంగ విధాన ప్రధాన లక్ష్యం. రెండు దేశాల వ్యూహాత్మక అంచనాలు, లక్ష్యాలు పుతిన్ భారత పర్యటన సందర్భంగా యాదృచ్ఛికంగా ఏకకాలంలో నిర్ధారణ అయ్యాయి' అని లవ్రోవ్ పేర్కొన్నారు.

గుజరాత్‌లో భారీ అగ్నిప్రమాదం

- టెక్స్‌టైల్ మార్కెట్ భవనంలో చెలరేగిన మంటలు

ఇంటర్నెట్ డెస్క్: గుజరాత్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సూరత్‌లోని బహుళ అంతస్తుల టెక్స్‌టైల్ మార్కెట్ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 20కిపైగా దుకాణాలు దగ్ధమైనట్లు అధికారులు పేర్కొన్నారు. గ్రౌండ్ ఫ్లోర్ లిఫ్ట్ వైరింగ్‌లో ప్రారంభమైన మంటలు 7వ అంతస్తు వరకూ వ్యాపించినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని అధికారులు వెల్లడించారు.



దిల్లీలో మూడు పాఠశాలలకు బాంబు బెదిరింపు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని మూడు ప్రైవేట్ పాఠశాలలకు బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం రేపింది. బుధవారం ఉదయం లక్ష్మీనగర్‌లోని లవ్లీ పబ్లిక్ స్కూల్, సాదిఖ్ నగర్‌లోని ఇండియాన్ పబ్లిక్ స్కూల్, ఆర్‌కే పురంలోని పబ్లిక్ స్కూల్‌లకు బెదిరింపు ఈమెయిల్స్ వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన సంబంధిత సిబ్బంది అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించాయి. అనుమానాస్పదంగా ఏమీ కనిపించకపోవడంతో నకిలీ బెదిరింపుగా తేల్చారు.

రాజస్థాన్ హైకోర్టుకు వరుసగా మూడోరోజూ బెదిరింపు

జైపుర్: రాజస్థాన్ హైకోర్టుకు వరుసగా మూడోరోజు బుధవారమూ బాంబు బెదిరింపు వచ్చింది. తనిఖీల తర్వాత బూటకమని తేల్చారు. అజ్మేర్ దర్గా, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. అవి కూడా బూటకపు బెదిరింపులేనని తేల్చారు.

యూట్యూబ్ వీడియో చూస్తూ ఆపరేషన్

నకిలీ వైద్యుడి చికిత్సతో మహిళ మృతి

బారబంకీ: నకిలీ డాక్టర్, అతని అల్లుడు చేసిన ఆపరేషన్ విఫలమై ఓ మహిళ మృత్యువాత పడ్డారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్ బారబంకీ జిల్లా పరిధిలో చోటుచేసుకుంది. మునిశ్రా రావత్ అనే మహిళ కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఆమె భర్త తేజ్ బహదూర్ రావత్ ఈ నెల 5న ఆమెను కొత్తిలోని శ్రీ దామోదర్ ఔషధాలయకు తీసుకెళ్లారు. నొప్పికి కారణం కిడ్నీలో రాళ్లు అని ఆ ఆసుపత్రి నిర్వాహకుడు జ్ఞాన్ ప్రకాష్ మిశ్ర వారితో చెప్పాడు. ఆపరేషన్ చేయాలని, రూ.25,000 ఖర్చు అవుతుందన్నాడు. అతని అల్లుడు వివేక్ కుమార్‌తో కలిసి చికిత్స ప్రారంభించాడు. ఆపరేషన్ తర్వాత మహిళ మరణించడంతో ఆమె భర్త వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆపరేషన్ చేసే సమయంలో మిశ్ర మద్యం మత్తులో ఉన్నాడని తేజ్ బహదూర్ ఆరోపించారు. యూట్యూబ్ వీడియో చూస్తూ చికిత్స కొనసాగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వీర్ సావర్కర్ అవార్డును స్వీకరించను: థరూర్

తిరువనంతపురం: కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ తన చుట్టూ నెలకొన్న రాజకీయ దుమారంపై స్పందించారు. ఓ స్వచ్ఛంద సంస్థ తనకు వీర్ సావర్కర్ అవార్డును అందించనున్నట్లు ప్రకటించడంపై థరూర్ బుధవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. అవార్డును తాను స్వీకరించడం లేదని స్పష్టం చేశారు. అవార్డు గురించి కానీ... దాన్ని అందిస్తున్న వారి గురించి కానీ తనకు ఎటువంటి అవగాహన లేదని, మీడియా కథనాల ద్వారానే తనకు ఈ విషయం తెలిసిందని పేర్కొన్నారు. కాగా... హైరేంజ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌ఆర్‌డీఎస్) అనే సంస్థ తొలిసారిగా వీర్ సావర్కర్ పేరుతో అవార్డులను ప్రారంభించింది. ఇందులో 'వీర్ సావర్కర్ ఇంటర్నేషనల్ ఇంపాక్ట్ 2025' అవార్డు గ్రహీతల్లో ఒకరిగా శశిథరూర్ పేరును ప్రకటించింది. ఇది కాస్తా రాజకీయ దుమారం రేపడంతో థరూర్ స్పందించారు.

85,000 వీసాల రద్దు

ఈటీవీ భారత్: వలసలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది కాలంగా వలసల నియంత్రణను మరింత కట్టుదిట్టం చేశారు. అందులో భాగంగానే ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 85,000 వీసాలను రద్దు చేసినట్లు అమెరికా విదేశాంగశాఖ ప్రకటించింది.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నరసాపురం వరకు పొడిగింపు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్- విజయవాడ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 15వ తేదీ నుంచి నరసాపురం వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 20677 చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి 7.05కి రేణిగుంట, 11.45 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. మధ్యాహ్నం 12.28కి గుడివాడ, 1.15కి భీమవరంటౌన్, 2.10 గంటలకు నరసాపురం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబరు 20678 నరసాపురంలో మధ్యాహ్నం 2.50కు బయలుదేరి రాత్రి 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది.

సవరణ

6-12-2025న ఈ దినపత్రికలో **DIPR No. 18295**తో ప్రచురితమైన ఆం.ప్ర. రెవెన్యూ శాఖ వారి టెండరు ప్రకటనలో **మోడెం రికార్డు గదులకు** బదులుగా **మోడరన్ రికార్డు రూమ్స్**గా సవరించి చదువుకోగలరు.

జగన్ హిందూ ద్వేషి అని.. అందుకే పరకామణిలో దొంగతనం కేసును చిన్నదిగా పేర్కొన్నారని తితిదే బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూ విమర్శించారు.



గూగుల్ కార్యాలయంలో ఆ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్‌తో చర్చిస్తున్న మంత్రి లోకేశ్ ★ గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌కు కానుక అందజేస్తున్న మంత్రి లోకేశ్ ★ శాన్‌ఫ్రాన్సిస్కో ఎన్‌విడియా వైస్ ప్రెసిడెంట్ రాజ్ మిర్ పురితో.. ★ అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో చర్చలు

డ్రోన్ల తయారీ రంగంలో సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించాలని కోరారు. విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు గూగుల్ అంగీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌లో క్లౌడ్ రీజియన్ల విస్తరణతో పాటు 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ యాక్సిలరేటర్' ద్వారా స్టార్టప్‌లకు మద్దతు ఇస్తున్నట్లు సుందర్ పిచాయ్ తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ఇంటెల్ ఏటీఎంపీ యూనిట్ ఏర్పాటు చేయండి

రాష్ట్రంలో ఉత్పత్తుల అసెంబ్లింగ్, టెస్టింగ్, మార్కింగ్, ప్యాకేజింగ్ (ఏటీఎంపీ) యూనిట్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఇంటెల్‌ను మంత్రి లోకేశ్ కోరారు. ఇంటెల్-అమరావతి ఏఐ రీసెర్చ్ సెంటర్‌ను శ్రీసిటీ ట్రిపుల్‌ఐటీ/ ఐఐటీ తిరుపతి భాగస్వామ్యంతో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ప్రతిపాదించారు. ఆ సంస్థ ఐటీ విభాగం సీటీవో శేష కృష్ణపురతో భేటీ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "గతంలో ఏపీ ప్రభుత్వంతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాన్ని అమలు చేయాలి. ఇంటెల్ ఆధారిత హెచ్‌పీసీ క్లస్టర్లు ఏర్పాటు చేసి విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ప్రభుత్వం చేపట్టే ఆరోగ్య, వ్యవసాయ, వాతావరణ నమూనా పరిశోధనలకు సహకరించాలి. భవిష్యత్తు నైపుణ్య వర్క్‌ఫోర్స్ తయారు చేసేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. రాష్ట్రంలోని ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ పాఠ్య ప్రణాళికల్లో ఇంటెల్ శిక్షణ కార్యక్రమాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ఏపీలోని విశ్వవిద్యాలయాల్లో ఇంటెల్ స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలి. వీఎల్ఎస్ఐ డిజైన్, సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ మూలాలు, ఏఐ, రోబోటిక్స్‌లో ప్రత్యేక శిక్షణ అందించండి" అని ప్రతిపాదించారు.



శాన్‌ఫ్రాన్సిస్కోలోని శాంటాక్లారా నగరంలో ఇంటెల్ సంస్థ ఐటీ విభాగం సీటీవో శేష కృష్ణపురతో భేటీ అయిన మంత్రి లోకేశ్ ★ జూమ్ సంస్థ వీడియో కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్, ఇంజినీరింగ్ విభాగ ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ బృందంతో మంత్రి లోకేశ్ బృందం

అడోబ్ జీసీసీ ఏర్పాటును పరిశీలించండి

విశాఖలో అడోబ్ గ్లోబల్ కేపబులిటి సెంటర్ (జీసీసీ) లేదా డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని అడోబ్ సంస్థను మంత్రి లోకేశ్ కోరారు. ఆ సంస్థ సీఈవో శంతను నారాయణ్‌తో భేటీలో మాట్లాడుతూ.. "అమెరికా టెక్ సంస్థలు ఇంటెల్, ఏఎండీ, అప్లైడ్ మెటీరియల్స్ వంటి సంస్థలను అనుసంధానించి ఫ్యాబ్‌లెస్ డిజైన్, పరిశోధన, తయారీ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి. మీరు డైరెక్టర్‌గా ఉన్న ఫైజర్ సంస్థ ద్వారా టీకాలు, చిన్న మాలిక్యూల్స్, బయోలాజిక్స్ తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. మీరు డైరెక్టర్‌గా ఉన్న మరో సంస్థ కేకేఆర్ ద్వారా ఏపీలో పెట్టుబడులు పెట్టేలా సహకరించండి" అని విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని నారాయణ్ పేర్కొన్నారు.

వర్చువల్ తరగతుల నిర్వహణలో సహకరించాలి


అమరావతి లేదా విశాఖలో పరిశోధన, అభివృద్ధి/ ఇంజినీరింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని జూమ్ సంస్థ ప్రతినిధులను లోకేశ్ కోరారు. ఆ సంస్థ వీడియో కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణతో లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పట్టణ ప్రాంతంలో ఉన్న నిపుణుల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు వర్చువల్ తరగతుల నిర్వహణలో సహకరించండి. రాష్ట్రంలో జూమ్ వేదిక ద్వారా టెలిమెడిసిన్, ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేందుకు సాంకేతిక సహకారాన్ని అందించండి" అని కోరారు. వాటిని పరిశీలిస్తామని శంకరలింగం చెప్పారు.

ఏఐ నైపుణ్యాభివృద్ధిలో సహకరించండి

ఏపీలో ఏఐ నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, భవిష్యత్ సాంకేతికతల బలోపేతానికి సహకరించాలని గేమింగ్, చిప్ డిజైనింగ్, జీపీయూ తయారీలో అగ్రగామి సంస్థ ఎన్‌విడియాను మంత్రి కోరారు. ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్, ఎంటర్‌ప్రైజ్ అండ్ క్లౌడ్ సేల్స్ రాజ్ మిర్‌పురితో లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పౌర సేవల్లో ఏఐ వినియోగానికి శిక్షణ, ఏఐ పాఠ్యాంశాల రూపకల్పనలో సూచనలు అందించండి. విద్యార్థులు, పరిశోధకులకు క్వాంటమ్ సిమ్యులేటర్లు అందించేందుకు ఏపీలోని విశ్వవిద్యాలయాలు /పరిశోధన సంస్థలతో పైలట్ ప్రాజెక్టు ఏర్పాటు చేయండి. డిజిటల్ ట్విన్, ఏఐ ఆధారిత పరిశ్రమల ఆప్టిమైజేషన్ కోసం ఎన్‌విడియా ఓమ్నివర్స్, ఐజాక్ సిమ్ వినియోగించేలా స్మార్ట్ ఫ్యాక్టరీ పైలట్ ప్రాజెక్టు ప్రారంభించండి. భారత్‌లో డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం ఎన్‌విడియా కేటాయించిన 850 మిలియన్ డాలర్లను ఏపీలోని డీప్‌టెక్ స్టార్టప్‌లు, మెంటారింగ్ కోసం కేటాయించండి" అని ప్రతిపాదించారు. వాటిపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రాజ్ మిర్‌పురి తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించండి

- ఎన్డీయే ప్రజాప్రతినిధులకు సీఎం సూచన
- ఉల్లి బకాయిలు విడుదల చేయండి.. సుబాబుల్‌కు ధర కల్పించండి
- పంట ఉత్పత్తుల కొనుగోళ్లపై సమీక్ష సందర్భంగా చంద్రబాబు ఆదేశం
- సీసీఐ పత్తి కొనుగోళ్లపై అసహనం.. కేంద్రానికి లేఖ రాయాలని సూచన



ఈనాడు, అమరావతి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎన్డీయే ప్రజాప్రతినిధులంతా సందర్శించి.. రైతులకు అండగా నిలబడాలని సీఎం చంద్రబాబు సూచించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 32% అదనంగా ధాన్యం సేకరణ జరిగిందని, 24 గంటల్లోపే సొమ్ము చెల్లిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.4,085 కోట్లు జమ చేశామన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో ధాన్యం, పత్తి, మిరప సహా వివిధ పంటల కొనుగోళ్లపై సమీక్షించారు. 'ప్రజలు తినే రకాల వరి సాగు చేయాలి. వాటి కొనుగోలుతో పాటు అంతర్జాతీయ మార్కెట్లపైనా దృష్టి పెట్టాలి. రాగులు, సజ్జలు, చిరుధాన్యాల్ని సేకరించి వినియోగదారులకు అందుబాటులో ఉంచాలి' అని చంద్రబాబు నిర్దేశించారు. ఉల్లి కొనుగోలు నిధులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. '45,420 హెక్టార్లలో సుబాబుల్ సాగవుతోంది. రైతులకు ధర దక్కేలా చూడాలి. అరటి, నిమ్మ తదితర ఉద్యానపంటల కొనుగోలుదారులతో సమావేశం ఏర్పాటుచేయండి' అని చెప్పారు.

యంత్ర పరికరాలకు బ్యాంక్ ఏర్పాటు

రైతులకు అవసరమైన ఆధునిక యంత్ర పరికరాలకు అగ్రికల్చర్ ఎక్విప్‌మెంట్ బ్యాంకు ఏర్పాటుచేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. వాటిని రైతులకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. డ్రోన్ల వినియోగం ద్వారా సాగువ్యయం తగ్గించాలన్నారు. 'ప్రజల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టిపెట్టేలా అవగాహన కల్పించాలి' అని పేర్కొన్నారు.

పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలి

పత్తి కొనుగోలులో సీసీఐ తీరుపై చంద్రబాబు తీవ్ర అసహనం వెలిబుచ్చారు. 'కిసాన్ కపాస్ యాప్ ద్వారా కొనుగోళ్లకు స్లాట్ల కేటాయింపు, ఇతర సాంకేతిక సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి. రైతులకు ఇబ్బందులు సృష్టించవద్దు' అని స్పష్టం చేశారు. పత్తి కొనుగోళ్లపై కేంద్రానికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు.

ప్రొడక్ట్ క్లస్టర్ల ద్వారా ఉత్పత్తి, మార్కెటింగ్

వివిధ ప్రాంతాల్లో పండే పంటలకు ప్రొడక్ట్ క్లస్టర్లు ఏర్పాటుచేయాలని, పంట ఉత్పత్తితో పాటు మార్కెటింగ్‌నూ సమన్వయం చేయాలని చంద్రబాబు సూచించారు. వాణిజ్యపంటల కోతల్లో రేషనలైజేషన్ విధానం పాటించాలని చెప్పారు. రైతులకు రవాణా ఖర్చులు తగ్గించి అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తుల్ని అనుసంధానించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

గూగుల్ డేటాసెంటర్‌కు మార్చిలో శంకుస్థాపన

సిలికాన్ వ్యాలీలో బే ఏరియా కౌన్సిల్ సమావేశంలో లోకేశ్

ఈనాడు, అమరావతి: విశాఖలో గూగుల్ డేటాసెంటర్‌కు మార్చిలో శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి లోకేశ్ ప్రకటించారు. 13 నెలల్లోనే ఆ సంస్థ పెట్టుబడులకు అన్ని అనుమతులూ పూర్తిచేశామన్నారు. 'ఏఐ యుగంలో నైపుణ్యాలు, విశ్వసనీయత, ఈ రంగంలో వచ్చే మార్పులకు అనుగుణంగా సమన్వయం' అనే అంశంపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని సిలికాన్ వ్యాలీలో జరిగిన బే ఏరియా కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 'ఏఐ విప్లవంలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతాం. భారత్‌లోని యువరాష్ట్రాల్లో ఏపీ ఒకటి. భవిష్యత్తులో 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 15% వృద్ధిరేటు సాధించేందుకు క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేస్తున్నాం. దీనికోసం 20 రంగాలను గుర్తించాం. దీనికి అవసరమైన ఎకోసిస్టమ్‌ను ఏర్పాటుచేస్తున్నాం' అని పేర్కొన్నారు.

12న విశాఖలో ఏడు ఐటీ సంస్థలకు భూమిపూజ

హాజరుకానున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ, అంతర్జాతీయస్థాయి ఐటీ సంస్థలు విశాఖకు తరలివస్తున్నాయి. ఆయా సంస్థల ఏర్పాటుకు అవసరమైన భూములు, ఇతర మౌలిక వసతుల కల్పనకు జిల్లా యంత్రాంగం చురుగ్గా కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే ఈ నెల 12 న విశాఖలోని ఐటీ హిల్స్‌పై ఏడు ఐటీ సంస్థలకు భూమి పూజ జరుగుతుందని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రికి మంత్రి లోకేశ్ విశాఖకు చేరుకొని ఇక్కడ బస చేస్తారు. 12వ తేదీ ఉదయం 9 గంటల నుంచి జరిగే కార్యక్రమాలకు ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపనలు చేస్తారన్నారు. ఉదయం 11.30 గంటలకు నిర్వహించే కాగ్నిజెంట్ సంస్థ భూమిపూజలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, మంత్రి లోకేశ్ హాజరవుతారని కలెక్టర్ చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)లో పరిశ్రమలఏర్పాటుకు 5 వేల ఎకరాల భూములు సిద్ధం చేస్తున్నామని, వీఈఆర్‌పై 12న ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరించిన చంద్రబాబు



బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు

ఈనాడు, అమరావతి: యోనెక్స్-సన్‌రైజ్ 87వ సీనియర్ జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2025 పోస్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 24 నుంచి 28 వరకు విజయవాడలో జరగనున్న ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిని... రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆహ్వానించారు. ఏపీలో పదేళ్ల తర్వాత మళ్లీ ఈ పోటీలను నిర్వహిస్తున్నామని వారు సీఎంకు వివరించారు. పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఈ సందర్భంగా సీఎం వారికి సూచించారు. చంద్రబాబును కలిసిన వారిలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు అంకమ్మ చౌదరి ఉన్నారు.

ఆయనో అవినీతి అనకొండ

- విశ్రాంత ఈఎన్‌సీ శ్రీనివాస్ అక్రమాస్తులపై కేసు నమోదు
- ఏకకాలంలో ఏడుచోట్ల సోదాలు
- కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

ఈనాడు-విశాఖపట్నం, విశాలాక్షినగర్-న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా ఇటీవలే ఉద్యోగ విరమణ చేసిన సబ్బవరపు శ్రీనివాస్ అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు 7న ఆయన గుత్తేదారు నుంచి రూ.25 లక్షల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు పట్టుబడ్డారు. విజయవాడ జైల్లో రిమాండ్‌లో ఉండగానే ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేశారు. ఇటీవలే బెయిల్‌పై విడుదలై విశాఖలో ఉంటున్నారు. అక్రమాస్తుల కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం ఏకకాలంలో హైదరాబాద్, ఏలూరు, విశాఖపట్నంలలో ఏడుచోట్ల ఏసీబీ సోదాలు సాగాయి. బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ రోజంతా తనిఖీలు నిర్వహించారు. విశాఖ నగరం విశాలాక్షినగర్ ఎస్ఎస్ఎస్‌కే ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లోని శ్రీనివాస్‌కు చెందిన ఫ్లాటుతోపాటు, నగరంలోని నాలుగు ఇళ్లల్లో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. తాజా తనిఖీల్లో 10 స్థిరాస్తులు, ఒక ఇన్నోవా కారు, బంగారం, వెండి వస్తువులు, కొంత నగదు గుర్తించారు. తనిఖీలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.



శ్రీనివాస్

నాలుగుసార్లు ఏసీబీ దాడులు

◆ విజయనగరం జిల్లాకు చెందిన శ్రీనివాస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా, ఏఈగా, ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)గా పనిచేసిన కాలంలో గుత్తేదారులను వేధించి మరీ లంచాలు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి.

◆ 2001లో ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే కేసు నమోదైంది. ◆ 2014లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏఈగా పనిచేస్తున్నప్పుడు బిల్లుల మంజూరుకు లంచం అడిగి ఏసీబీకి చిక్కారు.

◆ ఈ ఏడాది ఆగస్టు 7న విశాఖకు చెందిన గుత్తేదారు కృష్ణంరాజు బిల్లుల మంజూరుకు లంచం తీసుకుంటూ మరోసారి చిక్కారు. తాజాగా మరోసారి దాడులు నిర్వహించి ఆయన బంధు మిత్రుల ఇళ్లలో తనిఖీలు జరిపారు.

◆ ఆయన విధుల్లో ఉన్నప్పుడు మూడుసార్లు, పదవీ విరమణ తరువాత ఒకసారి ఏసీబీ దాడులు సాగాయి. ఒకే అధికారిపై నాలుగుసార్లు దాడులు నిర్వహించడం ఇదే తొలిసారనే చర్చ సాగుతోంది.

◆ తాజాగా శ్రీనివాస్‌పై మరోసారి అక్రమాస్తుల కేసు నమోదైంది. ◆ శ్రీనివాస్‌కు గత వైకాపా, ప్రస్తుత కూటమి ప్రభుత్వాల్లో అందలమేశారు. వైకాపా హయాంలో గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనుల పర్యవేక్షణలో కీలకమైన ఈఎన్‌సీ పోస్టును అర్హత లేకున్నా కట్టబెట్టారనే విమర్శలున్నాయి.

జింకానా ఔదార్యం.. తల్లీబిడ్డలకు వరం

గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో (జీజీహెచ్) ఇప్పటికీ వందేళ్ల నాటి శిథిల భవనాల్లోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్యం అందిస్తున్నారు. ఈ పరిస్థితిని చూసి చలించిన గుంటూరు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, నార్త్ అమెరికా (జింకానా) రూ.100 కోట్ల విరాళాలతో అధునాతన వసతులతో 'కానూరు రామచంద్రరావు మాతాశిశు సంరక్షణ కేంద్రం' (ఎంసీహెచ్ బ్లాక్) నిర్మాణానికి ముందుకు వచ్చింది. మొత్తం ఆరు అంతస్తులుండే భవనంలో 650 పడకలతో పాటు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, చిన్నపిల్లల వార్డులు, ప్రసూతి విభాగం, పీడియాట్రిక్ సర్జరీ, సిక్ న్యూబోర్న్ ఐసీయూ, ఎన్ఐసీయూ, ఔట్ పేషంట్ విభాగాలు ఉండనున్నాయి. ప్రస్తుతం భవనానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. కావాల్సిన అత్యాధునిక వైద్య పరికరాలు, యంత్రాల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.27 కోట్లు మంజూరు చేసింది. 2026 జనవరిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ భవనాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. – ఈనాడు, గుంటూరు





విమర్శకులుగా మిగిలిపోకండి

ఇలాంటి కథ నేనూ రాయగలను, ఈ మాత్రం సినిమా నేనూ తీయగలను, వేదిక ఎక్కితే ఇలాంటి ఉపన్యాసాలు నేనూ ఇవ్వగలను అని చాలా మంది గర్వంగా చెప్పుకొంటుంటారు. ఇవేమన్నా బ్రహ్మవిద్యలా అని ఇతరుల పనితనాన్ని తేలిగ్గా కొట్టిపడేస్తుంటారు. కానీ వారు మాత్రం ఫోన్లో ఇతరులు చేసిన రీల్స్ చూస్తూ గడిపేస్తుంటారు. వారు జీవితాంతం విమర్శకులుగా, వీక్షకులుగా మిగిలిపోతారు తప్ప దేన్నీ సృష్టించలేరు. మీరు ఆ సమూహంలో ఉండకూడదనుకుంటే, మీ ఆలోచనలకు రూపమివ్వడానికి శ్రమించండి.

– డెరెక్ సివర్స్, రచయిత

ఆరో రియాల్టీ చేతికి తాజ్ బంజారా హోటల్?

రూ.315 కోట్లకు కొనుగోలు



హైదరాబాద్: అరబిందో గ్రూపు ప్రమోటర్లకు చెందిన ఆరో రియాల్టీ, హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తాజ్ బంజారా హోటల్‌ను కొనుగోలు చేసినట్లు తెలిసింది. సుమారు రూ.315 కోట్లకు ఈ హోటల్‌ను దక్కించుకున్నట్లు స్థిరాస్తి వర్గాలు తెలిపాయి. దాదాపు 16,645 చదరపు గజాల స్థలంలో ఈ హోటల్ ఉంది. భవన విస్తీర్ణం 1.2 లక్షల చదరపు అడుగులు. ఈ హోటల్ రెండు దశాబ్దాలకు పైగానే తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ అజమాయిషీలో ఉంది. కానీ రెండేళ్లుగా ఇది నిర్వహణలో లేదు.

ఈనాడు బిజినెస్

పసిడి బాండ్లలో రూ.2,954 పెట్టుబడిపై రూ.9,847 లాభం



ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పసిడి బాండ్లలో పెట్టుబడులు పెట్టిన మదుపర్లకు భారీ ప్రతిఫలం లభిస్తోంది. 2017 డిసెంబరు 11న జారీ చేసిన సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ) 2017-18 సిరీస్-11కు తుది రిడెంప్షన్ ధరను, యూనిట్‌కు రూ.12,801గా నిర్ణయించారు. అప్పటి మేలిమి బంగారం ధర గ్రాము రూ.2,954 చొప్పున పెట్టుబడి పెడితే, ఇప్పుడు రూ.9,847 లాభాన్ని మదుపర్లు పొందనున్నారు. దీనికి వార్షిక వడ్డీ రేటు (2.5%) అదనం. 2019-20 సిరీస్-1 ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ధరను కూడా యూనిట్‌కు రూ.12,801గా ఆర్‌బీఐ నిర్ణయించింది. ఈ వారంలో సోమవారం నుంచి బుధవారం వరకు పసిడి ముగింపు ధరల సగటు ఆధారంగా ఈ రేటును నిర్ణయించింది.



కొత్త సెల్టోస్‌తో కియా ఇండియా సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్, చీఫ్ సేల్స్ ఆఫీసర్ సునాక్ పార్క్

విపణిలోకి సరికొత్త సెల్టోస్

నేటి నుంచి బుకింగ్‌లు

ఈనాడు, హైదరాబాద్: మారుతున్న వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా 'సెల్టోస్' రెండో తరాన్ని కియా ఇండియా ఇక్కడ ఆవిష్కరించింది. డిజైన్, ఇంటీరియర్, ఇంజిన్ సామర్థ్యాల్లో గణనీయ మార్పులు చేసిన ఈ కొత్త ఎస్‌యూవీ కోసం రూ.25,000 చెల్లించి, గురువారం నుంచి బుక్ చేసుకోవచ్చు. జనవరి మధ్య నుంచి డెలివరీ ఇచ్చే ఈ కారు ధరను జనవరి 2న ప్రకటించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, మరింత ఆకర్షణీయంగా దీన్ని తీసుకొచ్చినట్లు కియా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గ్వాంగు లీ తెలిపారు. ముందు భాగంలో కియా ప్రత్యేకమైన 'టైగర్ నోజ్ గ్రిల్', నిలువుగా ఉండే ఎల్‌ఈడీ లైట్లు, 18 అంగుళాల అలాయ్ వీల్స్, వెనక భాగంలో కలిసి ఉండేలా టెయిల్ లైట్లు, మారిన బంపర్లు సెల్టోస్‌కు సరికొత్త రూపు తెచ్చాయన్నారు. 10 రంగుల్లో ఈ వాహనం లభించనుంది. కొత్త కె3 ప్లాట్‌ఫామ్‌పై రూపొందించిన ఈ కారు పొడవు 4,460 మిల్లీమీటర్లు. రెండు రంగుల్లో ఉండే డాష్‌బోర్డు, 30 అంగుళాల స్క్రీన్, 8 స్పీకర్లతో బోస్ సిస్టమ్, హెడ్స్ అప్ డిస్‌ప్లే, 6 ఎయిర్‌బ్యాగులు, 360 డిగ్రీల కెమెరా, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేకు, 4 చక్రాలకూ డిస్కు బ్రేకులతో పాటు అడాస్‌లాంటి సదుపాయాలుంటాయి. 1.5 లీటర్ల పెట్రోల్ - టర్బో పెట్రోల్ - డీజిల్ ఇంజిన్లతో వస్తున్న కొత్త సెల్టోస్.. టాటా సియారా, హ్యుందాయ్ క్రెటా, మారుతీ గ్రాండ్ విటారా, హోండా ఎలివేట్ వంటి కార్లకు పోటీనిచ్చే అవకాశం ఉంది.

కోడి గుడ్లు

11న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	651
వరంగల్	653
విజయవాడ	670
తూ/ప గోదావరి	650
విశాఖపట్నం	640
చిత్తూరు	663

సిప్లా నుంచి ఊబకాయం మందు

ఊబకాయం మందుల విభాగంలోకి సిప్లా లిమిటెడ్ అడుగుపెట్టింది. యర్‌పీక్ (టిర్జెపటైడ్) మందును దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఇది వారానికి ఒకసారి ఇంజెక్షన్ రూపంలో తీసుకోవాలి. ఊబకాయాన్ని తగ్గించడంతో పాటు టైప్-2 డయాబెటిస్ వ్యాధిని అదుపు చేయడానికీ ఇది ఉపకరిస్తుంది. ఈ మందు తీసుకురావటానికి ఎలీ లిల్లీతో సిప్లా ఒప్పందం కుదుర్చుకుంది. యర్‌పీక్ మందును ఎలీ లిల్లీ ఉత్పత్తి చేసి సిప్లాకు అందిస్తుంది. సిప్లా ఈ మందును విక్రయిస్తుంది.

ఐటీ దిగ్గజాల భారీ పెట్టుబడులు

- ట్రంప్ సుంకాల వేళ భారత్ వైపు చూస్తున్న అమెరికా కంపెనీలు
- తక్కువ ఖర్చులు, విశేష నైపుణ్యాలు ప్రధాన ఆకర్షణ
- ఏఐ జోరు కూడా కారణం ● దేశీయ ఐటీ రంగానికి మేలు



ప్రపంచ మార్కెట్‌ను, ఐటీ సేవల తీరుతెన్నులను ఏఐ (కృత్రిమ మేధ) ప్రభావితం చేస్తోంది. ఇదే సమయంలో వస్తువులపై అధిక సుంకాలతో, వీసా ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనదేశాన్ని ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఇటువంటి కీలక తరుణంలో, అంతర్జాతీయంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ దిగ్గజ సంస్థలు మనదేశంలో తమ కార్యకలాపాలను విస్తరించడానికి క్యూ కట్టడం సంతోషకర పరిణామం. ప్రధానంగా ఏఐ, క్లౌడ్ విభాగాల్లో పెట్టుబడులను ఈ సంస్థలు ప్రకటించాయి. ఆయా కంపెనీల ఉన్నతస్థాయి అధికారులు మనదేశాన్ని సందర్శించడమే కాకుండా, ప్రధానమంత్రిని ఇతర నేతలను కలిసి తమ ప్రణాళికలు వివరిస్తున్నారు. అమెరికాలో వీసా ఆంక్షలు, అధిక వ్యయాల నేపథ్యంలో.. భారత్‌లో ఐటీ నిపుణుల లభ్యత అధికంగా ఉండటం, ఖర్చులు తక్కువగా ఉన్నందునే కార్యకలాపాల విస్తరణకు ఈ కంపెనీలు మనదేశంలో కొత్త పెట్టుబడులకు ముందుకు వస్తున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. దేశీయ ఐటీ కంపెనీల్లో వాతావరణం కొంతకాలంగా స్తబ్దుగా ఉండగా, అగ్రశ్రేణి సంస్థల పెట్టుబడుల ప్రణాళికతో మళ్లీ కళకళలాడుతుందనే ఆశాభావం కలుగుతోంది.

మైక్రోసాఫ్ట్

మైక్రోసాఫ్ట్ మనదేశంలో అయిదేళ్లలో 17.5 బిలియన్ డాలర్ల (రూ.1.58 లక్షల కోట్ల) పెట్టుబడి పెట్టనుంది. ఈ సంస్థ ఇటీవలి కాలంలో ప్రకటించిన అతిపెద్ద పెట్టుబడి ఇదే. ప్రధానంగా క్లౌడ్, ఏఐ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి, నైపుణ్యాల విస్తరణకు, ప్రస్తుత కార్యకలాపాలను బలోపేతం చేయడానికి ఈ నిధులు వెచ్చిస్తారు.

గూగుల్

విశాఖపట్నంలో అతిపెద్ద ఏఐ హబ్, గిగావాట్ స్కేల్ డేటా సెంటర్‌ను గూగుల్ ఏర్పాటు చేయనుంది. అయిదేళ్లలో దీనిపై 15 బి.డాలర్ల (రూ.1.35 లక్షల కోట్ల) పెట్టుబడిని ప్రకటించింది. పూర్తిస్థాయి కంప్యూటర్ మౌలిక వసతులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్, సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ నిర్మాణం కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. అమెరికా వెలుపల గూగుల్‌కు అతిపెద్ద ఏఐ/డేటా కేంద్రం విశాఖపట్నం ప్రాంగణం అవుతుందని అంచనా.

అమెజాన్

ఇ-కామర్స్ దిగ్గజమైన అమెజాన్, 2030కి మనదేశంలో 35 బి.డాలర్ల (రూ.3.15 లక్షల కోట్ల) పెట్టుబడి పెట్టనుంది. ఏఐ ఆధారిత డిజిటైజేషన్‌పై దృష్టి కేంద్రీకరిస్తామని.. తత్ఫలితంగా భారత్ నుంచి ఎగుమతులు పెరగడమే కాకుండా పెద్దఎత్తున ఉద్యోగాల కల్పన జరుగుతుందని అమెజాన్ వివరించింది. ఏఐ, వెబ్ సర్వీసెస్ సామర్థ్యాన్ని విస్తరించడానికి తెలంగాణ, మహారాష్ట్రల్లో 12.7 బి.డాలర్ల (రూ.1.14 లక్షల కోట్ల) పెట్టుబడి పెట్టనున్నట్లు గతంలో అమెజాన్ ప్రకటించింది. కొన్ని ఇతర ప్రాజెక్టులను కూడా కలిపి, మొత్తం పెట్టుబడులను 35 బి.డాలర్లకు పెంచనున్నట్లు తాజాగా ఈ సంస్థ వెల్లడించింది. మనదేశంలో అమెజాన్‌కు 1.20 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు.

మెటా

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ మాతృసంస్థ మెటా, మనదేశంలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో కలిసి 100 మిలియన్ డాలర్ల (సుమారు రూ.900 కోట్ల)కు పైగా పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార సంస్థలకు అత్యాధునిక ఏఐ సేవలు అందించేందుకు ఈ పెట్టుబడులను సిద్ధం చేసింది. సిఫీ టెక్నాలజీస్‌తో కలిసి విశాఖపట్నంలో 500 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికీ సిద్ధం అవుతోంది.

✦ భారత సెమీకండక్టర్ ప్రయాణంలో కలిసి నడుస్తామని ఇంటెల్ సీఈఓ ప్రకటించారు. విశాఖపట్నంలో కాగ్నిజెంట్ సేవల ప్రారంభానికి ఆ సంస్థ సీఈఓ కూడా భారత్‌కు వచ్చారు.

సుంకాలు వికటిస్తున్నాయా?



వివిధ దేశాల ఉత్పత్తులపై పన్నులతో విరుచుకుపడటంతో పాటు, ఆయా దేశాల నిపుణులు వర్క్ వీసాపై వచ్చి అమెరికాలో పనిచేసేందుకు పలు రకాల ఆంక్షలను ట్రంప్ అమలు చేయడంతో.. అమెరికా ఐటీ దిగ్గజ సంస్థలు నిపుణుల కోసం మనదేశం వైపు చూడక తప్పదనే అభిప్రాయం కొంతకాలంగా వినపడుతోంది. ఇదే జరుగుతున్నట్లు ఇప్పుడు కనిపిస్తోంది. అగ్రశ్రేణి సంస్థలు మనదేశంలో కార్యకలాపాలను విస్తరించడానికి ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. పైగా ఆయా కార్యకలాపాలు సొంతంగా చేపట్టడానికి ముందుకు రావడం ఆసక్తికరమైన అంశం. పెద్ద సంఖ్యలో జీసీసీ (గ్లోబల్ కేపబులిటీ సెంటర్)లను ఏర్పాటు చేయడమే దీనికి ఉదాహరణ. బహుళ జాతి ఐటీ కంపెనీలకు జీసీసీలు 'ఆఫ్‌షోర్' యూనిట్లుగా ఉంటున్నాయి. కేవలం ఖర్చులు తగ్గించుకోవడమే కాకుండా, పరిశోధనా కేంద్రాలుగా, సామర్థ్యాలను పెంచుకోవడానికి వీలుకల్పించే సంస్థలుగా జీసీసీలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయని ఐటీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ కేంద్రాల్లో ఏఐ ఆధారిత ఐటీ సేవల ఆవిష్కరణ, విస్తరణ అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అన్ని ఆర్థిక సేవలకూ ఒకే సంతకమా!

- నిబంధనలు చదవకపోతే ఇబ్బందే
- ఎస్‌బీఐ ఎండీ అశ్వినీ కుమార్

ముంబయి: వినియోగదారులు నిబంధనలు చదవకుండా, పూర్తి వివరాలు అర్థం చేసుకోకుండానే అన్ని ఆర్థిక సేవలకు అంగీకారం తెలియజేస్తున్నారని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) మేనేజింగ్ డైరెక్టర్ అశ్వినీ కుమార్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే.. అకౌంట్ అగ్రిగేటర్ (ఏఏ) వినియోగించే 'ఒకే అంగీకార విధానం' గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నియంత్రణలో ఉన్న ఏఏ వ్యవస్థ, డేటా మధ్యవర్తిగా వ్యవహరిస్తుంది. ఆర్థిక సంస్థల మధ్య సమాచారాన్ని సులువుగా పంచుకోవడానికి, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేందుకు వీలు కల్పించేందుకు ఆర్‌బీఐ ఈ నిబంధనావళిని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఈ వేదికపై దాదాపు 22.5 కోట్ల మంది వినియోగదారులున్నారు.

✦ రుణాలు మంజూరు చేయడం, సంపద నిర్వహణ, ఖాతాలు ప్రారంభించడం వంటి అన్ని ఆర్థిక సేవల ఉత్పత్తుల కోసం వినియోగదారుల నుంచి ఒకే అంగీకారం తీసుకునే విధానం సరికాదని ఎస్‌బీఐ ఎండీ అభిప్రాయపడ్డారు.

✦ వినియోగదారుల నుంచి ఒకసారే అంగీకారం తీసుకుంటున్నారని, వారు నిబంధనలు చదవకుండా, అర్థం చేసుకోకుండానే ఆమోదిస్తున్నారని పేర్కొన్నారు. 'ఇది సరైనది కాకపోవచ్చు' అని తివారీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

అమెరికాలో వడ్డీరేట్లు తగ్గాయ్

అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక రేటులో 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించింది. ఇటీవలి ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడం కోసం కీలక రేటును 0.25% తగ్గించి, 3.50 - 3.75 శాతానికి పరిమితం చేసింది. అధిక స్థాయిలో ఉద్యోగ కల్పనకు, ద్రవ్యోల్బణాన్ని 2 శాతానికి తెచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రెండింటి మధ్య సమతౌల్యం పాటించడంపై అమెరికా కేంద్ర బ్యాంకు దృష్టి కేంద్రీకరించింది. సెప్టెంబరు, అక్టోబరు సమావేశాల్లోనూ అమెరికా ఫెడ్ రేట్ల కోత చేసిన సంగతి విదితమే. తాజా నిర్ణయంతో తనఖా రుణాలు, ఇళ్లు, కార్ల రుణ రేట్లు తగ్గనున్నాయి.

సంక్షిప్తంగా..

✦ బీఎస్ఈ ఇండెక్స్ సర్వీసెస్ బుధవారం 4 లార్జ్-క్యాప్ ఫ్యాక్టర్ సూచీలను ప్రారంభించింది. వీటిలో బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 100 మొమెంటమ్ 30, బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 100 లో ఓలటిలిటీ 30, బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 100 ఎన్‌హాన్స్‌డ్ 30, బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 100 క్వాలిటీ 30 ఉన్నాయి.

✦ విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫెమా) కేసులో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన 13 బ్యాంక్ ఖాతాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. ఈ ఖాతాల్లో రూ.54.82 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లు ఈడీ తెలిపింది.

మీషోకు భారీ లాభం

ఇ-కామర్స్ సంస్థ **మీషో** షేరు, ఇష్యూ ధర రూ.111తో పోలిస్తే బీఎస్ఈలో 45.22% ప్రీమియంతో రూ.161.20 వద్ద బుధవారం నమోదైంది. ఇంట్రాడేలో 59.95% పెరిగి రూ.177.55 స్థాయిని తాకింది. చివరకు 53.33% లాభంతో రూ.170.20 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.76,813.49 కోట్లుగా నమోదైంది.

✦ విద్యా వైర్స్ షేరు, ఇష్యూ ధర రూ.52తో పోలిస్తే బీఎస్ఈలో 0.25% ప్రీమియంతో రూ.52.13 వద్ద నమోదైంది. ఇంట్రాడేలో 12.46% లాభంతో రూ.58.48 స్థాయిని తాకింది. చివరకు 2.19% లాభపడి రూ.53.14 వద్ద స్థిరపడింది.


✦ ఏక్‌స్ షేరు, ఇష్యూ ధర రూ.124తో పోలిస్తే బీఎస్ఈలో 12.90% ప్రీమియంతో రూ.140 వద్ద నమోదైంది. ఇంట్రాడేలో 26.61% పెరిగి రూ.157 స్థాయిని తాకింది. చివరకు 22.18% లాభంతో రూ.151.15 వద్ద స్థిరపడింది.

ప్రవాసులకు శుభవార్త

డిజిటల్ వెరిఫికేషన్ సమయంలో భారతదేశంలో మనిషి భౌతికంగా ఉండాలనే అవసరాన్ని తొలగించడం ద్వారా ప్రవాస భారతీయుల కోసం రీ-కేవైసీ ప్రక్రియను సులభతరం చేసినట్లు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ బుధవారం వెల్లడించింది. ఆర్థిక సంస్థలు, ఇంటర్‌మీడియరీల్లోని ప్రస్తుత సభ్యుల కేవైసీ వివరాలను మరోసారి ధ్రువీకరించుకోడానికి రీ-కేవైసీ చేస్తుంటారు. ర్యాండమ్ ప్రాంప్ట్స్, టైమ్ స్టాంపింగ్, జియో ట్యాగింగ్ సందర్భాల్లో అసలు వ్యక్తేనా అని ధ్రువీకరించుకోడానికి రీ-కేవైసీ వాడతారు. కొత్తగా చేరేవారి కేవైసీ ధ్రువీకరణకు, వ్యక్తి తప్పనిసరిగా భారత్‌లోనే ఉండాలి. సంబంధిత ఖాతాదారు, భారత్‌లో తెలిపిన చిరునామాలో ఉన్నారో, లేదో జీపీఎస్ లొకేషన్ ద్వారా పరిశీలిస్తారు.

డేటా కేంద్రం సామర్థ్యంపైనే దృష్టంతా..

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల



దిల్లీ: భారత్‌లో ఏర్పాటు చేయబోతున్న డేటా కేంద్రం సామర్థ్యంపై ఉత్సాహంగా ఉన్నామని.. తమ కంపెనీ పెట్టుబడుల ప్రణాళిక గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో చర్చించినట్లు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వెల్లడించారు. మన దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాలు, నైపుణ్య సామర్థ్యాల కోసం 2030 నాటికి 17.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.58 లక్షల కోట్ల) పెట్టుబడులను తాజాగా నాదెళ్ల ప్రకటించిన సంగతి విదితమే. మనదేశంలో ఏఐ రంగానికి సంబంధించి, గత రెండు నెలల్లో వచ్చిన మూడో అతిపెద్ద పెట్టుబడి ప్రకటన ఇదే. 'భారత్‌లో త్వరలో ఏర్పాటు చేయబోయే డేటా కేంద్రం సామర్థ్యంపై చాలా ఉత్సాహంగా ఉన్నాం. ఇప్పటికే మాకు పుణె, చెన్నై, ముంబయిల్లో కేంద్రాలు ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రంగా దక్షిణ భారత క్లౌడ్ రీజియన్‌ను వచ్చే ఏడాది మధ్యలో ప్రారంభించనున్నాం' అని మైక్రోసాఫ్ట్ కార్యక్రమంలో నాదెళ్ల వివరించారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ విధానాన్ని అమలు చేయడానికి మన దేశం సిద్ధమవుతున్న తరుణంలో, భారత వినియోగదారుల కోసం సార్వభౌమ పబ్లిక్ క్లౌడ్, సార్వభౌమ ప్రైవేట్ క్లౌడ్‌ను మైక్రోసాఫ్ట్ తీసుకొస్తోంది. ప్రపంచ స్థాయి సైబర్ భద్రత, సైబర్ వ్యవస్థలను ప్రజలు గుర్తించడం చాలా ముఖ్యమని నాదెళ్ల అభిప్రాయపడ్డారు.

కార్మిక శాఖతో మైక్రోసాఫ్ట్ ఒప్పందం: దేశంలో యువతకు ఉద్యోగ అవకాశాలు, కృత్రిమ మేధ నైపుణ్యాలు కల్పించేందుకు మైక్రోసాఫ్ట్‌తో ప్రారంభ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతర్జాతీయ అవకాశాల కోసం మన ఉద్యోగులను సిద్ధం చేయడంలో ఇది కీలక అడుగని వెల్లడించింది. దిల్లీలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ప్లాట్‌ఫామ్‌పైకి మైక్రోసాఫ్ట్ అంతర్జాతీయ నెట్‌వర్క్‌కు చెందిన 15,000కు పైగా సంస్థలు, భాగస్వాములను తీసుకురానుంది.

2025-26లో భారత వృద్ధి 7.2%: ఏడీబీ

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత జీడీపీ వృద్ధి 7.2 శాతంగా నమోదు కావొచ్చని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) అంచనా వేసింది. గతంలో అంచనా వేసిన 6.5 శాతాన్ని గణనీయంగా పెంచింది. ద్రవ్యోల్బణ అంచనాను కూడా 3.1% నుంచి 2.6 శాతానికి ఏడీబీ సవరించింది. ఇటీవలి జీఎస్‌టీ రేట్ల కోతలు.. దేశీయ వినియోగం, వృద్ధికి మద్దతు ఇస్తాయని తెలిపింది. భారత్ వృద్ధి బలంగా పెరగనుండటంతో మొత్తం ఆసియా వృద్ధిని కూడా గతంలో అంచనా వేసిన 4.8% నుంచి 5.1 శాతానికి ఏడీబీ పెంచింది. జులై-సెప్టెంబరు త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి 8.2 శాతానికి చేరిన సంగతి తెలిసిందే. ఏప్రిల్-జూన్‌లో 7.8 శాతంగా నమోదైంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలో వృద్ధిరేటు 8 శాతానికి చేరింది.

మర్చంట్ బ్యాంకర్ల నియామకంలో ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్

ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఐపీఓ కోసం మర్చంట్ బ్యాంకర్లు, ఇతర సర్వీస్ ప్రొవైడర్ల నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (61.98%), పారిస్‌కు చెందిన అమండి (36.40%) సంయుక్త సంస్థే ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎస్‌బీఐఎఫ్ఎంఎల్). ఈ ఫండ్ హౌస్ 2025 సెప్టెంబరు నాటికి సుమారు రూ.12 లక్షల కోట్ల ఆస్తుల్ని నిర్వహిస్తోంది. ఈ రెండు సంస్థలు ఐపీఓ ద్వారా చెరో 10% వాటాను విక్రయించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాయి.

2026 డిసెంబరుకు నిఫ్టీ 29,000 పాయింట్లకు

కోటక్ సెక్యూరిటీస్ అంచనా

దేశీయ కంపెనీల ఆదాయాల వృద్ధి బాగుండటంతో 2026 డిసెంబరు ఆఖరుకు నిఫ్టీ 12% వృద్ధితో 29,000 పాయింట్లకు చేరే అవకాశం ఉందని దేశీయ బ్రోకరేజీ సంస్థ కోటక్ సెక్యూరిటీస్ అంచనా వేసింది. 'బేస్ కేస్'లో నిఫ్టీ-50 సూచీ 29,120 పాయింట్లకు చేరొచ్చని ఎండీ, సీఈఓ శ్రీపాల్ షా వెల్లడించారు. 'బుల్ కేస్'లో 32,032 పాయింట్లకు, 'బేర్ కేస్'లో 26,208 పాయింట్లకు నిఫ్టీ సూచీ చేరొచ్చని పేర్కొన్నారు. బులియన్ మార్కెట్‌లో పసిడి 10 గ్రాములు రూ.1.5 లక్షలకు చేరొచ్చని అంచనా వేశారు. వెండి కిలో రూ.2.1 లక్షలకు చేరే అవకాశం ఉందని తెలిపారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 87-88 స్థాయులకు రావొచ్చని పేర్కొన్నారు.

ఆరేళ్లలో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు

గౌతమ్ అదానీ ప్రకటన

ధన్‌బాద్ (ఝార్ఖండ్): వచ్చే ఆరేళ్లలో మనదేశంలో రూ.10-12 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడించారు. మౌలిక సదుపాయాలు, టెక్నాలజీ, గనులు, పునరుత్పాదక ఇంధనం, పోర్టులు, ఇతర రంగాల్లో ఈ పెట్టుబడులు ఉంటాయని తెలిపారు. స్వావలంబన సాధించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు పెట్టుబడులు పెట్టేందుకు భారత కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని.. ఇది మనదేశానికి సరికొత్త స్వాతంత్ర్యం అని పేర్కొన్నారు. ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్ శతాబ్ది ఉత్సవాల్లో బుధవారం గౌతమ్ అదానీ ప్రసంగించారు. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న పునరుత్పాదక ఇంధన కంపెనీల్లో ఒకటిగా నిలిచేందుకు పెట్టుబడులు పెడుతున్నామని, రాబోయే దశాబ్ద కాలంలో భారత్ ఆకాంక్షలకు అవసరమైన విస్తరణకు సిద్ధంగా ఉన్నట్లు అదానీ వివరించారు. కంపెనీల ప్రయాణంలో సవాళ్లు భాగమని, దేశ నిర్మాణంలో భాగస్వామిగా ఉంటామన్నారు. 21వ శతాబ్దంలో దేశ సార్వభౌమాధికారం.. సహజ వనరులు, ఇంధన వ్యవస్థలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. రాబోయే అయిదేళ్లలో హరిత ఇంధన రంగంలో 75 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6,75,000 కోట్ల) పెట్టుబడులను అదానీ ప్రకటించారు. రాబోయే దశాబ్దాల్లో ఈ రంగం విలువ లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆఖర్లో అమ్మకాలు.. నష్టాల్లో సూచీలు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1,651.06 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.3,752.31 కోట్లు



సెన్సెక్స్ ▼275 **84391** | **నిఫ్టీ** ▼82 **25758**

మన్నికైన వినిమయ వస్తువులు, ప్రైవేటు బ్యాంకులు, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. చివరి గంట అమ్మకాల వల్లే, సూచీలు దాదాపు నెల కనిష్ఠస్థాయికి చేరాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు తగ్గి 89.94 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 0.03% తగ్గి 61.92 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.83,000 కోట్లు తగ్గి, రూ.464.08 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 84,607.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,666.28) ప్రతికూలంగా ప్రారంభమైంది. 85,020.34 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. మళ్లీ నష్టాల్లోకి జారుకున్న సూచీ ఒక దశలో 84,313.62 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 275.01 పాయింట్ల నష్టంతో 84,391.27 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 81.65 పాయింట్లు కోల్పోయి 25,758 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,947.65-25,734.55 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 18 నష్టపోయాయి. ఎటర్నల్ 2.86%, ట్రెంట్ 1.66%, భారతీ ఎయిర్‌టెల్ 1%, ఇన్ఫోసిస్ 0.92%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.80%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.78% చొప్పున తగ్గాయి. టాటా స్టీల్ 1%, సన్‌ఫార్మా 0.57%, ఐటీసీ 0.56%, ఎన్‌టీపీసీ 0.53%, హెచ్‌సీఎల్ టెక్ 0.47% మేర లాభపడ్డాయి.

✦ రంగాల వారీ సూచీలకొస్తే సేవలు, మన్నికైన వినిమయ వస్తువులు, భారీ యంత్ర పరికరాలు, ఫోకస్డ్ ఐటీ, ఐటీ, టెక్, పారిశ్రామిక, టెలికాం రంగాలు నష్టపోయాయి. కమొడిటీస్, ఇంధన, యుటిలిటీస్, లోహ, చమురు-గ్యాస్ లాభపడ్డాయి.

✦ **కరోనా రెమిడీస్** ఐపీఓకు 137.04 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 45,71,882 షేర్లను ఆఫర్ చేయగా 62,65,41,440 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ రూ.871 కోట్ల సమీకరణకు వచ్చిన **నెఫ్రోకేర్ హెల్త్** సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ తొలిరోజున 12% స్పందనే లభించింది.

✦ **వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్** ఇష్యూ ముగిసేసరికి 2 రెట్లకు పైగా బిడ్లు దాఖలయ్యాయి.

✦ ఒడిశాలోని త్రివేణి పెల్లెట్స్ సంస్థలో 50.01% వాటాను రూ.636 కోట్లకు కొనుగోలు చేసేందుకు తమ బోర్డు అంగీకరించినట్లు **టాటా స్టీల్** వెల్లడించింది.

అన్ని మున్సిపాలిటీల్లో కలిపి నాలుగేళ్లుగా రూ.4వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, పనులు చేసిన గుత్తేదార్లకు వాటిని వెంటనే చెల్లించేలా చూడాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (సబ్కా) కోరింది.

సివిల్స్ శిక్షణకు 100 మంది ఎంపిక

- ఒక్కొక్కరికి శిక్షణ, వసతికి రూ.85వేల చొప్పున వెచ్చింపు
- త్వరలో ఆదరణ-3 పథకం అమలు
- బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత


బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత సివిల్స్ శిక్షణకు ఎంపికైన వారి వివరాలు వెల్లడిస్తున్న మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: బీసీ స్టడీసర్కిల్ ద్వారా ఉచితంగా సివిల్స్‌లో శిక్షణ అందించేందుకు స్క్రీనింగ్ పరీక్ష ద్వారా 100 మందిని ఎంపికచేసినట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత తెలిపారు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూకు కలిపి శిక్షణ, వసతి తదితరాలకు ఒక్కొక్కరికి రూ.85వేల చొప్పున వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఆమె బుధవారం సచివాలయంలో సివిల్స్ శిక్షణకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసి, విలేకర్లతో మాట్లాడారు. స్క్రీనింగ్ పరీక్షకు 723 మంది హాజరయ్యారని, వీరిలో మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా 100 మందిని ఎంపికచేశామని చెప్పారు. ఇందులో బీసీలకు 66%, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14% రిజర్వేషన్ కల్పించామని, వీరిలోనూ మహిళలకు 33% రిజర్వేషన్ ఉందని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 12న గొల్లపూడిలో బీసీ స్టడీసర్కిల్‌లో జరుగుతుందని, 14నుంచి అక్కడే హైదరాబాద్‌కు చెందిన లా-ఎక్సలెన్స్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా శిక్షణ మొదలవుతుందని మంత్రి పేర్కొన్నారు.

రూ.141 కోట్లతో వసతిగృహాల మరమ్మతులు

రాష్ట్రంలో రూ.141 కోట్లతో వసతిగృహాల మరమ్మతులు చేస్తున్నామని, 843 మరుగుదొడ్లు నిర్మిస్తున్నామని, 920 వసతిగృహాల్లో ఆర్వోప్లాంట్ల ఏర్పాటు, అన్నింటా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి సవిత తెలిపారు. మెనూ అమలు, వసతిగృహం శుభ్రంగా ఉండేలా చూసేందుకు యాప్ తీసుకొచ్చామని, ప్రతి వసతిగృహ అధికారి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు ఆరోగ్యసమస్యలు ఉంటే వెంటనే తెలుసుకొని, వైద్యసేవలు అందించేందుకు వీలుగా మరొక యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. పిల్లల్లో కుంగుబాటు లాంటివి లేకుండా చూసేందుకు కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆదరణ-3 అమలును త్వరలో ప్రారంభిస్తామని, సీఎం వద్ద జరిగే సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సవిత వెల్లడించారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, అదనపు సంచాలకులు చంద్రశేఖర్‌రాజు, జేడీ తనూజారాణి తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ సన్నిధిలో దీక్షగా ఏర్పాట్లు..!

విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం భవానీదీక్షల విరమణ మహోత్సవానికి ముస్తాబైంది. ఈనెల 11 నుంచి 15 వరకు దీక్షల విరమణ ఉంటుంది. ఇందుకోసం కొన్ని రోజులుగా చేస్తున్న ఏర్పాట్లు బుధవారం పూర్తయ్యాయి. దేవాలయం, పరిసరాల్లో విద్యుత్తు దీపాలు అలంకరించారు. సీతమ్మవారి పాదాల ఘాట్ రోడ్డు, క్యూలైన్, కనకదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు.

– ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

బీటెక్ విద్యార్థి దారుణ హత్య

- ప్రేమ వ్యవహారమే కారణం
- అమ్మాయి కుటుంబ సభ్యులే చంపారని బాధితుల ఆరోపణ


కాకాణి శ్రవణ్ సాయి

జిన్నారం(అమీన్‌పూర్), పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ప్రేమ వ్యవహారం ఓ యువకుడి నిండు ప్రాణం బలి తీసుకుంది. ప్రేమించిన యువతి ఇంటికి వెళ్లిన యువకుడిని... ఆమె కుటుంబ సభ్యులు తర్వాతి రోజు ఆసుపత్రికి తరలించడం... తీవ్ర గాయాలతో ఉన్న అతను అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించడం గమనార్హం. హైదరాబాద్ అమీన్‌పూర్ ఠాణా పరిధిలో దారుణం వెలుగుచూసింది. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన కాకాణి శ్రవణ్ సాయి అలియాస్ శివ(19) మేడ్చల్ జిల్లా మైసమ్మగూడెంలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కుద్బుల్లాపూర్‌లో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అమీన్‌పూర్ పట్టణం బీరంగూడ సృజనలక్ష్మీనగర్‌లో ఉండే యువతి, శ్రవణ్ సాయి ఇద్దరూ కూకట్‌పల్లి ప్రగతినగర్‌లోని పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. అప్పటి స్నేహం తర్వాతి కాలంలో ప్రేమగా మారింది. ప్రస్తుతం ఇద్దరూ వేర్వేరు కళాశాలల్లో చదువుకుంటున్నప్పటికీ తరచూ కలుసుకునేవారు. ప్రేమ వ్యవహారం పెద్దలకు తెలియడంతో గతంలోనే ఇరు కుటుంబాలు.. వారిని హెచ్చరించాయి. 'మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో శ్రవణ్‌సాయి, యువతి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో గొడవ జరిగింది. ఈ ఘర్షణలో యువతి చేయి విరగడంతో అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతోంది. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరిన శ్రవణ్ సాయిని కూడా యువతి కుటుంబ సభ్యులే బుధవారం తెల్లవారుజామున నిజాంపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు' అని సీఐ నరేశ్ తెలిపారు. దాడిలో ఎంత మంది పాల్గొన్నారనే విషయం విచారణలో తేలుతుందన్నారు.

తల్లిదండ్రులు లేరు... పెదనాన్న సంరక్షణలో..

పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన అశోక్, కోమలి దంపతుల ఏకైక కుమారుడు శ్రవణ్ సాయి. చిన్నతనంలోనే తల్లి బలవన్మరణానికి పాల్పడగా..కొన్నేళ్లకు అనారోగ్యంతో తండ్రి కూడా మృతి చెందారు. ఈ పరిస్థితుల్లో నాయనమ్మ వసంత, పెదనాన్న వెంకటేశ్వరరావు సంరక్షణలో ఉంటూ చదువుకుంటున్నాడు. 'పెళ్లి గురించి మాట్లాడదామంటూ యువతి తల్లి.. శ్రవణ్ సాయిని ఇంటికి పిలిపించింది. అనంతరం ఆమె, కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఇంట్లో బంధించి.. విచక్షణ రహితంగా కొట్టారు. హింసించడం వల్లనే మా బిడ్డ చనిపోయాడు' అని వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు ఫిర్యాదు చేశారు. యువకుడి మృతితో అతని స్వగ్రామం పెనుగంచిప్రోలులో విషాద ఛాయలు అలముకున్నాయి.



రిసార్టు కాదు.. ప్రభుత్వ బడి!



అదో మారుమూల గిరి పల్లెలోని బడి. శిథిలావస్థకు చేరింది. పిల్లల్ని పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. పరిస్థితి అర్థం చేసుకున్న అక్కడి ఉపాధ్యాయుడు విరాళాలతో దాన్ని బొమ్మరిల్లులా తీర్చిదిద్దారు. ఇప్పుడు శత శాతం హాజరుతో ఆ గిరుల్లో పిల్లలు సందడి చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలోని గోమంగి, కిముడుపల్లి పంచాయతీలకు కలిపి వన్నాడలోని గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇందులో ఒకటి నుంచి 5 తరగతులు ఉన్నాయి. 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల శిథిలస్థితికి చేరడంతో ఉపాధ్యాయుడు నవీన్‌కుమార్ చొరవ తీసుకున్నారు. తల్లిదండ్రులు, గ్రామస్థులకు అవగాహన కల్పించి విరాళాలు పోగు చేశారు. ఉపాధ్యాయులు, అధికారులు, ఎంఈవోలు, డీఈవో, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వారూ సాయం చేశారు. సమకూరిన రూ.4 లక్షలతో పాఠశాలను బొమ్మరిల్లులా తీర్చిదిద్దారు. గోడలపై చిత్రాలను గీయించారు. వసతులన్నీ కల్పించారు. పిల్లలకు ఆటపాటలతో చదువు చెప్పడం మొదలుపెట్టారు. ఇంకేం... పిల్లలు క్రమం తప్పకుండా రావడం మొదలుపెట్టారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఈ పాఠశాలను చూసి ఎంతో ముచ్చటపడ్డారు. ఉపాధ్యాయుడి కృషిని అభినందించారు. మిగతా వారు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

– న్యూస్‌టుడే, పెదబయలు

నూటికి నూరుశాతం జగనన్నే నా వెనక ఉన్నారు

- ఆయనే నాకు బెయిల్ ఇప్పించారు
- వెల్లడించిన రౌడీషీటర్ అనిల్‌కుమార్

ఈనాడు, అమరావతి: "నాకు అండగా నిలిచింది జగనే. ఆయన లేకపోతే నేను ఇప్పటికీ జైల్లోనే ఉండేవాడిని. నూటికి నూరుశాతం జగనన్నే నా వెనక ఉన్నారు. ఆయనకు బెయిల్ ఇప్పించి బయటకు తీసుకొచ్చిన న్యాయవాదుల బృందం నా కోసం పనిచేసింది. ఏపీలో ఇద్దరి కోసమే ఆ లాయర్లు పనిచేశారు. ఒకటి నాకోసమైతే, రెండో వ్యక్తి రాష్ట్ర నిఘా విభాగం మాజీ అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు" అని రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ తెలిపారు. స్వయంగా అనిల్‌కుమారే ఓ ఇంటర్వ్యూలో ఈ సంగతి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో వైరల్ అవుతోంది. వైకాపా హయాంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను, వారి కుటుంబసభ్యులను నీచాతినీచమైన పదజాలంతో దూషించి, మహిళలని కూడా చూడకుండా ఘోరంగా అవమానించిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు వైకాపా అధినేత జగన్ అండగా నిలవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల వైకాపా కేంద్ర కార్యాలయంలో అనిల్ హడావుడి చేశాడు. ఆ వీడియోలు సైతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

నేడు మాచర్ల కోర్టులో లొంగిపోనున్న పిన్నెల్లి సోదరులు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి గురువారం మాచర్ల జూనియర్ అదనపు సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోనున్నారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెదేపా నాయకులు, సోదరులైన జవ్విశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులు మే 24న హత్యకు గురయ్యారు. గ్రామంలో ఆధిపత్య పోరును తమకు అనుకూలంగా మలచుకుని జంట హత్యలకు పరోక్షంగా సహకరించారని పోలీసులు పిన్నెల్లి సోదరులను ఏ6, ఏ7గా చేర్చి కేసు నమోదు చేశారు. ఈ కేసులో వారు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కింది కోర్టు, హైకోర్టు రద్దు చేయగా.. సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అక్కడ కూడా బెయిల్ పిటిషన్ రద్దయింది. రెండు వారాల్లో లొంగిపోవాలని గత వారం సుప్రీంకోర్టు సూచించింది. దీంతో పిన్నెల్లి సోదరులిద్దరూ ఈ నెల 11న మాచర్ల కోర్టులో ఉదయం 11 గంటలకు లొంగిపోనున్నట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వైకాపా శ్రేణులు మాచర్లకు భారీగా చేరుకోనున్నట్లు తెలిసింది. మాజీ మంత్రులు పేర్ని నాని, అనిల్‌కుమార్ యాదవ్, అంబటి, ద్వితీయ శ్రేణి నాయకులు కోర్టు వద్దకు భారీ ర్యాలీగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మరోవైపు ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు.

ఈశా ఫౌండేషన్ ఉచిత దహన సంస్కార సేవలు


పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

చెన్నై, న్యూస్‌టుడే: ఈశా ఫౌండేషన్ తమిళనాడు ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తున్న 17 శ్మశానవాటికల్లో బుధవారం ఉచిత దహన సంస్కార సేవలను ప్రారంభించింది. సద్గురు మార్గదర్శకాల్లో ఈశా ఫౌండేషన్ రాష్ట్రంలో 15 ఏళ్లుగా పలు ప్రాంతాల్లో శ్మశానవాటికలను నిర్వహిస్తోంది. వీటిలో ప్రాచీన సంప్రదాయాలు, అంత్యక్రియల విధానాలను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్థికంగా వెనుకబడిన తమవారి అంత్యక్రియలను నిర్వహించలేని వారి కోసం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. చెన్నైలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేఎన్ నెహ్రూ ఈ పథకాన్ని ప్రారంభించారు.

బిజినెస్ రూల్స్‌లో సవరణలు చేస్తాం

దీనికి మంత్రులు, నిపుణులతో కమిటీ

- దస్త్రాల టాంపరింగ్‌కు అవకాశం లేకుండా బ్లాక్‌చైన్ విధానం
- జనవరి 15 నాటికి అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోకి తీసుకురావాల్సిందే

ఇష్టానుసారం పనిచేస్తామంటే కుదరదు..

'కొంతమంది అధికారులు నెగెటివ్ ఆలోచనల్లోనే ఉన్నారు. చేపట్టిన పనిని ఎలా ముందుకు తీసుకెళ్లాలని కాకుండా ఎలా నియంత్రించాలని ఆలోచిస్తున్నారు. అలాంటి వాటిని అనుమతించబోం. ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. నిజాయతీగా పనిచేయాలి. ప్రజలకు ఫలితాలు అందాలి. ఇష్టానుసారం పనిచేస్తామంటే కుదరదు.

నిబద్ధతకు మా నాన్నే ఉదాహరణ..

గతంలో ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారు. వ్యక్తి ప్రవర్తన వల్ల అతని పరపతి పెరుగుతుంది. ఇందుకు మా తండ్రే నాకు ఉదాహరణ. అప్పట్లో భద్రత కోసం మా గ్రామంలోని వారందరూ డబ్బు తెచ్చి ఆయన దగ్గర పెట్టేవారు. నిబద్ధత ఎలా పనిచేస్తుందనే దానికి ఇది ఉదాహరణ.

ఈనాడు, అమరావతి: మనం ప్రజల కోసం పనిచేస్తున్నామని, వారు మెచ్చేలా పాలన అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.. మనం పనిచేస్తున్నది వారికి సర్వీస్ చేయడానికేనని, వారిని వేధించడానికి కాదనే విషయం గుర్తించాలని స్పష్టం చేశారు. 'దస్త్రాలను పరిష్కరించడమంటే (క్లియరెన్స్) దేశాన్ని మోస్తున్నట్లు కొంతమంది అధికారులు భావిస్తుంటారు. హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ చేయాలి. రోజుకు నాలుగైదు దస్త్రాలు మించి రావు. కొన్ని శాఖల్లో దస్త్రాల్ని కావాలని క్రియేట్ చేస్తున్నారు. వీటికి స్వస్తి పలికేందుకు అవసరమైతే బిజినెస్ రూల్స్‌ను సవరణ చేసి సరళీకరిస్తాం. మంత్రులు, నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తాం' అని సీఎం తెలిపారు. సచివాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'రాబోయే రోజుల్లో ప్రతి దస్త్రానికి లింక్ ఫైల్ ఉంటుంది. బ్లాక్‌చైన్ విధానం తీసుకురాబోతున్నాం. ఇక టాంపరింగ్ చేసే దానికి అవకాశముండదు. ఇది అమల్లోకి వస్తే రెవెన్యూ రికార్డులకు భద్రత పెరుగుతుంది. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత సంబంధిత పత్రాలను కొరియర్ సర్వీస్‌లోనే వినియోగదారులకు పంపే విధానం తీసుకురాబోతున్నాం. పట్టాదారు పాసుపుస్తకాలు ప్రింటింగ్ సెంటర్ నుంచి రెవెన్యూ కార్యాలయానికి రాకుండా నేరుగా రైతులకు కొరియర్ సర్వీస్ ద్వారా చేరే విధానాన్ని తీసుకొస్తున్నాం' అని పేర్కొన్నారు.

అనుకున్న ఫలితాలు సాధించాల్సిందే..

'జనవరి 15 నాటికి అన్ని సేవలు ఆన్‌లైన్‌లో తీసుకురావాలి. ఇందులో ఏ శాఖకు మినహాయింపు లేదు. దేవాదాయ శాఖ, రెవెన్యూ శాఖల పనితీరు ఆశించిన స్థాయిలో లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రచురితమైతే వాటిని విశ్లేషించాలి. దీనికోసం మంత్రిత్వ శాఖలకు కేటాయించిన వారు సమర్థంగా పనిచేయడం లేదు. భవిష్యత్తులో దీనికి కూడా రేటింగ్ ఇచ్చి పర్యవేక్షిస్తాం. వచ్చే వార్తల్లోని వాస్తవాలను గుర్తించి వ్యవస్థలో లోపాలుంటే వాటిని సరిదిద్దుదాం.'



అధికారుల పనితీరుపై సమాచారం..

- తొలిఏడాది జీఎస్‌డీపీ 12.02% వృద్ధిరేటు సాధించాం. ఇప్పుడు రెండో త్రైమాసికానికి 11.28% వచ్చింది. ఈ ఏడాది 17% లక్ష్యంగా పెట్టుకున్నాం.
- పోటీ తత్వం అందరికీ సమానం. ఏ అధికారి ఎలా పనిచేస్తున్నారో.. ఒక్క క్లిక్ ద్వారా తెలుసుకునే వ్యవస్థల్ని ఏర్పాటు చేస్తున్నాం.
- డేటా లేక్ సిద్ధమైంది. దీంతో రాష్ట్ర, కేంద్ర శాఖల సమాచారాన్ని సమీకృతం చేశాం. ఏ అధికారి ఏమనుకుంటున్నారో కూడా అందులో ఉంటుంది.
- 'వైకల్యం లేకపోయినా కొంతమంది దివ్యాంగుల పింఛన్లు తీసుకుంటున్నారు. అనర్హులకు ప్రభుత్వ ఫలాలు అందకూడదు. అదే సమయంలో అర్హులెవరికీ ప్రభుత్వ చేయూత దూరం కాకూడదు. గతంలో వివిధ శాఖల్లో జరిగిన అవకతవల్ని సరిచేయాల్సిన అవసరముంది. దీనికోసం సమగ్ర ప్రాజెక్టును అమలు చేస్తున్నాం.


సమావేశానికి హాజరైన అధికారులు

అన్ని శాఖలు ఆడిటింగ్..

- 8-10 ఏళ్లుగా ఆడిటింగ్ చేయని శాఖలున్నాయి. అన్ని శాఖల్ని ఆడిటింగ్ చేయబోతున్నాం.
- గత ప్రభుత్వంలో కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల్ని మళ్లించారు. దీన్ని కట్టడి చేసేందుకు కేంద్రం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందంటే అప్పట్లో పరిస్థితి ఏంటో అర్థమవుతుంది.
- ఈ ఏడాది గరిష్ఠంగా కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకోవాలి.
- ఆర్టీజీఎస్, ప్రణాళికశాఖ జనాభా లెక్కల్ని రియల్ టైంలో నిర్వహించాలి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి. మార్చి నాటికి జనాభా లెక్కల అప్‌గ్రేడేషన్ పూర్తి చేయాలి.

మైక్రో గ్రిడ్ విధానం..

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి సగటు యూనిట్ విద్యుత్తు కొనుగోలు ధర రూ. 5.19 ఉండగా.. దాన్ని రూ.4.92 పైసలకు తగ్గించాం. ఈ ఏడాది రూ.4.80కి రావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ఏడాది విద్యుత్తు ఛార్జీలు పెంచబోం. ఒకప్పుడు యూనిట్ రూ.14 పెట్టి కొనుగోలు చేశారు. ఇప్పుడు సగటు కొనుగోలు ధర రూ.4.80 అయితే దానికే కొనుగోలు చేస్తున్నాం.
- సబ్‌స్టేషన్ యూనిట్‌గా మైక్రో గ్రిడ్ విధానాన్ని తీసుకురాబోతున్నాం. ప్రొద్యూసర్ కమ్ కన్జ్యూమర్ విధానంలో ముందుకు వెళుతున్నాం. దీన్ని ప్రతి ఇల్లు, పంపుసెట్లలో అమలు చేయబోతున్నాం. అక్కడ వీలు కాని పక్షంలో సబ్‌స్టేషన్‌లో విద్యుత్తును జనరేట్ చేస్తాం. ట్రాన్స్‌మిషన్ లాసెస్ సున్నాగా ఉంటుంది. ఇవన్నీ అమలు చేస్తే 5 ఏళ్లలో విద్యుత్తు కొనుగోలు ధర రూ.4కు తగ్గుతుంది.

భూగర్భ జలాలు పెంచితే రూ.5 వేల కోట్లు మిగులు..

ప్రస్తుతం సగటున 6.07 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి. వర్షాకాలం తర్వాత 3 మీటర్లు.. వర్షాకాలానికి ముందు 8 మీటర్ల లోతులో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. భూగర్భ జలాలను తోడేందుకు రూ.10 వేల కోట్లు విద్యుత్తు రూపంలో ఖర్చు పెడుతున్నాం. భూగర్భ జలాలను పెంచితే సగం ఖర్చు తగ్గుతుంది.

పింఛన్ల పంపిణీపై 88.5 శాతం సంతృప్తి

- అన్న క్యాంటీన్లు భేష్ • బస్టాండ్లలో సౌకర్యాలు అధమం
- అభిప్రాయ సేకరణలో ప్రజల మనోగతం

ఈనాడు, అమరావతి: పింఛన్ల పంపిణీ, దీపం గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలపై అత్యధిక ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారు. పింఛను పంపిణీలో అవినీతి లేదని 88.5% మంది సమాధానమిచ్చారు. సగటున చూస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వివిధ సేవలకు సంబంధించి సంతృప్త స్థాయి 70 శాతానికి పైగా ఉంది. 2024 జూన్ నుంచి వివిధ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన సేవలపై ప్రభుత్వం క్యూఆర్ కోడ్, ఐవీఆర్‌ఎస్‌తోపాటు వివిధ మార్గాల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఇందులో దీపం, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి) కార్యక్రమాలపైనా అధిక స్పందన లభించింది.

- ఆర్టీసీ బస్టాండ్లలో సౌకర్యాలపై అధిక శాతం ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లతో పోలిస్తే విద్యుత్ అంతరాయాలు, వోల్టేజీ సమస్యలు పెరిగాయి.
- పట్టణాలు, పంచాయతీల్లో చెత్త సేకరణ అంతంతమాత్రంగానే ఉందని సర్వేలో తేలింది.
- దేవాలయాల్లో ప్రసాదం నాణ్యంగా ఉందని.. సంతృప్తికరంగా దర్శనం చేసుకుంటున్నామని అధికశాతం మంది చెప్పారు.

ప్రభుత్వ సేవలపై

కాలం	సంతృప్తి%	అసంతృప్తి%
సంవత్సరం (2024జూన్-2025మే)	71.57	28.43
త్రైమాసికం (గత 90రోజులు)	74.36	26.64
నెలలో (గత 30 రోజులు)	68.98	31.02

27 కొత్త హోటళ్లకు అనుమతులు

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం 18 నెలల్లో రాష్ట్రంలో 27 కొత్త క్లాసిఫైడ్ హోటళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం కింద అనుమతులిచ్చిన ఈ హోటళ్ల నిర్మాణం పూర్తయితే కొత్తగా 4,597 గదులు అందుబాటులోకి రానున్నాయి. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, పలు రాయితీలతో పర్యాటక విధానం 2024-29 ప్రకటించడం ద్వారా ఈ రంగంలో గత 50 ఏళ్ల పురోగతి ఒక్క ఏడాదిలోనే సాధించినట్లు అధికారులు వెల్లడించారు.

2025-26లో దేశవ్యాప్తంగా కొత్తగా 11,272 గదులు అందుబాటులోకి వచ్చేలా వివిధ రాష్ట్రాల్లో హోటళ్లకు అనుమతులిచ్చారు. వీటిలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 4,597 కొత్త గదులు వచ్చేలా హోటళ్ల నిర్మాణానికి అనుమతులిచ్చినట్లు భారత ఆతిథ్య రంగం నివేదికలు చెబుతున్నాయని రాష్ట్ర పర్యాటకశాఖ వెల్లడించింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త హోటళ్ల విధానం ఇలా..

మొత్తం అనుమతులిచ్చినవి	: 27
ప్రారంభించినవి: 3 (393 గదులు అందుబాటులోకి వచ్చాయి).	
పనులు జరుగుతున్నవి	: 12
శంకుస్థాపనకు సిద్ధంగా ఉన్నవి	: 5
భూములు కేటాయించాల్సినవి	: 7

మిగతా ప్రాజెక్టులు వెంటనే ప్రారంభించండి: మంత్రి దుర్గేష్



త్వరితగతిన ప్రాజెక్టుల నిర్మాణ పనులు ప్రారంభిస్తే ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొత్త ప్రాజెక్టులపై పర్యాటక శాఖతో ఒప్పందం చేసుకున్న వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన సచివాలయంలో బుధవారం సమావేశమయ్యారు. 'పెట్టుబడిదారులకు ఇతర ప్రభుత్వ శాఖలతో సమస్యలు ఉంటే సమాచారమివ్వండి. వాటిని పరిష్కరించి త్వరితగతిన అనుమతులిప్పిస్తాం' అని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

మీరూ ముస్తాబు చేయాలి

అధికారులతో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఉత్తమ విధానాలను అమల్లోకి తీసుకురావాలని వివిధ శాఖల కార్యదర్శులు, అధిపతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మన్యం జిల్లాలో అక్కడి కలెక్టర్ అమలు చేస్తున్న 'ముస్తాబు' కార్యక్రమం గురించి సీఎం ప్రస్తావించారు. 'ముస్తాబు అనేది సింపుల్ ప్రాక్టీస్.. ఇందులో ప్రతి విద్యార్థికీ ఒక దువ్వెన, అద్దం ఇస్తున్నారు. తరగతికి ఇద్దరు చొప్పున లీడర్లను పెట్టారు. పిల్లలు ఉదయాన్నే తరగతిలోకి వచ్చేటప్పుడు వారు ముఖం కడుక్కున్నారా? తల దువ్వుకున్నారా? యూనిఫాం ఉతక్కుని వేసుకొచ్చారా? బూట్లు శుభ్రంగా ఉన్నాయా ఇలాంటివన్నీ ఆ లీడర్లు పరిశీలిస్తారు. అన్నీ సరిగా ఉంటే లోపలికి అనుమతిస్తారు. లేనివారిని పక్కన నిలబెడతారు. తర్వాత వారిని ముస్తాబు రూంలోకి తీసుకువెళ్లి, రెడీ చేసి క్లాస్‌కు పంపుతారు. భోజనానికి ముందు చేతులు కడుక్కోవడం లాంటివీ చేయిస్తున్నారు. కేవలం రెండు నెలల్లోనే ఈ ముస్తాబు బాగుంది అని పిల్లల్లోనే చర్చ జరుగుతోంది' అని సీఎం తెలిపారు. 'నేను మొదటిసారి సీఎం అయినపుడు గిరిజన పాఠశాలల్లో తరగతి గది ముందు అద్దాలు పెట్టించా.. పిల్లలంతా వాటిలో తమను చూసుకుని సరిచేసుకుని లోపలికి వెళ్లేవారు.. అని ప్రధానమంత్రి నాతో ఒకసారి చెప్పారు. ఇలా డబ్బుతో సంబంధం లేకుండా కొన్ని బెస్ట్ ప్రాక్టీస్‌లు చేయవచ్చు. ఇలాంటి మంచి విధానాలను మీరందరూ వర్కవుట్ చేసుకుని రావాలి' అని సీఎం అధికారులను ఆదేశించారు.

వ్యవసాయ రంగ సూచికల్లో పశ్చిమగోదావరి జిల్లా అగ్రస్థానం

ఈనాడు, అమరావతి: వ్యవసాయ రంగ పనితీరు సూచికల్లో పశ్చిమగోదావరి జిల్లా 89 స్కోర్‌తో అగ్రస్థానంలో నిలిచింది. ఎన్టీఆర్ 82, కృష్ణా 80, శ్రీసత్యసాయి 80, నంద్యాల 78 స్కోర్లతో తర్వాత స్థానాల్లో ఉన్నాయి. 'ఎ' గ్రేడ్‌లో 7 జిల్లాలు, 'బి' గ్రేడ్‌లో 19 జిల్లాలు ఉన్నాయి. అన్నమయ్య 53, చిత్తూరు 59, శ్రీకాకుళం 61 స్కోర్లకు పరిమితమై అట్టడుగున నిలిచాయి.

- కాలువలకు సాగునీరు ముందుగా విడుదల చేయడంతో ఈ ఏడాది ధాన్యం ఉత్పత్తి పెరిగింది. గతేడాదితో పోలిస్తే సగటున 23.59% అధిక ఉత్పత్తి లభిస్తుందని అంచనా. దూది (పత్తి) ఉత్పత్తి కూడా గతేడాది కంటే 30.97% పెరుగుతుందని పేర్కొన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో అధిక ఉత్పత్తి లభించనుంది.
- మొక్కజొన్న ఉత్పత్తిలో ప్రకాశం, పల్నాడు జిల్లాలు తొలి స్థానాల్లో నిలిచాయి.

ప్రజలకు నచ్చేలా పాలన లేకుంటే... బంగారం ఇచ్చినా ఉపయోగం లేదు

- ఎవరు తప్పు చేసినా ఆ ప్రభావం ప్రభుత్వంపై ఉంటుంది
- రుణాల రీషెడ్యూలు వల్ల రూ.7,000 కోట్ల ఆదా
- కేంద్ర పథకాల నిధులు ఎందుకు ఖర్చు చేయరు?

మంత్రులు, అధికారులకు సీఎం చంద్రబాబు చురకలు

ఈనాడు, అమరావతి: 'ప్రజలకు నచ్చేలా పాలన అందించకపోతే.. వారికి బంగారం ఇచ్చినా ఉపయోగం లేదు. మన పరిపాలన వారికి నచ్చాలి. వచ్చే మూడు నెలల్లో అన్ని శాఖలు, అందరు అధికారులు, మంత్రులు ప్రజల సంతృప్తి 80% దాటేలా పనితీరు మలుచుకోవాలి. పౌరసేవలను మరింత మెరుగుపరచాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు డిసెంబర్ 20 లోపు ఖర్చుచేయాల్సి ఉన్నా ఎందుకు చేయట్లేదు? మంత్రులు ఏం చేస్తున్నారు? వారు, అధికారులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలి. లిఖితపూర్వక వివరణలు కోరే పరిస్థితిని మంత్రులు, అధికారులు తెచ్చుకోవద్దు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఏ ఒక్క వ్యక్తి తప్పు చేసినా ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుంది. అది అధికారులైనా, ఎన్డీయే నాయకులైనా సరే. రెండువైపులా సుపరిపాలన ఉండాలి' అన్నారు. సచివాలయంలో బుధవారం మంత్రులు, ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన, ముఖ్య కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన సమావేశంలో సీఎం వివిధ సందర్భాల్లో అనేకాంశాలపై మార్గనిర్దేశనం చేశారు. ఆయా అంశాల సమీక్ష సందర్భంగా మధ్యలో సమాచారం తెలుసుకోవడంతో పాటు ఒక్కో సందర్భంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిదిద్దుకోవాలంటూ ఉద్బోధించారు. ఆ వివరాలు ఇవి...

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ బాగానే ఉంది. ప్రజలు అవినీతి లేదంటున్నారు. ఇవన్నీ బాగున్నాయి. అధికారుల ప్రవర్తన విషయానికి వచ్చేసరికి 88% సంతృప్తి మాత్రమే ఉంది. ఆ తీరు మార్చుకోవాలి.
- అన్నక్యాంటీన్ల ప్రారంభంలో సంతృప్తిస్థాయి ఎక్కువ ఉంది. ఇప్పుడు 80% వచ్చింది. మిగిలిన అంశాలను పరిశీలిస్తే 80%, 60%, 50%, కొన్ని 45% సంతృప్తిస్థాయిలే కనిపిస్తున్నాయి.
- మీ అందరికీ డేటా అందుబాటులో ఉంది. ప్రజలు ఎవరివల్ల అసంతృప్తితో ఉన్నారనే సమాచారం ఉంది. ఎక్కడ గరిష్ఠంగా, ఎక్కడ కనిష్ఠంగా ఉందో కూడా సమాచారం అందిస్తున్నాం. అందరూ అధ్యయనం చేసి అన్నింటిలో 80% చేరుకోవాలి. క్రమేణా 90%కు చేరాలి.
- హాస్టళ్లు, దేవాలయాల్లో కూడా ఏవి బాగున్నాయో, ఏవి బాగోలేవో ప్రజలు చెప్పిన డేటా ఉంది. వెళ్లి పరిశీలించి సరిదిద్దండి.
- ప్రతి నెలా మనం శాటిలైట్ డేటా తీసుకుంటున్నాం. ఆక్రమణలు, పంటల సాగు.. ఇలా ఎన్నో అంశాలు మనం ఇక్కడి నుంచే తెలుసుకోవచ్చు. ఈ డేటాను విశ్లేషించగలిగే నాయకత్వం అధికారుల్లో ఉండాలి.

20 లోగా కేంద్రనిధులు ఖర్చుచేయాలి

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు డిసెంబర్ 20 లోపు రూ.1,171 కోట్లు ఖర్చుచేయాలి. ఖర్చుచేసిన ధ్రువీకరణ పత్రాలను వెంటనే కేంద్రానికి పంపాలి. ఈ ఏడాది కేంద్రం నుంచి ఇంకా అదనంగా నిధులు తెచ్చుకోవాలి.

రుణాల రీషెడ్యూలుతో రూ.7,000 కోట్ల ఆదా

అధికారులకు ఆర్థిక విషయాలు తెలియకపోవచ్చు. కానీ ప్రొసీజర్ తెలుసుకోవాలి. బ్యాంకులను సంప్రదించి అవసరమైన ప్రక్రియ చేపట్టకపోవడం వల్ల పాత సర్కారులో వడ్డీలు పెరిగిపోయాయి. ఆ పాలకుల వల్ల రాష్ట్రానికి ఉన్న బ్రాండ్ దెబ్బతిని 12% వడ్డీకి రుణాలు తెచ్చారు. ఇప్పుడు రుణాలను రీ షెడ్యూలు చేసి ప్రభుత్వసొమ్ము ఆదా చేస్తున్నాం. మొదటి ఏడాది రుణాల రీషెడ్యూలు వల్ల రూ.512 కోట్లు ఆదా అయింది. మొత్తం రుణాలు రీషెడ్యూలు చేస్తే రూ.7,000 కోట్ల వరకు ఆదా అవుతుందని అంచనా.


సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు, అధికారులు

కేంద్ర నిధులున్నా ఖర్చు చేయలేరా?

- మంత్రులు వచ్చి ఏడాదయింది.. ఇంకా తెలియదంటే కుదరదు
- ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఇచ్చిన నిధులు ఖర్చు చేయడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులు, మంత్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలే వనరులు లేక అవస్థలు పడుతుంటే ఇలా చేస్తే ఎలా అని మండిపడ్డారు. మంత్రులు వచ్చి ఏడాదయింది.. ఇంకా తెలియదంటే కుదరదని వ్యాఖ్యానించారు. ప్రతి అంశంలో కలగజేసుకుని పరిష్కరించాలని, కార్యదర్శుల సహకారం తీసుకోవాలని చెప్పారు. అవసరమైతే మంత్రులు, కార్యదర్శులు దిల్లీకి వెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలని నిర్దేశించారు. మరో 10 రోజుల్లో కేంద్రం ఇచ్చిన నిధుల్లో దాదాపు రూ.1,200 కోట్లు ఖర్చు చేయాలని, ఆ నిధులు ఖర్చు చేయకపోతే సాస్కీ కింద మరో రూ.1,300 కోట్లు ఇచ్చేందుకూ కేంద్రం వెనకాడుతుందని అధికారులు సీఎంతో చెప్పారు. దీంతో ముఖ్యమంత్రి సుతిమెత్తగా మాట్లాడుతూనే హెచ్చరికలు జారీ చేశారు. ఇలా చేస్తే మీ పనితీరు నివేదికల్లో ఈ అంశాలు చేర్చాల్సి ఉంటుందనీ పేర్కొన్నారు. కేంద్రం నుంచి ఈ ఏడాది ఎవరు అదనంగా నిధులు తీసుకువస్తారో చూస్తానని చెప్పారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు స్పర్శ్, సింగిల్ నోడల్ ఖాతా ద్వారా రెండు విధానాల్లో అమలవుతున్నాయి.

ఆర్థికశాఖ అధికారులు ప్రవీణ్, రోనాల్డ్ రాస్ వెల్లడించిన వివరాల ప్రకారం నిధుల మంజూరు, ఖర్చు తీరు

అంశం	స్పర్శ్ (నిధులు రూ.కోట్లలో)	సింగిల్ నోడల్ ఖాతా (నిధులు రూ.కోట్లలో)
మొత్తం పథకాలు	140	55
2025-26లో కేంద్రం కేటాయింపులు	11,372	3,801
ఇప్పటి వరకు మంజూరు	5,286	4,261 (రాష్ట్రవాటాతో కలిపి)
చేసిన ఖర్చు	2,667	95%
ఇంకా ఖర్చు చేయాల్సిన మొత్తం	2,618	955.42

'డిజి వెరిఫై'తో సర్టిఫికెట్ల తనిఖీ సులభం

ఈనాడు, అమరావతి: 'ఆర్టీజీఎస్‌లో ప్రత్యేకంగా ''డిజి వెరిఫై'' అనే ఏర్పాటు చేశాం. ఏ ధ్రువపత్రాలైనా ఇక ఈ విభాగంలో సులభంగా.. వేగంగా తనిఖీ చేయవచ్చు. అవి అసలైనవో కావో తెలుసుకోవచ్చు. ఇందు కోసం ఆర్టీజీఎస్ ప్రత్యేక సదుపాయం కల్పిస్తోంది' అని ఐటీ, ఆర్టీజీ శాఖల కార్యదర్శి కాటమనేని భాస్కర్ చెప్పారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు సమర్పించే ధ్రువపత్రాలను, విద్యార్థుల సర్టిఫికెట్లను తనిఖీ చేయాలన్నా ఈ సదుపాయాన్ని ఉపయోగించుకుంటే ఎంతో వేగంగా పరిశీలన పూర్తవుతుందన్నారు. ఏపీపీఎస్సీ వంటి సంస్థలకు ఉద్యోగాలు ఇచ్చే క్రమంలో ధ్రువీకరణ పత్రాల తనిఖీకి చాలా సమయం పడుతోందని, ఇక ఆ అవసరం ఉండదని డిజి వెరిఫై ద్వారా సులభంగా ఈ ప్రక్రియను పూర్తిచేయవచ్చన్నారు. అన్ని ప్రభుత్వశాఖలూ ఈ సదుపాయాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు.



వాయిదా మనస్తత్వానికి ఇలా చెక్ పెట్టండి

వాయిదా మనస్తత్వానికి విరుగుడు ఏంటంటే మనం మొదటి అడుగు వేయడమే. అందుకోసం మీ రోజువారీ పనుల జాబితాను ఇలా మార్చుకోండి:

- 'వ్యాసం రాయాలి' అన్నది ఈరోజు లక్ష్యమైతే, 'ఎట్టి పరిస్థితుల్లోనూ మొదటి వాక్యం పూర్తిచేయాలి' అని జాబితాలో రాసుకోండి.
- 'ఇల్లు శుభ్రం చేసుకోవాలి' అని కాకుండా 'కిచెన్ నుంచి క్లీనింగ్ మొదలుపెట్టాలి' అని నిర్దేశించుకోండి.
- 'రన్నింగ్‌కు వెళ్లాలి' అని కాదు, 'నిద్రలేచిన వెంటనే రన్నింగ్ షూస్ వేసుకోవాలి' అన్నది తప్పనిసరి ప్రక్రియగా పెట్టుకోండి.

– ఫెర్నాండో గుటెరెజ్, ఇన్వెస్టర్

వివేకా హత్యకేసులో సాక్షికంగా తదుపరి దర్యాప్తునకు అనుమతి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణల నేపథ్యంలో అర్జున్‌రెడ్డి, కిరణ్‌యాదవ్‌ల ఫోన్ సంభాషణ (సీడీఆర్)పై దర్యాప్తు నిర్వహించి అనుబంధ అభియోగపత్రం దాఖలుచేయాలంటూ సీబీఐకి న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. కోర్టు మార్గదర్శకాల ప్రకారం సీబీఐ దర్యాప్తు కొనసాగించాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే సునీత సందేహాలు వ్యక్తం చేసిన అందరిపైనా దర్యాప్తునకు అనుమతించడానికి నిరాకరించారు. ఈ దర్యాప్తును నెలలోగా పూర్తిచేయాలని గడువు విధించినట్లు సమాచారం. పూర్తి వివరాలకు తీర్పు ప్రతి వెలువడాల్సి ఉంది.

సునీత లేవనెత్తిన సందేహాలివీ..

''హత్య జరిగిన రోజు అవినాష్‌రెడ్డి ఫోన్ వాడుకలోనే ఉందని, ఆయన జగన్‌కు చెప్పి ఉండవచ్చని సీబీఐ సందేహం వ్యక్తం చేసి వదిలేసింది. జగన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారా లేదా అన్న కోణంలో దర్యాప్తు జరగలేదు. మాజీ ఐఏఎస్ అజేయ కల్లం తన వాంగ్మూలంలో.. 5 గంటలకు మేనిఫెస్టోపై చర్చ జరుగుతుండగా ఫోన్ వచ్చిందని భారతి మనిషిని పంపడంతో జగన్ లోపలికి వెళ్లారని, తిరిగి వచ్చాక వివేకా చనిపోయినట్లు చెప్పారని వెల్లడించారు. భారతికి సమాచారం ఎలా వచ్చిందన్న దానిపై దర్యాప్తు కొనసాగించలేదు. సునీల్‌యాదవ్ సీడీఆర్‌ను పరిశీలిస్తే అవినాష్‌రెడ్డితో ఉన్నట్లు తెలుతోంది. సునీల్‌యాదవ్ స్నేహితుడు భరత్‌యాదవ్ పరస్పర విరుద్ధమైన వాంగ్మూలాలు ఇచ్చారు. మొదట వజ్రాల వ్యాపారంలో డబ్బు వస్తూనే ఇస్తానంటూ రూ.16లక్షలు తీసుకున్నట్లు చెప్పి, తర్వాత సునీత, ఆమె భర్త డబ్బులిచ్చారని మరోరకంగా వాంగ్మూలం ఇచ్చారు. భరత్‌యాదవ్ పాత్రతో పాటు దస్తగిరితో ఆర్థిక వ్యవహారాలున్న న్యాయవాది ఓబుళరెడ్డి పాత్రపై దర్యాప్తు కొనసాగించలేదు. హత్య జరిగిన రోజు, తర్వాత అవినాష్‌రెడ్డి, సునీల్‌యాదవ్‌ల మధ్య జరిగిన సంభాషణలపై దర్యాప్తు జరగాలి. 2019 మార్చి 2019న అవినాష్‌రెడ్డి ఎక్కడ ఉన్నారో ఆరా తీయాలి. వివేకా హత్య విషయంలో ఆయన పీఏ కృష్ణారెడ్డి పాత్రపై సందేహాలున్నాయి. వాటిపై లోతైన దర్యాప్తు జరపాలి. సంఘటనా స్థలంలో కృష్ణారెడ్డి సోదరుడు మనోహర్‌రెడ్డి ఉన్నారు. సాక్ష్యాల చెరిపివేతలో ఎవరెవరి పాత్ర ఉందో దర్యాప్తు చేయలేదు. నేరాన్ని అంగీకరిస్తే భాస్కరరెడ్డి, అవినాష్‌రెడ్డి రూ.10 కోట్లు ఇస్తామన్నారని గంగాధర్‌రెడ్డి వాంగ్మూలం ఇచ్చారు. ఈ విషయాలన్నింటిపై దర్యాప్తుచేయాలి'' అని సునీత తన పిటిషన్‌లో కోరారు.

అర్జున్‌రెడ్డికి వచ్చిన సమాచారం ఏంటి?

అర్జున్‌రెడ్డికి 2019 మార్చి 15న తెల్లవారుజామున 1.42 గంటల సమయంలో అర్జున్ అన్నా వివేకం సర్ అని, సర్ చనిపోయాడు అన్నా అంటూ కిరణ్‌యాదవ్ నుంచి మెసేజ్ వచ్చినట్లు సీబీఐ వెల్లడించింది. అనుమానాలకు ఆస్కారమిస్తున్న ఈ మెసేజ్‌పై ఎలాంటి దర్యాప్తు జరపలేదన్నది సునీత ఆరోపణ. అందువల్ల వీరిద్దరి మధ్య సీడీఆర్‌పై దర్యాప్తు చేపట్టాలంటూ సీబీఐ కోర్టు ఆదేశాలు జారీచేసింది.

అమెజాన్ పెట్టుబడులు రూ.3.15 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ(ఏఐ)లో వ్యాపారాన్ని విస్తరించడం కోసం వీటిని వినియోగించనుంది.

పోటీని తట్టుకోవడం కోసమే

కృత్రిమ మేధ(ఏఐ), లాజిస్టిక్స్ మౌలిక వసతులపై 2030లోగా అమెజాన్ పెట్టుబడులను పెట్టనుంది. తద్వారా భారత్‌లో 10 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని పేర్కొంది. వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్‌తో పాటు దేశీయ సంస్థలైన జియోమార్ట్, బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్ జెప్టోలకు పోటీనివ్వడం కోసం అమెజాన్ ఇక్కడ పెట్టుబడులు పెంచుతోంది. 2010 నుంచి ఇప్పటిదాకా 40 బిలియన్ డాలర్ల (సుమారు రూ.3.60 లక్షల కోట్లు)ను అమెజాన్ వెచ్చించింది. 2023లోనూ 26 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.34 లక్షల కోట్లు) పెట్టుబడులను ప్రకటించింది. తాజా పెట్టుబడులతో భారత్‌లోని విక్రేతల ఎగుమతులు 2030 కల్లా 80 బిలియన్ డాలర్ల (సుమారు రూ.7.20 లక్షల కోట్లు)కు చేరడానికి ఉపయోగపడతాయి. ప్రస్తుత ఎగుమతుల విలువ 20 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.80 లక్షల కోట్లు)గా ఉంది. 'భారత వృద్ధికి మేం ఒక ఉత్ప్రేరకంగా ఉండడాన్ని కొనసాగిస్తాం. కోట్ల మంది భారతీయులకు ఏఐని దగ్గర చేస్తాం' అని అమెజాన్ హెడ్ ఆఫ్ ఎమర్జింగ్ మార్కెట్స్ అమిత్ అగర్వాల్ అన్నారు.

మెస్సితో ఫొటోకు రూ.10 లక్షలు

• 100 మందికి మాత్రమే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ పర్యటనకు రానున్న ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి (అర్జెంటీనా)తో అభిమానులు ప్రత్యేకంగా ఫొటోలు తీసుకోవచ్చు. అయితే అందుకు బాగానే ఖర్చవుతుంది. ఒక్క ఫొటోకు రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. 'ద గోట్ టూర్' నిర్వాహక కమిటీ (హైదరాబాద్) సలహాదారు పార్వతిరెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో ఆ మేరకు వెల్లడించారు. 'ఈ నెల 13న సాయంత్రం మెస్సి హైదరాబాద్‌లో అడుగు పెడతారు. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే 'మెస్సితో మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో ఆయనతో ఫొటోలు దిగొచ్చు. ఒక్కో ఫొటోకు రూ.9.95 లక్షలు (జీఎస్టీ అదనం) చెల్లించాల్సి ఉంటుంది. డిస్ట్రిక్ట్ యాప్‌లో ఆ టికెట్లు అందుబాటులో ఉన్నాయి. 100 మందికి మాత్రమే ఫొటోలు తీసుకునే అవకాశం ఉంటుంది' అని వెల్లడించారు.

కొమరేపల్లి పంచాయతీలో జనన ధ్రువపత్రాలన్నీ రద్దు

- రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు
- 'ఈనాడు' కథనాలకు స్పందన



ఈనాడు, పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా అగళి మండలంలోని మారుమూల గ్రామమైన కొమరేపల్లి పంచాయతీలో జారీ అయిన 3,981 జనన ధ్రువపత్రాలను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శ్రీసత్యసాయి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి ఫిరోజ్‌బేగంకు జనన, మరణాల నమోదు శాఖ చీఫ్ రిజిస్ట్రార్ ఆదేశాలిచ్చారు. దాదాపు 1500 జనాభా కూడా లేని పంచాయతీలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు 31 వరకు వేల సంఖ్యలో జనన ధ్రువపత్రాలు జారీ కావడంపై సర్టిఫి'కేటుగాళ్లు' శీర్షికన ఈ నెల 3న, 'విజయవాడలో తీగలాగితే.. కొమరేపల్లిలో కదిలిన డొంక' శీర్షికన ఈ నెల 4న, 'భారీగా జనన ధ్రువపత్రాల జారీ' శీర్షికన ఈ నెల 9న 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో జిల్లా వైద్యాధికారిణి స్పందించారు. దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని వైద్యశాఖ జిల్లా గణాంక అధికారి కళాధర్‌ను ఆదేశించారు. ఆయన తన బృందంతో విచారణ చేపట్టారు. కొమరేపల్లి పంచాయతీ ఐడీ, పాస్‌వర్డ్‌ను దుర్వినియోగం చేసి పెద్దసంఖ్యలో జనన ధ్రువపత్రాలు జారీ చేశారని, అవన్నీ నకిలీవేనని నివేదిక సమర్పించారు. ఉన్నతాధికారులకు నివేదికను పంపడంతో చర్యలు తీసుకున్నారు. అలాగే ఎక్కువ సంఖ్యలో జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేసిన పంచాయతీల్లోనూ పునఃపరిశీలన చేయాలని, బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ తరహా అనుమానాలు వ్యక్తమవుతున్న 14 జిల్లాల్లోనూ పునఃపరిశీలన చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీలో వైద్యకళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోండి

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు వైకాపా వినతి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని వైకాపా పార్లమెంటరీ పార్టీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తిచేసింది. ఆ పార్టీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, పీవీ మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, మద్దిల గురుమూర్తి, జి.తనూజారాణి, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మేడా రఘునాథరెడ్డిలు ఆర్థిక మంత్రిని బుధవారం పార్లమెంటులో కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ఇందుకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో ఇప్పటి వరకు కోటి మందికిపైగా సంతకాలు చేశారని, ఆ సంఖ్య ఇంకా పెరుగుతోందని చెప్పారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే వైద్య విద్య అందరికీ అందుబాటులో ఉండదని, దాని వల్ల రాష్ట్రంలోని పేదలు వైద్యులు అయ్యే అవకాశాన్ని కోల్పోతారని పేర్కొన్నారు. అందువల్ల దేశంలో ఎక్కడా వైద్య కళాశాలలను ప్రైవేటీకరించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తే.. అది రాష్ట్ర వ్యాప్తంగా వైద్యసేవలను బలహీనపరుస్తుందని, సామాన్యులకు వైద్యం దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల కేంద్ర ఆర్థిక మంత్రిగా ఈ అంశంలో జోక్యం చేసుకొని వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని నిర్మలా సీతారామన్‌ను వైకాపా ఎంపీలు కోరారు.



మీ ప్రయాణం ఇతరుల ఆమోదం కోసం కాదు

ప్రతి ఒక్కరూ మీకు మద్దతుగా నిలబడరనే విషయాన్ని అంగీకరిస్తే, మీ జీవితం చాలా ప్రశాంతంగా అనిపిస్తుంది. కొందరు ఎప్పుడూ గతంలోని మీ స్థాయి గురించే మాట్లాడతారు తప్ప మీ ఎదుగుదలను గుర్తించడానికి ఇష్టపడరు. వారి గురించి పట్టించుకోకుండా ముందుకు సాగండి. ఎందుకంటే మీ ప్రయాణం మీ పురోగతి కోసమే తప్ప వారి ఆమోదం కోసం కాదు.

– లిల్లీ, లైఫ్ కోచ్

శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ విమానాశ్రయానికి బుధవారం సాయంత్రం బాంబు బెదిరింపు వచ్చింది. ఎయిర్‌పోర్ట్ అధికారుల కథనం ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తులు ఆర్జీఐఏ సెక్యూరిటీ ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ కస్టమర్ సర్వీస్‌కు బాంబులు పెట్టామని మెయిల్ పంపించడంతో భద్రతాధికారులు అప్రమత్తమయ్యారు. బాంబు నిర్వీర్య బృందం, డాగ్ స్క్వాడ్, భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

77 విమాన సర్వీసులు రద్దు: ఇండిగోకు చెందిన 77 విమాన సర్వీసులను బుధవారం రద్దు చేసింది. శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన 37 విమానాలు, శంషాబాద్‌కు రావాల్సిన 40 విమానాలు రాలేదు.

స్క్రబ్‌టైఫస్ లక్షణాలతో అనకాపల్లి జిల్లాలో వ్యక్తి మృతి

దేవరాపల్లి, న్యూస్‌టుడే: స్క్రబ్‌టైఫస్ లక్షణాలతో అనకాపల్లి జిల్లా దేవరాపల్లి శివారు అల్లిపురానికి చెందిన ఓ వ్యక్తి (50) మృతి చెందారని ప్రభుత్వ వైద్యాధికారిణి పూజ్య మేఘన బుధవారం తెలిపారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు సోమవారం కేజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ చనిపోయారన్నారు. స్క్రబ్‌టైఫస్ వ్యాప్తి నేపథ్యంలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆ వ్యక్తికి రక్తపరీక్ష చేయగా స్క్రబ్‌టైఫస్ సోకినట్లు నిర్ధారణ అయిందన్నారు. అయితే మృతికి స్క్రబ్‌టైఫస్ కారణం కాదని, ఇతర అనారోగ్య సమస్యలున్నాయని కేజీహెచ్ వైద్యులు తమ నివేదికలో పేర్కొన్నారు. ఆయన కొంతకాలంగా దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కర్ణాటకలో విద్యార్థినులకూ నెలసరి సెలవులు

ఈనాడు, బెంగళూరు: మహిళలకు ఒక రోజు 'నెలసరి' సెలవును మరిన్ని రంగాలకు విస్తరిస్తూ కర్ణాటక ప్రభుత్వం చట్టాన్ని సవరించింది. ప్రస్తుతం ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగినులు, కార్మికులకే ఈ సదుపాయాన్ని కల్పించగా.. తాజాగా విద్యాసంస్థలు, అంగన్‌వాడీలకూ వర్తించేలా నిబంధనలను సవరించారు. ఈ రంగాల్లో 18-52 ఏళ్ల ఉద్యోగినులు, కార్మికులతో పాటు విద్యార్థినులు 'నెలసరి' రోజుల్లో ఓ రోజు సెలవును వినియోగించుకునే వీలుంది. విద్యార్థినులకు ఏటా 12 సెలవులు తీసుకునే వీలు కల్పించారు. ఉద్యోగినులు ఇంటి నుంచే విధులు నిర్వహించొచ్చు. వెసులుబాటు ఉంటుంది. ఈ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు 'మహిళల సంరక్షణ సంస్థ'ను సర్కారు స్థాపించనుంది. మరోవైపు నెలసరి సెలవులకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. మంగళవారం మధ్యంతర స్టే విధించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి బుధవారం ఈ ఆదేశాలు రాజ్యాంగంలోని 42 ఆర్టికల్‌కు అనుగుణంగా మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించే అవకాశం ఉందని కోర్టుకు వివరించారు. ఈ వివరణ తర్వాత స్టేను ఉపసంహరించి విచారణను జనవరి 20కి వాయిదా వేస్తూ జస్టిస్ జ్యోతి ఆదేశాలిచ్చారు.

అతిగా ఫోన్లో మాట్లాడొద్దన్న భర్తపై గొడ్డలితో భార్య దాడి

చికిత్స పొందుతూ బాధితుడి మృతి



రాజారావు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అతిగా సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దన్న భర్తపై అతని భార్య గొడ్డలితో దాడి చేసింది. బాధితుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ వినోద్‌బాబు వివరాల ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ మేడూరు గ్రామానికి చెందిన దేవి సోమవారం ఫోన్లో మాట్లాడుతుండగా ఆమె భర్త కొర్ర రాజారావు(45) మందలించారు. రోజూ ఎవరితో అంతగా మాట్లాడుతున్నావంటూ ప్రశ్నించారు. ఈ విషయం ఇద్దరి మధ్య పెద్ద గొడవకు దారి తీసింది. ఇది మనసులో పెట్టుకున్న దేవి అర్ధరాత్రి రాజారావు నిద్రిస్తున్నప్పుడు గొడ్డలితో అతనిపై దాడి చేసింది. రాజారావు తలపై పెద్ద గాయమవ్వడంతో కుమారుడు అరుణ్ కుమార్, కుమార్తె మల్లేశ్వరి గ్రామస్థుల సాయంతో చింతపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. బాధితుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మాగాణి పొలాల్లో ఐదంచెల సాగు

- ప్రత్యక్ష పరిశీలనకు రైతులకు ఆహ్వానం
- ఈ నెల 15 నుంచి 31 వరకు అవకాశం
- సేవ్ సంస్థ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఎకరం మాగాణి పొలంలో ఏడాదికి రూ.3 లక్షల ఆదాయం సాధ్యమేనని చెబుతోంది సేవ్ సంస్థ. ఏడాది పొడవునా ఉద్యాన పంటలు పండించుకునేలా పొలాన్ని మార్చుకోవచ్చని సూచిస్తోంది. ఐదంచెల ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండ్లు, పసుపు, కూరగాయల సాగు చేసుకోవచ్చని పేర్కొంటోంది. ఇందుకు సేవ్ సంస్థ నిర్వాహకులు, సుభాష్ పాలేకర్ కృషి (ఎస్‌పీకే) పద్ధతి ప్రచారకులు విజయ్ రామ్.. కృష్ణా జిల్లా గూడూరు మండలం తరకటూరులోని తన సొంత పొలాన్ని ప్రదర్శన క్షేత్రంగా తీర్చిదిద్దారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఆసక్తిగల రైతులు పేర్లు నమోదు చేసుకొని... ఈ నెల 15 నుంచి వచ్చి చూసి, నేర్చుకోవచ్చని బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 15 ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, 17న వరంగల్, ఖమ్మం, నల్గొండ, 19న మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్; 21న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, 23న తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, 25న కృష్ణా, గుంటూరు, 27న ప్రకాశం, నెల్లూరు, 29న కడప, కర్నూలు, 31న చిత్తూరు, అనంతపురం జిల్లాల రైతులు సందర్శించవచ్చన్నారు. ఇతర వివరాలకు వ్యవసాయ క్షేత్రం చిరునామా... సౌభాగ్య గోసదన్, పినగూడూరులంక, తరకటూరు గ్రామం దగ్గర, గూడూరు మండలం, కృష్ణా జిల్లా, ఫోన్ నంబరు 63091 11427లో సంప్రదించాలని సూచించారు.

EENADU Vol: 52, Issue: 121 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

మకరందం

makarandam@eenadu.in

గురువారం డిసెంబరు 11, 2025

15

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

ఈనాడు


అహాన్ని తొలగించే కాలభైరవుడు

పరమశివుని అంశతో అవతరించి నవగ్రహాలను అనుచరులుగా చేసుకున్న స్వామి.. కాలభైరవుడు. మనలో ఉన్న 'నేను', 'నాది' అనే అహాన్ని తొలగిస్తాడు. నిత్యజీవితంలో ఎదురయ్యే వేదనలు, భయాలను పోగొట్టి రక్షణ కల్పిస్తాడు. గ్రహ బాధల నుంచి విముక్తి ప్రసాదించే మూర్తిగా పూజలు అందుకుంటున్నాడు.

డిసెంబరు 12 కాలభైరవ అష్టమి

కాలభైరవుని రూపం నల్లగా, మూడు కళ్లు, నాలుగు చేతులతో, పాములు, పుర్రెల దండ ధరించి, మారణాయుధాలు చేపట్టి భయానకంగా ఉంటుందని కాలభైరవ అష్టకంలో జగద్గురువు ఆదిశంకరాచార్యులవారు వర్ణించారు. కాల స్వరూపం తెలిసినవాడు కావడం వల్ల కాలభైరవుడు అయ్యాడు. ఈ స్వామిని ధ్యానించడం వల్ల మనలోని అజ్ఞానం, అహంకారం తొలగుతాయి. బాధల నుంచి ఉపశమనం కలుగుతుంది. క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనే శక్తి, స్థైర్యం అలవడతాయి, దీర్ఘకాలిక వ్యాధులు సైతం తగ్గుతాయి- అని భక్తులు విశ్వసిస్తారు.

కొందరు శునకాన్ని కాలభైరవ పేరుతో పిలుస్తుంటారు. వాస్తవానికి అది సరికాదు. అది కాలభైరవుని వాహనమే తప్ప స్వయానా కాలభైరవుడు కాదు. శునకం ధర్మానికి ప్రతీక. అందుకే ధర్మరాజు స్వర్గారోహణ సమయంలో యమధర్మరాజు కుక్క రూపంలో తోడుగా ప్రయాణించి ఆయన ధర్మనీతిని పరీక్షించాడు. అందువల్ల కాలభైరవుడు ధర్మాన్ని వాహనంగా చేసుకున్నవాడని గ్రహించాలి. దైవాన్ని, మృత్యుదూతలను చూడగలిగినందున శునకం భైరవమూర్తి వాహనమైంది.



అష్టమి విశిష్టత

మార్గశిర కృష్ణ అష్టమిన ఉద్భవించాడు కాలభైరవుడు. అష్టమి విశిష్ట తిథి. శ్రీకృష్ణుడు, ద్రౌపది, దుర్గాదేవి, భీష్మాచార్యుడు, అనఘ, భువనేశ్వరి, ధూమావతి, బగళాముఖి తదితరులు ఉద్భవించింది కూడా అష్టమినాడే. అష్టమి పవిత్ర సంఖ్య. కృష్ణుడు జన్మించిన తిథి మాత్రమే కాదు.. అవతారమూ ఎనిమిదోది. అష్టమ గర్భ శిశువు. 'అష్టమీ వ్యాధి నాశినీ' అని ఆయుర్వేదం పేర్కొంది. ఈ తిథినాడు ఔషధం సేవిస్తే వ్యాధి త్వరగా నయమవుతుందన్నది ఆర్యోక్తి. అష్టమినాడు కాలభైరవ ఉపాసన దీక్ష ప్రారంభిస్తే నవగ్రహ బాధల నుంచి విముక్తి కలగడమే గాక మోక్షం లభిస్తుందని, స్వామిని పూజించేవారు భయం, ఆందోళనల నుంచి బయట పడతారని పెద్దలు చెబుతారు.

పుట్టుకలో దాగిన మర్మం..

పౌరాణిక కథను అనుసరించి.. త్రిమూర్తుల్లో బ్రహ్మత్వం ఎవరిదో తెలుసుకోవాలనే జిజ్ఞాసతో మహర్షులు కైలాసం వెళ్లారు. ఆ సమయంలో విష్ణుమూర్తి, బ్రహ్మదేవుడు- సద్యోజాత, అఘోర, తత్పురుష, ఈశాన, వామదేవ అనే పంచ ముఖాలతో ఉన్న శివుడితో సంభాషిస్తున్నారు. 'స్వామీ! మీలో బ్రహ్మత్వం ఎవరిలో ఉన్నదో తెలియజేయండి' అనడిగారు రుషులు. త్రిమూర్తులు ఎవరికి వారు తామేనని వాదించుకున్నారు. చివరికి ఆ విషయాన్ని నిర్ధారించేందుకు నాలుగు వేదాలను, ఓంకారాన్ని పిలిచారు. పరమశివుడే బ్రహ్మత్వం కలిగినవాడని ముక్తకంఠంతో తెలియజేశాయి ఓంకారం, వేదాలు. కోపగించిన బ్రహ్మ- 'రుద్రా! నువ్వు నా రెండు కనుబొమల మధ్య నుంచి పుట్టినవాడివి! నన్ను స్తుతించు' అన్నాడు. అప్పుడు కాలభైరవుడు మహోగ్రరూపం దాల్చాడు. పరమేశ్వరుడు- బ్రహ్మదేవుడి పంచముఖాల్లో ఐదో తలను ఖండించమన్నాడు. కాలభైరవుడు అలాగే చేశాడు. దాంతో ఐదు ముఖాలున్న బ్రహ్మదేవుడు చతుర్ముఖుడయ్యాడు. కాలభైరవుని ద్వారా బ్రహ్మ అహంకారం నశించింది. మనలో లేశమాత్రంగా కూడా అహంకారం లేకుండా చూసుకోవాలన్నది ఇందులోని అంతరార్థం.

శునకానికి గారెల దండ

ఇహలోకంలో పాపాలు చేసినవారు మరణానంతరం కాలభైరవుని చూసి భీతిచెందుతారు. దీనినే భైరవ యాతన అంటారు. ఈ యాతన తప్పాలంటే శివాలయాల్లో కొలువైన భైరవునికి నమస్కరించాలి. ఆ స్వామిని పూజించినవారికి కైలాసం ప్రాప్తిస్తుంది. పాపాలను తొలగించే శక్తి ఉన్నందున భైరవునికి పాపాల భక్షకుడు, పాపాల భైరవుడు అనే పేర్లు వచ్చాయి. స్వామిని ఆదిశంకరాచార్యులు కాలభైరవాష్టకంలో కాశీ ప్రభువుగా అభివర్ణించారు. భైరవుని అనుగ్రహం పొందిన వారికి కాశీక్షేత్ర దర్శనం తప్పక లభిస్తుంది. కాశీ సమారాధన సమయంలో ధర్మానికి ప్రతీక అయిన శునకానికి మినపగారెల దండ సమర్పించాలని, అలా చేయడం వల్ల భైరవుడి అనుగ్రహం లభిస్తుంది, సకల దుఃఖాలూ తొలగి ఆనందం పొందుతారని పెద్దలు చెబుతారు.

కాలభైరవుడిని స్తుతించేదే కాలభైరవాష్టకం. ఇది అహాన్ని విడనాడాలన్న సందేశం అందిస్తుంది. ధర్మమార్గాన్ని ఎలా అనుసరించాలో తెలియజేస్తుంది. 'ఈ అష్టకాన్ని నిత్యం పఠించేవారికి చెడుకర్మల వల్ల కలిగే దుష్ప్రభావాల నుంచి రక్షణ లభిస్తుంది. గ్రహ దోషాల ప్రతికూలత తగ్గుతుంది. సదా అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. రోజూ పఠించే అవకాశం లేనివాళ్లు కాలభైరవాష్టమి రోజున తప్పక పఠించాలి' అన్నది ఆధ్యాత్మిక గురువుల ఉద్బోధ.

కాలం విలువను గుర్తించి, అందుకు తగ్గట్టుగా నడచుకోవాలన్నది భైరవ సందేశం. సమయం మన కోసం ఆగదు, వేచి చూడదు. కాలం సాక్షాత్తూ శివ స్వరూపం. సమయాన్ని వివేకంతో, విచక్షణతో సద్వినియోగం చేసేవారు కాలభైరవునికి అత్యంత ప్రీతిపాత్రులు అవుతారు. ధర్మమార్గంలో నడవాలంటే భైరవ ఆరాధన తప్పనిసరి. మనల్ని సృజించింది దైవం. మన ప్రవర్తన ధర్మబద్ధంగా, వినమ్రంగా ఉంటేనే దైవానుగ్రహం కలుగుతుంది. జీవితం క్షణభంగురమని గ్రహించి.. సత్యమార్గాన్ని అనుసరించాలి. అప్పుడు కాలాన్ని జయించినట్లే.

కాలభైరవ పూజలు మనదేశంలోనే కాకుండా నేపాల్, ఇండోనేషియా, థాయిలాండ్ తదితర దేశాల్లోనూ ఘనంగా నిర్వహిస్తారు.

– డా. జయదేవ్ చల్లా

భక్తి జ్ఞాన వైరాగ్య సమ్మిళితం తిరుప్పావై గానామృతం

ధనుర్మాసంలో 30 రోజుల వ్రతం తిరుప్పావై. తమిళంలో తిరు అంటే శ్రీ అని, పావై అంటే వ్రతం అని అర్థం. శుభకరం, మంగళకరం, సౌభాగ్యకరమైన వ్రతమని భావం. గోదాదేవిగా పిలుచుకునే ఆండాళ్ మనకు అనుగ్రహించిన 30 పాటల సముదాయమే తిరుప్పావై.

డిసెంబరు 16 ధనుర్మాసారంభం



ఆండాళ్‌తల్లి ఎవరంటే.. తమిళదేశానికి చెందిన పన్నెండుమంది వైష్ణవ ఆళ్వారుల్లో ఒకే ఒక్క స్త్రీ ఆళ్వార్. ఆండాళ్ అమ్మ తిరుప్పావై, నాచియార్ తిరుమొళి అనే విష్ణుభక్తి స్ఫోరకమైన రచనలు మనకు అందించిన మహానుభావురాలు. శ్రీవిల్లిపుత్తూరులో అవతరించిన ఆండాళ్- అక్కడి వటపత్రశాయినే శ్రీరంగనాథునిగా భావించి తిరుప్పావై పేరుతో 30 పాటలను పాడి స్వామికి సమర్పించింది. అందువల్ల ఇది పాటల మాలిక. అంటే స్వామిపై చెప్పినవి పద్యమాలికలు. అల్లినవి పూలమాలికలు. ఆ తల్లి అందించింది గీతమాల. ధరించి ఇచ్చింది పుష్పమాల. మొదట తాను ధరించి స్వామివారికి సమర్పించింది. కాబట్టి ఆముక్తమాల్యద. ఈ తిరుప్పావై మొత్తం భక్తి, జ్ఞాన, వైరాగ్య సమ్మిళితం. స్వామికి అత్యంత ప్రీతిపాత్రం.

దైవలీలా విశేషం

యజ్ఞభూమిని దున్నుతుండగా.. దశరథునికి సీతమ్మవారు దొరికినట్టుగా.. తులసిమొక్కలకు పాదు చేస్తుండగా భట్టనాథులకు ఆండాళ్ తల్లి లభించింది. భూమాత అంశగా భావించి ఆ బిడ్డని అల్లారుముద్దుగా సాకి పెంచాడాయన. ఈ భట్టనాథుడు ఎవరయ్యా అంటే నిత్యం పుష్పమాలలు అల్లి శ్రీవిల్లిపుత్తూరు వడపెరుం కోయిలుడయాన్ (వటపత్రశాయి) మందిరంలో స్వామికి సమర్పించేవాడు. ఇతడికి విష్ణుచిత్తుడు, పెరియాళ్వారు పేర్లు కూడా ఉన్నాయి. పెంచేది పూలవనం. ఉద్యోగం పూలమాలా కైంకర్యం. బిడ్డ దొరికిన ప్రదేశం తులసీవనం. అందువల ఈ బిడ్డని సాక్షాత్తూ భూదేవి స్వరూపంగా భావించి ముద్దుగా 'కోదై' అని పిలుచుకునేవాడు. తమిళంలో కోదై అంటే పూమాల. ఆ కోదైయే గోదా.. గోదాదేవి.

తండ్రికి పువ్వులు కోయడం, మాలలు అల్లడంలో సాయంచేస్తూ బాల్యంలోనే విష్ణుమూర్తికి భక్తురాలైంది గోదాదేవి. ఆ స్వామినే తన సర్వస్వంగా భావించసాగింది. పుష్పమాలలను ముందుగా తాను ధరించి, వాటిని తిరిగి పూలబుట్టలో అమర్చి స్వామివారి కైంకర్యం నిమిత్తం తండ్రికి అందించేది. అది గమనించిన భట్టనాథుడు కూతురు చేస్తున్న పని సరికాదని, అపచారమని మందలించి.. ఇకపై అలా చేయొద్దని హెచ్చరించాడు. మర్నాడు మందిరంలో 'ఈరోజు కోదై మాల ధరించకుండానే నాకు సమర్పించావు. ఆమె ముందుగా ధరించినవే నాకు ప్రీతికరం' అని వినిపించడంతో ఆశ్చర్యపోయాడు. ఇదంతా దైవలీలా విశేషంగా భావించిన భట్టనాథుడు నాటి నుంచి గోదా ధరించిన మాలనే స్వామికి సమర్పిస్తూ వచ్చాడు.

పరమాత్ముడే కాబోయే భర్త

గోదాదేవిలో నానాటికీ భక్తి పెరగసాగింది. స్వామినే వివాహం చేసుకోవాలనే కాంక్షను పెంచుకుంది. ఒకరోజు భట్టనాథుడు 'నీకు యుక్తవయసు వచ్చింది.. తగిన వరుణ్ణి చూస్తాను' అన్నాడు కుమార్తెతో. అప్పుడామె.. పరమపురుషుడే తనకు కాబోయే భర్త అని, ఆయననే వివాహం చేసుకుంటానని చెప్పింది. ఖిన్నుడైన తండ్రి అంతా స్వామికే వదిలి తన నిత్యసేవలో మునిగిపోయాడు.

ధనుర్మాసం.. తిరుప్పావై

స్వామిని ఎలా సాక్షాత్కరింపచేసుకోవాలి- అని ఆలోచించింది గోదాదేవి. తన మనసంతా స్వామిపట్ల అనురాగం, ఆంతరంగిక భక్తి నిండాయి. ఆ భావాలను స్వామికి ఎలా నివేదించుకోవాలి అనుకుంటూ తాను విన్న విష్ణుకథలను అవలోకనం చేసుకుంది. అలా రేపల్లెలోని గోపికలు శ్రీకృష్ణుని పొందటానికి మార్గశిరమాసంలో ఆచరించిన కాత్యాయనీ వ్రత వృత్తాంతం గుర్తుచేసుకుంది. తాను కూడా వ్రతం ఆచరించాలని, స్వామిని ప్రసన్నం చేసుకుని, ఆయనను పొందాలని, నవవిధ భక్తిమార్గాల ద్వారా స్వామిని చేరుకోవాలని నిశ్చయించుకుంది. భక్తి జ్ఞాన వైరాగ్య సమ్మిళితాలైన 30 గీతాలను తిరుప్పావైగా అందించింది ఆండాళ్ తల్లి. జీవాత్మ పరమాత్మను చేరుకునే చక్కని సాధనంగా ఈ పాటలను రచించి గానంచేసింది. అప్పటి నుంచీ ధనుర్మాసంలో సూర్యోదయానికి ముందే లేచి స్నానాదికాలు ముగించి గోదాదేవి మనకు అనుగ్రహించిన తిరుప్పావై గానం చేయటం ఆనవాయితీగా మారింది.


భగవత్ సాక్షాత్కార వైభవాన్ని తాను అనుభవించి లోకానికి అందించిన మహనీయురాలు గోదాదేవి. సత్సంగం ద్వారా భగవత్ సాన్నిధ్యం పొందవచ్చని భావించిన గోదాదేవి తిరుప్పావై ద్వారా తన చెలికత్తెతో కలిసి భగవంతుడికి సేవ చేసింది. ఇదే తిరుప్పావై సారాంశం. 30 రోజుల శ్రీవ్రతాన్ని మూడు దశలుగా విభజించారు మన పూర్వాచార్యులు. మొదటి 5 పాశురాల్లో వ్రతస్వరూపాన్ని జ్ఞానరూపమైన అనన్యశేషత్వం (భగవంతుడికే పూర్తిగా అంకితమవడం), తర్వాతి 10 పాశురాల్లో తన స్నేహితురాళ్లను నిద్రలేపి, వ్రతోన్ముఖులను చేసే అనన్యభోగత్వం (అసాధారణమైన ఆనందానుభూతి), మిగిలిన 15 పాశురాల్లో నంద యశోద శ్రీకృష్ణ బలరాములను మేల్కొలిపి.. శ్రీకృష్ణునిలో లీనమవడం కనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే జీవాత్మ పరమాత్మలో కలిసిపోయే ప్రస్థానమే తిరుప్పావై.

– నేమాన వెంకటరమణ

గయాసురుడి కోరిక తీర్చిన త్రిమూర్తులు

మార్గశిర, పుష్య, మాఘ, పాల్గుణ మాసాల్లో కృష్ణపక్షంలోని సప్తమి, అష్టమి, నవమి తిథులను 'త్రి స్రోష్టకములు' అంటారు. ఈ తిథుల్లో ఉపనయనం వంటి శుభకార్యాలను ఆచరించరు. పితృదేవతారాధన చేస్తే విశేష ఫలితాలు కలుగుతాయని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. మరణించిన తల్లిదండ్రులు, తాత, నాన్నమ్మ, అమ్మమ్మ, మేనమామ.. ఇలా పెద్దలందరికీ ఆరాధన చేయవచ్చును. పితృ దేవతారాధన ఈ తిథుల ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

వాయుపురాణంలోని కథను అనుసరించి... గయాసురుడు అనే రాక్షసుడికి దైవిక లక్షణాలున్నాయి. కానీ అతడి అనుచరులు రాక్షస లక్షణాలతో విజృంభిస్తూ అనేక విధ్వంసాలు సృష్టించసాగారు. గయాసురుడి నేతృత్వంలోనే ఇవన్నీ జరిగినట్లు దేవేంద్రుడు త్రిమూర్తులకు ఫిర్యాదు చేశాడు. త్రిమూర్తులు గయాసురుడి దేహాన్నే యజ్ఞ స్థలంగా చేసుకున్నారు. శిరస్సు వద్ద విష్ణువు, నాభి ప్రాంతంలో బ్రహ్మ, పాదాల వద్ద పరమశివుడు ఆక్రమించి.. యజ్ఞం ఆరంభించారు. యోగ విద్య మూలంగా గయాసురుడు ఆ వేడిని భరించగలిగాడు. ఏడు రోజులపాటు ఎంతో నియమంగా ఉన్న గయాసురుడు ఆఖరి రోజున మోసపోయాడు. ఈశ్వరుడు కోడి అవతారంలో వేకువ కాకుండానే కూయటం వల్ల గయాసురుడి ధ్యాస మళ్లింది. యజ్ఞం పూర్తయ్యిందని భ్రమపడి కదిలాడు. కదిలితే వధిస్తామని త్రిమూర్తులు ముందే ఆంక్ష విధించటంతో గయాసురుడు తన మరణానికి అడ్డు చెప్పలేదు. ఆ కోడి అవతారం మూలంగానే పిఠాపురంలో పరమశివుడు కుక్కుటేశ్వరుడిగా ప్రసిద్ధిగాంచాడు. ఆ విధంగా గయాసురుణ్ణి త్రిమూర్తులు హతమార్చారు. ఆ రాక్షసుడు చనిపోతూ తన చివరి కోరికగా- బిహార్‌లో శిరోగయ, కటక్ వద్ద జాజ్‌పుర్‌లో నాభి గయ, ఆంధ్రప్రదేశ్ పిఠాపురం వద్ద పాదగయల్లో పితృ తర్పణాలు వదిలిన వారికి త్వరితంగా ముక్తిని ప్రసాదించమని త్రిమూర్తులను ప్రార్థించాడు. జనహితమే గయాసురుడి కోరిక కాబట్టి త్రిమూర్తులు 'తథాస్తు' అని ఆశీర్వదించారు. గయాసురుడి కోరిక మేరకు ఈ క్షేత్రాలు శక్తి నివాసాలుగా ప్రసిద్ధి చెందాయి.



గుజరాత్ రాష్ట్రం పటాన్ జిల్లా సిద్ధపూర్‌లో మాతృగయ ఉంది. మాతృమూర్తులకు పిండ ప్రదానం చేస్తారిక్కడ. కర్దమ ప్రజాపతి తపస్సు చేసిన స్థలమిది. విష్ణుమూర్తి ప్రత్యక్షం కాగానే ఇతని కంటి నుంచి వెలువడిన ఆనందబాష్పాలతో ఇక్కడ బిందు సరోవరం వెలిసిందంటారు. దీనిని ముక్తిధామమని కూడా పిలుస్తారు. రుగ్వేదంలో కూడా మాతృగయ ప్రస్తావన ఉంది. తక్కిన రోజుల్లోనూ ఈ ప్రదేశాల్లో పితృ తర్పణాలు వదిలినప్పటికీ అధికశాతం త్రి స్రోష్టక తిథుల్లో ఈ కర్మ ఆచరించి.. పూర్వీకులకు శాంతి కలగజేస్తారు. ఇటువంటి ఆచారాలు అన్నీ కూడా మానసిక ప్రశాంతత చేకూర్చేందుకు ఏర్పరచినవే. మనం ప్రత్యక్ష దైవాలుగా భావించే తల్లిదండ్రులకు, వారిని కన్నవారికి తర్పణాలు సమర్పించడం మన కృతజ్ఞతాభావానికి సంకేతం. ప్రతిఫలంగా పెద్దల ఆశీర్వచనాలు పొందగలుగుతాం. మనం చేసే మంచి పనులతో వారి ఆత్మ ఆనంద స్థితిని పొందుతుందన్నది ఆర్యోక్తి.

– కె.వి.వి.సత్య ప్రసాద్

ఆదరణ.. అభిమానం

క్రీస్తువాణి



మన రూపాలు భిన్నంగా ఉన్నట్టే, అభిప్రాయాలు ఒక్కొక్కరివి ఒక్కో విధంగా ఉంటాయి. అందరి ఆలోచనావిధానం ఒకలా ఉండదు. మీలో కొందరు యోగ్యులుంటారు. ఆలోచనల్లో ఐక్యత ఉండదు. భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతాయి- (1 కొరింథీ 11:19) అని పౌలు ద్వారా తెలియజేశాడు ప్రభువు. అభిప్రాయాలు కలవకపోవడం వల్ల విభేదాలు రావడం సహజం. ఒకరితో ఒకరు తర్కించినప్పుడు.. మన అవగాహన ఇంకా పెరుగుతుంది. అందులో మేలైన అంశాన్ని గ్రహించాలి. ఆ దేవాధిదేవుడు ఇటువంటి వ్యవస్థని సృష్టించడంలోని అంతర్యం ఇదే.

జీవితంలో రకరకాల ఇబ్బందులు ఎదురవడం సహజం. ఒక్కోసారి ఏ నిర్ణయం తీసుకోవాలో అవగాహన లేక సందిగ్ధంలో పడుతుంటాం. అలాంటప్పుడు సమస్యను సన్నిహితులకు చెప్పి సలహా అడుగుతాం. ఇక్కడ కూడా ఒక్కొకరు ఒక్కో అభిప్రాయం వ్యక్తం చేయడం సహజం. అవన్నీ వింటే ఏ మార్గం ఉత్తమమైందో అర్థమవుతుంది. ఒక పరిష్కారం దొరుకుతుంది- అని బైబిల్ కథనం తెలియజేసింది.. ప్రభువు ఇలా ఎందుకు చెప్పాడంటే... మన సమస్యకు సరైన పరిష్కారం దొరుకుతుందో లేదో తెలీదు కానీ.. ఈ నెపంతోనైనా తోటివారితో సంభాషిస్తాం. అహాన్ని వదిలి మనల్ని మనం తగ్గించుకుంటాం. మనసులో ఉన్న భయాలూ, ఆందోళనల గురించి అరమరికలు లేకుండా మాట్లాడతాం. ఇలా చేస్తున్నామంటే.. వారి మీద మనకు ఎంత నమ్మకం ఉందో అవతలివారికి స్పష్టమవుతుంది. అది ప్రేమను చిగురింపచేస్తుంది. వాళ్లు మంచి మాటలతో ఉపశమనం కలిగిస్తారు. మన శ్రేయస్సును ఆశించి తమకు చేతనైనంత సాయం చేస్తారు. ఇక అశాంతికి తావెక్కడిది?! మనం ఇతరులతో పంచుకున్నట్టే.. తోటివాళ్లు తమ సమస్యను విన్నవిస్తే.. మన అభిప్రాయం తెలియజేయాలి. వారిని కష్టం నుంచి బయటపడేసేందుకు ప్రయత్నించాలి. దేవుడి కరుణాకటాక్షాలతో పాటు ఇతరుల ఆదరాభిమానాలు పొందటం కూడా అవసరమని గ్రహించాలి. జ్ఞానం ఉదాత్తమైంది. అది మనకూ తోటివారికీ కూడా మేలుచేస్తుంది. ఆలోచనలను పంచుకోవడం వల్లే ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు సాధ్యమయ్యాయి.

– పూసపాటి విజయరాజు

కోర్కెలు తీర్చే శ్రీకొమురవెల్లి మల్లన్న

తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో మల్లన్నస్వామి కల్యాణోత్సవాన్ని డిసెంబరు 14న ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుక చూసేందుకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రమవుతుంది.

ప్రచారంలో ఉన్న కథనాన్ని అనుసరించి... శివపార్వతుల తనయుడైన కుమారస్వామి చాలాకాలం ఇక్కడ తపస్సు చేసినందువల్ల ఈ గ్రామం కుమారవెల్లిగా ప్రఖ్యాతమైంది. కాలక్రమంలో ఇది కొమురవెల్లిగా మారింది. కొండ గుహలో వెలసిన మల్లన్న ఇక్కడ లింగాకారంలో కాకుండా విగ్రహ రూపంగా ఉభయ దేవేరులతో కొలువుదీరి ఉండటం విశేషం. ఇక్కడి సూదిమాను గుండుపై స్వామివారి త్రిశూలం దర్శనమిస్తుంది. ఈ గుడి ఎదురుగా ఉన్న గంగరేగి వృక్షాన్ని కల్పవృక్షంగా భావిస్తారు.



ఈ ఆలయానికి 10 కి.మీ దూరంలో కొండ పోచమ్మ ఆలయం ఉంది. ఈమె కొమురవెల్లి మల్లన్నకు సోదరి. మల్లన్నను ప్రార్థించిన తర్వాత కొండ పోచమ్మ ఆలయాన్ని దర్శించుకుంటారు. ఇది అనాదిగా కొనసాగుతున్న ఆచారం. కొమురవెల్లి మల్లన్న విగ్రహం మహా తేజోవంతంగా కనిపిస్తుంది. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారిని పూలమాలలు, బంగారు నగలు, కిరీటంతో అలంకరిస్తారు. మల్లన్న స్వామికి ఇద్దరు దేవేరులు. ఒకపక్క కేతమ్మ, మరోపక్క మేడలమ్మ దర్శనమిస్తారు.

కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనుంది. ఈ కల్యాణాన్ని ముక్కోటి దేవతలు తిలకిస్తారని విశ్వసిస్తారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులు తన్మయత్వంతో కల్యాణం వీక్షిస్తారు. అసంఖ్యాకంగా వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులూ కలగకుండా కొమురవెల్లి దేవస్థానంవారు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. అవివాహితులు మల్లన్న కల్యాణాన్ని వీక్షిస్తే త్వరితంగా వివాహం జరుగుతుందని, పిల్లలు లేని దంపతులకు సంతానం కలుగుతుందని స్థానికులు చెబుతారు.

మోక్షప్రాప్తికి అనఘాష్టమి వ్రతం

అవధూత శ్రీ దత్తాత్రేయుడికి గృహస్థుడిగా మరో రూపం ఉంది. దానినే అనఘ స్వామి అని పిలుస్తారు. ఆయన సతీమణి అనఘాదేవి. వీరిని భక్తిశ్రద్ధలతో కొలిచిన వారికి కోరికలు ఫలిస్తాయి, మోక్షం కూడా ప్రాప్తిస్తుంది.



ప్రచారంలో ఉన్న కథలను అనుసరించి... సద్గురు దత్తాత్రేయస్వామి కార్తవీర్యార్జునుడితో అనఘ పూజను ప్రారంభించాడు. దశరథుడు, శ్రీరాముడు ఈ పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు ఈ పూజ గురించి ధర్మరాజుకు వివరించాడు. ఆ నాటి నుంచీ అనఘ పూజలు జనబాహుళ్యంలోకి వచ్చాయి. ఎందరో భక్తులు ఈ వ్రతం ఆచరించి అనఘ స్వామి అనుగ్రహం పొందుతున్నారు. అనఘ వ్రతం ఏ నెలలోనైనా బహుళ అష్టమి రోజున చేయవచ్చు. ప్రధానంగా మార్గశిర బహుళ అష్టమినాడు చేస్తారు. సంవత్సరానికి ఒక్కసారైనా అనఘ పూజ చేయడం మంచిదని పండితులు చెబుతారు. ఈ స్వామిని పూజించడం వల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది. దుఃఖాలు తొలగుతాయి. కార్తవీర్యార్జునుడు అనఘాష్టమి వ్రతం చేసి అపూర్వశక్తిని, వెయ్యి చేతులను పొందగలిగాడు.


ఇలా చేయాలి..

వ్రతం చేయదలచుకున్న వారు.. ఆ రోజు ఉదయాన్నే లేచి ఇల్లు పరిశుభ్రం చేసుకోవాలి. తల స్నానం చేయాలి. పూజామందిరంలో పీఠం మీద అనఘస్వామిని ఏర్పాటు చేసుకోవాలి. పుష్పాలతో అలంకరించాలి. బియ్యప్పిండి, కుంకుమ, పసుపులతో అష్టదళపద్మం వేయాలి. దళం మధ్యలో కలశం ఉంచాలి. ధూప దీప నైవేద్యాలు సమర్పించాలి. మొదట గణపతిని ప్రార్థించి.. తర్వాత అనఘస్వామిని పూజించాలి. పగటిపూట నిద్రించకూడదు. పగలంతా ఉపవాసం ఉండాలి. అలా ఉండలేని వారు పండ్లు తీసుకోవచ్చు. రాత్రివేళ సాత్వికాహారం తీసుకోవాలి. 'ఓం దత్తాత్రేయాయ నమః' అనే నామాన్ని స్మరిస్తుండాలి. వ్రతం పూర్తయ్యాక.. దక్షిణ, తాంబూలాలు ఇవ్వాలి. కొందరు వ్రత పుస్తకాలను కూడా ఇస్తారు.

ఎలాంటి మర్యాదలు పాటించాలంటే..

ఇస్లాం సందేశం

మనం అనుసరించాల్సిన ఆధ్యాత్మిక అంశాలతో పాటు నిత్యజీవితంలో ఆచరించాల్సిన నియమావళిని, ప్రవర్తనాశైలిని సవివరంగా, సమగ్రంగా తెలియజేస్తుంది ఇస్లాం. రోజువారీ పాటించాల్సిన మర్యాదలు, గౌరవప్రదమైన సంభాషణలు, నైతిక వర్తన తదితరాలపై దివ్య ఖురాన్ బోధనలు, దైవ ప్రవక్త ముహమ్మద్ (స) ఆచరణలు మార్గనిర్దేశం చేస్తాయి. వీటి గురించి తెలుసుకోవటం, ఆచరించటం విశ్వాసుల ప్రాథమిక విధిగా పరిగణిస్తారు. వీటిలో కొన్ని సాధారణ మర్యాదలు కాగా.. మరికొన్ని ఆధ్యాత్మికపరమైనవి.



నిత్య జీవితంలో తోటివారితో మంచిగా, మృదువుగా మాట్లాడాలి. అసభ్యకరమైన, నిందాపూర్వకమైన భాషను వాడకూడదు. ఇతరులను ఎగతాళిచేయటం, అవమానించటం తగవు. నడకలో వినయం కనిపించాలే కానీ అహంకారం కూడదు. తోటివారితో దయతో మెలగాలి. అబద్ధాలు, మోసం, నమ్మకద్రోహం తగవు. నిజాయితీగా ఉండాలి. ఆగ్రహావేశాలకు దూరంగా ఉండాలి. ఇతరులతో ఏ వ్యవహారమైనా సున్నితంగా ఉండాలి. తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవం చూపాలి. ఆతిథ్యం విషయంలో ఉదారంగా ఉండాలి. ముందుగా అతిథులు తినేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇతరులు మాట్లాడేటప్పుడు మధ్యలో అడ్డుకోకూడదు. ఘర్షణ వాతావరణం ఉన్నప్పుడు శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నించాలి. సదా పరిశుభ్రతను పాటించాలి. గౌరవప్రదంగా, నిరాడంబరంగా ఉండే దుస్తులు ధరించాలి. ఒకరి గదిలోకి ప్రవేశించే ముందు తలుపు తట్టాలి. అదే సమయంలో అధిక శబ్దం చేయకూడదు. దుబారాను నివారించాలి. వనరులను వృథా చేయరాదు. తీసిన వస్తువును తిరిగి యథాస్థానంలో ఉంచటం వంటివి మన ప్రవర్తనలో భాగం కావాలి.

మతపరమైన మర్యాదలు ఇస్లాంలో ప్రతి ఒక్కరికీ అనుసరణీయమైనవి. ఇతరులను 'అస్సలాము అలైకుమ్' (మీకు శాంతి కలుగుగాక) అని పలకరించాలి. ఎవరైనా తొలుత అలా పలకరిస్తే 'అలైకుమ్ అస్-సలాం' (మీకు కూడా శాంతి కలుగుగాక) అని ప్రతిస్పందించాలి. ఏ పనైనా 'బిస్మిల్లాహ్' అని మొదలుపెట్టాలి. కొత్త కార్యక్రమం చేపట్టినప్పుడు 'బిస్మిల్లాహ్ ఇర్ రెహమాన్.. ఇర్ రహీమ్' (అత్యంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో) అంటూ ప్రారంభించి దైవ ఆశీర్వాదాన్ని కోరుకోవాలి. భోజనం తదితర సందర్భాల్లో 'అల్హమ్దులిల్లాహ్' (అన్ని పరిపూర్ణ స్తోత్రాలు అల్లాహ్‌కే చెందుతాయి) అని చెప్పటం ద్వారా దైవానికి కృతజ్ఞతలు తెలియజేయాలి. దైవం పట్ల పరిపూర్ణ విశ్వాసం కలిగుండాలి. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడేటప్పుడు 'ఇన్షా అల్లాహ్' (అల్లాహ్ కోరుకుంటే) అని చెప్పాలి. ఏదైనా అద్భుతంగా అనిపించినప్పుడు 'సుభానల్లాహ్' (అల్లాహ్ మహిమ కలుగుగాక) అని ప్రశంసించాలి. ఇతరుల సాయానికి ధన్యవాదాలు తెలపాలంటే 'జజాక్ అల్లాహు ఖైరాన్' (అల్లాహ్ మీకు గొప్ప ప్రతిఫలం అందించుగాక) అనాలి. ముస్లింలు ఇలాంటి మర్యాదలను అనుసరిస్తూ తమ విశ్వాసాన్ని ఆచరణలో ప్రదర్శించాలి. ఇవి సామాజిక బంధాలను బలోపేతం చేసుకోవటానికి, సృష్టికర్తకు దగ్గరవటానికి ఉపకరిస్తాయని గ్రహించాలి.

– ఖాసిం పీరా

వసుంధర

vasundhara@eenadu.in

మనీ మంత్ర...

ఇన్నాళ్లూ కోరింది కొనివ్వలేదని ఏడ్చే పిల్లల్ని చూసుంటాం. పాకెట్‌మనీగా ఇచ్చిన మొత్తాన్ని నచ్చినట్లు ఖర్చు చేసే చిన్నారుల గురించీ విని ఉంటాం. కానీ, ఇదంతా నిన్నటి మాట. నేటితరం ఆర్థికమాంద్యం, ద్రవ్యోల్బణం, పెట్టుబడులు, పొదుపు... వంటివాటిపై తెగ మాట్లాడేస్తున్నారు. ఈ వయసులో ఇదంతా అవసరమేనా?

పిల్లలకూ పెట్టుబడుల పాఠాలు..!

● అమ్మ వ్యాపారంలో లాభనష్టాలను లెక్కే సేదీ, ప్రతి రూపాయినీ సమర్థంగా ఎలా వాడాలో సలహాలు ఇచ్చేదీ 10 ఏళ్ల ప్రణతీనే.

● కొత్తగా ఉద్యోగంలో చేరిన అక్కకు ఆర్థిక మాంద్యం నుంచి తప్పించుకోవడానికి ఎలాంటి ఫైనాన్షియల్ ప్లాన్ అవసరమో సూచిస్తోంది వర్ష. తనకు కేవలం 11 ఏళ్లే.



వీళ్లే కాదు... ఈతరంలో చాలామంది చిన్నారులు ఆర్థిక విషయాలన్నీ అలవోకగా వల్లించేస్తున్నారు. ఇది మనకి కొంత అతిశయోక్తిగా అనిపించొచ్చు. కానీ, నిపుణులు మాత్రం ఆర్థిక స్వాతంత్ర్యం, మెరుగైన జీవితాన్ని అందిస్తాయనీ, అందుకు వీటిపై అవగాహన ఉండటం ఎంతో అవసరమనీ సూచిస్తున్నారు. వారెన్ బఫెట్ కూడా తన ఆరేళ్ల వయసు నుంచే సంపాదించడం ప్రారంభించారు.

ఆ తేడా తెలియాలి...

ఈ రోజుల్లో పిల్లలకు ఆర్థిక అక్షరాస్యత అత్యంత అవసరం. డబ్బు డిజిటల్‌గా మారిపోయింది. గతంలోలా తాకలేరు, చూడలేరు. కాబట్టి పిల్లలు డబ్బుని ఎలా పొదుపు చేయాలి, ఏ విధంగా ఖర్చు చేయాలి అన్న విషయాల్ని అర్థం చేసుకోకుండానే పెరుగుతున్నారు. వేగంగా సంపాదించడానికీ క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాలిక పెట్టుబడికీ మధ్య తేడాను వాళ్లు తెలుసుకోవాలి. లక్ష్యం పిల్లల్ని ఆర్థిక నిపుణులుగా మార్చడం కాదు... డబ్బుని సాధారణ సాధనంగా చూడటం, నిజమైన సంపద కాంపౌండింగ్ ద్వారా నెమ్మదిగా పెరుగుతుందని అర్థం చేసుకునేలా తీర్చిదిద్దడమే.



– శిల్పా గోలే, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఎప్పుడు నేర్పాలి?

వయసుని బట్టి దశలవారీగా నేర్పించాలి. కాస్త లెక్కలు అంటే కూడికలు, తీసివేతలు, గుణకారాలు వస్తే చాలు అవి సులువుగానే అర్థమవుతాయి.

లక్ష్యం ఉంటే...

ఆర్థిక విషయాలను చిన్నారులు సులువుగా అర్థం చేసుకోవాలంటే ముందు వారికో లక్ష్యం ఏర్పరచాలి. అంటే... మంచి షూ, నచ్చిన సైకిల్... ఇలా! వీటిని సాధించుకునే దిశగా చిన్నారులకు పొదుపు, మదుపులను అలవాటు చేయండి. పొదుపు ఖాతాలను తెరవండి. లేదా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)పై దృష్టి పెట్టేలా చేస్తే సరి.

బడ్జెట్ కావాలి...

ఇంటి బడ్జెట్‌ని వేసినట్లే, తమ నెలవారీ అవసరాలకోసం పిల్లలూ ఓ బడ్జెట్ వేసుకునేలా చేయండి. ఇందుకోసం ప్రతినెలా 100 నుంచి 500 రూపాయల వరకూ సంపాదించుకునే అవకాశం కల్పించండి. ఇంటిపని, తోటపని, మంచిపని... అంటూ ఒక్కోదానికి కొన్ని డబ్బులు ఇవ్వండి. ఇలా వారు కష్టపడి పోగేసిన మొత్తంతో నచ్చిన వస్తువుల్ని కొనుక్కోనివ్వండి.

వృథా ఆపండి...

చిన్నారులకు పొదుపు, మదుపుతోపాటు... వృథా ఖర్చుల్ని అరికట్టడమూ తెలియాలి. ఖరీదైనవి కొంటేనే తృప్తి కలుగుతుంది అనుకునే భ్రమల్ని తొలగించండి. చిన్న చిన్న విషయాలనూ ఆస్వాదించగలగడం నేర్పండి. అవసరానికీ, సౌకర్యానికీ, విలాసాలకూ మధ్య తేడాలను తెలియజేయండి. ధరను బట్టి కాకుండా వస్తువు అవసరాన్ని బట్టి కొనుగోలు చేయాలని నేర్పించండి. ఇవన్నీ వారి భవిష్యత్తుకి మేలు చేసేవే.



నిస్సత్తువా... భిన్నంగా ఆలోచించండి!

అలసట, నిరాసక్తత, నిస్సత్తువ... పేరేదైనా ఇంకేపనీ చేయబుద్ధికాని ఆ పరిస్థితి మీకూ ఎదురయ్యే ఉంటుంది. దీనికి పోషకాల లోపం, వ్యాయామం లేకపోవడం... ఒత్తిడి, ఆందోళన లాంటి మానసిక సమస్యలు కారణాలు కావొచ్చు. పరిష్కారంగా పోషకాహారం తీసుకోవాలనీ, వ్యాయామం చేయాలనీ చెబుతారు. కానీ అలసట కారణంగా తినబుద్ధి కావడంలేదనీ, వ్యాయామం చేయాలనిపించడంలేదనీ చెప్పేవాళ్లూ ఉన్నారు. దీనికి పరిష్కారం కాస్త భిన్నంగా ఆలోచించడమేనని చెబుతున్నారు నిపుణులు.

● మంచి ఆహారం తీసుకోవాలన్నా ప్రణాళిక, సమయం అవసరం. పిల్లలు, ఇంటి పని, ఆఫీసు... వీటన్నింటి మధ్య అదనపు సమయం కేటాయించడమూ కష్టం అనిపిస్తుంది. చేయాల్సిన పనుల జాబితా చాంతాడంత ఉన్నా... ఇదే పరిస్థితి. రోజువారీ పనుల్లో కోత వేయండి.

● లక్ష్య సాధనలో ఆత్మవిశ్వాసం లోపించడం కూడా నిస్సత్తువకు కారణం కావొచ్చు. జీవితంలో పెద్ద లక్ష్యాలు... నిర్దేశించుకుని వాటిని సాధించగలమా లేదా అని పదే పదే ఆందోళన చెందుతున్నారా.. . బదులుగా సాధించగలిగే లక్ష్యాలే పెట్టుకోండి. లేదంటే లక్ష్యాల్ని భాగాలుగా విడగొట్టండి.

● రొటీన్‌కు భిన్నంగా ఏదైనా ప్రయత్నించండి. మీకు ఇష్టమైన పనేదైనా చేయండి. ప్రకృతిలోకి వెళ్లి ఫొటోలు తీయడం, పెయింటింగ్ వేయడం... లాంటివి ప్రయత్నించండి. మీకోసం కొంత సమయం కేటాయించుకోండి.

● వనరుల అతి వినియోగంవల్ల భూమిపైన ఎలా ఒత్తిడి పడుతుందో తెలుసుకదా! మనకూ అంతే... సమయం, శక్తి, వనరులు ఎక్కడ అదనంగా ఖర్చవుతున్నాయో గుర్తించి వాటిని తగ్గించుకోండి.



కస్తూర్బా బాలికలు ఆంగ్లంలో అదరగొట్టేస్తున్నారు!

పల్లెల్లోనూ ప్రైవేటు బడులపై ఆసక్తికి ఆంగ్ల మాధ్యమం చదువులూ ఓ కారణమే. అందుకే, వాటికి దీటుగా ప్రభుత్వ పాఠశాల చిన్నారులకు ఇంగ్లిష్ వచ్చేలా చేయాలనుకున్నారు ఉపాధ్యాయురాలు సీఆర్టీ బుర్ర లత. పెద్దపల్లి జిల్లా అంతర్గాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా చేయగలిగారు. ఆమె ఏం చెబుతున్నారంటే...

పోటీ ప్రపంచంలో నిలబడాలంటే... మాతృభాషపై మమకారంతోపాటు ఆంగ్లభాషపై పట్టు అవసరం. 2018లో నేనీ పాఠశాలలో చేరినప్పుడు విద్యార్థినులు ఆంగ్లంలో మాట్లాడేందుకు సిగ్గు పడేవారు. భయంతో వెనకంజ వేసేవారు. ఈ విషయాన్ని గమనించి వాళ్లకి ఆంగ్లం ప్రాముఖ్యత, భాషపై ఆసక్తి కల్పించాలని వినూత్నంగా ఆలోచించా. 100 రోజుల యాక్షన్ ప్లాన్, వ్యక్తిగత డిక్షనరీలు, లఘు చిత్రాలు, తదితర అంశాలను సిద్ధం చేసి ఒక్కొక్కటిగా అమలు చేశా. దీంతో విద్యార్థినులకు ఆంగ్ల భాషపై ఆసక్తి పెరిగి చదవడం, మాట్లాడటం, రాయడంలో విజయవంతమయ్యారు. అంతే కాదు, మారుమూల ప్రాంతంలోని మా కేజీబీవీ విద్యార్థినులకు రాష్ట్రపతికి రాఖీ కట్టే అవకాశం వచ్చిందంటే... ఆంగ్లభాషపై పట్టు సాధించడమే కారణం. ఇది నా జీవితంలోనే అతి పెద్ద అవకాశం.

మాది గోదావరిఖని. నాన్న సింగరేణి కార్మికుడు. అక్కడే పదోతరగతి వరకూ చదివా. ఇంటర్ హైదరాబాద్‌లో, డిగ్రీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి చేశా. పెద్దపల్లిలో బీఈడీ అయ్యాక ఎంఏ ఇంగ్లిష్‌లో గోల్డ్‌మెడల్ సాధించా. ఆంగ్లం అంటే విద్యార్థినులకు భయం పోగొట్టేందుకు సరికొత్త బోధనా పద్ధతులద్వారా వారికి దగ్గరయ్యా. ఈ కృషికే ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నో అవార్డులూ, రివార్డులూ అందుకున్నా. తాజాగా తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రశంసాపత్రాన్నీ అందించింది. అదెలాగంటే...

100 రోజుల యాక్షన్ ప్లాన్: వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి నైపుణ్యాలపై 100 రోజుల ప్రణాళికను సిద్ధం చేసి రోజుకో టాపిక్ ఇచ్చా. స్వాతంత్ర్య సమరయోధులు, వ్యక్తిత్వ నిపుణులు, ఇతర అంశాలపై రోజుకో విద్యార్థిని 'జస్ట్ ఎ మినిట్' తరహాలో మాట్లాడటం, పాఠ్యాంశాలను స్కిట్లుగా, స్పీకింగ్ స్కిల్స్, రాత నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ నేర్పించా.

వ్యక్తిగత నిఘంటువులు: ప్రతి విద్యార్థి ఆంగ్లంలో రాణించాలంటే పదజాలం(ఒకాబులరి) ముఖ్యం. తరగతిలోని ప్రతి పాఠంలోని అర్థాలు, నానార్థాలు, వ్యతిరేక పదాలతో ప్రతిఒక్కరూ సెల్ఫ్ డిక్షనరీ తయారుచేసుకున్నారు. స్టేజ్ ఫియర్ పోగొట్టేందుకు... ప్రార్థన సమయంలో ఏదో ఒక అంశంపై విద్యార్థులు మాట్లాడాలన్న రూల్ పెట్టా. అంతేకాదు, ఆంగ్ల భాషలో మరింత అభివృద్ధి సాధించేందుకు 'ఇన్‌స్పైర్-ఎడ్యుకేట్-ఎంపవర్' అనే లఘు చిత్రాన్నీ రూపొందించాం. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా)తో పాటు మరెన్నో సంస్థలు నిర్వహించిన పలు పోటీల్లో మా విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపించారు. ఇవి పాఠశాల గౌరవాన్ని మరింత పెంచాయి. ఏ గురువుకైనా ఇంతకు మించిన సంతృప్తి ఏముంటుంది.

- కిరణ్, పాలకుర్తి



ఆన్‌లైన్ వేధింపులు ఆఫ్‌లైన్లో దాడులు!

మహిళా జర్నలిస్టులు, ఉద్యమకర్తలు ఆన్‌లైన్లో హింసను ఎదుర్కొంటున్నట్లు ఐరాస తాజా నివేదిక చెబుతోంది. ఈ రకమైన అనుభవం ఎదురవుతున్నట్లు అధ్యయనంలో పాల్గొన్న మూడింట రెండొంతుల మంది చెప్పడం గమనార్హం. అంతేకాదు, డిజిటల్ వేధింపులు ఎదుర్కొన్నవారిలో 40 శాతం మంది బయట కూడా దాడులకు గురవుతున్నారు. 119 దేశాలకు చెందిన 6900 మంది నుంచి ఈ వివరాలను తీసుకున్నారు. సోషల్ మీడియా, ఏఐ వినియోగం పెరుగుతోన్న నేపథ్యంలో ఇది ఆందోళనకరమైన పరిణామంగా చెబుతున్నారు నిపుణులు. ఐరాస మహిళా విభాగం, కొన్ని భాగస్వామ్య సంస్థల ఆధ్వర్యంలో... మహిళల హక్కులు, లింగ సమానత్వం, బాలిక-మహిళా సాధికారత కోణాల్లో అవగాహనే లక్ష్యంగా చేపట్టిన అధ్యయనమిది. 'మహిళలపైన ఆన్‌లైన్ హింస ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోంది. వేధింపులు, బెదిరింపులు కొన్నిసార్లు ఆన్‌లైన్ దాటి బయట ప్రపంచంలోనూ ఎదురవుతున్నాయి. భౌతిక, లైంగిక దాడులు, వెంబడించడం, మహిళ ఇంట్లో అత్యవసర పరిస్థితి అంటూ బోగస్ కాల్స్ చేసి వేధిస్తున్నారట. మానవ హక్కుల కోసం గొంతు వినిపించే రచయితలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, సోషల్ మీడియా కంటెంట్ ప్రొవైడర్లు ఈ దాడుల్ని ఎదుర్కొంటున్నారు. డీప్‌ఫేక్ ఇమేజ్‌లు, దుర్బుద్ధితో వ్యాఖ్యలు రాయడం వంటివీ ఉన్నాయి. గత అయిదేళ్లలో మహిళా జర్నలిస్టులపై హింస రెట్టింపు అయ్యిందంటారు పరిశోధనకు నాయకత్వం వహించిన జూలీ పొసెటి. 'ఇది ఎంతో ప్రమాదకరమైన మార్పు. వీటిని అరికట్టాలంటే... కఠినమైన చట్టాలు తేవడం, ఆన్‌లైన్లో మహిళలపైన దాడుల్ని మెరుగ్గా పర్యవేక్షించి నిలువరించడం, టెక్ కంపెనీలు మరింత బాధ్యతాయుతంగా ఉండటంతోపాటు సమాజంలోని మిగతా వర్గాలు మద్దతు తెలపడం ముఖ్యమ'ని చెబుతోందీ నివేదిక.

పీసీఓడీ... థైరాయిడ్... ఏం తినాలి?

నా వయసు 26. బరువు 48కేజీలు. ఎత్తు 155సెం.మీ. పెళ్లై మూడేళ్లవుతోంది. ఐదునెలల క్రితం ప్రెగ్నెంట్ అయ్యాను. బేబీకీ హార్ట్‌బీట్ లేదని అబార్షన్ చేశారు. తర్వాత నెలసరి క్రమం తప్పింది. పరీక్ష చేయిస్తే పీసీఓడీ, థైరాయిడ్ ఉన్నాయని తేలింది. థైరాయిడ్‌కి మందులు వాడుతున్నా. వీటిని తగ్గించుకుంటూనే గర్భం దాల్చాలంటే ఎలాంటి డైట్ పాటించాలి? – కల్యాణి, హైదరాబాద్

డియర్ వసుంధర



డాక్టర్ లతాశశి
పోషకాహార నిపుణులు

పీసీఓడీ, థైరాయిడ్ సమస్యలున్నవారు గర్భధారణ కోసం ప్రయత్నిస్తుంటే ముందుగా డాక్టర్‌ని సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాల్సి ఉంటుంది. వాటితోపాటు జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు తప్పక పాటించాలి. ఎత్తుకు తగ్గ బరువు తప్పక ఉండాలి. పీసీఓడీ ఉన్నవారిలో హార్మోన్లలో అసమతౌల్యం ఎక్కువ. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ఎప్పుడూ 23 లోపు ఉండాలి. అలా ఉంటేనే తల్లయ్యే అవకాశాలు ఎక్కువ. మీకు థైరాయిడ్ కూడా ఉంది కాబట్టి కొన్ని రకాల కాయగూరలు... క్యాబేజీ, బ్రొకలీ, కాలీఫ్లవర్ వంటివి పచ్చిగా తినకూడదు. పీసీఓడీ ఉన్నవాళ్లు శాచ్యురేటెడ్ ఫ్యాట్స్.. వెన్న, నెయ్యి వంటివి తగ్గించి తీసుకోవాలి. మాంసాహారులైతే మటన్‌ని మోతాదుకు మించి తినకూడదు. బరువు పెరిగేందుకు ఆహారంలో ప్రొటీన్ తప్పక ఉండాలి. దీనికోసం గుడ్డు, చికెన్‌లు మంచి ఎంపిక. నెలకి కేజీ నుంచి కేజీన్నర బరువు పెరిగేలా ఆహారంలో మార్పులు చేసుకోవాలి. ఇందుకు రోజూ 100 గ్రా. చొప్పున ఆకుకూరలను చపాతీ లేదా అన్నంతో కలిపి తినాలి. 10-15 గ్రా. చొప్పున ఏవైనా పప్పు దినుసులు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. 10-15గ్రా. నట్స్, సీడ్స్, డ్రైఫ్రూట్స్‌ని చిరుతిండిగా తినొచ్చు. ఆహారాన్ని తక్కువ మొత్తంలో ఎక్కువసార్లు తినాలి.

కలిసి పుట్టారు... సాధిస్తున్నారు

ముగ్గురు అక్కాచెల్లెళ్లు. కలిసి ఒకే కాన్పులో జన్మించారు. ఇప్పుడు కలిసి పతకాలను కొల్లగొడుతున్నారు. వాళ్ల కథేంటంటే...



సుచేత, రంజిత, సుప్రీత ఛటర్జీలది పశ్చిమ్‌బంగాలోని ఆసన్‌సోల్. వీళ్లు నెలలు నిండకముందే పుట్టారు. దీంతో బతకడమే కష్టమన్నారంతా. కానీ తల్లిదండ్రులు వీళ్లని కాచుకుంటూ వచ్చారు. తరవాతా బరువు లేకపోవడం, అనారోగ్యాలు వంటి ఎన్నో సమస్యలు. దీంతో డాక్టర్లు వాళ్లని క్రీడల్లో భాగం చేయమన్నారు. తండ్రి బామా ప్రసాద్ ఛటర్జీ చిన్న ట్యూటరింగ్ సెంటర్ నిర్వహిస్తారు. తల్లి సునేత్ర తండ్రికి ట్యూటరింగ్‌లో సాయపడతారు. వైద్యుల సలహామేరకు ఈ దంపతులు పిల్లల్ని తైక్వాండోలో చేర్చారు. ఆ అమ్మానాన్నల లక్ష్యం పిల్లలు ఆరోగ్యవంతులు అవ్వాలని! కానీ వాళ్లేమో అది దాటి తమకంటూ గుర్తింపు తెచ్చుకునే స్థాయికి చేరుకున్నారు. అనేక పోటీల్లో పతకాలు సాధించారు. ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తాజాగా బరేలీలో పోటీలు నిర్వహించింది. ఈ నేషనల్ కెడెట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో ఈ ముగ్గురు అక్కాచెల్లెళ్లూ నాలుగు బంగారు, ఒక్కోటి చొప్పున రజతం, కాంస్య పతకాలు గెలిచారు. అంతేకాదు, ఇప్పటివరకూ జాతీయ స్థాయి పోటీల్లో నాలుగుసార్లు విజేతగా నిలిచారు. అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటాలనేది వీరి కోరిక. మిగతా పిల్లలు ఆటలంటూ వెళ్తే... వీళ్లు మాత్రం రోజులో ఆరు గంటలు సాధనకే కేటాయిస్తారు. లక్ష్యం కోసం చదువు, ఆటపైనే పూర్తిగా దృష్టిపెడుతున్నారు. అయితే, శిక్షణ, పోషకాహారానికే ఖర్చు పెట్టలేని స్థితిలో ఉన్న కుటుంబం వాళ్లది. ఆ అమ్మాయిలు చదివేదీ ప్రభుత్వ పాఠశాలలోనే. 'ఇప్పటికే వాళ్ల అనారోగ్యం, శిక్షణ నిమిత్తం వాళ్ల తాతగారు ఉన్న కొంచెం ఆస్తిని అమ్మేశారు. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో నేను వాళ్ల శిక్షణని కొనసాగిస్తున్నా. కొందరు స్నేహితులూ సాయం చేస్తున్నారు. పిల్లలకేమో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఉంది. ప్రభుత్వం సాయం చేస్తే తమని తాము నిరూపించుకుంటారు' అంటున్నారు అమ్మాయిల తండ్రి ప్రసాద్. ఆ సాయం అంది... వాళ్లు కోరుకున్నట్టుగా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరుకుందామా?

ఈటీవీ భారత్



నడిచేటప్పుడు నిటారుగా!

వ్యాయామం చేయాలనుకున్నప్పుడు ప్రతి మహిళా మొదట ఎంచుకునే మార్గం నడకే. కానీ, ఆదిలోనే బోలెడన్ని కారణాలు చెప్పుకొని ఆగిపోతుంటారు. అలా కాకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోండి.

● సౌకర్యవంతమైన నడకకు వీలుగా షూస్ ఉండాల్సిందే. ఇవి కాళ్ల నొప్పులు రాకుండా కాపాడతాయి. మృదువైన కుషనింగ్‌తో కీళ్లకు సపోర్ట్‌ని ఇస్తాయి. అరికాళ్లపై ఒత్తిడిని తగ్గిస్తాయి. అంతేకాదు, మట్టి, రాళ్లు, నీళ్లు, టైల్స్.. ఇలా వేటి మీదైనా నడవడానికి సౌకర్యంగా ఉంటాయి. అసమానంగా ఉండే నేలపై నడవడానికి స్థిరత్వాన్ని ఇస్తాయి.

● వ్యాయామం ప్రారంభించిన రోజు నుంచే కిలోమీటర్లు నడిచేయాలని అనుకోవద్దు. మొదట ఓ 10-15 నిమిషాల దూరాన్ని నడిచి చూడండి. కాస్త శరీరం అలవాటు పడ్డాక క్రమంగా సమయాన్ని పెంచుకోండి. అయితే, వాకింగ్‌తో పాటు స్ట్రెచింగ్, కూల్‌డౌన్ ఎక్సర్‌సైజ్‌లు చేయడమూ ముఖ్యమే.

● వాకింగ్ చేసేటప్పుడు నిటారుగా నిలబడి అడుగులేయండి. అప్పుడే సరైన పోశ్చర్ సాధ్యమవుతుంది. అంతేకాదు, నడిచేముందు, తర్వాత తగినంత నీరు తాగడం తప్పనిసరి.

ప్రయోజనాలు: నడక గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. బరువు తగ్గడానికీ సాయపడుతుంది. ఎముకల్ని దృఢంగా మారుస్తుంది. కండరాల బలాన్ని పెంచుతుంది. శరీరాన్ని సౌకర్యవంతంగా మారుస్తుంది.



బంగారం - వెండి
10న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,31,960	1,19,850	1,90,755
విజయవాడ	1,28,360	1,19,450	1,91,300
ప్రొద్దుటూరు	1,27,800	1,17,580	1,83,000
రాజమహేంద్రవరం	1,30,310	1,19,450	2,07,000
విశాఖపట్నం	1,29,830	1,19,450	1,85,000
తమిళనాడు	-----	1,20,300	2,07,000



నాయకత్వం అంటే క్లిష్ట సమయంలో ముందుంటూ, సాధారణ సమయంలో వెనక నిలుస్తూ బృందాన్ని నడిపించడం. సుదీర్ఘ ప్రయాణంలో కొన్ని విజయాలు సాధించడం కాదు, మన తర్వాతా పదికాలాలపాటు నిలిచి ఉండేలా వ్యవస్థల్ని నిర్మించడం.
- నీతా అంబానీ, వ్యాపారవేత్త, ఫిలాంత్రపిస్ట్

5-3-1 రూల్... ఏం చెబుతుందంటే..!

ప్రస్తుతం పెరుగుతున్న సోషల్ మీడియా, ఇంటి నుంచి పని చేయడం, బిజీ షెడ్యూల్ ఇవన్నీ మనల్ని తెలియకుండానే సామాజిక సంబంధాలకు దూరం చేస్తున్నాయి. మన చుట్టూ ఉండే మనుషులు వారితో పరిచయాలు, స్నేహాలు కూడా మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా సామాజిక ఆరోగ్యం సరిగ్గా లేకపోతే ఒంటరితనం, నిరాశ, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయని వెల్లడించింది. అందుకే పరిచయాలను పెంచుకుని వాటిని కొనసాగించాలంటే 5-3-1 రూల్ పాటించాలంటున్నారు నిపుణులు. దీనివల్ల భావోద్వేగాలు నియంత్రణలో ఉండి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.



* రోజులో కనీసం ఐదునిమిషాలు మన మనసుకి దగ్గరైన వారితో ఓ ఐదునిమిషాలు మాట్లాడాలి. వారు అందుబాటులో లేకపోతే ఫోన్ లేదా మెసేజ్‌లో చిన్న పలకరింపు మనసుకి ఉత్తేజాన్నిస్తాయి. సామాజిక నైపుణ్యాల్నీ పెంచుతాయి.

* వారానికి మూడుసార్లు ఔటింగ్స్‌కి వెళ్లాలి. దీనికోసం పెద్ద పెద్ద ప్లానింగ్స్ అవసరం లేదు. మీ స్నేహితులతో కాఫీకి వెళ్లడం, సహోద్యోగితో బ్రేక్ టైమ్‌లో కలిసి వాక్‌కి వెళుతూ మాటలు కలపడం, ఖాళీ సమయంలో ఇంటి పక్కవారితో షాపింగ్‌కి వెళ్లడం మన పరిచయాల్ని పెంచడమే కాకుండా జీవితంలో వైవిధ్యాన్ని తీసుకొస్తాయి.

* వారంలో ఒకసారి కుటుంబంతో బయటికి భోజనానికి లేదా ట్రిప్‌కి వెళ్లిరండి. అదీ వద్దంటే భాగస్వామితో కాసేపు మనసువిప్పి మాట్లాడండి. ఇవన్నీ ఒంటరితనాన్ని దూరం చేసి, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

బంగారు తీగ... గుత్తుల్లో వేలాడుతోంది..!





ఇల్లంతా పచ్చగా అల్లుకున్న తీగకు... అందంగా విచ్చుకున్న పూల గుత్తులు కిందకి వేలాడుతుంటే చూడ్డానికి భలేగా ఉంటుంది కదూ! వీటిని మీరూ పెంచుకోవాలనుకుంటున్నారా? అయితే, మీకోసమే ఈ జాగ్రత్తలు...

గోల్డెన్ కాస్కేడ్ క్రీపర్ శాస్త్రీయనామం పెట్రియోవిటెక్స్ బాంబూసెటోరం. దీన్ని తెలుగులో బంగారు లత అని కూడా పిలుస్తారట. ఈ మొక్క ఒక్కసారి పూస్తే బంగారు వర్షం కురిసినట్లే అనిపిస్తుంది మరి. ఈ మొక్క ఒకప్పుడు మలేసియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా వంటి ఆగ్నేయాసియా దేశాల్లో విరివిగా కనిపించేది. కొన్నాళ్లుగా మన దగ్గరా వికసిస్తోంది. ఈ గోల్డెన్ కాస్కేడ్ క్రీపర్... వేగంగా పెరుగుతుంది. సుమారు ఇరవై నుంచి 25 అడుగుల ఎత్తువరకూ ఎగబాకి కిందకి వేలాడుతూ మురిపిస్తుంది. వీటి పూలు సుమారు 30-90సెం.మీల పొడవు వరకూ వేలాడతాయి. ఈ పూలు మొదట ఆకుపచ్చ రంగులో ఉండి తర్వాత పసుపు వర్ణంలోకి మారతాయి. పూర్తిగా వికసించాక కాస్త లేత కాషాయ ఛాయలోనూ కనిపిస్తాయి. ఈ పూలకు తేనెలాంటి సుగంధం ఉంటుంది. అందుకే, ఇవి సీతాకోకచిలుకలు, తేనెటీగల్ని ఎక్కువగా ఆకర్షిస్తాయి.




సంరక్షణ ఎలాగంటే...

మన దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ సులువుగా ఎదిగే తీగజాతి మొక్క ఇది. ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నేరుగా సోకే ఎండ అవసరం. నీడ ఎక్కువైతే పూత తగ్గుతుంది. నీరు నిలవని సారవంతమైన నేలల్లో ఇది చక్కగా పెరుగుతుంది. దీన్ని నాటుకునే మట్టిలో 30 శాతం కోకోపీట్, 20శాతం పేడ ఎరువు, పదిశాతం ఇసుక కలపాలి. ఈ గోల్డెన్ కాస్కేడ్‌ని నాటుకున్న మొదటి ఆరునెలలు రోజూ నీళ్లు పోయాలి. ఆ తర్వాత వారానికి రెండు మూడు సార్లు అందిస్తే చాలు. మొదలు చుట్టూ నీరు నిల్వకుండా చూసుకోవాలి. నెలకోసారి 19-19-19 నిష్పత్తిలో ఎన్‌పీకే సమగ్ర ఎరువుని అందిస్తే పూలు బాగా విచ్చుకుంటాయి. పూలు పూయడం పూర్తయ్యాక తీగల్ని 30శాతం వరకూ కత్తిరిస్తే మళ్లీ గుబురుగా విచ్చుకుంటుంది. మరుసటి సీజన్‌లో ఎక్కువ పూలూ వస్తాయి. ఈ మొక్క చాలా గట్టిది. కానీ, అధిక తేమ వల్ల ఆకుముడత, వేరు కుళ్లు తెగులు వచ్చే ముప్పు ఎక్కువ. మిలీ బగ్, స్పైడర్ మైట్ వంటివీ కొన్నిసార్లు ఆశించొచ్చు. ఓ చెంచా వేపనూనెను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేస్తే సరి. ఆరోగ్యంగా ఎదుగుతుంది.

ఇంటి తోట





చాంపియన్


హార్దిక్

టెస్టు చేజారినా.. వన్డే సిరీస్ గెలిచి జోరందుకుంది. అదే ఊపులో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ తొలి టీ20లో సఫారీలను చిత్తు చిత్తుగా ఓడించింది. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. జోరు కొనసాగించాలనుకుంటున్న ఆతిథ్య జట్టు.. రెండో టీ20లో నేడు దక్షిణాఫ్రికాను ఢీకొంటుంది. మరి భారత్ ఆధిక్యం 2-0కు పెరుగుతుందా లేదా దక్షిణాఫ్రికా పుంజుకుంటుందా?

ఈ జోరిలా సాగనీ..

దక్షిణాఫ్రికాతో భారత్ రెండో టీ20 నేడు

రాత్రి 7 గంటల నుంచి


సూర్య కుమార్ యాదవ్

ముల్లాన్‌పుర్ (న్యూ చండీగఢ్): రెట్టించిన ఉత్సాహంతో ఉన్న భారత జట్టు గురువారం జరిగే రెండో టీ20లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో ఓడినప్పటికీ సఫారీ జట్టు కూడా బలంగానే ఉన్న నేపథ్యంలో ఈ పోరు సూర్య బృందానికి తేలికేమీ కాదు. అయితే కటక్‌లో 101 పరుగుల విజయం ఆతిథ్య జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందనడంలో సందేహం లేదు. ముల్లాన్‌పుర్‌లోని పీసీఏ కొత్త స్టేడియంలో ఇదే పురుషుల తొలి అంతర్జాతీయ టీ20 మ్యాచ్.

ఒత్తిడిలో గిల్: పొట్టి సిరీస్‌లో శుభారంభం చేసినప్పటికీ టీమ్ఇండియా బ్యాటింగ్ మెరుగుపడాల్సివుంది. తొలి మ్యాచ్‌లో హార్దిక్ పాండ్య చెలరేగకపోయుంటే జట్టు ఇబ్బంది పడాల్సి వచ్చేది. ముఖ్యంగా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఒత్తిడిలో ఉన్నాడు. ఆసియాకప్‌లో పొట్టి ఫార్మాట్లోకి పునరాగమనం చేసినప్పటి నుంచి అతడి ఆటే చర్చనీయాంశంగా మారింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజు శాంసన్ బాగానే రాణిస్తున్నప్పటికీ జట్టు మేనేజ్‌మెంట్.. టీ20 ఓపెనర్‌గా గిల్ సామర్థ్యంపై విశ్వాసముంచింది. అప్పటి నుంచి సంజు తుది జట్టులో స్థానం కోసం తంటాలు పడుతున్నాడు. గత టీ20 ప్రపంచకప్ వరకు కోహ్లి పోషించిన పాత్రను వన్డే, టెస్టు కెప్టెన్ గిల్ సమర్థంగానే పోషించగలడు. కానీ టీమ్ఇండియా మరింత నిర్భయంగా, మరింత దూకుడుగా ఆడుతుండడం, లోతైన బ్యాటింగ్ లైనప్ ఉండడంతో యాంకర్ పాత్రకు వీలులేకుండా పోయింది. గిల్ పవర్‌ప్లేల్లో అభిషేక్ శర్మలా బాదేయలేడు. ఈ నేపథ్యంలో పరిస్థితులకు తగ్గట్లు అతడు తనను తాను ఎలా మలుచుకుంటాడో చూడాలి. తొలి టీ20లో గిల్ 4 పరుగులు మాత్రమే చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్ కూడా ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది కాలంగా నిలకడగా ఆడలేకపోతున్న అతడిపైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇంకొన్ని నెలల్లో టీ20 ప్రపంచకప్‌లో సూర్య జట్టును నడిపించనున్న నేపథ్యంలో అతడు పరుగుల బాట పట్టడం చాలా అవసరం. కటక్‌లో అతడు 12 పరుగులే చేశాడు. పేలవ ఫామ్‌ను అధిగమించడానికి సూర్యకు ఈ సిరీస్ ది చక్కని అవకాశం. రెండో టీ20 కోసం తుది జట్టులో టీమ్ఇండియా ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పునరాగమనంలో తొలి మ్యాచ్‌లోనే చెలరేగడం భారత్‌కు సంతోషాన్నిస్తోంది. కటక్‌లో కేవలం 28 బంతుల్లోనే అజేయంగా 59 పరుగులు చేసిన అతడు.. మరోసారి మెరవాలని జట్టు కోరుకుంటోంది. ఇంకా అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, దూబె, జితేశ్ శర్మలతో టీమ్ఇండియా బ్యాటింగ్ లైనప్ చాలా బలంగా కనిపిస్తోంది. ఇక బౌలర్లు గత మ్యాచ్‌లో సమష్టిగా విజృంభించడం భారత్‌కు సానుకూలాంశమే. పేసర్లు బుమ్రా, అర్ష్‌దీప్‌తో పాటు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, అక్షర్.. సఫారీ జట్టును దెబ్బతీశారు. వీళ్ల నుంచి మరో అదిరే ప్రదర్శనను జట్టు ఆశిస్తోంది. బౌలింగ్‌లోనూ భారత్ మార్పులు చేయకపోవచ్చు.

దక్షిణాఫ్రికా పట్టుదలతో..: తొలి మ్యాచ్‌లో ఘోరపరాజయం చవిచూసిన దక్షిణాఫ్రికా.. లెక్క సరిచేయాలనే పట్టుదలతో ఉంది. ఆ జట్టును భారత్ తేలికగా తీసుకుంటే పొరపాటే. అయితే సిరీస్‌ను సమం చేయాలంటే బ్యాటుతో సఫారీ జట్టు గణనీయంగా మెరుగుపడాల్సివుంది. కటక్‌లో ఆ జట్టు 74 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్‌ను ఎదుర్కోవడం దక్షిణాఫ్రికా బ్యాటర్లకు సవాలే.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్, శివమ్ దూబె, అక్షర్, అర్ష్‌దీప్, వరుణ్, బుమ్రా.

దక్షిణాఫ్రికా: డికాక్, మార్‌క్రమ్, స్టబ్స్, బ్రెవిస్, మిల్లర్, డొనోవన్ ఫెరీరా, యాన్సెన్, సిపమ్లా, కేశవ్ మహరాజ్, ఎంగిడి, నోకియా.

పిచ్.. వాతావరణం

ముల్లాన్‌పుర్ స్టేడియంలో మంచు ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. ఐపీఎల్‌లో ఇక్కడ మొదట బ్యాటింగ్ చేసిన జట్ల గెలుపోటముల రికార్డు 6-5గా ఉంది. 200పై లక్ష్యాలను జట్లు విజయవంతంగా కాపాడుకున్నాయి. ఫాస్ట్‌బౌలర్లకు సహకారం లభించవచ్చు.


అర్ష్‌దీప్ బుమ్రా


జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో కాంస్యం గెలిచిన భారత జట్టు

ఆఖర్లో అద్భుతం

పది నిమిషాల్లో నాలుగు గోల్స్ • భారత్‌కు కాంస్యం.. జర్మనీకి టైటిల్ • జూనియర్ హాకీ ప్రపంచకప్

చెన్నై

జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో టైటిల్ సాధించాలన్న లక్ష్యం నెరవేర్చుకోలేకపోయిన భారత్.. కాంస్యం కోసం జరిగిన పోరులో విజేతగా నిలిచింది. బుధవారం ఆతిథ్య జట్టు 4-2తో అర్జెంటీనాను ఓడించి మూడో స్థానం సాధించింది. సెమీస్‌లో భారత్‌ను ఓడించిన డిఫెండింగ్ ఛాంపియన్ జర్మనీ.. ఫైనల్లోనూ జయకేతనం ఎగురవేసింది. ఆ జట్టు రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. నిర్ణీత సమయంలో 1-1తో సమమైన ఫైనల్లో జర్మనీ షూటౌట్‌లో 3-2తో స్పెయిన్‌ను ఓడించింది. ఇక కాంస్య పోరులో భారత్ విజేతగా నిలవడం అనూహ్యమే. 48వ నిమిషం వరకు 0-2తో వెనుకబడి ఉన్న ఆతిథ్య జట్టు.. ఆఖర్లో చెలరేగి ఆడి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మూడో నిమిషంలోనే నికోలస్ రోడ్రిగ్జ్ గోల్‌తో అర్జెంటీనా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత్ ఎంత ప్రయత్నించినా స్కోరును సమం చేయలేకపోయింది. 44వ నిమిషంలో శాంటియాగో ఫెర్నాండెజ్ గోల్‌తో అర్జెంటీనా ఆధిక్యం రెట్టింపవడంతో భారత్‌కు ఓటమి తప్పదనిపించింది. కానీ చివర్లో భారత ఆటగాళ్లు రెచ్చిపోయారు. పది నిమిషాల వ్యవధిలో నాలుగు గోల్స్ కొట్టి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. 49వ నిమిషంలో అంకిత్ పాల్ భారత్ ఖాతా తెరవగా.. 52వ నిమిషంలో మన్‌మీత్ సింగ్ గోల్‌తో స్కోరు సమమైంది. శర్దానంద్ (57), అన్మోల్ ఎక్కా (58) గోల్స్‌తో భారత్ విజయాన్నందుకుంది. చివరగా 2016లో భారత జట్టు ఈ టోర్నీలో విజేతగా నిలిచింది. తర్వాతి రెండు టోర్నీల్లోనూ నాలుగో స్థానానికి పరిమితమైంది. ఈసారి మళ్లీ భారత జట్టు పోడియంపై నిలిచింది.



విజేత జర్మనీ జట్టు

"జూనియర్ జట్టుది గొప్ప ప్రయాణం. ఈ టోర్నీలో ఒత్తిడికి నిలిస్తే.. భవిష్యత్తులో ఒలింపిక్స్ సహా పెద్ద టోర్నీల్లో రాణించగలరని కుర్రాళ్లకు చెప్పా. 0-2తో వెనుకబడి, చివరి క్వార్టర్లో పుంజుకుని 4-2తో గెలవడమంటే అద్భుతం. టోర్నీలో ఇదే ఉత్తమ విషయం. ప్రపంచకప్‌లో భారత జట్టు ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంది. ఆ సవాలును స్వీకరించి కాంస్యం సాధించడం గొప్ప ప్రదర్శన"

– శ్రీజేష్, భారత జూనియర్ హాకీ కోచ్

క్రికెట్‌నే ఎక్కువ ప్రేమిస్తా


స్మృతి మంధాన

దిల్లీ: క్రికెట్ కన్నా దేన్నీ ఎక్కువగా ప్రేమించనని భారత మహిళల జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన చెప్పింది. "నేను క్రికెట్ కన్నా దేన్నైనా ఎక్కువగా ప్రేమిస్తానని అనుకోను. భారత జెర్సీని ధరించడం మాకు ప్రేరణనిస్తుంది. చిన్నప్పుడు బ్యాటింగ్ అంటే పిచ్చి. ఎవరూ అర్థం చేసుకోలేదు. కానీ మనసులో మాత్రం ప్రపంచ ఛాంపియన్ అని పిలిపించుకోవాలని అనుకునేదాన్ని" అని స్మృతి వివరించింది. 2013లో అరగేట్రం చేసిన స్మృతి.. నెల కింద భారత్ ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది. ప్రపంచకప్ తమ ఎన్నో ఏళ్ల శ్రమ ఫలితమని ఆమె బుధవారం ఓ కార్యక్రమం సందర్భంగా చెప్పింది. పలాశ్ ముచ్చల్‌తో తన వివాహం రద్దయ్యాక స్మృతి బయట కనిపించడం ఇదే తొలిసారి.

మెస్సి రాక వెనుక..?




కోల్‌కతాలో ఏర్పాటుచేసిన 70 అడుగుల మెస్సి విగ్రహం

కోల్‌కతా: ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడు లియోనెల్ మెస్సి. అలాంటి దిగ్గజ ఆటగాడు రెండోసారి భారత్‌కు రాబోతున్నాడు. ఈసారి అతను ప్రపంచకప్ విజేతగా భారత్‌లో అడుగు పెడుతున్నాడు. తనను నేరుగా చూసే అవకాశం కోసం దేశవ్యాప్తంగా సాకర్ ప్రియులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈసారి అతను మూడు రోజులు భారత్‌లో గడపబోతుండడం విశేషం. ఈ పర్యటనకు మెస్సిని రప్పించిన ఘనత శతద్రు దత్తాకే సొంతం. మెస్సి కంటే ముందు బ్రెజిల్ దిగ్గజం పీలేను, అర్జెంటీనా గ్రేట్ డీగో మారడోనాను భారత్‌కు తీసుకొచ్చింది కూడా అతనే కావడం విశేషం. మెస్సిని రప్పించడానికి అతను రెండేళ్ల పాటు శ్రమించడం గమనార్హం. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీకి చెందిన శతద్రు నిజానికి ఫుట్‌బాల్ కంటే ముందు క్రికెట్ ప్రేమికుడు. టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీకి అతను వీరాభిమాని. పలు కార్పొరేట్ సంస్థల్లో పని చేసిన అనుభవమున్న శతద్రు.. తర్వాత 'శతద్రు దత్తా ఇనిషియేటివ్' పేరుతో సొంత సంస్థను నెలకొల్పి.. స్పోర్ట్స్ మార్కెటింగ్, సెలబ్రిటీ మేనేజ్‌మెంట్ ఈవెంట్లు చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో గంగూలీతో కూడా అతను కలిసి పని చేశాడు. దీంతో శతద్రుకు ఈ రంగంలో మంచి పేరొచ్చింది. కోల్‌కతా సహా కొన్ని నగరాల్లో ఫుట్‌బాల్‌కు ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని శతద్రు.. ఈ ఆటలో దిగ్గజాలను భారత్‌కు రప్పించడంపై దృష్టి పెట్టాడు. 2015లో పీలేను కోల్‌కతాకు తీసుకువచ్చాడు. ఆ కార్యక్రమానికి గంగూలీ కూడా హాజరు కావడంతో అభిమానుల నుంచి గొప్ప స్పందన వచ్చింది. తర్వాత మారడోనా, రొనాల్డినో, ఎమి మార్టినెజ్ లాంటి స్టార్లతోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాడు శతద్రు. 2022లో అర్జెంటీనా ఫుట్‌బాల్ ప్రపంచకప్ గెలవడం, ఆ విజయంలో మెస్సి కీలక పాత్ర పోషించడంతో ప్రపంచవ్యాప్తంగా అతడి పేరు మార్మోగింది. దీంతో అతణ్ని భారత్‌కు రప్పిస్తే గత ఈవెంట్లు అన్నింటినీ మించిన స్పందన వస్తుందని.. అది భారత్‌లో ఫుట్‌బాల్ ఆదరణకూ తోడ్పడుతుందని భావించాడు శతద్రు. రెండేళ్ల పాటు ఇందుకోసం అతను ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. ముందుగా మెస్సి ఏజెంట్ అయిన అతడి తండ్రితో సంప్రదింపులు జరిపాడు. మరోవైపు మెస్సితో కలిసి ఆడిన అనుభవం ఉన్న రొనాల్డినో, మార్టినెజ్.. తమ భారత పర్యటన గురించి, శతద్రు గురించి అతడికి సానుకూలంగా చెప్పడం కలిసొచ్చింది. అనేక ప్రయత్నాల తర్వాత అతను ఈ నెల 13-15 మధ్య భారత్‌లో పర్యటించడానికి అంగీకరించాడు. కోల్‌కతాతో పాటు హైదరాబాద్, ముంబయి, దిల్లీ నగరాల్లో తన పర్యటన సాగనుంది. 13న సాయంత్రం హైదరాబాద్‌లో అతను పర్యటిస్తాడు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటారన్న సంగతి తెలిసిందే.

గాయాలు పరీక్షిస్తాయి: హార్దిక్

కటక్: సానుకూల దృక్పథం వల్లే గాయాల తర్వాత తాను బలంగా పునరాగమనం చేయగలిగానని టీమ్ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అన్నాడు. రెండు నెలల విరామం అనంతరం తిరిగి క్రికెట్లోకి వచ్చిన హార్దిక్.. తొలి టీ20లో దక్షిణాఫ్రికాపై భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. అతడు 28 బంతుల్లోనే 59 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ''మరింత బలంగా, మెరుగ్గా పునరాగమనం చేయాలనే ఆలోచనతో ఉండేవాణ్ని. గాయాలు ఆటగాడిని మానసికంగా పరీక్షిస్తాయి. తనపై తనకే సందేహాలు కలిగేలా చేస్తాయి. నేను బలంగా నిలిచా. చాలా విషయాల్లో హుందాగా వ్యవహరించా. ఫలితంగా ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. నా నైపుణ్యాలను నమ్ముకున్నా. ఆటగాడిగా నాపై నాకు నమ్మకముంది. నన్ను నేను నమ్మకపోతే ఇతరులు నన్నెలా నమ్ముతారు" అని హార్దిక్ చెప్పాడు. ఇతరులు తన గురించి ఏమనుకుంటున్నారన్నది పట్టించుకోనని అన్నాడు.

రోహిత్, కోహ్లిల కాంట్రాక్టులపై ఏజీఎంలో చర్చ!

ముంబయి: ఈ నెల 22న జరిగే బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిల కాంట్రాక్టుల సవరణ గురించి చర్చించనున్నారు. టెస్టులు, టీ20ల్లో రిటైరైన ఈ ఆటగాళ్లు.. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఏజీఎం ఆన్‌లైన్‌లో జరగనుంది. టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సీనియర్ ఆటగాళ్లు రవీంద్ర జడేజా, బుమ్రాలకు ఎ-ప్లస్ విభాగంలో చోటు దక్కే అవకాశముంది. దేశవాళీ క్రికెట్లో మహిళా క్రికెటర్లకు చెల్లింపుల గురించి, అంపైర్లు, మ్యాచ్ రిఫరీల ఫీజుల పెంపుపై కూడా ఏజీఎంలో చర్చిస్తారు. మిథున్ మన్హాస్ అధ్యక్షుడయ్యాక జరుగుతున్న తొలి ఏజీఎం ఇదే.

రోహిత్ × కోహ్లి

- అగ్రస్థానంలోనే హిట్‌మ్యాన్
- రెండో ర్యాంకుకు ఎగబాకిన కింగ్


రోహిత్ కోహ్లి

దుబాయ్: అంతర్జాతీయ కెరీర్ చరమాంకంలో అద్భుత ప్రదర్శన చేస్తున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తమ ఆధిపత్యాన్ని చాటుతున్నారు. కొన్ని నెలల నుంచి రోహిత్ శర్మ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ఆ ర్యాంకును చేజిక్కించుకోవడానికి విరాట్ కోహ్లి కూడా గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో రెండు శతకాలు, ఓ అర్ధశతకంతో 302 పరుగులు సాధించిన కోహ్లి.. ర్యాంకుల్లోనూ పురోగతి సాధించాడు. తాజా ర్యాంకింగ్స్‌లో అతడికి రెండో స్థానం దక్కింది. ఈ సిరీస్‌లో రోహిత్ కూడా రెండు అర్ధశతకాలు సాధించడంతో అతడి అగ్రస్థానానికి ఢోకా లేకపోయింది. కానీ కోహ్లి ఇదే ఊపును కొనసాగిస్తే నంబర్‌వన్ ర్యాంకు అతడి సొంతం కావచ్చు. చివరగా 2021లో అతను వన్డేల్లో నంబర్‌వన్‌గా ఉన్నాడు. గాయంతో దక్షిణాఫ్రికా సిరీస్‌కు దూరమైనప్పటికీ భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అయిదో ర్యాంకును నిలబెట్టుకున్నాడు. ఆ సిరీస్‌కు తాత్కాలిక సారథిగా వ్యవహరించిన కేఎల్ రాహుల్ రెండు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంకులో నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ పదో ర్యాంకులో కొనసాగుతున్నాడు. బౌలర్లలో స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ మూడు స్థానాలు మెరుగై మూడో ర్యాంకుకు చేరుకున్నాడు. భారత బౌలర్లలో అతనొక్కడే టాప్-10లో ఉన్నాడు. రషీద్ ఖాన్ (అఫ్గానిస్థాన్) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టెస్టు బ్యాటర్లలో రూట్ నంబర్‌వన్ ర్యాంకులో ఉండగా.. భారత్ నుంచి అత్యుత్తమంగా యశస్వి జైస్వాల్ ఎనిమిదో స్థానంలో నిలిచాడు. బౌలర్లలో బుమ్రా అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టీ20 బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ, బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి నంబర్‌వన్ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

విండీస్ 205 ఆలౌట్

న్యూజిలాండ్‌తో రెండో టెస్టు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో వెస్టిండీస్ తడబడింది. బుధవారం ప్రారంభమైన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. జాన్ క్యాంప్‌బెల్ (44; 87 బంతుల్లో 6×4), షై హోప్ (48; 80 బంతుల్లో 8×4) జట్టును ఆదుకున్నారు. కివీస్ బౌలర్లు బ్లెయిర్ టిక్నర్ (4/32), మైకేల్ రే (3/67) విజృంభించి విండీస్‌ను కట్టడి చేశారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 24 పరుగులు సాధించింది.


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పతక విజేతలు పూజారాణి, నుపుర్, మీనాక్షి, జైస్మీన్.

కమిన్స్ వచ్చేశాడు

యాషెస్ మూడో టెస్టులో బరిలోకి


ప్యాట్ కమిన్స్

అడిలైడ్: వెన్ను గాయం కారణంగా కొన్ని నెలలుగా క్రికెట్‌కు దూరంగా ఉన్న ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్.. ఎట్టకేలకు జట్టులోకి వచ్చాడు. సొంతగడ్డపై ఇంగ్లాండ్‌తో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో తొలి రెండు టెస్టులు ఆడలేకపోయిన అతను.. మూడో మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్ కోసం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో అతడికి చోటు దక్కింది. తొలి రెండు టెస్టుల్లో ఘనవిజయాలు సాధించిన ఆసీస్.. 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ నెల 17న అడిలైడ్‌లో మూడో టెస్టు మొదలవుతుంది. సిరీస్‌పై ఆశలు నిలవాలంటే ఈ మ్యాచ్‌ను ఇంగ్లాండ్ కనీసం డ్రా చేసుకోవాలి.

రోహిత్ భయ్యా ప్రేమతో తిడతాడు


జైస్వాల్

దిల్లీ: జూనియర్ ఆటగాళ్లను రోహిత్ శర్మ ప్రేమతో తిడతాడని టీమ్ఇండియా ఆటగాడు యశస్వి జైస్వాల్ అన్నాడు. "రోహిత్ భయ్యా మమ్మల్ని ఎప్పుడు తిట్టినా.. ప్రేమతో తిడతాడు. అందులో చనువు ఉంటుంది. భయ్యా ఒకవేళ తిట్టకపోతే ఏదో అసౌకర్యంగా ఉంటుంది. ఏం జరిగి ఉంటుంది? ఎందుకు తిట్టట్లేదు అని అనుకుంటా. నా మీద ఏమైనా చెడు భావన కలిగిందా అని అనిపిస్తుంది" అని ఓ సదస్సులో జైస్వాల్ చెప్పాడు. రోహిత్, కోహ్లి జట్టులో ఉంటే తమకు ప్రేరణగా ఉంటుందని అతడు పేర్కొన్నాడు. "వాళ్లు జట్టులో ఉండడం మాకు మేలు చేస్తుంది. ఆట గురించి చర్చిస్తారు. అనుభవాలను మాతో పంచుకుంటారు. ఆ ఆటగాళ్లు మాకు ప్రేరణ. ఆ ఇద్దరు తాము కెరీర్ మొదట్లో చేసిన తప్పుల గురించి వివరించి, మేము అలాంటి తప్పులు చేయకుండా ఎలా ఉండాలో చెబుతారు. వాళ్లు లేనప్పుడు వెలితిగా అనిపిస్తుంది. ఆ ఇద్దరు ఉంటే చాలా ప్రశాంతంగా ఉంటుంది'' అని జైస్వాల్ చెప్పాడు. అవకాశమొస్తే భారత జట్టుకు నాయకత్వం వహిస్తానని అతడు అన్నాడు. రోహిత్, కోహ్లి వన్డే ఫార్మాట్లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

ఉరుగ్వేపై భారత్ విజయం

శాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల హాకీ ప్రపంచకప్‌లో ఉరుగ్వేపై భారత్ పైచేయి సాధించింది. గోల్‌కీపర్ నిధి అద్భుతమైన డిఫెన్స్‌తో రాణించడంతో షూటౌట్‌లో భారత్ 3-1తో ఉరుగ్వేపై నెగ్గి తొమ్మిదో స్థానం రేసులో నిలిచింది. 9 నుంచి 12 స్థానాల కోసం జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసేసరికి 1-1తో స్కోరు సమమైంది. 19వ నిమిషంలో మనీషా గోల్ చేసి భారత్ ఖాతా తెరిచింది. మరి కొన్ని సెకన్లలో మ్యాచ్ ముగుస్తుందనగా ఉరుగ్వే గోల్ సాధించింది. షూటౌట్‌లో పూర్ణిమ యాదవ్, ఇషిక, కనిక సివాచ్ గోల్స్ సాధించారు. గురువారం 9, 10 స్థానాల కోసం జరిగే మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ తలపడుతుంది.

ప్రాక్టీస్ ప్రశ్నలు — అరిథ్‌మెటిక్

1. ఒక త్రిభుజం భుజాల కొలతలు 5 సెం.మీ., 6 సెం.మీ., 7 సెం.మీ. అయితే ఆ త్రిభుజ వైశాల్యం ఎంత?
   1) $3\sqrt{6}$ 2) $6\sqrt{6}$ 3) $9\sqrt{6}$ 4) $12\sqrt{6}$
2. 4 సెం.మీ. భుజంగా ఉన్న సమబాహు త్రిభుజ వైశాల్యం (చ.సెం.మీ.లలో)
   1) 3 2) $3\sqrt{3}$ 3) $4\sqrt{3}$ 4) $\sqrt{3}$
3. రెండు సరూప త్రిభుజాల భుజాలు 3 : 4 నిష్పత్తిలో ఉన్నాయి. అయితే వాటి వైశాల్యం నిష్పత్తి?
   1) 16 : 9 2) 9 : 16 3) 4 : 3 4) 4 : 5
4. ఒక సమబాహు త్రిభుజ భుజాన్ని 20% పెంచితే ఆ త్రిభుజం నూతన త్రిభుజం వైశాల్యాల నిష్పత్తి ఎంత?
   1) 6 : 5 2) 49 : 36 3) 36 : 25 4) 25 : 36
5. ఒక త్రిభుజం వైశాల్యం 64 సెం.మీ.^{2} దాని మధ్య బిందువులను కలపగా ఏర్పడే త్రిభుజ వైశాల్యం ఎంత?
   1) 16 2) 32 3) 48 4) 24

సమాధానాలు: 1-2; 2-3; 3-2; 4-4; 5-1.

సీనియర్ ఇంటర్ వృక్షశాస్త్రం — మొక్కలలో రవాణా

ఫైనల్ పరీక్షలు 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. పోరిన్‌లు అంటే ఏమిటి? విసరణ చర్యలో వాటి పాత్ర?

జ: ★▲ పోరిన్‌లు అంటే ప్రొటీన్లు.
★ ఇవి ప్లాస్టిడ్‌లు, మైటోకాండ్రియా, కొన్ని బ్యాక్టీరియమ్‌ల వెలుపలి త్వచంలో పెద్ద సైజు రంధ్రాలను ఏర్పరచి చిన్న సైజు ప్రొటీన్ల పరిమాణంతో దాదాపు సమానంగా ఉన్న అణువులను రవాణా చేయడానికి తోడ్పడతాయి.

2. నీటి శక్మాన్ని నిర్వచించండి. శుద్ధమైన నీటికి ఉన్న నీటిశక్మం విలువ ఎంత?

జ: ★ నీటి అణువులు గతిజశక్తిని కలిగి ఉంటాయి. దీనినే నీటి శక్మం అంటారు.
నీటి శక్మం = ద్రావిత శక్మం + పీడన శక్మం
$\Psi_W = \Psi_S + \Psi_P$
★ శుద్ధజలం నీటి శక్మం విలువ సున్నా.

3. విసరణ, ద్రవాభిసరణకు మధ్య భేదమేమిటి?

జ: విసరణ: పదార్థపు అణువులు అధిక గాఢత ఉన్న ప్రాంతం నుంచి, అల్ప గాఢత ఉన్న ప్రాంతం వైపునకు దిశా రహితంగా చలించడాన్ని విసరణ అంటారు. త్వచం అవసరం లేదు.

ద్రవాభిసరణ: నీటి అణువులు అధిక నీటి శక్మం ఉన్న ప్రాంతం నుంచి తక్కువ నీటి శక్మం ఉన్న ప్రాంతం వైపు భేదక పారగమ్యతా త్వచం ద్వారా చలించడాన్ని ద్రవాభిసరణ అంటారు.

4. అపోప్లాస్ట్, సింప్లాస్ట్ అంటే ఏమిటి?

జ: అపోప్లాస్ట్: ◆ మొక్క దేహం నిండా పక్కపక్కన ఆనుకుని ఉన్న కణకవచాలు అవిచ్ఛిన్నంగా ఏర్పడి ఉన్న స్థితిని అపోప్లాస్ట్ వ్యవస్థ అంటారు. ◆ అపోప్లాస్ట్ నీటి చలనం కణాంతరవకాశాలు, కణకవచాల ద్వారా మాత్రమే జరుగుతుంది.

సింప్లాస్ట్: ◆ మొక్క దేహంలో కణకణానికి మధ్య ఏర్పడి ఉన్న ప్రోటోప్లాస్ట్‌ల అంతర్జాల వ్యవస్థను సింప్లాస్ట్ అంటారు. సింప్లాస్ట్ చలనంలో నీరు కణాల్లోని కణద్రవ్యం ద్వారా ప్రయాణిస్తుంది. ◆ కణాల మధ్య నీటి చలనం కణద్రవ్య బంధాల ద్వారా జరుగుతుంది.

5. బాష్పోత్సేకం, బిందుస్రావానికి మధ్య భేదం ఏమిటి?

జ: బాష్పోత్సేకం: మొక్కల వాయుగత భాగాల్లోని సజీవ కణజాలాల నుంచి నీరు ఆవిరిరూపంలో వాతావరణంలోనికి కోల్పోయే ప్రక్రియను బాష్పోత్సేకం అంటారు.

బిందుస్రావం: అనేక గుల్మయుత్ మొక్కల్లో, గడ్డిజాతి మొక్కల పత్రాల కొన ఈనెల వద్ద ఉండే ప్రత్యేక జల రంధ్రాల ద్వారా నీటి బిందువులు విడుదల కావడాన్ని బిందుస్రావం అంటారు.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు


రచయిత: టి.నాగరాజు

జనరల్ స్టడీస్ — పర్యావరణ అంశాలు

జల కాలుష్యానికి కొలమానాలు!

జీవనాధారమైన నీరు హానికర రసాయనాలు, సూక్ష్మజీవుల రహితంగా ఉంటేనే వినియోగానికి ఉపయోగపడుతుంది. ఆధునిక ప్రపంచంలో మానవ కార్యకలాపాలతో నీటిలో రకరకాల మలినాలు, ప్రమాదకర బ్యాక్టీరియా, ఖనిజాలు, సేంద్రియ వ్యర్థాలు చేరి కలుషితం చేస్తున్నాయి. దానిని నియంత్రించకపోతే మనుషుల ఆరోగ్యంతో పాటు జలచరాలు, జలావరణ వ్యవస్థలు నాశనమవుతాయి. ఈ రకమైన కాలుష్యాన్ని గుర్తించి నీటి స్వచ్ఛతను నిర్ధారించేందుకు బీఓడీ, సీఓడీ వంటి ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా నీటి శుద్ధి కోసం ఉపకరించే ఆ కొలమానాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఈ ప్రక్రియల్లో నీటిలోని సేంద్రియ పదార్థాల విచ్ఛిన్నం, కర్బన పదార్థాల గుర్తింపు, నివారణ జరిగే తీరును అర్థం చేసుకోవాలి.






నీటి స్వచ్ఛత-ప్రమాణాలు

బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్

నిర్దిష్ట ఉష్ణోగ్రత, కాలవ్యవధి వద్ద నీటి నమూనాలోని సేంద్రియ పదార్థాలను విచ్ఛిన్నం చేయడానికి, అందులోని బ్యాక్టీరియా లాంటి జీవులకు అవసరమైన ఆక్సిజన్ మొత్తాన్ని బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ)గా నిర్వచిస్తారు. సరళంగా చెప్పాలంటే ఆక్సీకరణ ప్రక్రియ ద్వారా సేంద్రియ పదార్థ విచ్ఛిన్నానికి కావాల్సిన ఆక్సిజన్ పరిమాణం. ఈ విధంగా నీటిలో కరిగిన ఆక్సిజన్ మొత్తాన్ని కొలవడానికి ఉపయోగించే జీవ పద్ధతిని బీఓడీ అంటారు. నీటి వనరుల్లోని సేంద్రియ పదార్థాల స్థితిని విచ్ఛిన్నం చేసే ప్రక్రియ కోసం సూక్ష్మజీవులు ఉపయోగించే ఆక్సిజన్ మొత్తాన్ని బీఓడీ కొలుస్తుంది.


ఇది జల పర్యావరణ వ్యవస్థలో ఉన్న సేంద్రియ కాలుష్య పరిమాణాన్ని సూచిస్తుంది. అకర్బన పదార్థం రసాయన ఆక్సీకరణను కూడా నియంత్రిస్తుంది. వాయు శ్వాసక్రియ జరిపే జీవుల ద్వారా సేంద్రియ వ్యర్థాలను నాశనం చేయడానికి లేదా మురుగునీటి శుద్ధి కోసం ఉపయోగిస్తారు. ✦ నేలలు, మురుగు నీరు, అవక్షేపం, చెత్త, బురద మొదలైన వాటిలో ఉండే సేంద్రియ పదార్థం మొత్తాన్ని బీఓడీ నిర్ణయిస్తుంది. జీవుల్లో శ్వాసక్రియ రేటును గుర్తిస్తుంది. కణవర్ధనం ఆక్సిజన్ వినియోగాన్ని పరీక్షించడానికి ఔషధ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. ✦ బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్‌ను పర్యావరణ కాలుష్యం స్థాయికి సూచికగా ఉపయోగించవచ్చు. ఉదాహరణకు సేంద్రియ పదార్థాల స్థాయి ఎంత ఎక్కువగా ఉంటే బీఓడీ కూడా అంత ఎక్కువగా ఉంటుంది. పర్యవసానంగా చేపలు లాంటి సముద్ర జీవులకు కావాల్సిన కరిగిన ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోతుంది. అందుకే మురుగునీటిని జలాశయంలోకి వదిలే ముందే దాని బీఓడీని మురుగునీటి శుద్ధిప్లాంట్ల ద్వారా తగ్గిస్తుంటారు.



కెమికల్ ఆక్సిజన్ డిమాండ్

రసాయన పదార్థాల ద్వారా కర్బన పదార్థాలను విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఆక్సిజన్ డిమాండ్‌ను కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ అంటారు. సీఓడీని సాధారణంగా నీటి కాలుష్యాన్ని, నీటి నాణ్యతను తెలుసుకోవడానికి ఉపయోగిస్తారు. సీఓడీని కొన్ని సందర్భాల్లో బీఓడీని లెక్కించడానికి వాడతారు. సీఓడీని నిర్ధారించడానికి పొటాషియం అయోడిన్, పొటాషియం పర్మాంగనేట్‌ను వినియోగిస్తారు. ఈ రసాయనాలను ఆమ్ల స్వభావంలో ప్రయోగించి కాలుష్య కారకాలను గుర్తిస్తారు. సీఓడీ నిర్ధారణకు 2 - 3 గంటల సమయం సరిపోతుంది. అదే బీఓడీని నిర్ధారించడానికి అయిదు రోజులు పడుతుంది. బీఓడీ, సీఓడీలు రెండూ కర్బన పదార్థాలను విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఆక్సిజన్‌ను కొలిచే ప్రక్రియలే. సీఓడీలో కర్బన పదార్థాలు అంటే బయోడీగ్రేడబుల్, నాన్-బయోడీగ్రేడబుల్. బీఓడీలో కర్బన పదార్థాలు అంటే కేవలం బయోడీగ్రేడబుల్ మాత్రమే. సీఓడీ ద్వారా బీఓడీని నిర్ధారించవచ్చు. కానీ బీఓడీ ద్వారా సీఓడీని నిర్ధారించడం కుదరదు. అందువల్ల సీఓడీ నీటిలో ఉన్న విషపదార్థాల తీవ్రతను కచ్చితంగా తెలియజేస్తుంది. బీఓడీ కోసం సూక్ష్మజీవులను 20° సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో 5 రోజుల పాటు నిర్ణీత నీటి నమూనాలో ఉంచి తెలుసుకుంటారు.

సీఓడీ విశ్లేషణ: సేంద్రియ వ్యర్థాలతో కలుషితమైన నీటి నమూనాలోని ఆక్సిజన్ క్షీణత కొలతనే కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ విశ్లేషణ అంటారు. ముఖ్యంగా ఇది నీటిలోని సేంద్రియ సమ్మేళనాలను రసాయనికంగా ఆక్సీకరణం చేయడానికి అవసరమైన ఆక్సిజన్ సమాన మొత్తాన్ని కొలుస్తుంది. సీఓడీని నీటి నాణ్యత సాధారణ సూచికగా ఉపయోగిస్తారు. ఇది అన్ని నీటి నాణ్యత నిర్వహణ కార్యక్రమాల్లో అంతర్భాగం. అలాగే సీఓడీను తరచూ బీఓడీ అంచనా వేసేందుకూ ఉపయోగిస్తారు. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ అనేది నీరు, మురుగునీటి నాణ్యతకు కొలమానం. నీటిశుద్ధి ప్లాంటు సామర్థ్యాన్ని పర్యవేక్షించేందుకు సీఓడీ పరీక్షను తరచూ వాడతారు. ★ సేంద్రియ నీటిని రసాయనికంగా ఆక్సీకరణం చేయడానికి ఉపయోగించే ఆక్సిజన్ మొత్తాన్ని సీఓడీ అంటారు. సీఓడీని తరచూ ఆమ్ల పరిస్థితుల్లో బలమైన ఆక్సిడెంట్‌ని ఉపయోగించి కొలుస్తారు. ఆక్సీకరణ పూర్తయిన తర్వాత ద్రావణంలో మిగిలి ఉన్న ఆక్సిడెంట్ మొత్తాన్ని కొలవడం ద్వారా నమూనాలోని సేంద్రియాల సాంద్రతను లెక్కిస్తారు. ఇది సాధారణంగా ఇండికేటర్ ద్రావణాన్ని ఉపయోగించే టైట్రేషన్ ద్వారా జరుగుతుంది. సీఓడీ మి.గ్రా/లీ. లో వ్యక్తమవుతుంది. ఇది లీటరు ద్రావణానికి వినియోగించే ఆక్సిజన్ ద్రవ్యరాశిని సూచిస్తుంది. ప్రతి నిర్దిష్ట నమూనాకు బీఓడీ, సీఓడీ మధ్య సంబంధం ఉంది. ఇచ్చిన నమూనా బీఓడీని అంచనా వేయడానికి సీఓడీ పరీక్ష ఫలితాలను ఉపయోగించవచ్చు. బీఓడీ పరీక్షకు భిన్నంగా, విశ్లేషించాల్సిన నమూనాల్లోని విష సమ్మేళనాలు సీఓడీ పరీక్షలో ఉపయోగించే ఆక్సిడెంట్లపై ప్రభావం చూపవు. అందువల్ల విషపూరితమైన వ్యర్థాల బలాన్ని కొలవడానికి సీఓడీ పరీక్షను ఉపయోగించవచ్చు. కొన్ని సేంద్రియ అణువులు డైక్రోమేట్ ఆక్సీకరణకు సాపేక్షంగా నిరోధకత కలిగి ఉంటాయి, అవి తక్కువ సీఓడీని ఇవ్వవచ్చు. సీల్ చేసిన నీటి నమూనాను 20 డిగ్రీల సెల్సియస్ వద్ద అయిదు రోజుల పాటు తటస్థంగా ఉంచి (ఇంక్యుబేషన్) బీఓడీని కొలుస్తారు. కరిగిన ఆక్సిజన్ తగ్గడం వల్ల వాయు శ్వాసక్రియ జరిపే జీవులు సేకరించిన ఆక్సిజన్ పరిమాణాన్ని గుర్తిస్తారు. సీఓడీ పరీక్షలోనూ నీటి నమూనాను ఇంక్యుబేట్ చేస్తారు.



కరిగిన ఆక్సిజన్

నీటిలో కరిగే మొత్తం ఆక్సిజన్‌ను కరిగిన ఆక్సిజన్ అంటారు. బీఓడీ ద్వారా పలు అంశాలను గుర్తించవచ్చు. జలావరణ వ్యవస్థలో సూక్ష్మజీవులు ఎంత ఆక్సిజన్‌ను వినియోగించుకుంటాయో తెలుసుకోవచ్చు. నీటి ఆవరణ వ్యవస్థలో ఉన్న కర్బన పదార్థాల కాలుష్యాన్ని గుర్తించవచ్చు. దీని ద్వారా సీఓడీని కూడా అంచనా వేయవచ్చు. మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో ఆక్సిజన్‌ను ఎంత మోతాదులో కలపాలో, కర్బన పదార్థాలను ఎంత మోతాదులో తొలగించాలో అంచనా వేయవచ్చు. దీని ద్వారా జీవుల శ్వాసక్రియ రేటును లెక్కించవచ్చు. ఫార్మా పరిశ్రమల్లో సెల్‌కల్చర్‌కు ఆక్సిజన్ ఎంత అవసరమో గుర్తించవచ్చు. బీఓడీ ఎక్కువగా ఉంటే ఆ నీరు ఎక్కువగా కలుషితమైందని అర్థం. మురుగునీటి శుద్ధి ప్లాంట్లలో బీఓడీని తగ్గించేందుకు ప్రయత్నిస్తారు.


రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

అధిక జనాభా నగరాలన్నీ ఆసియాలోనే!

ప్రపంచంలోనే అధిక జనాభా ఉన్న నగరంగా ఇండోనేసియా రాజధాని జకార్తా వార్తల్లో నిలిచింది. తొలిసారిగా గగనతలంలోని లక్ష్యాన్ని డ్రోన్‌తో కూల్చిన ఘనతను తుర్కియే సాధించింది. టాప్ వంద ఆయుధ కంపెనీల్లో భారత్ నుంచి మూడు ప్రభుత్వరంగ కంపెనీలు స్థానాలను దక్కించుకున్నాయి. బెంగాల్‌కు చెందిన మాండరిన్ నారింజకు, తమిళనాడులోని సంప్రదాయ బెల్లంపొడికి జీఐ గుర్తింపు లభించింది. ప్రధానమంత్రి కార్యాలయం సేవాతీర్థ్‌గా, రాజ్‌భవన్‌లు లోక్‌భవన్‌లుగా మారాయి. ఈ విధంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వర్తమానాంశాలు, ముఖ్య పరిణామాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో, ప్రపంచవ్యాప్తంగా జరిగిన కీలక నియామకాలు, విడుదలైన నివేదికలు, ఇటీవల నిర్వహించిన ఫిఫా కప్, ఇఫీ వేడుకల విశేషాలు, విజేతలు, వార్తల్లో నిలిచిన వ్యక్తుల గురించి అవగాహన కలిగి ఉండాలి.



మాదిరి ప్రశ్నలు

1. ఏ దేశానికి నూతన ప్రధానిగా ఇలి డోవియోరా నియమితులయ్యారు?



   1) జింబాబ్వే
   2) గినియా
   3) గినీబిస్సావు 4) నమీబియా

నోట్: ★ గినీబిస్సావు రాజధాని - బిస్సావు. కరెన్సీ - సీఎఫ్ఏ ఫ్రాంక్, అధికార భాష-పోర్చుగీస్ ★ గినియా రాజధాని - కొనాక్రి, కరెన్సీ - గినియా ఫ్రాంక్

2. శ్రీలంకలో దిత్వా తుపాను బాధితులకు సహాయం అందించేందుకు భారత్ ప్రకటించిన ఆపరేషన్ పేరు ఏమిటి?



   1) ఆపరేషన్ సాగర్ బంధు
   2) ఆపరేషన్ సాగర్ మిత్ర
   3) ఆపరేషన్ మిత్ర 4) ఆపరేషన్ దాన

3. ఏ రాష్ట్రంలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తం మఠం 550వ వార్షికోత్సవంలో మోదీ పాల్గొని 77 అడుగుల శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు?
   1) మహారాష్ట్ర 2) తమిళనాడు
   3) కేరళ 4) గోవా

నోట్: ★ ప్రపంచంలోనే అతి ఎత్తయిన శ్రీరాముడి విగ్రహం. ★ ఈ విగ్రహాన్ని డిజైన్ చేసినవారు రామ్‌సుతార్.

4. కిందివాటిలో సరైంది.



   ఎ) 20వ ఎడిషన్ ఫిఫా అండర్-17 ప్రపంచకప్ ఖతార్‌లో 2025, నవంబరు 3 నుంచి 27 వరకు జరిగింది.
   బి) ఈ టోర్నీ విజేత - పోర్చుగల్, రన్నర్ - ఆస్ట్రియా.
   సి) ఈ టోర్నీలో ఉత్తమ ఆటగాడు మాటియస్ మైడ్ (పోర్చుగల్).
   డి) ఈ టోర్నీ టాప్ స్కోరర్ (8 గోల్స్) జోహన్నెస్ మోసర్ (ఆస్ట్రియా).
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి

5. ఆసియా పవర్ ఇండెక్స్ – 2025లో భారత్ 40.0 స్కోరుతో ఏ ర్యాంక్ సాధించింది?
   1) 1 2) 2 3) 3 4) 4

నోట్: ★ ఆస్ట్రేలియాకు చెందిన లోవీ ఇన్‌స్టిట్యూట్ ఆర్థిక బలం, సైనిక సామర్థ్యం అంశాల ఆధారంగా ఈ సూచీని 27 దేశాలతో విడుదల చేసింది. ★ 80.5 స్కోర్‌తో అమెరికా మొదటి స్థానంలో, 73.7 స్కోర్‌తో చైనా రెండో స్థానంలో, 38.8 స్కోర్‌తో జపాన్ నాలుగో స్థానంలో ఉన్నాయి.

6. ఇటీవల మరణించిన టెన్నిస్ ప్లేయర్ నికోలా పియాట్రాంగెలీ ఏ దేశానికి చెందినవారు?
   1) ఇంగ్లండ్ 2) కెనడా 3) ఇటలీ 4) అమెరికా

నోట్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ రాబిన్ స్మిత్ ఇటీవల మరణించారు.

7. 56వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవం (ఇఫీ)కి సంబంధించి సరైంది?
   ఎ) 2025, నవంబరు 20-28 తేదీల్లో 56వ ఇఫీ గోవాలోని పనాజీలో జరిగింది.
   బి) ఈ చిత్రోత్సవంలో గోల్డెన్ పీకాక్ అవార్డు (ఉత్తమ చిత్రం) - స్కిన్ ఆఫ్ యూత్ (వియత్నాం).
   సి) సిల్వర్ పీకాక్ అవార్డు (ఉత్తమ డైరెక్టర్) - సంతోష్ దవాఖర్ (గోండల్).
   డి) సిల్వర్ పీకాక్ అవార్డు (ఉత్తమ నటుడు) - ఉదేయిమార్ రియోస్ (ఏ పొయెట్).
   ఇ) సిల్వర్ పీకాక్ అవార్డ్ (ఉత్తమ నటి) - జారా సోఫిజా ఓస్టాన్ (లిటిల్ ట్రబుల్ గర్ల్స్).
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి, డి, ఇ
   3) ఎ, బి, సి, ఇ 4) ఎ, బి, సి

8. కిందివాటిలో సరైంది.



   ఎ) దిల్లీలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న కొత్త ప్రధానమంత్రి కార్యాలయ సముదాయానికి 'సేవాతీర్థ్' అని పేరు పెట్టారు.
   బి) అన్ని రాజ్‌భవన్‌లకు లోక్‌భవన్‌గా పేరు మార్చారు.
   సి) రాజ్‌నివాస్‌ల పేర్లను లోక్‌నివాస్‌గా మార్పు చేశారు.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి

9. ఏ రాష్ట్రంలోని వొరైయూర్ కాటన్ చీర, కవిందపడి నట్టు సక్కరై అనే సంప్రదాయ బెల్లంపొడి నమక్కల్ సోప్‌స్టోన్ కుక్‌వేర్, తూయమల్లి బియ్యం అంబసముద్రం చొప్పు సమన్ అనే చెక్క బొమ్మలకు జీఐ ట్యాగ్ లభించింది.
   1) ఉత్తర్‌ప్రదేశ్ 2) కేరళ
   3) గోవా 4) తమిళనాడు

10. ఎల్ఐసీ ఎండీగా కిందివారిలో ఎవరు నియమితులయ్యారు?



   1) రామకృష్ణన్ చందర్
   2) కునాల్ సింగ్
   3) సత్యనారాయణ
   4) దరమ్‌నాథ్

కరెంట్ అఫైర్స్

నోట్: ★ కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) కొత్త ఛైర్మన్‌గా వివేక్ చతుర్వేది నియమితులయ్యారు.
★ లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ పదవీకాలాన్ని ఒక సంవత్సరం పొడిగించారు.

11. యూఎన్‌ఓ ప్రపంచ అర్బనైజేషన్ ప్రాస్పెక్ట్స్–2025 ప్రకారం ప్రపంచంలో ఎక్కువ జనాభా ఉన్న మొదటి మూడు నగరాలు వరుసగా?
   1) జకార్తా, ఢాకా, టోక్యో
   2) ఢాకా, జకార్తా, టోక్యో
   3) టోక్యో, జకార్తా, ఢాకా
   4) టోక్యో, దిల్లీ, ముంబయి

నోట్: ★ జకార్తా (4.19 కోట్లు), ఢాకా (3.66 కోట్లు), టోక్యో (3.34 కోట్లు), దిల్లీ (3 కోట్లు) తొలి నాలుగు స్థానాల్లో నిలిచాయి.
★ 2050 నాటికి ఢాకా తొలి స్థానానికి చేరే అవకాశం ఉంది.


12. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ 2025 సంవత్సరపు పదం?
   1) రేజ్ బైట్ 2) పారాసోషియల్
   3) "6 - 7" 4) వైబ్ కోడింగ్

నోట్: ★ కేంబ్రిడ్జ్ డిక్షనరీ వర్డ్ ఆఫ్ ది ఇయర్ 2025 - పారాసోషియల్
★ డిక్షనరీ.కామ్ వర్డ్ ఆఫ్ ది ఇయర్ 2025 - "6 - 7"
★ కోలిన్స్ డిక్షనరీ వర్డ్ ఆఫ్ ది ఇయర్ 2025 - వైబ్ కోడింగ్
★ Rage bait - దీన్ని ఆన్‌లైన్‌లో వీక్షకులను పెంచడానికి, కోపాన్ని రెచ్చగొట్టడానికి రూపొందించిన కంటెంట్‌గా నిర్వచించారు.

13. ఏ సంవత్సర కాలానికి భారతదేశం యునెస్కో ఎగ్జిక్యూటివ్ బోర్డుకు తిరిగి ఎన్నికైంది?
   1) 2026 - 2028 2) 2026 - 2029
   3) 2025 - 2027 4) 2025 - 2029

నోట్: 2026 - 27 పదవీకాలానికి ఇంటర్నేషనల్ మారీటైమ్ ఆర్గనైజేషన్ కౌన్సిల్‌కు భారత్ తిరిగి ఎన్నికైంది.

14. ఇంటర్‌పోల్ కొత్త అధ్యక్షుడిగా ఎవరు ఎన్నికయ్యారు?



   1) డేవిడ్ కాలమ్ (అమెరికా)
   2) లుకాస్ ఫిలిప్పే (ఫ్రాన్స్)
   3) సత్యప్రసాద్ (ఇండియా)
   4) ఆల్బర్ట్ నీట్ (ఆస్ట్రేలియా)

15. కిందివాటిలో సరైంది.
   ఎ) 14వ ఎడిషన్ సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్-300 బ్యాడ్మింటన్ దిల్లీలో జరిగింది.
   బి) ఈ టోర్నీ పురుషుల సింగిల్స్ విజేత - జాసన్ గుణవన్ (హాంగ్‌కాంగ్)
   సి) ఈ టోర్నీ మహిళల సింగిల్స్ విజేత - హీనా అకేజీ (జపాన్)


గాయత్రి, ట్రెసా జాలీ

   డి) ఈ టోర్నీ పురుషుల డబుల్స్ విజేత - కాంగ్ ఖై జంగ్ (మలేసియా), ఆరోన్‌తాయ్ (మలేసియా)
   ఇ) ఈ టోర్నీ మహిళల డబుల్స్ విజేత - ట్రెసా జాలీ(భారత్), గాయత్రి గోపిచంద్ పుల్లెల(భారత్).
   1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, డి, ఇ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, బి, సి

నోట్: ఈ టోర్నీ నవంబరు 25-30 (2025) లఖ్‌నవూలో జరిగింది.


16. డిసెంబరు – 1 (2025) ఎయిడ్స్ డే థీమ్ ఏమిటి?
   1) Overcoming Disruption, Transforming the AIDS Response.
   2) Take the right path: My health my right.
   3) Let communities lead 4) Equalize

17. మలేసియాలో జరిగిన 31వ ఎడిషన్ సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ కప్ ఫైనల్లో ఇండియాను ఓడించి ఏ దేశం తొలిసారి విజేతగా నిలిచింది?
   1) జపాన్ 2) దక్షిణ కొరియా
   3) సింగపూర్ 4) బెల్జియం

18. కృష్ణా బోర్డు ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు?
   1) బి.మోహన్ 2) ఆర్.కృష్ణ
   3) ఎస్.బిశ్వాస్ 4) ఎం.నగేశ్

19. కిందివాటిలో సరైంది.
   ఎ) 'కిజిలెల్మా' అనే మానవరహిత యుద్ధ విమానం రాడార్ మార్గనిర్దేశకత్వంలో గగనతలంలోని మరో లక్ష్యాన్ని నేలకూల్చిన ఘనత సాధించింది. ఇది తుర్కియే దేశానికి చెందింది.
   బి) భారత విమానయాన రంగంలో పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న 'హంస-3' శిక్షణ విమానం వాణిజ్య ఉత్పత్తికి సిద్ధమైంది. దీనికి సంబంధించిన ఒప్పందం సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) - నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్ మధ్య కుదిరింది.
   సి) ఆయుధ విక్రయాలు, సేవల ద్వారా ప్రపంచంలో 100 అగ్రశ్రేణి ఆయుధ ఉత్పత్తి సంస్థలు ఆర్జించిన ఆదాయం 2024లో 5.9% పెరిగినట్లు స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (SIPRI - సిప్రీ) నివేదిక పేర్కొంది.
   డి) సిప్రీ నివేదిక ప్రకారం టాప్-100 ఆయుధ కంపెనీల్లో భారత్‌కు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ 44వ స్థానంలో, భారత్ ఎలక్ట్రానిక్స్ 58వ స్థానంలో, మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్ 91వ స్థానంలో ఉన్నాయి.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, సి డి 4) ఎ, సి


20. ఇటీవల జీఐ ట్యాగ్ పొందిన 'మాండరిన్ నారింజ' ఏ రాష్ట్రానికి చెందింది?



   1) కేరళ 2) ఉత్తరాఖండ్
   3) పశ్చిమ బెంగాల్ 4) గుజరాత్

21. 2025 ప్రపంచ అథ్లెట్స్ ఆఫ్ ది ఇయర్‌గా ఈ కిందివాటిలో ఎవరు ఎంపికయ్యారు?
   1) అర్మాండ్ డుప్లాంటిస్
   2) సిడ్నీ మెక్‌లాఫ్లిన్ - లెవ్రోన్
   3) 1, 2 4) ఆబ్లిక్ సెవిల్లె

నోట్: ★ ఆర్మాండ్ డుప్లాంటిస్ స్వీడన్‌కు చెందిన పోల్‌వాల్ట్ స్టార్. ★ సిడ్నీ మెక్‌లాఫ్లిన్ - లెవ్రోన్ అమెరికాకు చెందిన మహిళా స్ప్రింటర్.


రచయిత: బి.ధన్‌మోహన్

సమాధానాలు

1-3, 2-1, 3-4, 4-3, 5-3, 6-3, 7-2, 8-3, 9-4, 10-1, 11-1, 12-1, 13-4, 14-2, 15-2, 16-1, 17-4, 18-3, 19-3, 20-3, 21-3.



ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటోన్న ప్రధాన సమస్యల్లో వాతావరణ మార్పు ఒకటి. మానవ అభివృద్ధి క్రమంలో చోటు చేసుకుంటున్న పరిస్థితులు, పారిశ్రామికీకరణ, నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికత లాంటివి సహజ వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్థికాభివృద్ధి పేరుతో పర్యావరణం విధ్వంసానికి గురవుతోంది. పరిశ్రమల్లో యంత్రీకరణ, వ్యవసాయంలో అనుసరిస్తోన్న నూతన టెక్నాలజీ ఫలితంగానూ వాతావరణ సమతౌల్యత నాశనమవుతోంది. వర్షాభావ పరిస్థితులు, కాలుష్య సమస్యలు తలెత్తి ఆ ప్రభావం మానవాళి మనుగడపై పడుతోంది. వాతావరణ మార్పు సమస్యను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ చర్యలు, అనుసరిస్తున్న విధానాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

అన్ని అనర్థాలకూ మూలం..
మానవాభివృద్ధికి అవరోధం!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

భారత ఆర్థిక సమస్యలు - వాతావరణ మార్పు

ఐక్యరాజ్య సమితి (ఐరాస) 2030 డిసెంబరు నాటికి సాధించాలని తీర్మానించిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 13వది పర్యావరణ మార్పు, దాని ప్రభావంపై సత్వర చర్యలు (Take urgent action to combat climate change and its impacts). సహజ విపత్తులు, శీతోష్ణస్థితి సంబంధ విపత్తులను తట్టుకోగలిగే సామర్థ్యాన్ని బలోపేతం చేయడం దీని లక్ష్యం.

✦ దీనికి అనుగుణంగా మన దేశంలో వాతావరణ మార్పుపై ఎనిమిది ముఖ్య జాతీయ మిషన్లను వివరిస్తూ జాతీయ వాతావరణ మార్పు కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించారు. అవి:

1. జాతీయ సౌర మిషన్ (National Solar Mission): దీన్ని 2010, జనవరి 11న ప్రారంభించారు. దీన్నే జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ సోలార్ మిషన్ (జేఎన్ఎన్ఎస్ఎం) అంటారు. దేశవ్యాప్తంగా సౌర విద్యుత్ శక్తిని ప్రోత్సహించడం దీని ఉద్దేశం.

☛ 2022 నాటికి 20 గిగావాట్ల గ్రిడ్ విద్యుత్ ఉత్పత్తి దీని లక్ష్యం. 2015, జులై 1న కేంద్రం ఈ లక్ష్యాన్ని 100 గిగావాట్లకు పెంచింది.

☛ చోదక సౌరశక్తి వృద్ధి (Propeller Solar Energy) సామర్థ్యాన్ని 2016లో 9.01 గిగావాట్స్ నుంచి 2025లో 97.86 గిగావాట్స్‌కు పెంచారు.

2. జాతీయ పవన శక్తి మిషన్ (National Wind Energy Mission): దేశంలో పవన శక్తి సామర్థ్యాన్ని పెంచడం దీని ప్రధాన ఉద్దేశం. దీని కోసం విండ్ టెక్నాలజీలో కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందిస్తారు.

3. నేషనల్ మిషన్ ఫర్ ఎన్‌హన్స్‌డ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (National Mission for Enhanced Energy Efficiency): దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల శక్తి సామర్థ్యాన్ని పెంచడం దీని లక్ష్యం. ఇందు కోసం పెర్ఫార్మ్, అచీవ్, ట్రేడ్ (పీఏటీ) పథకాన్ని రూపొందించారు. ఇంధన ఆదా, ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలుగా ఇది పనిచేస్తుంది.

4. స్థిర ఆవాసాలపై జాతీయ మిషన్ (National Mission on Sustainable Habitat): దేశవ్యాప్తంగా మానవ నివాసయోగ్యమైన సుస్థిర ఆవాసాలను అభివృద్ధిచేయడం దీని లక్ష్యం. సుస్థిర రవాణా, అధిక సామర్థ్యం ఉన్న గృహాల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ లాంటి చర్యల ద్వారా సుస్థిర ఆవాసాల సృష్టికి ఈ మిషన్ కృషి చేస్తుంది.

5. జాతీయ జల మిషన్ (National Water Mission): జల సంరక్షణ, నీటి నష్ట నివారణ, దేశవ్యాప్తంగా జలవనరుల కల్పన - వాటి విస్తరణ, సమగ్ర జల వనరుల నిర్వహణ మొదలైనవి ఈ మిషన్ లక్ష్యాలు. దేశవ్యాప్తంగా జలవినియోగ సామర్థ్యాన్ని 20% పెంచాలనేది ఈ కార్యక్రమం ఉద్దేశం.

6. హిమాలయ ఆవరణ వ్యవస్థను స్థిరంగా ఉంచే జాతీయ మిషన్ (National Mission for Sustaining the Himalayan Ecosystem): హిమాలయాల సుస్థిర అభివృద్ధి, వాటి ఆవాసాల పర్యవేక్షణను అక్కడి ప్రజల సహకారంతో నిర్వహించాలనే లక్ష్యంతో ఈ మిషన్‌ను ప్రారంభించారు. పరిశోధన, పర్యవేక్షణ ద్వారా పెళుసైన హిమాలయ పర్యావరణ వ్యవస్థను రక్షించడానికి ఇది పనిచేస్తుంది.

7. అనుకూల వ్యవసాయానికి జాతీయ మిషన్ (National Mission for Sustainable Agriculture): గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక ప్రగతికి సుస్థిర వ్యవసాయం ముఖ్యమని భావించి ఈ మిషన్‌ను రూపొందించారు. స్థిరమైన పద్ధతులు, పంట వైవిధ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయంలో స్థితిస్థాపకతను పెంపొందించడం దీని లక్ష్యం.

8. నేషనల్ మిషన్ ఫర్ ఏ గ్రీన్ ఇండియా: దేశవ్యాప్తంగా అటవీ, అటవీయేతర భూముల విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచి కార్బన్ డైఆక్సైడ్ స్థాయిని తగ్గించడం కోసం ఈ మిషన్‌ను ప్రారంభించారు.

రంగాల వారీ వ్యూహాలు

భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద గోధుమ, వరి ఉత్పత్తిదారు. అస్థిర వాతావరణం వల్ల రైతులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. అనుసరణ వ్యవసాయం పెరిగినప్పటికీ అనుకూల సామర్థ్యం అనేది ప్రాంతాలవారీగా మారుతూ ఉంటుంది. వాతావరణ స్థితిస్థాపక మౌలిక వసతులతో సహా రంగాల నిర్దిష్ట, క్రాస్ సెక్టోరల్ ప్రాధాన్యత లక్ష్యాలను బలోపేతం చేయడానికి వ్యూహాలను అభివృద్ధి చేశారు.

శక్తి రంగం (ఎనర్జీ సెక్టార్): పునరుత్పాదక శక్తిపై పెట్టుబడి పెట్టడం. **ఉదా:** సోలార్, విండ్, బయోమాస్, స్మార్ట్ గ్రిడ్స్.

వ్యవసాయం: వాతావరణ మార్పులను తట్టుకునే పంటలపై దృష్టి సారించడం. నీటిపారుదల సౌకర్యాలు అభివృద్ధి చేయడం. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించడం.

పట్టణ అభివృద్ధి: సుస్థిర పట్టణ ప్రణాళికను ప్రోత్సహించడం, గ్రీన్ బిల్డింగ్ ప్రాక్టీసెస్, వ్యర్థ నిర్వహణ చర్యలు తీసుకోవడం.

జల వనరులు: నీటి సంరక్షణ (వాటర్ కన్జర్వేషన్)ను ప్రోత్సహించడం, వర్షపు నీటిని ఒడిసిపట్టి వాటిని వ్యవసాయానికి ఉపయోగించడం, నీటిపారుదల (నదులు, కాలువలు)ను సక్రమంగా నిర్వహించడం.

విపత్తు నిర్వహణ: మెరుగైన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, సంసిద్ధత ద్వారా వాతావరణ ప్రేరిత విపత్తులకు వ్యతిరేకంగా స్థితిస్థాపకతను బలోపేతం చేయడం.

వాతావరణ మార్పులపై ప్రభుత్వ కార్యాచరణ - ప్రణాళికలు

వాతావరణ మార్పుల కారణంగా తీవ్ర స్థాయిలో ప్రభావానికి గురవుతోన్న దేశాల్లో భారత్ ఒకటి. దేశ సామాజిక, ఆర్థిక స్థితులపై ఇది ఉంటోంది. ప్రస్తుతం మన దేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. ఈ క్రమంలోనే ప్రపంచ వాతావరణ మార్పు ఉపశమన ప్రయత్నాల్లో తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోంది. ఇందులో భాగంగానే గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను 2070 నాటికి నికర సున్నా (నెట్ జీరో) స్థాయికి తేవాలని దీర్ఘకాలిక ప్రణాళిక రచించింది.

◆ 2022లో శిలాజేతర ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఆ వనరుల నుంచి సమగ్ర (Cumulative) విద్యుత్ శక్తి స్థాపిత సామర్థ్య లక్ష్యాన్ని 2030 నాటికి 50శాతాకి పెంచారు.

◆ భారత్ 2022, నవంబరులో వాతావరణ మార్పుపై 'యూఎన్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్'కు ఒక నివేదికను సమర్పించింది. లాంగ్-టర్మ్ లో-కార్బన్ డెవలప్‌మెంట్ స్ట్రాటజీ (ఎల్‌టీ-లీడ్స్) పేరుతో రూపొందించిన ఆ నివేదికలో హరిత గృహ వాయు ఉద్గారాల కట్టడికి తీసుకోవాల్సిన 7 వ్యూహాల గురించి ఉంది. అవి:

1. ఇంధన సామర్థ్యాన్ని పెంచడం (Enhancing Energy Efficiency)
2. రవాణా రంగాన్ని డీకార్బనైజ్ చేయడం (Decarbonizing the Transport Sector)
3. శిలాజేతర విద్యుత్ వాటాను పెంచడం (Increasing Share of Non-Fossil Electricity)
4. కార్బన్ సింక్‌లను పెంచడం (Enhancing Carbon Sinks)
5. వాతావరణ స్థితిస్థాపక మౌలిక సదుపాయాలు (Climate Resilient Infrastructure)
6. ఆర్థిక, సాంకేతిక బదిలీని సమీకరించడం (Mobilizing Finance and Technology Transfer)
7. వ్యర్థాల నుంచి సంపదను సృష్టించడం (Promoting Waste-to-Wealth Conversion)



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day 857

Requite

Telugu meaning: బహుమతిగా ఇచ్చు, తిరిగి చెల్లించు

English meaning: The word requite (రిక్వైట్) is a verb that means to return a favour, service, or feeling, often in terms of love, kindness, or revenge.

Synonyms: Repay, Return; ***Antonyms:*** Ignore, Disregard

Usage: **1.** She hoped to requite his kindness by helping him during a difficult time.

2. His desire to requite the insult led him to react more strongly than necessary.

Current Affairs



The traditional saree weaving art of Tangail from Bangladesh and Behzad's style of miniature painting from Afghanistan were among the elements which were inscribed on UNESCO's Representative List of the Intangible Cultural Heritage of Humanity.

✦ The ongoing 20th session of the Intergovernmental Committee under the 2003 UNESCO Convention in New Delhi, India, took the decision on 9 December 2025.

A total of 7075.78 Megawatts of rooftop solar capacity has been installed in the country under the PM Surya Ghar Muft Bijli Yojana scheme in the residential sector. Minister of State for New and Renewable Energy, Shripad Yesso Naik said this in Rajya Sabha on 9 December 2025. The scheme aims to achieve rooftop solar installations in one crore households in the residential sector by financial year of 2026-27 with an outlay of 75,021 crore rupees.



President Droupadi Murmu presented the National Handicrafts Awards for the years 2023 and 2024 at an event held in New Delhi on 9 December 2025. A total of 48 awards were presented, including - 12 Shilp Guru awards and 36 National awards, including 2 Design & Innovation Awards (artisan–designer collaboration). Among the awardees, 20 are women artisans.

India and Brunei held the inaugural meeting of their Joint Working Group (JWG) on Defence Cooperation in New Delhi on 9 December 2025, marking a key step forward in strengthening bilateral defence ties.

✦ The discussions focused on expanding military-to-military exchanges, enhancing joint training initiatives, deepening maritime security collaboration, and strengthening cooperation in Humanitarian Assistance and Disaster Relief (HADR).

For more Current Affairs: **Scan QR code**

యునిసెఫ్ డే

డిసెంబరు 11
చరిత్రలో ఈనాడు

బాలల సంక్షేమంపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. వారే రేపటి ప్రపంచ భవిష్యత్తు. చిన్నారుల సంరక్షణ విషయంలో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల నిధి (United Nations Children's Fund - UNICEF) సంస్థ ఎనలేని కృషి చేస్తోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని బాలల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఇది పని చేస్తోంది. అనేక వర్ధమాన దేశాల్లో బాలల ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం అందించడం, రోగ నియంత్రణ లాంటి కార్యక్రమాలను చేపడుతోంది. దీని ఏర్పాటుకు గుర్తుగా ఏటా డిసెంబరు 11న 'యునిసెఫ్ డే'గా (UNICEF Day) నిర్వహిస్తారు. పిల్లల జీవితాలకు సవాలుగా ఉన్న సమస్యల గురించి అవగాహన కల్పించడంతో పాటు వారికి సాయం చేయాల్సిన ఆవశ్యకత గురించి చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

పనితీరు

పిల్లల సంక్షేమం, వారి అభివృద్ధి అనేది యునిసెఫ్ లక్ష్యం. దీని సాధన అది కమ్యూనిటీ స్థాయి సేవలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తుంది. 190 దేశాల్లో ఇది తన కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

✦ చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, నీరు, పారిశుద్ధ్యం, విద్య, సంరక్షణ, లైంగిక సమానత్వం లాంటి అంశాల్లో ఆయా దేశాల ప్రభుత్వాలు, ఇతర సంస్థలతో కలిసి యునిసెఫ్ పనిచేస్తోంది. ఇది ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, వ్యక్తుల నుంచి విరాళాలు సేకరించి, వాటితో కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

ఇతర ముఖ్యాంశాలు

మన దేశంలో యునిసెఫ్ కార్యకలాపాలు 1949 నుంచి మొదలయ్యాయి.

✦ యునిసెఫ్‌కు 1965లో నోబెల్ శాంతి బహుమతి, 1989లో ఇందిరా గాంధీ అవార్డు, 2006లో ప్రిన్సెస్ ఆఫ్ అస్టురియాస్ అవార్డు దక్కాయి.

unicef for every child

చారిత్రక నేపథ్యం


రెండో ప్రపంచయుద్ధం తర్వాత యూరప్‌లోని బాలలకు ఆహారం, మందులు, దుస్తులు లాంటి అత్యవసర సాయం అందించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి (ఐరాస) జనరల్ అసెంబ్లీ 1946, డిసెంబరు 11న 'ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి' (యునిసెఫ్)ని ఏర్పాటు చేసింది.

పాలకమండలి - ప్రస్తుత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు సహా పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

ఉపరితల రసాయనశాస్త్రం

ఉపరితలాలు లేదా అంతర్ తలాల వద్ద జరిగే దృగ్విషయాలను అధ్యయనం చేసే శాస్త్రమే 'ఉపరితల రసాయనశాస్త్రం' (Surface Chemistry). ఒక పదార్థం వేరొక ద్రవం లేదా ఘనపదార్థం అంతర్భాగాల్లోకి చొచ్చుకుపోకుండా ఉపరితలంపైనే ఉండటాన్ని 'అధిశోషణం' అంటారు. వాయువుల్లో భౌతిక, రసాయనిక అధిశోషణం జరుగుతుంది. వీటి తీవ్రతను ప్రభావితం చేసే అంశాలపై పోటీపరీక్షార్థులు అవగాహన ఏర్పర్చుకోవాలి.



వాయువుల అధిశోషణ తీవ్రతను ప్రభావితం చేసే అంశాలు

✦ అధిశోషకం ఉపరితల వైశాల్యం ✦ అధిశోషితం (వాయు) స్వభావం
✦ వాయువు పీడనం ✦ ఉష్ణోగ్రత

అధిశోషణం అనువర్తనాలు

✦ వాయు ముసుగు
✦ తేమను నియంత్రించడం
✦ జడవాయువుల మిశ్రమాన్ని వేరుచేయడం
✦ అధిక శూన్యస్థితిని ఏర్పర్చడం
✦ వ్యాధులను నయం చేసే ప్రక్రియ

అధిశోషణ క్రమం, ఫ్రాయిండ్లిష్ అధిశోషణ సమోష్ణరేఖ, ఫ్రాయిండ్లిష్ సమీకరణం, ద్రావణాల నుంచి అధిశోషణం - ఇమిడి ఉన్న సూత్రాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Apprentice Posts

Hindustan Urvrak Rasayan Limited, Gorakhpur, Uttar Pradesh, is inviting applications for the recruitment of Technician and Graduate Apprentice Trainee posts in HURL Barauni Unit. The total no. of posts is 33. Eligible candidates can apply online before 20 December 2025.

Engineering Assistant Trainee Posts

Bharat Electronics Limited (BEL), a government defence sector organisation, is inviting applications for the Engineering Assistant Trainee and Technician-C posts in various departments. The total no. of posts is 14. The application fee is Rs.590. The last date for online applications is 23 December 2025.

Junior Assistant Posts

The Central Board of Secondary Education (CBSE), an autonomous body functioning under the auspices of the Union Ministry of Education, is inviting online applications for the recruitment of Superintendent, Assistant Professor, Junior Assistant, etc. The total no. of posts is 124. Eligible candidates can apply online before 22 December 2025.

Did You Apply..?

Today (December 11) is the last date for the following Jobs/ Admissions

☛ KVS – NVS Recruitment Notification 2025 - 14,967 posts.

☛ Medical Consultant Posts in RBI. ***Eligibility:*** MBBS.

☛ Data Entry Operator Jobs in AIIMS Delhi. ***Eligibility:*** Intermediate.


☛ XAT (Xavier Aptitude Test) - 2026 Notification. ***Eligibility:*** Bachelor's Degree.

For more information and other notifications - scan QR code

Multi - Dimensional Logical Diagrams

Directions (Qs. 1 - 3): *The diagrams shown below represent 3 segments of society overlapping each other*

viz. circle = educational youth
triangle = unemployed youth
square = employed youth




Based on the above relationship given in the diagram answer the following

1. Which number of the following represents "some educated youth are employed".
A) 3 B) 5 C) 4 D) 2 E) 1

2. Some youth are neither educated nor employed
A) 2 B) 5 C) 4 D) 3 E) 1

3. Some educated youths are not employed.
A) 4 B) 6 C) 3 D) 5 E) 1

Directions (Qs. 4 - 8): *The diagrams shown below represent 3 segments of society over lapping each other viz. post graduates, doctors, musicians denoted by triangle, circle and rectangle respectively.*



Based on the above relationships given in the diagram answer the following.

4. Post graduates who are doctors but not musicians are represented by.....
A) a B) b C) f
D) e E) None of these

5. Doctors who are neither post graduates nor musicians are represented by...
A) b B) e C) c
D) f E) None of these

6. Post graduates who are musicians but not doctors are represented by...
A) a B) b C) d D) c E) f


7. Post graduates who are doctors as well as musicians are represented by....
A) c B) f C) b D) a E) g

8. Doctors who are musicians and still Post graduates only a represented by...
A) e B) f C) g D) c E) d

Bank Exams
Reasoning

Directions (Qs. 9 - 13): *Questions are based on the following figure study the figure carefully and answer the questions that follow.*

In the following diagram hexagon represents Olympians, triangle represents Indians, circle represents Swimmers and rectangle represents Government employees.



9. Which numbers represents Indians who are neither Swimmers nor Government employees and never been to Olympics?
A) 3, 11, 12 B) 3, 12 C) 3, 7, 10
D) 3, 4, 10 E) None of these

10. Non Indian Swimmers who are Olympians also are represented by...
A) 1 B) 2 C) 5
D) 6 E) None of these

11. Non Indian Olympians are represented by number....
A) 1 B) 2 C) 3 D) 4 E) 5

12. Chances of having a government employee being an olympian are (based an diagram)
A) Occasional B) Always
C) Never D) Very Little
E) Data inadequate

13. The number '6' represents...
A) Indian swimmers
B) Indian Government employees who are swimmers also
C) Non - Olympians, Non Indian swimmers
D) Non - indian Government employees
E) None of these

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

జెన్-జడ్‌తో నేపాల్ ప్రభుత్వం ఒప్పందం

- ఎన్నికల సంస్కరణలు సహా 10 అంశాలపై ఇరుపక్షాల సంతకం

కాఠ్‌మాండూ: అవినీతికి, అస్తవ్యస్త పాలనకు నిరసనగా ఉద్యమించిన జెన్-జడ్ ప్రతినిధులు.. నేపాల్‌లోని తాత్కాలిక ప్రభుత్వం మధ్య బుధవారం కీలక ఒప్పందం కుదిరింది. ఎన్నికల సంస్కరణల అమలు, సుపరిపాలన, ఐటీవలి నిరసన ఉద్యమాల సమయంలో హక్కుల హననంపై ఉన్నత స్థాయి దర్యాప్తు, అవినీతి నిర్మూలనకు కమిటీ ఏర్పాటు సహా పది అంశాలు దానిలో ఉన్నాయి. ప్రభుత్వం తరఫున ప్రధాని సుశీల కార్కీ, జెన్-జడ్ ప్రతినిధుల తరఫున బోజ్ బిక్రమ్ థాపా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కింద ప్రభుత్వం ...ఐటీవల ఆందో ళనల్లో అమరులైన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. బాధితులకు ఉచిత వైద్య చికిత్సలు అందించడంతో పాటు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఈ ఒప్పందం దేశంలో కీలకమైన మార్పులు తీసుకు వస్తుందని ప్రధాని కార్కీ తెలిపారు.

పాఠశాల వయసు నుంచే మాదకద్రవ్యాల వినియోగం!

- తాజా సర్వేలో వెల్లడి

దిల్లీ: విద్యార్థులు 12, 13 ఏళ్ల వయసు నుంచే మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటుపడుతున్నారని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. దేశవ్యాప్తంగా ఉన్న 10 నగరాల్లో పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై దిల్లీలోని ఎయిమ్స్ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. చిన్న వయసులోనే డ్రగ్స్‌కు అలవాటు పడితే నష్టాలు తీవ్రంగా ఉంటాయని, కనీసం ఒక ఏడాది ఆలస్యం చేసినా వాటి ద్వారా కలిగే దుష్ప్రభావాల తగ్గే అవకాశముందని కూడా సర్వే స్పష్టంచేసింది. దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన దాదాపు 5,900 మంది ఈ సర్వేలో పాల్గొన్నట్లు నివేదిక పేర్కొంది.

మధ్యప్రదేశ్ రోడ్డు ప్రమాదంలో నలుగురు కానిస్టేబుళ్ల మృతి

సాగర్: మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. బాంబు స్క్వాడ్‌కు చెందిన వాహనం అదుపుతప్పి కంటైనర్ ట్రక్కును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో నలుగురు పోలీసు సిబ్బంది అక్కడికక్కడే మృతిచెందగా, మరో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున జాతీయ రహదారి 44పై బంద్రీ-మల్తోన్ మధ్య జరిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్ట్ మలోన్ షోలో వేధింపులకు గురయ్యాం

- ఇద్దరు బ్యాంకాక్ వనితల ఆరోపణ

గువాహటి: రెండ్రోజుల క్రితం గువాహటిలో జరిగిన కచేరీలో తాము వేధింపులకు గురయ్యామని, కొందరు తమను అసభ్యకరంగా తాకారని ఇద్దరు విదేశీ వనితలు ఆరోపించారు. గువాహటిలో తమకు మంచి ఆతిథ్యం లభించినా దీనిలో మాత్రం పోకిరీల వల్ల ఇబ్బంది పడ్డామని, కార్యక్రమాన్ని ఆస్వాదించలేకపోయామని సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ గాయకుడు పోస్ట్ మలోన్ (ఆస్టిన్ రిచర్డ్ పోస్ట్) తొలిసారిగా మన దేశానికి వచ్చిన సందర్భంగా గువాహటిలో నిర్వహించిన కార్యక్రమానికి దాదాపు 20 వేల టికెట్లు అమ్ముడయ్యాయి. కిక్కిరిసిన ప్రాంగణంలో తాము అడుగుపెట్టగానే వేధింపులు ఎదురయ్యాయని, వెంటనే వెనుదిరిగి వెళ్లిపోయామని బ్యాంకాక్‌కు చెందిన వనితలు తెలిపారు. వారు లాంఛనంగా ఫిర్యాదు ఇవ్వకపోయినా అస్సాం పోలీసులు దీనిపై దృష్టి సారించారు. వీడియోలో స్పష్టత లేనందున మరిన్ని వివరాలు ఇవ్వాలని 'ఎక్స్'లో కోరారు.

101 కోట్ల మందికి బాల్యంలో లైంగిక వేధింపులు

- 60.8 కోట్ల మంది మహిళలను హింసించిన సన్నిహిత భాగస్వాములు
- 2023 నాటి పరిస్థితులపై ఓ అధ్యయనంలో వెల్లడి



దిల్లీ: చిన్నారులపై లైంగిక వేధింపులను నివారించడం కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను తాజా అధ్యయనమొకటి నొక్కిచెప్పింది. 2023 నాటికి- బాల్యంలో లైంగిక వేధింపులను ఎదుర్కొన్నవారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 101 కోట్లుగా ఉందని తెలిపింది. సన్నిహిత భాగస్వామి చేతుల్లో హింస (ఐపీవీ)కు గురైన మహిళల సంఖ్య 60.8 కోట్లుగా నమోదైనట్లు వెల్లడించింది. 2023 నాటికి 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసుకు చేరుకున్నవారి పరిస్థితిని ఈ అధ్యయనంలో విశ్లేషించినట్లు పేర్కొంది. 'ది లాన్సెట్' జర్నల్‌లో సంబంధిత వివరాలు ప్రచురితమయ్యాయి. వాటి ప్రకారం- లైంగిక వేధింపులు, ఐపీవీ సంబంధించిన ఘటనలు సబ్ సహారన్ ఆఫ్రికా, దక్షిణాసియాల్లో ఎక్కువగా నమోదయ్యాయి. భారత్‌లో మహిళల్లో 30% మంది, పురుషుల్లో 13% మంది బాల్యంలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నారు. మహిళల్లో 23% మంది సన్నిహిత భాగస్వామి చేతుల్లో హింసకు గురయ్యారు.

అధ్యయనంలో గుర్తించిన మరిన్ని కీలక అంశాలివీ..

- ఐపీవీ కారణంగా 2023లో ప్రపంచవ్యాప్తంగా 1.45 లక్షల మరణాలు నమోదయ్యాయి. వాటిలో హత్యలు, ఆత్మహత్యలు, హెచ్ఐవీ/ఎయిడ్స్ కారణంగా మృతిచెందడం వంటి కేసులు అత్యధికంగా ఉన్నాయి.
- అదే ఏడాది దాదాపు 30 వేల మంది మహిళలు తమ భాగస్వాముల చేతుల్లో హత్యకు గురయ్యారు.
- బాల్యంలో లైంగిక హింసకు గురవడంతో ముడిపడిన మరణాలు 2023లో 2.9 లక్షల వరకు నమోదయ్యాయి.
- బాల్యంలో లైంగిక వేధింపులకు గురైతే మానసిక ఆరోగ్యం దెబ్బతిని, దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడే ప్రమాదం అధికమవుతోంది.
- సన్నిహిత భాగస్వామి చేతుల్లో హింస కారణంగా మహిళల్లో ఆదుర్దా, కుంగుబాటు వంటి రుగ్మతలు అధికమై వైకల్యం బారిన పడే ముప్పు పెరుగుతోంది.

'మీ డబ్బు.. మీ హక్కు'లో భాగస్వాములు కండి

- అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వెనక్కి తీసుకోండి
- ప్రధాని మోదీ పిలుపు



దిల్లీ: ఉద్యమంలా చేపట్టిన 'మీ డబ్బు.. మీ హక్కు' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను సరైన ఆధారాలు చూపించి కుటుంబ సభ్యులు వెనక్కి తీసుకోవాలని ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముగ్గురుండు ఈ ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని, గత 2 నెలల్లో రూ.2,000 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను సంబంధీకులకు అందజేశామని బుధవారం ఎక్స్‌లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు సమన్వయంతో చేపట్టిన చర్యలవల్ల రూ.2,000 కోట్లను అసలైన యజమానులకు వెనక్కి ఇవ్వగలిగామని వివరించారు. 'మీ డబ్బు.. మీ హక్కు' ఉద్యమాన్ని అక్టోబరు 4వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అన్‌క్లెయిమ్డ్‌గా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, ఇన్సూరెన్సు పరిహారాలు, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్లను కుటుంబ సభ్యులు సరైన ఆధారాలు చూపించి తీసుకోవాలని కోరుతోంది. బ్యాంకుల వద్ద రూ.78,000 కోట్లు, ఇన్సూరెన్సు కంపెనీలవద్ద రూ.14,000 కోట్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలవద్ద రూ.3,000 కోట్లు, డివిడెండ్ల రూపంలో రూ.9,000 కోట్లు అన్‌క్లెయిమ్డ్‌గా ఉన్నాయి.

మోదీకి నెతన్యాహు ఫోన్

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బుధవారం ఫోన్ చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితులను వివరించారు. రెండు దేశాల మధ్య బంధం బలోపేతం పై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనడానికి అవసరమైన సహకారం అందిస్తామని ఈ సందర్భంగా మోదీ హామీ ఇచ్చినట్లు ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. త్వరలో మోదీని నెతన్యాహు కలుస్తారని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం తెలిపింది.

ఉమర్ ఖాలిద్, ఇమాంల బెయిలు పిటిషన్లపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు



దిల్లీ: దిల్లీ అల్లర్ల కేసులో అరెస్టయి జైలులో ఉన్న ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్ తదితరుల బెయిలు పిటిషన్లపై తీర్పును సుప్రీంకోర్టు రిజర్వు చేసింది. 2020 ఫిబ్రవరిలో దిల్లీలో జరిగిన అల్లర్లకు కుట్రదారులుగా పేర్కొంటూ పిటిషన్‌దారులపై ఉపా కేసు నమోదు చేశారు. తొలుత వీరు దిల్లీ హైకోర్టుకు వెళ్లగా.. బెయిల్ పిటిషన్లను తిరస్కరించింది. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దిల్లీ పోలీసుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపిస్తూ.. పిటిషన్‌దారులు ఆకస్మాత్తుగా అల్లర్లకు పాల్పడలేదని.. పూర్తి ప్రణాళికతోనే అన్నీ చేశారని ధర్మాసనానికి నివేదించారు. అది భారత సార్వభౌమత్వంపై జరిగిన దాడి అని తెలిపారు. నిందితుల తరఫున కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దవే, సల్మాన్ ఖుర్షీద్, సిద్ధార్థ్ లూథ్రాలు వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. 2020లో సీఏఏకు వ్యతిరేకంగా దిల్లీలో వివిధ వర్గాల నిరసనలు చేపట్టగా పెద్దఎత్తున అల్లర్లు జరిగాయి. వాటిలో 53 మంది మరణించగా, 700 మందికిపైగా గాయాలపాలయ్యారు.

190 వెరై'టీ'లు



ఈటీవీ భారత్: ఉదయం నిద్ర లేవగానే టీ తాగనిదే చాలామందికి రోజు మొదలవదు. ఒడిశా రాజధాని నగరమైన భువనేశ్వర్‌లోని ఎన్‌ఐసీ చౌక్‌లో ఉన్న టీ స్టాల్‌లో రామ్‌భాయ్ (45) ఏకంగా 190 రకాల చాయ్‌లను వినియోగదారులకు అందిస్తున్నారు. ఇక్కడ దొరికే వెరైటీ టీలను తాగేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కువమంది యువత వరుస కడతారు. ఈ టీల ధరలు రూ.10 నుంచి రూ.150 వరకు ఉంటాయి. మెట్రిక్యులేషన్ పరీక్ష తప్పాక కటక్ నుంచి భువనేశ్వర్ చేరుకున్న రామ్‌భాయ్ 2003లో రూ.5 వేల పెట్టుబడితో టీ స్టాల్ ప్రారంభించారు. ఏడేళ్ల తిరిగే సరికల్లా లెమన్, కేసర్, తాజ్‌మహల్, అల్లం, కశ్మీరీ, హెర్బల్, మసాలా, బాదం టీ.. ఇలా విస్తరణ చాయ్ విక్రయాలు ప్రారంభించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన రామ్‌భాయ్ హైదరాబాద్, కోల్‌కతా, ముంబయి వంటి నగరాల్లో టీ తయారీలో శిక్షణ పొందారు. వివిధ ఆయుర్వేద పానీయాలను కూడా ఈయన తయారు చేస్తారు. రోజుకు వెయ్యికి పైగా టీలను అమ్ముతానని రామ్ భాయ్ తెలిపారు.

ప్రధాని సగం సమయం దేశం బయటే ఉంటున్నారుగా..

- ప్రతిపక్ష నాయకుడి విదేశీ పర్యటనపైనే విమర్శలెందుకో
- భాజపాపై మండిపడ్డ ప్రియాంకాగాంధీ వాద్రా



దిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వచ్చేవారం జర్మనీ పర్యటనకు వెళుతుండడంపై భాజపా విమర్శలు గుప్పించడాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా బుధవారం తిప్పికొట్టారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సగం సమయాన్ని దేశం బయటే గడుపుతున్నారని, అలాంటప్పుడు వారు (భాజపా శ్రేణులు) రాహుల్ గాంధీ విషయంలో మాత్రమే ఎందుకు ప్రశ్నలు సంధిస్తున్నారని ప్రశ్నించారు. ప్రవాస భారతీయ కాంగ్రెస్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాహుల్ ఈ నెల 15 నుంచి 20 వరకు జర్మనీలో పర్యటిస్తారు. ప్రవాస భారతీయులను, ఆ దేశ మంత్రులను కలుసుకుంటారు. దీనిపై భాజపా.. 'రాహుల్ ఎల్‌వోపీ- లీడర్ ఆఫ్ పర్యటన్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. 'విదేశీ నాయకుడు మళ్లీ తనకు నచ్చిందే చేస్తున్నారు. విదేశీ పర్యటనకు వెళుతున్నారు. పార్లమెంటు సమావేశాలు ఈ నెల 19 వరకు ఉన్నాయి. కానీ, రాహుల్ ఈ నెల 15 నుంచి 20 వరకు జర్మనీ వెళుతున్నట్లు తెలుస్తోంది. రాహుల్ ఎల్‌వోపీ- లీడర్ ఆఫ్ పర్యటన్' అని పేర్కొంటూ భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. బిహార్ ఎన్నికల సమయంలోనూ ఆయన విదేశీ పర్యటనకు, తర్వాత జంగిల్ సఫారీకి వెళ్లారని పేర్కొన్నారు. ఈ విమర్శలపై స్పందించాల్సిందిగా విలేకరులు ప్రియాంకాగాంధీ వాద్రాను కోరగా.. ఆమె పై విధంగా స్పందించారు.

బెలారస్ బెలూన్ల దెబ్బకు లిథువేనియాలో ఎమర్జెన్సీ

విల్నియస్: బెలారస్ ప్రయోగిస్తున్న వాతావరణ బెలూన్ల వల్ల లిథువేనియా వ్యాప్తంగా అత్యవసర పరిస్థితి విధించాల్సి వచ్చింది. బెలూన్ల కారణంగా లిథువేనియా గగనతల మార్గాల్లో సమస్యలు తలెత్తుతుండడంతో దేశ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఐరుదేశాల భాగంగా పోలీసులు, భద్రతా బలగాలతో పాటు సైన్యం కూడా సరిహద్దు ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తుందని దేశాధ్యక్షుడు తెలిపారు. ఎమర్జెన్సీ విధింపు వల్ల పార్లమెంట్ ద్వారా సమకూరే అదనపు హక్కులను ఉపయోగించి సైన్యం అనుమానాస్పద ప్రదేశాల్లో సోదాలు నిర్వహించడం, నిబంధనలు ఉల్లంఘించిన వారిని అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలు చేపడుతోంది. ఇరుదేశాల సరిహద్దు ఉద్రిక్తతలపై చర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు లిథువేనియా అధ్యక్షుడు గిటానస్ ప్రకటించారు. బెలూన్లతో తమపై బెలారస్ చేస్తున్న హైబ్రిడ్ దాడిని ఎదుర్కోవడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని ఇంగా రుగినియెనె పేర్కొన్నారు. బెలూన్లపై ఉన్నతాధికారులు దర్యాప్తు ప్రారంభించారు. వీటి వెనక ఉన్న కుట్ర త్వరలోనే బయటపడుతుందని అంతర్గత వ్యవహారాల మంత్రి వ్లాడిస్లావ్ కొండ్రాటోవిచ్ అన్నారు.

సుడాన్ చమురు పరిశ్రమపై డ్రోన్ దాడులు

- 25 మంది మృతి!

జుబా: సుడాన్‌లోని అతిపెద్ద చమురు శుద్ధి పరిశ్రమపై సైన్యం డ్రోన్ దాడులు చేసింది. ఈ దుర్ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోయారని పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్‌ఎస్‌ఎఫ్) వెల్లడించింది. దక్షిణ సుడాన్ సరిహద్దుకు సమీపంలోని హెగ్లిగ్ ప్రాంతంలో ఉన్న చమురు పరిశ్రమను తాము ఆదివారంలోనే తీసుకున్న మరుసటి రోజే దాడులు జరిగాయని ఆర్‌ఎస్‌ఎఫ్ తెలిపింది. ఎంతమంది ప్రాణాలు కోల్పోయారనే విషయంపై స్పష్టత లేనప్పటికీ.. ఏడుగురు గిరిజన నాయకులు, 'దజన్లకొద్దీ ఆర్‌ఎస్‌ఎఫ్ బలగాలు ఈ దాడుల్లో మృత్యువాతపడినట్లు స్థానిక మాధ్యమాలు తెలిపాయి. కాగా డ్రోన్ దాడుల్లో ముగ్గురు దక్షిణ సుడాన్ సైనికులు మృతిచెందారని ప్రభుత్వం పేర్కొంది. కానీ...దాదాపు 25మంది మృతిచెందినట్లు భావిస్తున్నారు.

కుప్పకూలిన యుద్ధవిమానం

కింద కు దిగేందుకు ప్రయత్నిస్తున్న సుడాన్ సైన్యానికి చెందిన ఓ యుద్ధ విమానం కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న సిబ్బంది అంతా ప్రాణాలు కోల్పోయినట్లు సైన్యాధికారులు తెలిపారు. ఉస్మాన్ డిగ్నా ఎయిర్‌బేస్‌లో ల్యాండవుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కిందకు దిగే క్రమంలో ఇది జరిగిందని తెలిపారు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇల్యుషిన్ ఐఎల్-76 యుద్ధవిమానం కూలిపోయిందని అధికారులు వివరించారు.

క్లబ్‌లో అగ్నిప్రమాదం జరిగాక గంటలోనే..
విదేశాలకు పారిపోయేందుకు ప్రణాళిక

- అర్ధరాత్రి పుకెట్‌కు విమాన టికెట్లు బుక్ చేసుకున్న లూథ్రా సోదరులు

పణజీ, దిల్లీ: గోవా నైట్ క్లబ్ 'బిర్చ్ బై రోమియో లేన్'లో అగ్నిప్రమాదం కేసుకు సంబంధించి తాజాగా మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. క్లబ్‌లో ఈ నెల 6న ప్రమాదం జరిగిన తర్వాత గంట సేపట్లోనే.. దాని యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రా విదేశాలకు పారిపోయేందుకు ప్రణాళిక వేసుకున్నారు. అగ్నిప్రమాదం గురించి తెలియగానే.. థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు వెళ్లేందుకు అర్ధరాత్రి విమాన టికెట్లు బుక్ చేసుకున్నారు. క్లబ్‌లో మంటలను ఆర్పేందుకు, అందులో చిక్కుకున్నవారి ప్రాణాలను రక్షించేందుకు పోలీసులు, సహాయక సిబ్బంది ప్రయత్నిస్తుండగానే (ఈ నెల 7వ తేదీ తెల్లవారుజామున).. లూథ్రా సోదరులు ఇండిగో విమానంలో భారత్‌ను వీడి వెళ్లారు. లూథ్రా సోదరులకు కోర్టులో దక్కని ఉపశమనం: అరెస్టు నుంచి రక్షణ కల్పించాలంటూ దిల్లీ కోర్టును ఆశ్రయించిన సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలకు తాత్కాలిక ఉపశమనమేమీ దక్కలేదు. ప్రస్తుతానికి వారికి ముందస్తు బెయిలు మంజూరు చేసేందుకు న్యాయస్థానం బుధవారం నిరాకరించింది. నాలుగు వారాల పాటు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ ప్రొటెక్షన్ కోరుతూ వారు దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని గోవా పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. లూథ్రా సోదరులు తమను లాంబాకు పరారయ్యారన్న ఆరోపణలను వారి తరఫు న్యాయవాది ఖండించారు. ఓ వ్యాపార సమావేశం కోసమే వారు ఆ దేశానికి వెళ్లారని పేర్కొన్నారు.

అజయ్ గుప్తాను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు



దిల్లీలో అరెస్టయిన 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్ సహ యజమాని అజయ్ గుప్తాను పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. గోవాకు తీసుకెళ్లేందుకు వీలుగా కోర్టు ఆయనకు 36 గంటల ట్రాన్సిట్ రిమాండ్‌ను విధించింది. క్లబ్‌లో తాను స్లీపింగ్ పార్ట్‌నర్‌ను మాత్రమేనని, అందులో చోటుచేసుకున్న అక్రమాలతో తనకు సంబంధమేమీ లేదని అజయ్ గుప్తా పేర్కొన్నారు.

పిల్లల్లో మెదడు గాయాలకు మరింత మెరుగైన చికిత్స!

విట్స్‌బర్గ్: పిల్లల్లో మెదడు గాయాలకు మెరుగైన చికిత్స అందించేందుకు బాటలు పరిచే దిశగా శాస్త్రవేత్తలు కీలక ముందడుగు వేశారు. మెదడు గాయానికి చిన్నారులు కణ స్థాయిలో ఎలా స్పందిస్తున్నారో తెలుసుకునేందుకు వీలు కల్పించే ఓ జీవ సంకేతాన్ని కనుగొన్నారు. ప్రత్యేక చికిత్సలు అవసరమైనవారిని సులభంగా గుర్తించడంలో అది వైద్యులకు దోహదపడనుంది. ఈ అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు డీఎన్‌ఏపై లోతుగా పరిశోధనలు జరిపారు. సాధారణంగా వృద్ధుల్లో డీఎన్‌ఏ జీవితాంతం యథాతథంగా ఉంటుంది. కొన్నిసార్లు మాత్రం చిన్న చిన్న రసాయనిక మార్పులకు లోనవుతుంది. వాటిని ఎపిజెనెటిక్ మాడిఫికేషన్లు అంటారు. 'డీఎన్‌ఏ మిథైలేషన్' అనేది అత్యంత సాధారణ ఎపిజెనెటిక్ మాడిఫికేషన్లలో ఒకటి. వృద్ధులు తీసుకునే ఆహారం, కాలుష్యం, ఒత్తిడి వంటివాటి కారణంగా అవి మారవచ్చు. ..డీఎన్‌ఏ మిథైలేషన్ మారుతూ ఉంటుంది. మెదడుకు గాయమైన చిన్నారుల్లో ఎపిజెనెటిక్ మార్పులు ఎలా ఉంటాయో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు దాదాపు 300 మంది చిన్నారుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. వారిలో 'బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ (బీడీఎన్‌ఎఫ్)' అనే జన్యువు వద్ద డీఎన్‌ఏ మిథైలేషన్ స్థాయిని విశ్లేషించారు. బీడీఎన్‌ఎఫ్ జన్యువు మెదడు అభివృద్ధి, మరమ్మతు ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఇతర గాయాలైన పిల్లలతో పోలిస్తే.. మెదడు దెబ్బ తగిలిన పిల్లల్లో 90 గంటల్లో డీఎన్‌ఏ మిథైలేషన్ స్థాయిలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఇది గాయం తీవ్రతకు సంబంధించి ప్రభావం చూపించే అవకాశాలున్నాయని తేల్చారు. మెదడుకు గాయమైన పిల్లలకు వైద్యులు మెరుగైన చికిత్స అందించేందుకు డీఎన్‌ఏ మిథైలేషన్ వంటి ఎపిజెనెటిక్ సంకేతాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

లాస్ ఏంజెలెస్‌లో నేషనల్ గార్డులను ఉపసంహరించండి

- ట్రంప్‌నకు ఫెడరల్ కోర్టు ఆదేశం




శాన్‌ఫ్రాన్సిస్కో: లాస్ ఏంజెలెస్ నుంచి కాలిఫోర్నియా నేషనల్ గార్డులను ఉపసంహరించాలని అధ్యక్షుడు ట్రంప్‌ను ఫెడరల్ కోర్టు ఆదేశించింది. ఆ బలగాలపై నియంత్రణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని సూచించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని యూఎస్ జిల్లా జడ్జి చార్లెస్ బ్రేయర్ బుధవారం ఈ ఆదేశాలిచ్చారు. గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర బలగాలను వలస సేవల్లో వినియోగించుకోవడానికి వీల్లేదని ట్రంప్ తీసుకున్న ఈ అసాధారణ నిర్ణయంపై ఇంజంక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలన్న కాలిఫోర్నియా అధికారుల విజ్ఞప్తికి అనుకూలంగా జడ్జి తీర్పు చెప్పారు. అయితే ఈ ఉత్తర్వులను సోమవారం వరకు అమలు చేయవద్దని సూచించారు.

పర్యాటక వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా చరిత్ర పరిశీలన

ఇంటర్నెట్ డెస్క్: విదేశీ వలసలను కట్టడి చేస్తున్న అమెరికా.. తాజాగా పర్యాటకులపైనా నిఘా పెంచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తమ దేశంలోకి వచ్చే పర్యాటకులు.. దరఖాస్తు సమయంలో గత ఐదేళ్ల సోషల్ మీడియా చరిత్రను అందించడాన్ని తప్పనిసరి చేసే యోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు సమాచారం. ఆస్ట్రేలియా, జర్మనీ, జపాన్, బ్రిటన్ తదితర వీసా అవసరం లేని దేశాల టూరిస్టులకూ ఈ నిబంధనలను వర్తింపజేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనలకు సంబంధించి అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తాజాగా పబ్లిక్ నోటీసు జారీ చేసింది. వీటిపై 60 రోజుల్లో తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించింది. అయితే ఈ ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు ఉండవచ్చని తెలిపింది.

కొత్త విమాన డ్యూటీల నిబంధనలు మరీ కఠినం

- ఇతర దేశాల్లో కొంత నయమే
- ప్రస్తుత సమస్య తాత్కాలికమే
- ఐటా అధిపతి విల్లీ వాల్ష్



జెనీవా: భారత పైలట్ల కోసం తీసుకొచ్చిన కొత్త విమాన డ్యూటీ నిబంధనలు, ఇతర దేశాలతో పోలిస్తే మరీ కఠినంగా ఉన్నాయని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్(ఐటా) డైరెక్టర్ జనరల్ విల్లీ వాల్ష్ అభిప్రాయపడ్డారు. ఈ నిబంధనల కారణంగానే వారం రోజులుగా, రోజూ వందల కొద్దీ ఇండిగో విమాన సర్వీసులు రద్దయి, లక్షల మంది ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తాయి. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్) రెండోదశ నిబంధనలను పాటించేలా సరిపడా సిబ్బందిని నియమించుకోవడంలో ఇండిగో విఫలమైన సంగతి తెలిసిందే.

నియంత్రణ సంస్థలదే బాధ్యత

'విమానయాన పరిశ్రమను భద్రంగా ఉంచేలా చూసుకోవాల్సిన బాధ్యత నియంత్రణ సంస్థలదే. సరైన కారణాలతోనే మార్పులు అమలు చేయాలన్నది నా అభిప్రాయం. పరిస్థితులు సద్దుమణగడానికి కొంత సమయమైతే పట్టొచ్చ'ని వాల్ష్ అన్నారు. పైలట్లను అలసట నుంచి రక్షించేందుకు అమలు చేయాల్సిన నిబంధనలపై ఐరోపా, అమెరికాల్లో ఎప్పుడూ చర్చ జరుగుతూనే ఉంటుందని జెనీవాలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో విల్లీ వాల్ష్ పేర్కొన్నారు. 'భారత్ ఇప్పుడైనా చర్యలను తీసుకోవాలని నిర్ణయించుకుంది. ముఖ్యంగా రాత్రిపూట సర్వీసుల కారణంగా ఎదురవుతున్న అలసటను దూరం చేయాలని అనుకుంది. చౌకధర ప్రయాణానికి వీలవుతున్న విమాన సర్వీసులపైనా ఇది అధిక ప్రభావం చూపింది. నిబంధనల మార్పు వల్ల, భారీగా సర్వీసులు రద్దయి, ఎక్కువ మంది ప్రయాణికులపై ప్రభావం పడడమే నిరుత్సాహకర అంశమన్నారు. ఐటాలో 360 విమానయాన కంపెనీలు సభ్యులుగా ఉన్నాయి. అంతర్జాతీయ విమాన రద్దీలో 80% వీటిదే. ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్‌లకు ఐటాలో సభ్యత్వం ఉంది.

భారత అద్భుత మార్కెట్‌గా మారొచ్చు: 'చరిత్ర చూస్తే భారత్ విమానయాన కంపెనీలకు ఒక సవాలుభరిత మార్కెట్‌గా ఉంది. జెట్ ఎయిర్‌వేస్, కింగ్‌ఫిషర్ ఇందుకు ఉదాహరణ. అయితే ఒక అద్భుత మార్కెట్‌గా మారడానికి కావలసిన అంశాలన్నీ భారత్‌లో ఉన్నాయి. ఎయిరిండియా ప్రైవేటీకరణ అతిపెద్ద సానుకూలత. ప్రస్తుత సమస్యలు తాత్కాలికమేననిపిస్తుంది. భారత విమానయాన కంపెనీలు విస్తరణ నిమిత్తం 1500 విమానాలకు ఆర్డర్ పెట్టాయని, మరిన్ని విమానాశ్రయాలు రానున్నాయని గుర్తు చేశారు. 2020తో పోలిస్తే భారత విమాన మార్కెట్ 32% పెద్దదిగా మారిందన్నారు. వృద్ధి పథంలో సవాళ్లు సహజమేనన్నారు.

ఒక్కో గుర్రం రూ.కోటికి పైనే!

మహారాష్ట్రలోని నందుర్బార్‌లో 'సరంగ్ ఖేడా' చేతక్ ఉత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ ఉత్సవానికి పంజాబ్ నుంచి తెచ్చిన గుర్రాల్లో రూ.కోటికి పైగా పలుకుతున్న బైట్‌కోబ్రా, రుద్రాణి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 'బైట్‌కోబ్రా' ఎత్తు 61 అంగుళాలు. దీని ఆహారం, నిర్వహణకు నెలకు రూ.75 వేలకు పైగా ఖర్చవుతోంది. ప్రతి రోజూ పాలు, పప్పులు, దేశీ నెయ్యి, బార్లీ వంటి ప్రత్యేక ఆహారాన్ని అందిస్తారు. దీని ఆలనాపాలనా చూసుకోడానికి ఇద్దర్ని నియమించారు. నుఖ్రా జాతికి చెందిన ఈ గుర్రం సంతానానికి భారీ డిమాండు ఉంది. అందుకే ఈ గుర్రం ధర భారీగా ఉంటుంది.



- ఈటీవీ భారత్



ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లా నీతీ వ్యాలీలో గడ్డకట్టిన ఓ జలపాతం



స్పానిష్ ఎక్కడ నేర్చుకోవాలి?



బీటెక్ చివరి ఏడాది చదువుతున్నాను. స్పానిష్ నేర్చుకుని, సర్టిఫికేషన్ కోర్సులు చేస్తే ఉద్యోగాలు ఉంటాయా? ఈ భాషను ఆన్‌లైన్‌లో ఉచితంగా నేర్చుకునే వీలుందా? - బి.హరీష్

■ ప్రపంచీకరణ కారణంగా విదేశీ భాషల ప్రాధాన్యం ఎంతో పెరుగుతోంది. వాటిలో స్పానిష్ భాషకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఇది మాతృభాష. అలాగే ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషల్లో నాలుగో స్థానంలో ఉంది. మన దేశంలోనూ స్పానిష్ తెలిసిన వారికి ఉద్యోగాల్లో గిరాకీ పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో ఈ భాషను నేర్చుకునేవారి సంఖ్య గత కొన్నేళ్లలో గణనీయంగా పెరిగింది.

❖ ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో స్పానిష్ తెలిసిన వ్యక్తులకు వివిధ ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఐటీ, ఐటీఈఎస్ సంస్థలు, బీపీవో, ఎంఎన్‌సీలూ, టూరిజం, హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థలూ, అంతర్జాతీయ వ్యాపారం, డబ్బింగ్ రంగాల్లో స్పానిష్ భాషకు మంచి డిమాండ్ ఉంది. అమెజాన్, గూగుల్, ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్, యాక్సెంచర్, డెలాయిట్, జెన్‌ప్యాక్ట్ వంటి ప్రముఖ సంస్థలు స్పానిష్ లాంగ్వేజ్ స్పెషలిస్టులను నియమిస్తున్నాయి.

❖ స్పానిష్ మాట్లాడగలిగే వారికి 'స్పానిష్ ప్రాసెస్ అసోసియేట్', 'టెక్నికల్ సపోర్ట్ - స్పానిష్', 'ట్రాన్స్‌లేటర్', 'ఇంటర్‌ప్రిటర్', 'లాంగ్వేజ్ ట్రెయినర్' లాంటి ఉద్యోగాలు ఉంటాయి.

❖ స్పానిష్ భాషను ఆన్‌లైన్‌లో సులువుగానే, ఉచితంగా నేర్చుకోవచ్చు. కొన్ని యాప్‌లు ప్రారంభ స్థాయి విద్యార్థులకు ప్రాథమిక అంశాలను అందిస్తున్నాయి. వివిధ యూట్యూబ్ ఛానళ్ల ద్వారా.. వ్యాకరణం, సంభాషణా నైపుణ్యాలు స్పష్టంగా నేర్చుకోవచ్చు. మరికొన్ని యాప్‌లు స్పానిష్ మాట్లాడే వారితో ప్రత్యక్ష సంభాషణ సాధనకూ అవకాశం కల్పిస్తున్నాయి.

❖ కోర్స్‌ఎరా, ఎడెక్స్, యుడెమి వంటి ఆన్‌లైన్ వేదికలు నామమాత్రపు ఫీజుతో స్పానిష్ కోర్సులను అందిస్తున్నాయి. కేంద్రప్రభుత్వ స్వయం ప్లాట్‌ఫామ్‌లో ప్రారంభ, మధ్య స్థాయి స్పానిష్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

❖ నియామక సంస్థలు అభ్యర్థులను ఎంపిక చేసే సమయంలో ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ సర్టిఫికేషన్ల కంటే.. భాషా నైపుణ్యాలు, మాట్లాడే శైలి, అనువాద నైపుణ్యాలను పరిశీలిస్తాయి. అందువల్ల మీరు నిరభ్యంతరంగా ఆన్‌లైన్‌లో స్పానిష్ భాష నేర్చుకుని, ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

> స్పానిష్ భాషలో A1, A2, B1 వంటి ప్రాథమిక కోర్సులు పూర్తిచేసి, చిన్న స్థాయి పోర్ట్‌ఫోలియోలను తయారు చేసుకుంటే, ఆన్‌లైన్ శిక్షణ ద్వారా మంచి ఉద్యోగాలు పొందగలరు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

కార్పొరేట్ స్కిల్స్

ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థాయికి!



కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఆశించేవారు ప్రాంగణ నియామకాల్లో ఎంపికవడానికి.. రీజనింగ్, జనరల్ నాలెడ్జ్, గ్రూప్ డిస్కషన్ లాంటి అంశాల్లో శిక్షణ తీసుకుంటారు. ఉద్యోగంలో చేరిన తర్వాత వీటితో పని లేదని భావించి వదిలేస్తారు. దీంతో ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థాయికి చేరుకోలేరు. కేవలం కొలువు సాధించడమే లక్ష్యంగా భావించి, నేర్చుకోవడం ఆపేస్తే కెరియర్‌లో ఎదగలేరు. మేటి హోదాలు పొందడానికి స్వీయ అభ్యాసం అత్యంత ముఖ్యం.

కార్పొరేట్ ఉద్యోగులు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి 'సెల్ఫ్ లెర్నింగ్' జీవన విధానం కావాలి. మారుతున్న వ్యాపార అవసరాలకు అనుగుణంగా కొత్త నైపుణ్యాలు, సాంకేతికతను అందిపుచ్చుకుని, ఫలితాలు సాధించగల వారినే విలువైన ఉద్యోగిగా సంస్థలు గుర్తిస్తాయి.

ఏ అంశాలు ఎంత పరిధిలో నేర్చుకోవాలన్న విషయాలకు కొలబద్ద లేదు. ఎవరూ చెప్పరు. సొంతంగా నేర్చుకోవాలి.

అడాప్టబిలిటీ »



శ్వేత ఎంబీఏ పూర్తి చేసి, ఎఫ్ఎంసీజీ సంస్థలో మార్కెటింగ్ ట్రెయినీగా చేరింది. ఉత్పత్తులను డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై ప్రచారం చేయాలని ఆ సంస్థ భావించింది. కాలేజీలో సోషల్ మీడియాకు సంబంధించిన అంశాలు చదువుకోలేదని, డిజిటల్ మార్కెటింగ్‌లో తనకు పరిజ్ఞానం లేదని, సమీక్ష సమావేశంలో ఆమె టీమ్ లీడర్‌కు చెప్పింది. దీంతో శ్వేతకు ఒక అవకాశం ఇస్తూ, సెల్ఫ్ లెర్నింగ్ కోర్సుల్లో చేరి, డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ తీసుకోమని సలహా ఇచ్చారు. అప్పటికీ నేర్చుకోలేకపోతే ఉద్యోగం కోల్పోయే ప్రమాదముందని హెచ్చరించారు. ఆ సలహాతో డిజిటల్ మార్కెటింగ్ టూల్స్‌లో ఆమె నైపుణ్యం సాధించింది. శ్వేత రూపొందించిన డిజిటల్ మార్కెటింగ్ క్యాంపెయినింగ్ వ్యూహంతో సంస్థ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఆమె క్విక్ లెర్నర్‌గా, సులభంగా అడాప్ట్ కాగలిగిన ఉద్యోగిగా యాజమాన్యంలో గుర్తింపు తెచ్చుకుంది.

✦ కార్పొరేట్ కొలువుల్లో విజయం సాధించాలనుకున్న యువ ఉద్యోగార్థులకు సెల్ఫ్ లెర్నింగ్ కీలక నైపుణ్యం. కాలేజీలో నేర్చుకునే అంశాలు, కార్పొరేట్ సంస్థల శిక్షణలు ఉద్యోగికి పరిమితమైన నైపుణ్యాలే ఇవ్వగలవు. కెరియర్ విజయానికి అవసరమయ్యే కీలక మెలకువలు కళాశాలల్లో చెప్పరు. వీటిని స్వయంగా నేర్చుకున్నవారు కార్పొరేట్ సంస్థల్లో విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు.

అనుత్పాదక నైపుణ్యం »

సుజాత ఎంబీఏ హెచ్‌ఆర్ చదివి, బహుళ జాతి సంస్థలో ట్రెయినీగా చేరింది. ఆ సంస్థ హెచ్‌ఆర్ శాఖలో ఆధునిక సాఫ్ట్‌వేర్ అమలు చేస్తున్నారన్న విషయం తెలుసుకుంది. శిక్షణ కేంద్రంలో చేరి, అందుకు సంబంధించిన కొన్ని ప్రోగ్రాంలు నేర్చుకుంది. ఆమె నైపుణ్యాల గురించి టీమ్ లీడర్ అడిగినప్పుడు.. హెచ్‌ఆర్ సాఫ్ట్‌వేర్‌లో పరిజ్ఞానం ఉందని తెలిపింది. దీంతో ఆమెకు ఉద్యోగుల వలస (అట్రిషన్), గైర్హాజరు (ఆబ్సెంటిజం), ఉద్యోగులలో నిబద్ధత లాంటి అంశాలకు సంబంధించిన గణాంకాలు ఇచ్చి, విశ్లేషించి, నివేదిక రూపొందించమన్నారు. ఆమె నేర్చుకున్న ప్రోగ్రాంలూ, సంస్థ అనుసరించే సాంకేతికతకూ పొంతన లేకపోవడంతో డేటాను అనాలిసిస్ చేయలేకపోయింది. ఫలితంగా సుజాతకు మెమో ఇచ్చి, ప్రధాన విధుల నుంచి తప్పించారు.

✦ కొత్తగా ఉద్యోగంలో చేరిన యువ ఉద్యోగులు ఆ ఉద్యోగ నిర్వహణకు అవసరమయ్యే నైపుణ్యాలను సీనియర్ల ద్వారా తెలుసుకుని, శిక్షణ తీసుకుంటే కొలువులో విజయం సాధించవచ్చు. సంస్థ అవసరాలకు ఉపయోగపడని నైపుణ్యం ఉద్యోగిలో ఎంత ఉన్నా అనుత్పాదక ప్రావీణ్యమే అవుతుంది. కార్పొరేట్ ఉద్యోగాల్లో స్వీయ అభ్యాసం చాలా ముఖ్యమైంది అయినప్పటికీ, సరైన పద్ధతి అనుసరించకపోతే యువ ఉద్యోగులు కెరియర్‌లో విఫలమయ్యే ప్రమాదం ఉంది.

నేర్చుకునే టైమింగ్ »



బీటెక్ చదువుతూ ప్రాంగణ నియామకాలకు రమేష్ సిద్ధమవుతున్నాడు. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఎంపికై, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఆ కళాశాల పూర్వ విద్యార్థులు అతడికి అడ్వాన్స్‌డ్ టూల్స్‌లో శిక్షణ తీసుకోమని సలహా ఇచ్చారు. ఉద్యోగంలో చేరాక అవసరమైతే ట్రెయినింగ్ తీసుకుంటానని వారి సలహాలను అతడు పరిగణనలోకి తీసుకోలేదు. ప్రాంగణ నియామకాల్లో రమేష్‌కు ఒక సంస్థలో అవకాశం వచ్చింది. అక్కడ రియల్ టైమ్ ప్రాజెక్టులపై పని చేయాల్సి వచ్చింది. అప్పటికప్పుడు నేర్చుకోవడానికి సమయం లేక, ప్రాక్టికల్‌గా ఏమీ చేయలేక, ఉద్యోగంలో విఫలమయ్యాడు. నేర్చుకోవలసిన అంశాలను నేర్చుకోవాల్సిన సమయంలో వాయిదా వేసి, ఉద్యోగం వచ్చాక నేర్చుకోవచ్చని అనుకోవడం సరైన నిర్ణయం కాదని రమేష్ అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడు.

✦ కార్పొరేట్ సంస్థల్లో మనుగడ సాగించడానికి నిరంతర అభ్యాసం తప్పనిసరి. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సంస్థలో విలువైన ఉద్యోగిగా గుర్తింపు పొంది, కెరియర్‌లో స్థిరమైన అభివృద్ధి సాధించవచ్చు.



– దొరైరాజ్,
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ (ఫైనాన్స్)

సంస్థ: హౌస్ ఆఫ్ కాటన్ ప్రై.లి.
నైపుణ్యాలు: అకౌంటింగ్, కంటెంట్ రైటింగ్, ఎకనామిక్స్, ఫైనాన్షియల్ మోడలింగ్
స్టైపెండ్: రూ.12,000-25,000
దరఖాస్తు గడువు: జనవరి 3
☛ https://tinyurl.com/yvcxyw68/R

డిజిటల్ కంటెంట్ రిసెర్చర్/ ప్రొడక్షన్ అసిస్టెంట్

సంస్థ: వక్ క్యా నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్ ఎడిటింగ్, డిజిటల్ అడ్వర్‌టైజింగ్, డిజిటల్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్ టూల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: జనవరి 3
☛ https://tinyurl.com/2v5bxv4p/R

రైట్స్ లిమిటెడ్‌లో

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామికల్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్), గురుగ్రామ్.. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్(మెకానికల్): 150 పోస్టులు (యూఆర్: 64; ఈడబ్ల్యూఎస్: 12; ఓబీసీ: 40; ఎస్సీ: 22 ఎస్టీ: 12)

అర్హత: మెకానికల్ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్/ మాన్యుఫ్యాక్చరింగ్/ మెకానికల్ అండ్ ఆటో మొబైల్‌లో డిప్లొమా ఇంజినీరింగ్‌తో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
వయసు: 40 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రూ.29,735.
ఎంపిక: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలనలతో
దరఖాస్తు ఫీజు: రూ.300. ఈడబ్ల్యూఎస్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.100. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31.12.2025.
రాత పరీక్ష తేదీ: 11.01.2026.
వెబ్‌సైట్: https://rites.com/Career

రైల్ కోచ్ ఫ్యాక్టరీలో

రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలా.. అప్రెంటిస్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● యాక్ట్ అప్రెంటిస్: 550 ఖాళీలు (యూఆర్-275; ఎస్సీ-85; ఎస్టీ-42; ఓబీసీ-148)

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్, మోటర్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రానిక్ మెకానిక్.
అర్హత: పదోతరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉండాలి.
వయసు: 07-01-2026 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: పదో తరగతి, ఐటీఐ మార్కులతో.
దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07-01-2026. **వెబ్‌సైట్:** https://rcf.indianrailways.gov.in/

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ).. 124 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీలతో వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.



సీబీఎస్ఈలో సేవలందిస్తారా?

మొత్తం ఉద్యోగాలను మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూపు-ఏలో అసిస్టెంట్ సెక్రటరీ-8, అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్స్)-12, అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ట్రెయినింగ్)-8, అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్ (స్కిల్ ఎడ్యుకేషన్)-7, అకౌంట్స్ ఆఫీసర్-2 ఉన్నాయి. గ్రూపు-బీలో సూపరింటెండెంట్-27, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్-9 ఉన్నాయి. గ్రూప్-సీలో జూనియర్ అకౌంటెంట్-16, జూనియర్ అసిస్టెంట్-35 ఉన్నాయి.

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల వివరాలు...

1 అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ అసిస్టెంట్ డైరెక్టర్ (అకడమిక్స్/ ట్రెయినింగ్/ స్కిల్‌ఎడ్యుకేషన్): 55 శాతంతో పీజీ డిగ్రీ, బీఈడీ/ఎంఈడీ, నెట్/సెట్, నెట్-జేఆర్ఎఫ్, డాక్టరేట్ డిగ్రీ ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. వయసు 30 ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక: రాత పరీక్షలో రెండు దశలు ఉంటాయి. టైర్-1 ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 100 ప్రశ్నలకు 300 మార్కులు. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ప్రశ్నపత్రంలో ఆరు విభాగాలు ఉంటాయి. కరెంట్ అఫైర్స్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంటెలిజెన్స్, లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ, అరిథ్‌మెటికల్, న్యూమరికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్, కంప్యూటర్ పరిజ్ఞానం నుంచి 20 ప్రశ్నల చొప్పున ఇస్తారు. జనరల్ హిందీ, జనరల్ ఇంగ్లిష్‌ల నుంచి 10 ప్రశ్నల చొప్పున అడుగుతారు. వ్యవధి రెండు గంటలు. ఇందులో అర్హత సాధించినవారిని 1:10 నిష్పత్తిలో టైర్-2కు ఎంపిక చేస్తారు.

● టైర్-2లో ఆబ్జెక్టివ్ పరీక్ష 110 మార్కులకు, డిస్క్రిప్టివ్ పరీక్ష 60 మార్కులకు ఉంటాయి. కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, ఎన్ఈపీ, ఎన్‌సీఎఫ్ నుంచి 30 ప్రశ్నల చొప్పున ఇస్తారు. క్వాంటిటేటివ్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఎడ్యుకేషన్ సిస్టమ్స్ నుంచి ఆరు డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి మూడు గంటలు. ఇందులో అర్హత సంపాదించినవారిని 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

2 సూపరింటెండెంట్: డిగ్రీ, విండోస్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-ఎక్సెల్, ఇంటర్నెట్ పరిజ్ఞానం ఉండాలి. వయసు 30 సంవత్సరాలు మించకూడదు.

ఎంపిక: రాత పరీక్ష రెండు దశల్లో జరుగుతుంది. టైర్-1లో 100 ప్రశ్నలకు 300 మార్కులు. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. కరెంట్ అఫైర్స్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంటెలిజెన్స్, లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ, అరిథ్‌మెటిక్, న్యూమరికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్, జనరల్ హిందీ, ఇంగ్లిష్, కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీల నుంచి ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి రెండు గంటలు. టైర్-2ను 300 మార్కులకు నిర్వహిస్తారు. 50 ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు 150 మార్కులు. 30 డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు 150 మార్కులు.

3 జూనియర్ అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్లు: ఇంటర్మీడియట్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు. టైపింగ్ స్పీడ్ ఇంగ్లిష్‌లో నిమిషానికి 35 పదాలు లేదా హిందీలో 30 పదాలు ఉండాలి. వయసు 27 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్‌తో ఉంటుంది. టైర్-1లో 100 ప్రశ్నలకు 300 మార్కులు. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ఆరు సెక్షన్లు ఉంటాయి. కరెంట్ అఫైర్స్, జనరల్ అవేర్‌నెస్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ ఇంటెలిజెన్స్, లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ, అరిథ్‌మెటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ నుంచి 20 ప్రశ్నలు చొప్పున వస్తాయి. జనరల్ హిందీ, ఇంగ్లిష్ నుంచి 10 ప్రశ్నల చొప్పున అడుగుతారు. వ్యవధి రెండు గంటలు. ప్రశ్నపత్రం ఇంటర్మీడియట్ స్థాయిలో ఉంటుంది. టైర్-1లో అర్హత సాధించినవారిని 1:10 నిష్పత్తిలో టైర్-2కు ఎంపిక చేస్తారు.

● టైర్-2 డిస్క్రిప్టివ్ పరీక్షలో నాలుగు ప్రశ్నలకు 150 మార్కులు. హిందీ, ఇంగ్లిష్‌లో ఎస్సే, లెటర్, ప్రెసీ రైటింగ్ ఉంటాయి. వ్యవధి రెండు గంటల పదిహేను నిమిషాలు. దీంట్లో విజయవంతమైనవారిని 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

● టైర్-2, ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల ఆధారంగా కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

సన్నద్ధత: వివిధ పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాల సాధనతో టైర్-1లో ఎక్కువ మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంటుంది.

● తరచూ మాక్ టెస్టులు రాయడం వల్ల నిర్ణీత వ్యవధిలో సమాధానాలు రాయడం అలవడుతుంది.

● నెగటివ్ మార్కులు ఉన్నాయి కాబట్టి తెలిసిన ప్రశ్నలకే సమాధానాలు రాయాలి.

● రాత పరీక్ష తేదీని ఇంకా ప్రకటించలేదు. పోటీలో ముందుండాలంటే సన్నద్ధతను ఇప్పటి నుంచే మొదలుపెట్టాలి.

దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ పోస్టులకు రూ.1750, గ్రూప్-బీ, సీ పోస్టులకు 1,050. ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగులు/ దివ్యాంగులు/ మహిళలకు ప్రాసెసింగ్ ఫీజు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.12.2025

వెబ్‌సైట్: https://www.cbse.gov.in/

పరీక్షల వేళ ప్రోత్సహించండిలా..

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. విద్యార్థులు ఉన్న వ్యవధిని సద్వినియోగం చేసుకోవాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకం. మీ వెంటే మేము అనే భరోసా కల్పిస్తే ఎలాంటి ఒత్తిడీ లేకుండా పరీక్షలో ప్రతిభ చూపగలరు. ఈ కీలక తరుణంలో తల్లిదండ్రులు ఏం చేయాలంటే..

పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఆచరణీయమైన ప్రిపరేషన్ ప్రణాళికలో భాగం కావాలి. వాళ్లకున్న సాధారణ సందేహాలను నివృత్తి చేయాలి. ఎలాంటి ఒత్తిడీ లేకుండా చూసుకోవాలి.

ప్రయాణాలు వద్దు: పరీక్షల సమయంలో పిల్లలను ప్రయాణాలు, శుభకార్యాలకు రమ్మని బలవంతం చేయొద్దు. అలాగే మీరూ వాళ్లకు అందుబాటులో ఉండటం ముఖ్యమే. పరీక్షల కారణంగా ఎదురయ్యే ఆందోళనతో ఒత్తిడికి గురవుతారు. కాబట్టి వాళ్లు చదువుకునేటప్పుడు పక్కనే ఉండి, ప్రోత్సహించండి.

◗ పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు టీవీ సీరియళ్లు, సెల్‌ఫోన్‌లో కాలక్షేపం.. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి. మీరేమైనా చూస్తుంటే వాళ్లకీ మనసు అటువైపు మళ్లుతుంది. అందువల్ల వారి ఏకాగ్రతకు ఎలాంటి భంగం లేకుండా ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి.



◗ రోజంతా ఎలాంటి విరామం లేకుండా చదవొద్దని చెప్పండి. కాసేపు విశ్రాంతి తీసుకునేలా చూడండి. ఆసక్తి ఉంటే వాళ్లతో ఏవైనా ఇండోర్ గేమ్స్ లాంటివీ ఆడొచ్చు లేదా కలిసి నడకకు వెళ్లొచ్చు. లేదంటే వారి అభిరుచుల ప్రకారం నచ్చినవి చేసుకునే వెసులుబాటు కల్పించాలి. అప్పుడప్పుడూ స్నేహితులతో గడపడాన్ని, ఏవైనా ఆటలు ఆడుకోవడాన్ని ప్రోత్సహించండి.

◗ పిల్లల ఆరోగ్యమూ ముఖ్యమే. రాత్రిళ్లు మేల్కొని ఎక్కువ సమయం చదవకుండా చూడండి. వేళకు ఆహారం, తగిన నిద్ర ఎంతో ముఖ్యం. ఈ రెండిటితో ఆరోగ్య సమస్యలు రాకుండా పరీక్షలకు బాగా సన్నద్ధం కాగలరు. తేలికగా జీర్ణమయ్యే పోషకాహారం తీసుకునేలా, సరిపడేంత నీరు తాగేలా చూడండి.

◗ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల్లో ముఖ్యమైంది.. సమయ నిర్వహణ. పాఠాలు, హోంవర్క్, ప్రత్యేక తరగతులు.. ఇవన్నీ వారిని గందరగోళానికి గురిచేస్తాయి. మీరు వాళ్ల సమయాన్ని ప్రణాళికలతో సద్వినియోగం అయ్యేలా చూడాలి.

> సిరి ఎంపీసీతో ఇంటర్మీడియట్ చదువుతోంది. తను నృత్యకారిణి. రోజూ ట్యూషన్‌కి వెళుతుంది. వీటికి తగిన సమయ పాలన అవసరం. వాళ్ల అమ్మ.. సాయంత్రం ట్యూషన్, పొద్దునే ప్రిపరేషన్, వారాంతంలో నాట్యం సాధన చేసేలా ప్రణాళిక వేసింది. అది సిరికీ నచ్చింది. దాన్నే అనుసరిస్తూ, బోర్డు పరీక్షలు రాయడానికి సిద్ధమవుతోంది.

ఎవరితోనూ పోల్చొద్దు

కొందరు తల్లిదండ్రులు పిల్లలు చదివేటప్పుడు.. 'పరీక్ష బాగా రాయాలి, భవిష్యత్తు నీ ఫలితాలపై ఆధారపడి ఉంది'. 'నువ్వు ఈ సబ్జెక్టులో ఫెయిల్ అవుతావేమో'. 'పక్కింటి అమ్మాయి పోయినసారి కాలేజీ టాపర్ నువ్వు ఏం చేస్తావో ఏమో'! ఇలా మాట్లాడుతుంటారు. దీంతో పిల్లలు మానసికంగా కుంగిపోతారు. ఏకాగ్రతతో చదవలేరు. బదులుగా.. నీ ప్రయత్నం నువ్వు చేయి, ప్రశాంతంగా చదువుకో, ఎలాంటి ఆందోళనలకూ గురవ్వకు అని ప్రోత్సహించాలి. దీంతో పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఎవరైనా ఒక సబ్జెక్టులో బలహీనంగా ఉన్నప్పటికీ వేరే సబ్జెక్టులో నిష్ణాతులు కావొచ్చు లేదా వేరే కళలలో రాణించొచ్చని తల్లిదండ్రులు తెలుసుకోవాలి.

పురోగతిని పర్యవేక్షించాలి

నెల వారీ పిల్లల మూల్యాంకనాలు పరిశీలించాలి. మెరుగు పడటానికి తగిన సూచనలు ఇవ్వాలి. ముఖ్యమైన విషయాలు గుర్తు చేయాలి. మాక్ టెస్టులు రాయించి, జవాబులు వారే సరిచూసుకునేలా చేయండి. దీంతో తప్పులు గ్రహించి, మరోసారి వాటిని చేయకుండా ఉండగలరు.

ప్రశంసించండి

పిల్లలు సాధించింది చిన్న విజయమే అయినప్పటికీ భుజం తట్టండి. వాళ్లకు మీరు ప్రాధాన్యమిస్తున్నారు అనుకునేలా వ్యవహరించండి. ఏదైనా సాధించినప్పుడు చిన్న బహుమతులూ ఇవ్వొచ్చు. పిల్లలకు ఉపయోగపడే లేదా మేలు చేసే లక్ష్యాలు నిర్దేశించి, వ్యవధిలోగా పూర్తయ్యేలా చూడమని చెప్పండి. మీ ప్రోత్సాహం కారణంగా ఉత్సాహంతో దాన్ని పూర్తిచేసి, మరో లక్ష్యాన్నీ నిర్దేశించమంటారు.

విద్యార్థులందరూ ఏదైనా సాధించగల సామర్థ్యం ఉన్నవారే. వాళ్ల ప్రయత్నంలో మీరు భాగస్వాములు కావడం ఎంతో ముఖ్యం. అలాగని వాళ్ల స్వాతంత్ర్యాన్ని నియంత్రించాలనుకోవద్దు. ఏవైనా నిర్ణయాలు వారినే తీసుకోనివ్వాలి. మీ పర్యవేక్షణ ఉంటే సరిపోతుంది. మా అమ్మానాన్నలు విసిగిస్తున్నారు అనేలా వారు భావించకూడదు. ప్రగతి బాటలో వారి విజయానికి మీరూ కారణం అవుతారు. మంచి తల్లిదండ్రులుగా మెప్పు పొందుతారు.

– మండ్ల స్వాతి, ఈజేఎస్

మామిడి రైతుకు లాభాల 'కవర్'

- టన్నుకు రూ.9 వేలు ఖర్చు.. రాబడి రూ.30 వేల వరకు
- ఫ్రూట్‌కేర్, గ్రోకవర్లతో అరటి, దానిమ్మలోనూ నాణ్యమైన పంట
- హెచ్‌ఓడీల సమావేశంలో ఉద్యాన శాఖ ప్రజంటేషన్

ఈనాడు-అమరావతి: మామిడిలో ఫ్రూట్ కవర్ విధానం సత్ఫలితాలనిస్తోంది. హెక్టారుకు బంగినపల్లిలో రూ.2లక్షలు, తోతాపురి రకంలో రూ.90 వేల చొప్పున అదనపు ఆదాయం లభిస్తోందని ఉద్యానశాఖ పేర్కొంది. బుధవారం సచివాలయంలో జరిగిన కార్యదర్శులు, శాఖాధిపతుల సమావేశంలో ఈ మేరకు సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చింది. అందులోని ప్రధానాంశాలు..

మామిడి రైతుకు అదనపు లాభాలు

మామిడిలో ఫ్రూట్ కవర్ విధానం సత్ఫలితాలనిస్తోంది. హెక్టారుకు బంగినపల్లికి రూ.2 లక్షలు తోతాపురి రకానికి రూ.90 వేల చొప్పున అదనపు ఆదాయం లభిస్తోంది.

● కవర్ ధర రూ.2 చొప్పున 3 వేల కాయలకు (కిలోకు మూడు కాయలు) ఇతర ఖర్చులతో కలిపి రూ.9 వేలు అవుతుంది.

● టన్ను బంగినపల్లి కాయలు అమ్మకపు ధర కవరు లేకుండా అయితే రూ.25,000, కవర్ కట్టిన కాయలకు టన్నుకు రూ.40 వేల నుంచి రూ.60 వేలు లభించింది. అంటే టన్నుకు రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు అదనంగా లభించింది

● తోతాపురి రకం మామిడి టన్ను కవరు లేకుండా అయితే రూ.5 వేలు.. కవరు కట్టిన రకానికి టన్నుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల ధర దక్కింది.

● హెక్టారుకు కవర్ల ఖర్చు రూ.1.12 లక్షలు ఖర్చవుతుండగా.. బంగినపల్లి రకానికి రూ.2 లక్షలు (హెక్టారుకు 12.5 టన్నుల దిగుబడి, టన్ను రూ.16 వేల చొప్పున అదనపు ధర ప్రకారం), తోతాపురి రకానికి (హెక్టారుకు 15 టన్నుల దిగుబడి, టన్నుకు రూ.6 వేల చొప్పున అదనపు ధర ప్రకారం) రూ.90 వేల వరకు అదనపు రాబడి వస్తోంది.

అరటిలో ఫ్రూట్‌కేర్..హెక్టారుకు అదనపు రాబడి రూ.1,30,000

అరటిలో ఫ్రూట్‌కేర్ విధానం ద్వారా హెక్టారుకు రూ.1,30,000 అదనపు రాబడి రైతుకు లభిస్తోంది. కొందరు రైతులు ఇప్పటికే దీన్ని అమలు చేస్తున్నారు.

● ఫ్రూట్‌కేర్‌లో భాగంగా బంచ్ ఇంజక్షన్, మగపువ్వల తొలగింపు, అనుమతించిన పోషకాలు, పురుగు మందుల పిచికారీ చేస్తారు

● ఒక్కో మొక్కకు రూ.20 చొప్పున హెక్టారుకు 3 వేల మొక్కలకు రూ.60 వేలు ఖర్చవుతుంది

● టన్నుకు రూ.923 చొప్పున హెక్టారుకు 65 టన్నుల దిగుబడికి రూ.60 వేలు ఖర్చవుతుంది.

● అరటి ధర టన్నుకు అదనంగా రూ.2 వేలు చొప్పున 65 టన్నులకు రూ.1,30,000 లభిస్తుంది. ఖర్చు రూ.60 వేలు మినహాయిస్తే.. రూ.70 వేలు అదనపు ఆదాయమే

దానిమ్మలోనూ గ్రోకవర్లు

●గ్రోకవర్లు, కర్రలకు హెక్టారుకు రూ.62,500 (ఎకరాకు రూ.25వేలు) ఖర్చవుతుంది.

● పురుగుమందుల రూపంలో రూ.12,500 (ఎకరాకు రూ.5వేలు) ఆదా చేసుకోవచ్చు

●దానిమ్మకు టన్నుకు రూ.10 వేలు అదనపు ధర లభిస్తుంది

● హెక్టారుకు 20 టన్నుల దిగుబడి వస్తే.. రూ.2 లక్షలు అదనంగా వస్తుంది. ఖర్చుల రూపంలో రూ.62,500 పోయినా రూ.1,37,500 నికరంగా మిగులుతుంది.

ఫ్రూట్ కవర్, ఫ్రూట్ కేర్, గ్రోకవర్‌తో ప్రయోజనాలేంటి?

● సాగు వ్యయం తగ్గుతుంది ● చీడపీడల నుంచి రక్షణ ● ఒకే రకమైన రంగు ఉంటుంది ● ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది ● అధిక ధర లభిస్తుంది. ● ఎగుమతికి అనువుగా ఉంటుంది. ● దానిమ్మలో పూత అధికంగా వస్తుంది. దిగుబడి పెరుగుతుంది ● పక్షులు, ఇతర పండ్లు తొలిచే పురుగుల నుంచి రక్షణ ● మచ్చలకు అవకాశం ఉండదు.

పింఛన్ల పంపిణీలో అవినీతి లేదు

అభిప్రాయ సేకరణలో ప్రజల మనోగతం

ఈనాడు, అమరావతి: పింఛన్ల పంపిణీ, దీపం గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలపై అత్యధిక ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారు. 2024 జూన్ నుంచి వివిధ పథకాలు, కార్యక్రమాలకు సంబంధించిన సేవలపై ప్రభుత్వం క్యూఆర్ కోడ్, ఐవీఆర్ఎస్‌తోపాటు వివిధ మార్గాల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఇందులో దీపం, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం (స్త్రీ శక్తి) కార్యక్రమాలపైనా అధిక స్పందన లభించింది.

పథకాలు, సేవల వారీ సంతృప్తశాతం

	ఏడాది	3 నెలలు	నెల
పింఛన్			
పంపిణీలో అవినీతి లేదు	85.0	87.1	88.5
ఇంటిదగ్గరే ఇస్తున్నారు	87.6	89.4	88.3
సిబ్బంది ప్రవర్తన బాగుంది	83.5	86.7	86.5
దీపం-2			
డెలివరీ సిబ్బంది ప్రవర్తన బాగుంది	74.7	77.4	78.7
ఎక్కువ డబ్బు డిమాండు చేస్తున్నారు	37.3	38.4	39.7
ఆర్టీసీ బస్సు ప్రయాణం			
సమయానికి కదులుతోంది	71.1	71.1	76.3
సమయానికి వస్తోంది	70.4	67.4	70.6
సిబ్బంది ప్రవర్తన బాగుంది	72.1	73.5	76.4
ఆర్టీసీ బస్‌స్టేషన్లలో			
పారిశుద్ధ్యం, సీట్లు బాగున్నాయి	53.4	56.3	54.1
తాగునీటి సౌకర్యం ఉంది	45.2	46.9	48.3
మరుగుదొడ్లు బాగున్నాయి	56.0	58.2	58.3
బస్సు రాకపోకలు ప్రదర్శిస్తున్నారు	61.5	66.1	63.0
రేషన్			
నెలవారీ తీసుకుంటున్నాం	75.1	77.8	77.1
సరుకుల నాణ్యత బాగుంది	73.8	76.9	79.0
పంచాయతీల్లో చెత్త సేకరణ			
ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తున్నారు	57.0	61.9	64.0
వారంలో 2 రోజులు తీసుకెళ్తున్నారు	52.6	57.8	59.7
ఆసుపత్రుల్లో సేవలు			
డాక్టర్ అందుబాటులో ఉన్నారు	-	-	75.6
ఉచితంగా మందులిస్తున్నారు	-	-	61.0
పారిశుద్ధ్యం బాగుంది	-	-	71.3
అవినీతి ఉంది	-	-	67.9
అన్న క్యాంటీన్లు			
పరిశుభ్రంగా ఉంటోంది	80.1	82.5	81.6
నాణ్యమైన ఆహారం లభిస్తోంది	78.9	78.3	80.5
సమయానికి తెరుస్తున్నారు	80.6	81.5	85.1
ఆలయాల్లో సౌకర్యాలు			
దర్శనం సంతృప్తికరం	67.9	71.9	73.8
సౌకర్యాలు బాగున్నాయి	63.8	65.3	65.4
ప్రసాదం నాణ్యంగా ఉంది	77.9	76.8	79.1
పరిశుభ్రంగా ఉంచుతున్నారు	64.1	66.8	66.7
విత్తనాల పంపిణీ			
సమయానికే ప్రభుత్వం ఇస్తోంది	58.7	65.0	71.5
ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే	-	-	73.2
పురపాలక సేవలు			
రోజువారీగా చెత్త సేకరిస్తున్నారు	68.0	59.9	71.6
చెత్తకుప్పలు 24 గంటల్లో తీస్తున్నారు	56.3	62.1	64.6
మురుగుకాల్వలు శుభ్రం చేస్తున్నారు	-	52.9	53.9
బహిరంగ మరుగుదొడ్లు శుభ్రమే	-	-	58.9
విద్యుత్ సేవలు			
సరఫరాలో అంతరాయాలున్నాయి	61.6	62.8	68.3
వోల్టేజీ సమస్యలున్నాయి	53.8	56.4	63.3
సిబ్బంది అందుబాటులో ఉన్నారు	65.9	68.6	71.8
మహిళలపై నేరాలు			
బహిరంగ ప్రదేశాల్లో వేధిస్తున్నారు	27.8	25.6	21.8
పోలీసు స్పందన బాగుంది	60.4	65.7	66.6
భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు	-	42.6	45.3
గంజాయి/మాదకద్రవ్యాలు			
మా దగ్గర డ్రగ్స్ సమస్య ఉంది	26.9	26.7	25.9
పోలీసు స్పందన బాగుంది	54.6	57.8	58.8
బహిరంగప్రాంతాల్లో అమ్ముతున్నారు	-	-	20.7
గృహనిర్మాణం			
బిల్లులు ఇస్తున్నారు	61.7	54.7	47.9
సిబ్బంది సహకరిస్తున్నారు	63.8	57.0	58.9
బిల్లులివ్వడంలో సమస్యలున్నాయి	25.7	26.9	47.5
ఏపీ కాలుష్య నియంత్రణ మండలి			
అవినీతి ఉంది	25.3	23.3	32.2
సేవలు సంతృప్తికరమే	75.2	76.4	67.3
ఉచిత ఇసుక			
సరఫరాకేంద్రాల్లో ధర తక్కువే	-	55.5	59.2
అందుబాటులో ఉంది	-	65.6	70.3
నిర్మాణాలకు ఉపయోగపడుతోంది	-	65.3	69.1
రెవెన్యూసేవలు(ఆర్‌ఓఆర్)			
అదనపు సొమ్ము తీసుకుంటున్నారు	24.6	27.6	28.7
నోటీసులివ్వడంలేదు	44.9	52.3	50.8
క్షేత్రస్థాయి విచారణ చేస్తున్నారు	65.3	63.9	62.5
ఆర్డర్ కాపీ ఇస్తున్నారు	-	-	43.2
రెవెన్యూ సేవలు (ఎఫ్-లైన్)			
సర్వేకు ముందు చెబుతున్నారు	66.5	55.6	64.2
ఫీల్డ్ సర్వే చేస్తున్నారు	62.0	57.9	62.4
డబ్బు డిమాండు చేస్తున్నారు	22.5	31.5	27.7

రిజిస్ట్రేషన్ సేవలు	నవంబరు 25	డిసెంబరు 25
ఆన్‌లైన్‌లో సేవలందుతున్నాయి	69.6	72.6
సిబ్బంది ప్రవర్తన బాగుంది	78.2	80.1
స్లాట్‌బుకింగ్ జరుగుతోంది	73.6	76.6
అనధికార చెల్లింపులు ఉన్నాయి	47.4	43.7

పురావస్తు తవ్వకాల్లో విద్యార్థులకూ అవకాశం

- త్వరలో ఏపీకి 50 వేల పురాతన నాణేల అప్పగింత
- వారసత్వశాఖ సంచాలకుడు ఆచార్య అర్జున్‌రావు
- నేటి నుంచి నాణేలపై జాతీయ సదస్సు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పురావస్తు తవ్వకాల్లో కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చరిత్ర, ఆర్కియాలజీ తదితర కోర్సులు చదువుతున్నవారికి భాగస్వామ్యం కల్పించి.. సర్టిఫికెట్లు అందిస్తామని తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకుడు ఆచార్య కె. అర్జున్‌రావు వెల్లడించారు. ఈ మేరకు ఆయా విద్యాసంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్ల తర్వాత భారతీయ నాణేల సంస్థ (ఎన్ఎస్ఐ) ఆధ్వర్యంలో పురాతన నాణేలపై ఈ నెల 11, 12 తేదీల్లో హైదరాబాద్ ఎంసీహెచ్ఆర్‌డీలో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఐ ఛైర్మన్ డాక్టర్ రాజారెడ్డితో కలిసి అర్జున్‌రావు పబ్లిక్ గార్డెన్‌లోని రాష్ట్ర మ్యూజియంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సదస్సుకు దేశవ్యాప్తంగా నాణేలపై పరిశోధన చేస్తున్నవారు హాజరవుతారని, ఎంసీహెచ్ఆర్‌డీలో నాణేల ఎగ్జిబిషన్ కూడా నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు సందర్శించవచ్చన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై సదస్సును ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్ర మ్యూజియంలో 3 నుంచి 18 శతాబ్దాల వరకు వినియోగించిన సుమారు 2.94 లక్షల పురాతన నాణేలున్నాయని వెల్లడించారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు సుమారు 50 వేల నాణేలను త్వరలోనే అప్పగిస్తామని తెలిపారు. సమావేశంలో మ్యూజియం డిప్యూటీ డైరెక్టర్ పి.నాగరాజు, ఎన్ఎస్ఐ ప్రతినిధి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.16 లక్షల కోట్ల విలువైన ఉత్పత్తి సాధిస్తాం

- ప్రణాళిక, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్

ఈనాడు, అమరావతి: 'ప్రభుత్వ శాఖలను మూడు విభాగాలుగా చేసి జీఎస్‌డీపీతో మ్యాపింగ్ చేశాం. ఏపీ తప్ప ఏ రాష్ట్రమూ ప్రతి త్రైమాసికానికి ఇలా వృద్ధి గణాంకాలు విడుదల చేయడం లేదు. కొన్ని రాష్ట్రాల్లో ఏడాదికి ఒకటి రెండు సార్లు విడుదల చేసినా ప్రజలకు అందుబాటులో ఉంచడం లేదు. స్వర్ణాంధ్ర లక్ష్యాలు సాధించేందుకు ఈ నివేదికలు ఎంతో ఉపయోగపడతాయి' అని రాష్ట్ర ప్రణాళిక, ఆర్థికశాఖల ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.16.88 లక్షల కోట్ల స్థూల ఉత్పత్తిని సాధించాలనేది లక్ష్యమని తెలిపారు. తొలి 6 నెలల్లో 41% సాధించామని, మిగిలిన లక్ష్య సాధనకు రంగాల వారీగా నిర్దిష్ట వ్యూహాలు అవలంబిస్తామని చెప్పారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ వివరాలు ఇలా..

● రాష్ట్ర వృద్ధి రేటు ఎంతో బాగున్నా ద్రవ్యోల్బణం వల్ల ఆ వృద్ధి మొత్తం ప్రతిఫలించడం లేదు. జాతీయ స్థాయితో పోలిస్తే 2.6% అధికంగా ఉంది.

● జిల్లా స్థాయిలో పరిశ్రమలశాఖలో కొత్త పారామీటర్లు ఏర్పాటు చేస్తున్నాం.

● వ్యవసాయంలో కూడా వినియోగం ఆధారంగా ఉత్పత్తి ఉండేలా చూస్తున్నాం. ఆర్‌టీజీఎస్‌తోను అనుసంధానం చేస్తున్నాం.

● పరిశ్రమల రంగంలో దేశం కన్నా మంచి పురోగతి సాధించాం. మధ్య చిన్న తరహా పరిశ్రమలకు కూడా ప్రోత్సాహకాలు అందించాం. అంతర్జాతీయ డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి ఉండేలా చూస్తున్నాం. గనుల విభాగాన్ని కూడా బలోపేతం చేశాం.

వైకాపా సర్కారు కారణంగానే పెండింగ్ పెరిగాయి

ఈనాడు, అమరావతి: 'గత ప్రభుత్వం పీఏసీకి సహకరించలేదు. దానివల్ల పెండింగ్ పెరిగింది. ఇప్పుడు స్పీడప్ చేస్తే వేగంగా అప్‌డేట్ అవుతుంది' అని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. 'వైకాపా హయాంలో పీఏసీకి సకాలంలో సమాచారమివ్వనందున కాగ్ ఆడిట్ పేరాలు పెండింగ్‌లో పడ్డాయి. ఇప్పుడు ఆ కమిటీకి త్వరగా సమాధానాలు ఇచ్చి, ఆడిట్ పేరాల అభ్యంతరాలను క్లోజ్ చేయించుకోవాలి' అని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. 'వాటిని ఫాలోఅప్ చేసి త్వరగా పూర్తి చేయండి. ఆడిట్ పెండింగ్ ఉంటే అదీ పూర్తిచేయించండి. అసెంబ్లీ పీఏసీకి త్వరగా సమర్పించండి' అని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

✦ 'వివరణ నివేదికలు (ఎక్స్‌ప్లనేటరీ నోట్స్) ఎన్ని రావాలనే వివరాలను ఆరు నెలలకోసారి ఆయా శాఖలకు కాగ్ పంపుతుంది. మనం రిప్లై పంపాలి. తర్వాత వాటిపై అసెంబ్లీ పీఏసీలో చర్చించాలి. ఇలాంటి నోట్స్ అన్ని శాఖలూ కలిపి 180 ఇవ్వాల్సి ఉంది' అని ఆర్థిక శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్ సీఎంకు తెలిపారు. సీఎం స్పందిస్తూ.. 'ఎట్టి పరిస్థితుల్లో ఈ త్రైమాసికంలో ఇవన్నీ పూర్తిచేయాలి. అసెంబ్లీ పీఏసీ నుంచి ర్యాటిఫై చేయించుకోవాలి. తర్వాత అప్‌డేటెడ్‌గా ఉండాలి' అని అధికారులకు స్పష్టం చేశారు.

పౌర సేవల్లో విశాఖ మొదటి స్థానం

ర్యాంకు	జిల్లా	సాధించిన స్కోర్ (శాతం)
1	విశాఖపట్నం	83.8
2	ఎన్టీఆర్	81.1
3	తూర్పుగోదావరి	71.5
4	గుంటూరు	71.2
5	తిరుపతి	70.1
6	పల్నాడు	69.7
7	విజయనగరం	68.5
8	బాపట్ల	68.1
9	కృష్ణా	66.1
10	ఏలూరు	65.5

ఈనాడు, అమరావతి: పుర, నగరపాలక సంస్థల్లో ప్రజలకు అందిస్తున్న వివిధ పౌర సేవలకు సంబంధించి విశాఖపట్నం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఎన్టీఆర్, తూర్పుగోదావరి జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. జిల్లాల పరిధిలోని నగరాలు, పట్టణాల్లో పౌర సేవల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన మొదటి పది జిల్లాలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఈ ర్యాంకులను ప్రకటించింది. సీఎం చంద్రబాబు సచివాలయంలో బుధవారం వివిధ శాఖల మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో నిర్వహించిన సదస్సులో ఈ వివరాలు వెల్లడించింది. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, రోడ్ల నిర్మాణం, వీధిదీపాల నిర్వహణ, స్వయం సహాయ సంఘాలకు ఆర్థిక సాయం, ఆస్తిపన్నుల వసూళ్ల తదితర ఎనిమిది అంశాలను మదింపు చేసి ర్యాంకులు కేటాయించారు. శ్రీ సత్యసాయి, పార్వతీపురం మన్యం, నంద్యాల, కోనసీమ, శ్రీకాకుళం తదితర జిల్లాలు బాగా వెనుకపడ్డాయి.

2.98 కోట్ల గ్యాస్ సిలిండర్లు.. 1.34 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డులు

ఈనాడు, అమరావతి: పౌరసరఫరాల శాఖ ద్వారా రాష్ట్రంలో ఇప్పటివరకు 2.98 కోట్ల గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఇందుకోసం మొత్తం 1.07 కోట్ల కుటుంబాలకు సంబంధించి ఇప్పటివరకు రూ.2,109 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. బుధవారం నిర్వహించిన శాఖాధిపతుల సమావేశంలో పౌరసరఫరాల శాఖ నివేదికను అధికారులు ప్రదర్శించారు.

✦ రాష్ట్రంలో 1.45 కోట్ల రేషన్ కార్డులుండగా.. 1.34 కోట్ల (93%)మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు.

✦ ప్రతినెలా 14.74 లక్షల కార్డుదారులకు 8,530 టన్నుల నిత్యావసరాల్ని వారి ఇళ్ల వద్దకే తీసుకెళ్లి ఇస్తున్నారు.

✦ 2025-26 ఖరీఫ్‌లో 50.75 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటివరకు 2.78 లక్షల మంది రైతుల నుంచి రూ.4,288 కోట్ల విలువైన 18.08 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు.

✦ 9,260 మొబైల్ డోర్ డెలివరీ వాహనాల్ని రద్దు చేసి, 29,796 రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు.

'సుస్థిరాభివృద్ధి'పై త్రైమాసిక సమీక్ష

- ధరల నియంత్రణ, ఉద్యోగ కల్పన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి
- సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్ని ఎప్పటికి సాధిస్తామో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అన్ని శాఖలకు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీనిపై ప్రతి మూణ్నెల్లకు ఒకసారి సమీక్షిస్తానని తెలిపారు. ధరల నియంత్రణ, ఉద్యోగావకాశాలను ప్రతి కుటుంబమూ కోరుకుంటోందని, దీనికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో శాఖల వారీగా పనితీరును, వివిధ అంశాలపై ప్రజల్లో సంతృప్తస్థాయిని వివరించారు.

రైతుల్లో అసంతృప్తిని తగ్గించడంపై దృష్టి సారించాం

వివిధ అంశాల్లో ప్రజల్లో సంతృప్తస్థాయికి సంబంధించి ర్యాంకులను సీఎం ప్రకటించారు. సుపరిపాలనపై ప్రజల్లో ఎక్కువ సంతృప్తి ఉందని.. రెండో స్థానంలో రహదారులు, రవాణా రంగం నిలిచిందని చెప్పారు. 'అభివృద్ధి మూడో స్థానంలో, ధరల నియంత్రణ నాలుగో స్థానంలో, ఆర్థిక వృద్ధి ఐదో స్థానంలో ఉంది. అవినీతి నియంత్రణ, తాగునీటి సౌకర్యం కల్పన, మెరుగైన వైద్య సేవలు మెరుగైన స్థానంలో ఉన్నాయి. పెట్టుబడుల ఆకర్షణ, రాజధాని, ఆలయాల నిర్వహణ, విద్యావ్యవస్థను మెరుగుపరచడం, పోలవరం, ఉద్యోగ కల్పన, ఇవన్నీ తరువాతి స్థాయిలో నిలిచాయి. వీటిని ప్రజలు ఆమోదిస్తున్నారు' అని వివరించారు. బియ్యం ధరల పెరుగుదలపైనా కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారని, ఇది వాస్తవం కాదని.. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల్లో అసంతృప్తి తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్న సీఎం.. అందుకు తానూ సమయం కేటాయిస్తున్నానని చెప్పారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి శాఖల వారీగా స్కోర్లు

శాఖ	ఇండికేటర్లు	స్కోర్	గ్రేడ్
విద్యుత్తు మౌలిక సదుపాయాల కల్పన	2	100	ఏ+
వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం	3	99	ఏ+
పౌరసరఫరాల శాఖ	3	97	ఏ+
మహిళా, శిశు సంక్షేమం	2	96	ఏ+
కార్మిక, ఉపాధి కల్పన	6	94	ఏ+
వైద్యారోగ్యశాఖ	16	89	ఏ
రెవెన్యూ	2	89	ఏ
మాధ్యమిక విద్య	11	86	ఏ
ప్రణాళిక	8	85	ఏ
ఆర్థికశాఖ	4	82	ఏ
పర్యావరణం, అటవీ	11	81	ఏ
పురపాలక, పట్టణాభివృద్ధి	7	75	ఏ
ఉన్నత విద్య	2	74	బీ
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	6	73	బీ
హోం	6	61	బీ
పరిశ్రమలు, వాణిజ్యం	2	34	సీ
గ్రామ, వార్డు సచివాలయాలు	3	0	సీ

దస్త్రాల పరిష్కారంలో టాప్-3 కార్యదర్శుల వివరాలు

కార్యదర్శి	పరిష్కరించినవి	పరిష్కారానికి తీసుకున్న సగటు సమయం
ఎం.హరిజవహర్‌లాల్	869	2 గంటలు 55 నిమిషాలు
అజయ్‌జైన్	11,853	12 గంటలు 39 నిమిషాలు
పీయూష్‌కుమార్	34,564	12 గంటల 54 నిమిషాలు
(చివరి నుంచి మూడు స్థానాల్లో)		
జి.జయలక్ష్మి	10,564	3 రోజుల 6 గంటల 9 నిమిషాలు
ఎం.ఎం.నాయక్	9,632	2 రోజుల 16 గంటల 23 నిమిషాలు
యువరాజ్	6,939	2 రోజుల 11 గంటల 52 నిమిషాలు

09.09.2025 నుంచి 9.12.2025 వరకు దస్త్రాల పరిష్కారంలో టాప్-3 సచివాలయ శాఖలు

శాఖ	పరిష్కరించిన దస్త్రాలు	పరిష్కారానికి తీసుకున్న సగటు సమయం
సీఎస్ కార్యాలయం	1,793	1 రోజు 2 గంటల 34 నిమిషాలు
శాసనసభా వ్యవహారాలు	1,806	3 రోజుల 1 గంటల 40 నిమిషాలు
సీఎంవో	1,143	3 రోజుల 14 గంటల 36 నిమిషాలు
(చివరి నుంచి మూడు స్థానాల్లో)		
పరిశ్రమలశాఖ	23,460	27 రోజుల 18 గంటల 08 నిమిషాలు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	35,577	24 రోజుల 20 గంటల 54 నిమిషాలు
విద్యుత్తు	8,695	23 రోజుల 16 గంటల 10 నిమిషాలు

మన రొయ్య.. ఈయూ, యూకే, రష్యాకు

- ఎగుమతుల్లో 28% వృద్ధి

ఈనాడు, అమరావతి: సుంకాల నేపథ్యంలో అమెరికాకు మన సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 11% క్షీణించాయి. ఇదే సమయంలో యూరోపియన్ యూనియన్, యూకే, రష్యా, తూర్పు ఆసియా దేశాలకు పెరిగాయి.

◆ 2024-25 ఏప్రిల్-అక్టోబరులో దేశం నుంచి 11.21 లక్షల టన్నుల ఎగుమతులు జరగ్గా.. అవి 2025-26 అక్టోబరులో 14.35 లక్షల టన్నులకు పెరిగాయి. పరిమాణంలో 28%, విలువ పరంగా 46% వృద్ధి కనిపించింది. ఇందులో అధికశాతం రొయ్య ఎగుమతులే. ◆ చైనాకు 11%, యూరోపియన్ యూనియన్ 19%, ఆసియాన్ దేశాలకు 370% వృద్ధి కనిపించింది. రష్యాకు ఎగుమతులు 13% పెరిగాయి. ◆ మత్స్యశాఖలో ఈ ఏడాది వృద్ధిరేటు 18.67 శాతం ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది.

2024, 2025 సంవత్సరాల్లో ఏప్రిల్-అక్టోబరు మధ్య ఎగుమతులు (టన్నుల్లో)

దేశం	2024	2025	తేడా(%)
అమెరికా	2,03,464	1,80,211	-11
చైనా	2,18,735	2,42,987	11
ఈయూ	1,09,690	1,30,095	19
ఆసియాన్	1,38,130	6,48,773	370
జపాన్	59,011	56,278	-5
జాంబియా	55,331	-	100
టోగో	65,975	-	100
కెనడా	15,019	16,964	13
యూఏఈ	20,515	17,579	-14
రష్యా	11,992	13,597	13
ఇతర దేశాలు	2,22,977	1,28,888	-42

తెలంగాణలో నేడు తొలి విడత పంచాయతీ పోరు

- 3,834 సర్పంచి... 27,628 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్
- అనంతరం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో తొలి దశ గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. 3,834 సర్పంచి... 27,628 వార్డు సభ్యుల స్థానాలకు గురువారం ఎన్నికలు జరుగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 37,562 పోలింగ్ కేంద్రాల్లో 56,19,430 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించి... ఫలితాలను ప్రకటిస్తారు. అనంతరం వార్డు సభ్యులతో సమావేశాలు నిర్వహించి... ఉపసర్పంచి ఎన్నికలు నిర్వహిస్తారు. పార్టీ రహిత ఎన్నికలైనప్పటికీ రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని... తమ మద్దతుదారులను అభ్యర్థులుగా బరిలోకి నిలిపాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రచారంలో పాల్గొన్నారు.

స్థిరాస్తి సంస్థలో ఈడీ సోదాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రీలాంచింగ్ ఆఫర్ల పేరుతో మోసానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై భువన్ తేజ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే స్థిరాస్తి సంస్థలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం సోదాలు నిర్వహించింది. సంస్థ కార్యాలయాలు, ఇళ్లు కలిపి ఐదు ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. ఇళ్లు నిర్మించి ఇస్తామని చెబుతూ భువన్ తేజ సంస్థ మోసం చేసిందని వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కాగా.. వాటన్నింటినీ హైదరాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. సీసీఎస్ దర్యాప్తు చేస్తుండగానే నిధుల మళ్లింపు కోణంలో ఈడీ మరో కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా సోదాలు నిర్వహించిన అధికారులు పలు పత్రాలు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నారు.

అమెరికాలో బిజీ బిజీగా

అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ టెక్ దిగ్గజ సంస్థలు గూగుల్, ఇంటెల్, అడోబ్, ఎన్‌విడియా, జూమ్ సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.



గూగుల్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వైస్ ప్రెసిడెంట్ వికాస్ కోలీకి అరకు కాఫీ ఉత్పత్తులు అందిస్తున్న మంత్రి లోకేశ్ ● ఫెయిర్ ఫాక్స్ ఫైనాన్షియల్ సీఈవో ప్రేమ్ వాత్సాతో మంత్రి లోకేశ్ ● జూమ్ సంస్థ గురించి వివరిస్తున్న మంత్రి లోకేశ్‌కు వివరిస్తున్న ఆ సంస్థ ప్రతినిధి. చిత్రంలో జూమ్ సంస్థ వీడియో కమ్యూనికేషన్స్ ప్రొడక్ట్, ఇంజినీరింగ్ విభాగ ప్రెసిడెంట్ వెల్చామి శంకరలింగం, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణ తదితరులు ● శాన్‌ఫ్రాన్సిస్కోలోని సిలికాన్ వ్యాలీలో జరిగిన బే ఏరియా కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్ ● బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ కెనడా ప్రెసిడెంట్ గోల్డీ హైదర్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్

అవార్డు గ్రహీతలకు గవర్నర్ అభినందన

ఈనాడు, అమరావతి: జాతీయ స్థాయిలో 'శిల్ప గురు' అవార్డు పొందిన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం నిమ్మలకుంటకు చెందిన తోలుబొమ్మల కళాకారిణి డి.శివమ్మను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందించారు. తోలుబొమ్మలాటలో రామాయణం, మహాభారతం, శ్రీకృష్ణ లీలలను అద్భుతంగా వర్ణించినందుకు శివమ్మకు ఈ అవార్డు దక్కడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఆమెతో పాటు జాతీయస్థాయి అవార్డులు పొందిన నెల్లూరుకు చెందిన కలంకారీ కళాకారిణి విజయలక్ష్మి, ఏటికొప్పాక బొమ్మల తయారీలో పురస్కారం పొందిన అనకాపల్లి జిల్లాకు చెందిన గోర్సా సంతోష్‌లకు కూడా గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు.

దోపిడీ, విధ్వంసమే జగన్ విజన్

తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల

ఈనాడు, అమరావతి: దోపిడీ, విధ్వంసం, మంద బలంతో అధికారాన్ని ఎలా హస్తగతం చేసుకోవాలో ఆలోచించడమే వైకాపా అధ్యక్షుడు జగన్ విజన్ అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తికి రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమాల్లో అగ్రస్థానంలో నిలపాలనుకుంటున్న సీఎం చంద్రబాబు విజన్ అర్థం కాదని బుధవారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. "రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ.. సమాజంలో పేదరికం, ఆర్థిక అసమానతల్ని తొలగించాలని చంద్రబాబు చూస్తుంటే.. జగన్ అవినీతి, అక్రమాలపై దృష్టి పెడుతున్నారు. సుపరిపాలన చంద్రబాబు లక్ష్యమైతే.. ప్రతీకార రాజకీయాలు జగన్‌కు ముఖ్యం" అని యనమల దుయ్యబట్టారు.

చిన్నారి గాయని సాధ్యకు చంద్రబాబు ప్రశంస

ఈనాడు, అమరావతి: అంతర్జాతీయ వేదికలపై శ్రావ్యంగా పాటలు పాడుతూ పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్న గుంటూరు జిల్లాకు చెందిన చిన్నారి గాయని సాధ్యను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. సాధ్య, ఆమె తల్లిదండ్రులు స్పైరా, సిరి కృష్ణ బుధవారం సచివాలయంలో సీఎంను కలిశారు. ఇప్పటివరకు దేశ, విదేశాల్లో 22 జాతీయ, అంతర్జాతీయ పాటల పోటీల్లో సాధ్య పాల్గొని 22 అవార్డుల్ని సాధించారని ఆమె తల్లిదండ్రులు సీఎంకు వివరించారు. సాధ్య మరిన్ని విజయాలను సాధించాలని సీఎం ఆకాంక్షించారు. ఆమెను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఈ సందర్భంగా సీఎం అభినందించారు.

టెట్ పరీక్షకు 17,181 మంది హాజరు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని బుధవారం నిర్వహించిన ఏపీ టెట్-2025 పరీక్షలకు 17,181 మంది హాజరయ్యారని ఏపీ టెట్ కన్వీనర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 79 కేంద్రాల్లో నిర్వహించిన స్కూలు అసిస్టెంట్ (తెలుగు)-2ఏ పరీక్షకు 92.45 శాతం మంది, మధ్యాహ్నం 32 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 90.3 శాతం మంది హాజరైనట్లు వెల్లడించారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

వైకాపా నేతల భూ దోపిడీ

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

తన స్థలాన్ని ఆక్రమించిన వైకాపా నాయకులపై చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా నందవరానికి చెందిన నాగలక్ష్మి వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.

రూ.2 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ఏపీపీఎఫ్‌సీఎల్‌కు అనుమతి

ఈనాడు, అమరావతి: ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ తీసుకునే రూ.2 వేల కోట్ల రుణానికి హామీ ఇచ్చేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, నిర్వహణ ఖర్చులకు ఆ మొత్తాన్ని వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏపీలో పెట్టుబడులకు విస్తృత అవకాశం

- కెనడాలో వివిధ సంస్థల ప్రతినిధులతో మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: అమెరికా పర్యటన ముగించుకున్న మంత్రి నారా లోకేశ్.. అక్కడి నుంచి బుధవారం కెనడా వెళ్లారు. కెనడాలోని టొరంటోలో వివిధ సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కెనడా సంస్థలను కోరారు. ఏపీలో పారిశ్రామిక రంగంలో కెనడా సంస్థల పెట్టుబడులకు సహకరించాలని మంత్రి లోకేశ్ బిజినెస్ కౌన్సిల్ ఆఫ్ కెనడా ప్రతినిధులను కోరారు. కెనడాలోని టొరంటోలో ఆ సంస్థ ప్రెసిడెంట్ హైదర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. 'రాష్ట్రానికి గత 18 నెలల్లో రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. మరికొన్ని పైప్‌లైన్‌లో ఉన్నాయి. పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్ నెట్‌వర్క్, పారిశ్రామిక కారిడార్లు అభివృద్ధి చేస్తున్నాం. గూగుల్, ఆర్సెలార్ మిత్తల్, రిలయన్స్ వంటి గ్లోబల్ సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ఐటీ కంపెనీలు, డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖపట్నం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది' అని పేర్కొన్నారు. ఏపీలో కెనడియన్ సంస్థల పెట్టుబడులకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని హైదర్ చెప్పారు.



గూగుల్ సంస్థ సీఈవో సుందర్ పిచాయ్‌కి రాష్ట్ర ప్రభుత్వం తరపున కానుక అందజేస్తున్న మంత్రి లోకేశ్

పర్యాటక రంగంలో పెట్టుబడులకు అవకాశం

కుప్పంలో విమానాశ్రయాన్ని నిర్మించేందుకు సహకరించాలని ఫెయిర్ ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ లిమిటెడ్‌ను మంత్రి కోరారు. ఆ సంస్థ సీఈవో ప్రేమ్ వాత్సాతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. 'ఏపీలో పర్యాటకం, ఆతిథ్య సేవల రంగంలో పెట్టుబడులు పెట్టండి. మీ అనుబంధ సంస్థ స్టెర్లింగ్ రిసార్ట్స్ ద్వారా హోటళ్లు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సహకరించండి. ఫ్లోరిడాలోని పనామా సిటీ తరహాలో రాష్ట్రంలోని నల్లమలలో స్టెర్లింగ్ రిసార్ట్స్ ఏర్పాటుకు అవకాశాలు పరిశీలించాలి' అని కోరారు. ఏపీ ప్రతిపాదనలు పరిశీలిస్తామని ప్రేమ్ వాత్సా పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీ, రోడ్ల అభివృద్ధిలో సహకరించాలి

గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టే ప్రతిపాదనను పరిశీలించాలని కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (సీపీపీఐబీ) గ్లోబల్ టీమ్ మెంబర్స్‌తో టీమ్ డౌనింగ్‌లో నిర్వహించిన భేటీలో మంత్రి కోరారు. 'పోర్టులు, లాజిస్టిక్స్‌లో పెట్టుబడులు, వాటి నిర్వహణలో సీపీపీఐబీకి అనుభవం ఉంది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు మెర్క్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయి. మా రాష్ట్రంలో టోల్ రోడ్లు, రవాణా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టండి. అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కండి. రాష్ట్రానికి అవసరమైన దీర్ఘకాల మూలధనం అందించండి' అని లోకేశ్ కోరారు.

ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి

- ఓపెన్ టెక్స్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌తో మంత్రి లోకేశ్

ఎంటర్‌ప్రైజ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో ప్రపంచస్థాయిలో పేరెన్నికగన్న ఓపెన్ టెక్స్ట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ రాడ్కోతో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి భవిష్యత్తు సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని యువతకు ప్రపంచస్థాయి నైపుణ్యాలను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా జాన్ రాడ్కో మాట్లాడుతూ 'మా సంస్థ డేటా/కంటెంట్ మేనేజ్‌మెంట్, వ్యాపార ప్రక్రియలు, డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ కోసం క్లౌడ్/ఏఐ పరిష్కారాలను అందిస్తోంది. భారతదేశంలో కూడా మాకు బలమైన ఉనికి ఉంది. ఏఐ, క్లౌడ్ సాంకేతికతలను ఉపయోగించి వివిధ రంగాల్లో సురక్షితమైన, ఆటోమేటెడ్ సమాచార నిర్వహణపై దృష్టి సారిస్తున్నాం. టైర్-2 నగరాలకు మా కార్యకలాపాలను విస్తరించాలని భావిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనల్ని పరిశీలిస్తాం' అని తెలిపారు.

రెండేళ్లలో గ'ఘన'యానం..!

- మానవరహిత, సహిత యాత్రలపై ఇస్రో కీలక దృష్టి
- 2035కల్లా నింగిలో సొంత స్పేస్‌స్టేషన్ ఏర్పాటుకు సన్నద్ధం
- 'ఈనాడు'తో అహ్మదాబాద్ శాక్ డైరెక్టర్ నీలేష్ ఎం.దేశాయ్



గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: అంతరిక్ష ప్రయోగాల్లో అద్భుతాలు సృష్టిస్తున్న ఇస్రో.. సరికొత్త చరిత్రను లిఖించేందుకు అడుగులు వేస్తోంది. ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిస్థాయిలో పట్టాలెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఇందుకు రూట్‌మ్యాప్ ఇప్పటికే పూర్తికాగా.. 2027లో మానవసహిత యాత్ర చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2035 నాటికి రోదసిలో భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం 5 మాడ్యూల్స్‌ను అనుసంధానించి సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ ప్రాజెక్టుల వివరాలను ఇస్రోలో భాగమైన అహ్మదాబాద్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (శాక్) డైరెక్టర్ నీలేష్ ఎం.దేశాయ్ 'ఈనాడు'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఇలా..

● అహ్మదాబాద్‌లో స్పేస్ అప్లికేషన్ సెంటర్ దేశంలో మిగిలినవాటితో పోలిస్తే ప్రత్యేకమైంది. ప్రయోగించే వాహక నౌకల్లోని అన్ని పేలోడ్లు ఇక్కడ తయారవుతాయి. 15 రోజుల ముందే తుపానుల సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేస్తున్నాం. మత్స్యకారుల ప్రాణాలు కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్నాం.

అలా ఆలస్యమైంది

2022లోనే గగన్‌యాన్ మిషన్ పూర్తిచేయాలని ప్రధాని మోదీ ఆదేశించారు. కానీ కొవిడ్, కొన్ని సాంకేతిక కారణాల వల్ల జాప్యమైంది. ఇప్పుడు మొట్టమొదటి మానవరహిత గగన్‌యాన్ మిషన్ 2026 ఫిబ్రవరిలో రోదసిలోకి పంపిస్తాం. మరో రెండు మానవరహిత మిషన్లు అదే ఏడాదిలో ప్రయోగిస్తాం. 2027లో నాలుగో మానవరహిత మిషన్‌ను పంపించి ఫలితాలను విశ్లేషిస్తుకుంటాం. వాటి ఆధారంగా మానవసహిత మిషన్ 2027 డిసెంబర్‌లో పంపిస్తాం.

● గగన్‌యాన్‌కు వైమానికదళం నుంచి నలుగురిని తీసుకున్నారు. ఇందులో ఒకరిని వ్యోమగామి శిక్షణకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపాం. ముగ్గురు శిక్షణ పొందుతున్నారు. గగన్‌యాన్ కింద ఎందరిని పంపాలన్న దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అదే అసలు సమస్య

కొంతకాలం అంతరిక్షంలో ఉండి నేలమీదకు వచ్చాక (భారరహిత స్థితి నుంచి గురుత్వాకర్షణ శక్తి పరిధిలోకి రావడం వల్ల) వ్యోమగాములు శారీరక రుగ్మతలకు లోనయ్యే అవకాశం ఉంది. భారతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం అందుబాటులోకి వస్తే రోదసిలోకి పంపించే మానవసహిత వాహనాలు అక్కడ ఆగుతాయి. ఈ అంతరిక్ష కేంద్రం భారత్‌కు ఒక మజిలీగా ఉపయోగపడుతుంది.

సెమీకండక్టర్ల ఉత్పత్తిలో శాక్ సత్తా..!

- ఇస్రో అవసరాలు తీర్చడానికి కృషి

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి: భారతదేశపు మొట్టమొదటి అంతరిక్ష ప్రమాణాలతో కూడిన ఎల్‌టీసీసీ ఆధారిత సిరామిక్ మల్టీ-చిప్-మాడ్యూల్ సెమీకండక్టర్ ప్యాకేజ్ ఫ్యాబ్రికేషన్ ఫౌండ్రీని స్పేస్ అప్లికేషన్ సెంటర్ (శాక్) అహ్మదాబాద్‌లో ఏర్పాటు చేసింది. దేశంలో చిప్ తయారీ, ప్యాకేజింగ్ కార్యక్రమాలు చేస్తున్నా.. ప్యాకేజింగ్ సాంకేతికత కోసం ఇప్పటికీ దిగుమతి మీద ఆధారపడుతున్నాం. శాక్‌లో అభివృద్ధి చేసిన ప్యాకేజింగ్ సాంకేతికత ఈ లోటును తీర్చింది.. ఇస్రో, దేశీయ అధునాతన సెమీకండక్టర్ ప్యాకేజ్ అవసరాల్లో స్వయం సంవృద్ధిని సాధించేందుకు సాయపడింది. ఇది సెమీకండక్టర్ ఆధారిత ఉప-వ్యవస్థలను అభివృద్ధి చేయడానికీ మార్గాన్ని సుగమం చేసింది. ఈ ఫౌండ్రీని ఇస్రోకు చెందిన నైసార్, రిశాట్-1 ప్రముఖ భూ పరిశీలనా ఉపగ్రహాల కోసం 1700కు పైగా మల్టీ-చిప్-మాడ్యూల్స్ తయారీలో విజయవంతంగా ఉపయోగించారు. భారీ ఉత్పత్తి కోసం ఈ పరిజ్ఞానాన్ని బెంగళూరులోని బీఈఎల్‌కు బదిలీ చేశారు. దీనిపై భారత పారిశ్రామిక వర్గాల నుంచీ ఆసక్తి వ్యక్తమవుతుండగా.. పెద్ద ఎత్తున మార్కెట్‌లో ఉపయోగించే బయోమెడికల్ పరికరాలు, ఆటోమోటివ్ రాడార్ వంటి రంగాల్లో వినియోగం కోసం సాంకేతిక బదిలీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

స్ట్రాటజిక్ సెమీకండక్టర్ డివైస్ ఫౌండ్రీ

గ్యాలియం నైట్రైడ్ (జీఏఎన్) ఆధారిత హై పవర్ ఆర్ఎఫ్ సెమీకండక్టర్ పరికరాలు, ఎంఎంఐసీలు.. ఇస్రో రాడార్ ఆధారిత వ్యూహాత్మక భూ పరిశీలన, నావిగేషన్, కమ్యూనికేషన్ ఉపగ్రహాలకు అత్యంత కీలకమని చెప్పవచ్చు. అయితే, వ్యూహాత్మక ఫ్రీక్వెన్సీ బ్యాండ్స్ కోసం ఈ పరికరాలు అనేక దిగుమతి పరిమితులను ఎదుర్కొంటున్నాయి. జీఏఎన్, ఎంఎంఐసీల విషయానికి వస్తే, ప్రపంచవ్యాప్తంగా కేవలం ఒకే ఒక స్పేస్-క్వాలిఫైడ్ జీఏఎన్ ఎంఎంఐసీ ఫౌండ్రీ మాత్రమే ఉంది (యూఎంఎస్, ఫ్రాన్స్). ఇది ఇస్రోకు కూడా ఫౌండ్రీ సేవలను అందిస్తోంది. సిలికాన్ ఆధారిత ఫౌండ్రీ టెక్నాలజీలకు భిన్నంగా, జీఏఎన్ ఫౌండ్రీ సాంకేతికతను సులభంగా బదిలీ చేయడం సాధ్యం కాదు. ఇది పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తుంది. ఈ సవాళ్ల నేపథ్యంలో శాక్ స్వదేశీ 250 ఎన్ఎం ఆర్ఎఫ్ జీఏఎన్ ఫౌండ్రీ టెక్నాలజీ అభివృద్ధి పనిని చేపట్టింది. ఈ నోడ్ 12 జీహెచ్‌జెడ్ వరకు ఉన్న వ్యూహాత్మక ఎక్స్ బాండ్ అప్లికేషన్లకు అనువుగా ఉంటుంది.

అలా విస్తరిస్తారు మరి..

● శాక్‌కు చెందిన మైక్రో, నానో ఫ్యాబ్రికేషన్ సదుపాయాలను ఉపయోగించి అనేక ఫ్యాబ్రికేషన్ ప్రక్రియలను ఇప్పటికే అభివృద్ధి చేశారు. వీటి సమగ్ర పనితీరు ప్రోత్సాహకరమైన ఫలితాలను ఇచ్చినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ సాంకేతికత నూరుశాతం ఫలితాల తరవాత 5జీ, 6జీ వంటి భారీ మార్కెట్ అప్లికేషన్ల కోసం.. పరికరాల ఉత్పత్తికి ఆసక్తి ఉన్న భారత పరిశ్రమలకూ బదిలీ అవుతుందనీ.. ఇందులో జీఏఎన్ సాంకేతికత కీలక పాత్ర పోషించనుందని అధికారులు చెబుతున్నారు.

● ఇస్రో, నాసా కలిసి అభివృద్ధి చేసిన నైసార్.. నాసా ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్ మొదటిసారి సమాన భాగస్వామ్యంతో మైక్రో వేవ్ ఇమేజింగ్ ద్వారా ఎలాంటి వాతావరణ పరిస్థితిలోనైనా అత్యంత స్పష్టంగా చిత్రాలు అందించే సాంకేతికతను అభివృద్ధి చేశారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

నంద్యాల-గుంతకల్లు మధ్య రైళ్ల సమయాలు మార్చే అంశాన్ని పరిశీలిస్తాం

ఈనాడు, దిల్లీ: నంద్యాల-గుంతకల్లు మధ్య ప్రస్తుతం రాత్రి సమయాల్లో నడుస్తున్న రైళ్ల రాకపోకలను మార్చే అంశంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ప్రస్తుతం నంద్యాల-గుంతకల్లు మధ్య నడుస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లతో పాటు విజయవాడ-హుబ్బళ్లి రైళ్లు అర్ధరాత్రి బయల్దేరుతున్నాయని, దీనివల్ల ఈ మార్గంలో రోజూ ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులకు ప్రయోజనం ఉండటంలేదని పేర్కొన్నారు. వాటికి బదులు మెము, ప్యాసింజర్ రైళ్లు నడిపేలా చూడాలని కోరారు. అందుకు అశ్వినీ వైష్ణవ్ బదులిస్తూ "నంద్యాల-గుంతకల్లు మధ్య పగటిపూట నడిచే రైళ్లు లేవన్న విషయం గురించి అధికారులతో చర్చించి వివరాలు తెలుసుకుంటా. గుంతకల్లులో ఐసీఎఫ్ కోచ్‌ల మెయింటెనెన్స్ సౌకర్యాలున్నాయి. నంద్యాలలో లేవు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సమస్యను ఎలా పరిష్కరించాలో అధికారులతో చర్చించి, పరిష్కారం కనుగొన్న వెంటనే ఎంపీకి సమాచారం అందిస్తా" అని చెప్పారు. డోన్-దూపాడు-బేతంచెర్ల రైల్వేలైన్ నిర్మాణ పురోగతి గురించీ వివరాలు తెలుసుకొని సమాచారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ఏపీలో 799 ఆర్‌ఓబీ/ఆర్‌యూబీల నిర్మాణం... మరో 316 మంజూరు

ఆంధ్రప్రదేశ్‌లో 2014-25 మధ్య 799 ఆర్‌ఓబీ/ఆర్‌యూబీలు నిర్మించినట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇప్పుడు తాజాగా మరో 316 మంజూరుచేసినట్లు చెప్పారు. లోక్‌సభలో ఏలూరు తెదేపా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. నవంబరు 1 నాటికి దేశవ్యాప్తంగా రూ.1.11 లక్షల కోట్లతో 4,689 ఆర్‌ఓబీ/ఆర్‌యూబీల నిర్మాణానికి అనుమతులు మంజూరుచేశామని, వాటిలో 316 ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్నట్లు చెప్పారు. ఎటపాక-వరాహపట్నం, వడర్లపాడు బ్రాంచ్ నుంచి వరాహపట్నం, పల్లెవాడ-రామవరం మధ్య మూడు ఆర్‌ఓబీల నిర్మాణానికి డీపీఆర్ తయారీ చేపట్టినట్లు చెప్పారు. కొక్కిరపాడు రైస్‌మిల్లు వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి డీపీఆర్ తయారీ పని మొదలుపెట్టినట్లు తెలిపారు.

ఏపీకి 3.88 లక్షల సోలార్ రూఫ్‌టాప్ కనెక్షన్ల మంజూరు

ఆంధ్రప్రదేశ్‌లోని మూడు డిస్కంల పరిధిలో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద 7,77,143 రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లు కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు కేంద్ర పునరుత్పాదక ఇంధనశాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. ఇందులో 3,88,571 కనెక్షన్లకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టిందని వెల్లడించారు. పీఎం కుసుమ్ స్కీంలో కాంపొనెంట్ ఎ (2 మెగావాట్ల నుంచి 500మెవా వరకు ప్లాంట్ల ఏర్పాటు), బి (వ్యక్తిగత సోలార్‌పంప్)ల కింద ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క కనెక్షన్ కూడా మంజూరుచేయలేదని చెప్పారు. కాంపొనెంట్-సి (గ్రిడ్‌తో అనుసంధానమైన పంపులు) కింద 2 లక్షల కనెక్షన్లు మంజూరుచేశామని, అయితే ఇంతవరకూ ఒక్కదాన్నీ సౌర విద్యుదీకరణ పరిధిలోకి తేలేదని చెప్పారు. బుధవారం లోక్‌సభలో జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి, భాజపా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిలు అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

ప్రకృతి వైపరీత్యాలతో ఏపీలో ఈ ఏడాది 530 మంది మృతి

ఈనాడు, దిల్లీ: ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఈ ఏడాది నవంబర్ 23 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 530 మంది చనిపోయినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ తెలిపారు. దేశవ్యాప్తంగా 2,388 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. బుధవారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు ముకుల్‌వాస్నిక్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. మొంథా తుపాను కారణంగా ముగ్గురు చనిపోగా, 4,566 ఇళ్లు దెబ్బతిన్నాయని, 610 పశువులు ప్రాణాలు కోల్పోయాయని చెప్పారు. 1.67 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద 2025-26లో రాష్ట్రానికి రూ.1,449.60 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో కేంద్ర వాటా రూ.1,088 కోట్లు కాగా, రాష్ట్ర వాటా రూ.361.60 కోట్లు ఉంటుందని చెప్పారు. తొలి విడత మొత్తం రూ.544 కోట్లను నవంబర్ 27న రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసినట్లు వెల్లడించారు.

587 కేజీబీవీల్లో 499 పనిచేస్తున్నాయ్

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ విధానం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకూ ఆంధ్రప్రదేశ్‌కు 587 పాఠశాలలు మంజూరు చేయగా, ప్రస్తుతం 499 మాత్రమే పనిచేస్తున్నాయని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు.

ఏడాదిలో ఆక్వాపార్క్ నిర్మాణం పూర్తి

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన ఆక్వా పార్క్ నిర్మాణ పనులను ఏడాదిలోపు పూర్తిచేయాలన్న షరతుతో రాష్ట్ర ప్రభుత్వం 2025 ఆగస్టు 5న ఎల్ 1 బిడ్డర్‌కు అప్పగించిందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ తెలిపారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. 2025 మార్చి 30 కల్లా పూర్తిచేయాలన్న షరతుతో కేంద్ర ప్రభుత్వం 2022-23లో రూ.52.85 కోట్లతో ఈ ప్రాజెక్టును మంజూరు చేసినట్లు చెప్పారు. అయితే భూసేకరణలో సమస్యలున్నట్లు తొలుత రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని వెల్లడించారు. చివరకు 2024 ఆగస్టులో భూమి కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను సకాలంలో చెల్లించకపోవడం కూడా జాప్యానికి ఒక కారణమని వివరించారు. వీటన్నింటినీ అధిగమించి ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కాంట్రాక్టర్‌కు అప్పగించి 2026 ఆగస్టు 5కు పూర్తిచేయాలని షరతు పెట్టినట్లు వెల్లడించారు.

పారా వెటర్నరీ, అనుబంధ కౌన్సిల్ చట్టం 2023ను రద్దు చేయాలి

- ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఏపీ వెటర్నరీ కౌన్సిల్ నిర్ణయం

ఈనాడు, అమరావతి: పారా-వెటర్నరీ, అనుబంధ కౌన్సిల్ చట్టం-2023ను పూర్తిగా రద్దు చేయాలని, దాని ఆధారంగా సాగుతున్న కార్యక్రమాలను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఏపీ వెటర్నరీ కౌన్సిల్ నిర్ణయించింది. ఈ చట్టం వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చట్టం-1984కు విరుద్ధంగా ఉందని, అందువల్ల దానిని రద్దు చేయాలని అభిప్రాయపడింది. బుధవారం విజయవాడలోని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఏపీ వెటర్నరీ కౌన్సిల్ (ఏపీవీసీ) ఆధ్వర్యంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, అధికారుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏపీవీసీ ఛైర్మన్ డాక్టర్ పీవీ లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ జేవీ రమణ, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ దామోదర్ నాయుడు, వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు డాక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మయ్య విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల్లో పశు సంవర్ధక సహాయకుల(ఆహా) నియామక సమయంలో అభ్యర్థులు సమర్పించిన అర్హత ధ్రువీకరణ పత్రాలు, వారు ఏ కళాశాలల్లో చదివారు, ఆ కళాశాలలు నిజమైనవేనా వంటి వివరాలను పరిశోధించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు వెల్లడించారు. దామోదర్ నాయుడు మాట్లాడుతూ.. కేంద్ర చట్టం-1984నే కొనసాగించాలా? లేదా 2023లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందా అనే అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వమని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.

పోరాటాలతోనే చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు

- బీసీల హక్కుల సెమినార్‌లో పలువురు ఎంపీల పిలుపు

ఈనాడు, దిల్లీ: చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్ల సాధన కోసం పోరాటాలు చేయాలని వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు పిలుపునిచ్చారు. దిల్లీలోని ఆంధ్రప్రదేశ్/తెలంగాణ భవన్ ఆడిటోరియంలో బుధవారం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీల హక్కులపై సెమినార్ నిర్వహించారు. ఇందులో తెదేపా ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బీద మస్తాన్‌రావు, అంబికా లక్ష్మీనారాయణ, భాజపా ఎంపీ పాకా సత్యనారాయణ, భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోఆర్డినేటర్ ర్యాగ అరుణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి బాణాల అజయ్‌కుమార్ పాల్గొన్నారు. వచ్చే జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయించినందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కుల కల్పన మోదీతోనే సాధ్యమని పేర్కొన్నారు. సమావేశంలో 14 అంశాలపై తీర్మానాలు చేశారు.



సంఘీభావం తెలుపుతున్న ఎంపీలు బస్తిపాటి నాగరాజు, వద్దిరాజు రవిచంద్ర, బీద మస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య, అంబికా లక్ష్మీనారాయణ, పాకా సత్యనారాయణ తదితరులు

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

ఈనాడు, అమరావతి: ఏడేళ్లుగా సీహెచ్‌వోలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్- కమ్యూనిటీ హెల్త్ అధికారుల అసోసియేషన్ (ఏపీఎంసీఏ) కోరింది. రాష్ట్ర కార్యదర్శి సందీప్‌కుమార్, కోఆర్డినేటర్ వినోద్, ఎన్టీఆర్, విజయనగరం జిల్లాల ప్రతినిధులు వర్షిణి, నీలిమ, విజయలక్ష్మి తదితరులు మంగళగిరిలోని వైద్యారోగ్య కమిషనర్ వీరపాండియన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. సమ్మె కాలంలో ఇచ్చిన హామీ మేరకు రూ.30వేలు బేసిక్ జీతం, రూ.10వేలు ప్రోత్సాహకం ఇవ్వాలని, రాత్రి 8 గంటలకు ఎఫ్ఆర్ఎస్ నమోదు నిబంధన తొలగించాలని కోరారు. సమ్మె చేసిన 40 రోజుల జీతం ప్రభుత్వ హామీ మేరకు మంజూరు చేయాలని, ఆర్థికేతర సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయాలని కోరారు.